'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 268

శుక్రవారం 19-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'జీ రామ్ జీ'కి జై

లోక్‌సభలో మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం - 6లో

ఇక స్వేచ్ఛా వాణిజ్యం

ఎఫ్‌టీఏపై సంతకాలు చేసిన భారత్, ఒమన్ - 6లో

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆగే వరకు

పోరాటమే

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మేం రాగానే పూర్తి చేస్తాం

కోటి సంతకాల ప్రతులను గవర్నర్‌కు అందజేసిన అనంతరం మీడియాతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

కోటి సంతకాల ప్రతుల వాహనాలకు జెండా ఊపి.. ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

చంద్రబాబూ.. మీకు చేతకాకపోతే అలా వదిలేయండి

మెడికల్ కాలేజీలను పూర్తి చేస్తే మాకు మంచి పేరొస్తుందనే అక్కసుతో ప్రైవేటీకరణ చేయడం మంచిది కాదు

బాబు అసంబద్ధ నిర్ణయాలు భవిష్యత్తు తరాలకు శాపం

- భూమి.. మెడికల్ కాలేజీ.. ఆస్పత్రి.. అన్నీ ప్రభుత్వానివే.. ఉద్యోగులూ గవర్నమెంట్‌వారే
- జీతాలు ఇచ్చేదీ ప్రభుత్వమే.. ప్రయోజనం పొందేది మాత్రం ప్రైవేట్ వ్యక్తులు!
- ఇది స్కామ్ కాకపోతే మరేమిటి? ప్రపంచంలో ఎక్కడైనా ఉందా? ఇది మదర్ ఆఫ్ ఆల్ స్కామ్స్!
- కొత్త వైద్య కాలేజీలు, ఆస్పత్రులను కట్టబెట్టడమే కాకుండా ఒక్క జీతాల రూపంలోనే రూ.1,200 కోట్లు.. ప్రజాధనాన్ని ప్రైవేట్ వ్యక్తులకు దోచి పెడుతున్నారు
- ఆ మెడికల్ కాలేజీలను రూ.5 వేల కోట్లతో పూర్తి చేయవచ్చు
- రాష్ట్ర ప్రజల ఆకాంక్షను గవర్నర్‌కు వివరించాం.. మా పోరాటం ఇంతటితో ఆగదు..
- న్యాయ పోరాటంతో పాటు ప్రజల్లోకి వెళ్లి పోరాటం కూడా చేస్తాం
- పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలతో కలసి గవర్నర్‌తో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భేటీ
- ఈ ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకునేలా చూడాలని కోరుతూ ప్రజా ఆకాంక్ష గవర్నర్‌కు నివేదన

2లో

"మా హయాంలో ప్రతి చోటా 50 ఎకరాలు ఉండేలా 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టాం. వాటికి నాబార్డ్, ఇతర బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ నిధులు టైఅప్ చేశాం. వాటిలో 7 కాలేజీలు పూర్తి కూడా చేశాం. అవి ఇప్పుడు రన్నింగ్‌లో ఉన్నాయి. వాటి ద్వారా 800 మెడికల్ సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన కాలేజీలు పూర్తి చేసేందుకు ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు అవసరం. మరి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఆ మాత్రం నిధులు ఖర్చు చేయలేదా? పోనీ మీరు ఖర్చు చేయలేకపోతే వదిలేయండి.. మేం వచ్చాక వాటిని పూర్తి చేస్తాం."

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

రాష్ట్ర చరిత్రలో గొప్ప ఉద్యమం

పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఒక పెద్ద స్కామ్

11లో

- ఆ సిబ్బందికి రెండేళ్ల పాటు వేతనాలు మరో స్కామ్
- అధికారంలోకి రాగానే అవన్నీ రద్దు చేస్తాం
- స్కామ్‌కు పాల్పడిన వారిని జైలుకు పంపుతాం
- రెండు నెలల్లోనే వారిపై అన్ని చర్యలుంటాయి
- చంద్రబాబు గ్రాఫ్ డౌన్ కావడంతో కలెక్టర్లపై నెపం

ఒక్కరోజు యోగాకు రూ.330 కోట్లా?

మ్యాట్లు మీరు కొన్నదెంత?.. అమెజాన్‌లో ఉన్నదెంత?

2లో

విజయవాడలో వైఎస్ జగన్ వాహనంపై పూలవర్షం కురిపించి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలు

విజయవాడ నేతాజీ బ్రిడ్జి వద్దకు భారీగా తరలివచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆగే వరకు పోరాటమే

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మేం రాగానే పూర్తి చేస్తాం: వైఎస్ జగన్

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల పత్రాలు గవర్నర్‌కు అందజేత

విజయవాడలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించి, వినతిపత్రం అందజేసి గవర్నర్‌ను కలిసేందుకు వెళుతున్న వైఎస్ జగన్

"మా పోరాటం ఇంతటితో ఆగదు. గవర్నర్‌కు కోటి సంతకాలు చూపించాం. రేపు కోర్టులో పిటిషన్ వేస్తాం. అక్కడ కూడా ఈ కోటి సంతకాలు చూపిస్తాం. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం...'

"మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణే ఒక స్కామ్ అయితే, ఆ తర్వాత రెండేళ్ల పాటు ఆ కాలేజీల సిబ్బందికి ప్రభుత్వమే జీతాలు ఇవ్వడం మరో స్కామ్. అంటే.. అక్కడున్న భూమి, భవనాలు, పని చేసే వారంతా ప్రభుత్వ ఉద్యోగులు. కానీ, నిర్వహణ మాత్రం ప్రైవేటువారిది. ఖర్చు ప్రభుత్వానిది.. సంపద మాత్రం ప్రైవేటువారికి. ఒక మెడికల్ కాలేజీలో జీతాలు ఏడాదికి కనీసం రూ.60 కోట్లు... రెండేళ్లకు రూ.120 కోట్లు అవుతాయి. ఆ లెక్కన 10 మెడికల్ కాలేజీల సిబ్బందికి రెండేళ్లపాటు జీతంగా కనీసం రూ.1,200 కోట్లు అవుతుంది. ఇలాంటి స్కామ్‌లు దేశంలో ఎక్కడా ఉండవు..."

"మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో బాబు చేస్తున్న అన్యాయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా రాష్ట్ర ప్రజల ఆకాంక్షను కూడా ఆయనకు తెలియజేశాం. ఈరోజు ఒక చరిత్రాత్మక ఘట్టం. ఏకంగా 1,04,11,136 సంతకాలు సేకరించాం. దేశ చరిత్రలో కూడా ఇలాంటి ఉద్యమం జరిగి ఉండదేమో.."

"నిజానికి ఆ మెడికల్ కాలేజీలన్నీ భవిష్యత్‌లో రూ.లక్ష కోట్ల విలువైన ఆస్తి అవుతాయి. కొన్ని కోట్ల మందికి ఉచిత వైద్యం అందిస్తూ, వెల కట్టలేని సేవలందిస్తూ కోట్లాది మందిలో వెలుగులు నింపుతాయి.."

"అందరం కలసికట్టుగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుందాం. మనం ఇప్పుడు ఆ పని చేయకపోతే, రేపొద్దున వైద్యం కోసం ఒక్కొక్కరు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు చెల్లించాల్సి వస్తుంది"

"మెడికల్ కాలేజీలను కాపాడుకునేందుకు ప్రతి ద్వారం తొక్కుతాం. కోర్టుల ద్వారా వీటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తాం. ఇంకా ఉద్యమం కొనసాగుతుంది. ప్రజలతో కలసి పోరాటం కూడా చేస్తాం. ఇది కచ్చితంగా స్కామే"

ఒక్కరోజు యోగాకు ₹330 కోట్లా?

మ్యాట్లు మీరు కొన్నదెంత?..

అమెజాన్‌లో ఉన్నదెంత?

"రుషికొండలో రూ.230... రూ.240 కోట్లతో కట్టిన భవనాలు విశాఖకు మణిహారంగా మారాయి. విశాఖకు ఆ భవనాలు తలమానికంగా ఉన్నాయి. ఈ రోజున వెళ్లి చూస్తే విశాఖపట్నానికి గొప్ప పర్యాటక ప్రాంతంగా ఉంటుంది. విశాఖకు గవర్నర్ వెళ్లినా, ప్రధాని మోదీ వచ్చినా, రష్యా ప్రెసిడెంట్ పుతిన్ వస్తే ఎక్కడ పెడతారు? బ్రహ్మాండమైన రాజ భవనం లాంటి భవనమది.. ఆ భవనంలో వారికి అతిథ్యం ఇవ్వవచ్చు. అదే చంద్రబాబు నాయుడు యోగా కార్యక్రమం కోసం రూ.330 కోట్లు ఖర్చు చేశారు. ఒక్క రోజు కార్యక్రమం కోసం రూ.330 కోట్లు ఆవిరి చేశారు. దాన్నేమంటారు? ఆరోజు యోగా మ్యాట్లకు ఎంత ఖర్చు పెట్టారో చూస్తే మీకే అర్థమవుతుంది. అమెజాన్‌లోకి వెళ్లి మ్యాట్ల ఖరీదు ఎంతో చూడండి. వీళ్లు ఎంతకు కొనుగోలు చేశారో పరిశీలించండి. వాళ్ల కంటే 50 శాతం తక్కువ ఉండకపోతే నన్ను అడగండి'' అని ఓ ప్రశ్నకు సమాధానంగా జగన్ పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రజల ఆకాంక్షను గవర్నర్‌కు నివేదించామని, ఈ పోరాటం ఇంతటితో ఆగదని.. న్యాయ పోరాటం.. ప్రజల్లోకి వెళ్లి పోరాటం కూడా చేస్తామని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన కోటి సంతకాల ప్రతులతో కూడిన 26 వాహనాలను లోక్‌భవన్‌కు తరలించారు. గవర్నర్ కార్యాలయ అధికారులు కె.రఘు (డిప్యూటీ సెక్రటరీ టు గవర్నర్), ఎన్.వెంకటరామాంజనేయులు (ఏడీసీ) ఆ పత్రాలు పరిశీలించారు. వాటన్నింటినీ వైఎస్ జగన్ తన భేటీలో గవర్నర్‌కు చూపారు. తాడేపల్లి లోని తన నివాసం నుంచి బయలు దేరిన వైఎస్ జగన్ నేరుగా తొలుత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గవర్నర్‌కు వినతిపత్రం అందించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ''చంద్రబాబూ..! ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాలను పూర్తి చేయడం మీకు చేతకాకపోతే.. అలా వదిలేయండి. మేం వచ్చాక వాటిని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. అంతేకానీ వాటిని పూర్తి చేస్తే ఎక్కడ మాకు మంచి పేరు (క్రెడిట్) వస్తుందోననే ఆలోచనతో ప్రైవేటీకరణ చేయడం మంచి పద్ధతి కాదు..'' అని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. చంద్రబాబు సర్కారు అసంబద్ధ నిర్ణయం భవిష్యత్తు తరాలకు పెను శాపంగా మారుతుందని హెచ్చరించారు. భూమి.. మెడికల్ కాలేజీ.. ఆస్పత్రి.. అన్నీ ప్రభుత్వానివే.. ఉద్యోగులూ గవర్నమెంట్‌వారే.. చివరకు జీతాలు ఇచ్చేదీ ప్రభుత్వమే..! ప్రయోజనం పొందేది మాత్రం ప్రైవేట్ వ్యక్తులు..! ఇది స్కామ్ కాకపోతే మరేమిటి? ప్రపంచంలో ఇలా ఎక్కడైనా ఉందా..? ఇది మదర్ ఆఫ్ ఆల్ స్కామ్స్..! అని మండిపడ్డారు. కొత్త వైద్య కాలేజీలు, ఆస్పత్రులను కట్టబెట్టడమే కాకుండా ఒక్క జీతాల రూపంలోనే రూ.1,200 కోట్ల ప్రజాధనాన్ని ప్రైవేట్ వ్యక్తులకు చంద్రబాబు దోచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రూ.5 వేల కోట్లతో ప్రభుత్వమే ఆ మెడికల్ కాలేజీలను పూర్తి చేసే వీలున్నా స్కామ్‌ల కోసం ప్రైవేట్‌పరం చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, రీజినల్ కో–ఆర్డినేటర్లతో కూడిన 40 మంది నేతల బృందంతో గురువారం లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ చేపట్టిన ప్రజా ఉద్యమం, కోటి సంతకాల సేకరణను వివరించారు. మెడికల్ కాలేజీల విషయంలో ఈ ప్రభుత్వం ఎలాగైనా తన నిర్ణయం మార్చుకునేలా చూడాలని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అన్ని వివరాలతో ఒక వినతిపత్రం సమర్పించారు. గవర్నర్‌తో సమావేశం ముగిసిన తర్వాత లోక్‌భవన్ వద్ద వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సర్కారు చేస్తున్న అన్యాయాలు, మోసాలు, స్కామ్‌లను గవర్నర్ దృష్టికి తేవడంతో పాటు రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ఆయనకు అర్థమయ్యేలా వివరించామని తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై గవర్నర్ చాలా బాధపడ్డారని.. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రజల మనోభావాలు గవర్నర్‌కు నివేదించాం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో చంద్రబాబు చేస్తున్న అన్యాయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా రాష్ట్ర ప్రజల ఆకాంక్షను కూడా ఆయనకు తెలియజేశాం. ఈరోజు ఒక చరిత్రాత్మక ఘట్టం. ఏకంగా 1,04,11,136 సంతకాలు సేకరించాం. దేశ చరిత్రలో కూడా ఇలాంటి ఉద్యమం జరిగి ఉండదేమో. గత అక్టోబరు 7న ప్రజా ఉద్యమ కార్యాచరణను ప్రకటించాం. అక్టోబరు 10 నుంచి ఈనెల 10 వరకు ప్రతి గ్రామం, పట్టణం, ప్రతి వార్డులో రచ్చబండ కార్యక్రమాల ద్వారా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. వారిని ఉద్యమంలోకి తీసుకువచ్చాం. వాళ్ల సంతకాలు తీసుకున్నాం. నవంబర్ 12న ఒకసారి, మళ్లీ ఈనెల 10న మరోసారి అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించాం. డిసెంబరు 10న ర్యాలీల తర్వాత కోటి సంతకాల పత్రాలను జిల్లా కేంద్రాలకు తరలించాం. అక్కడ డిసెంబరు 15న ర్యాలీలు నిర్వహించి వాటిని ప్రజలకు చూపాం. ఆ తర్వాత వాటన్నింటినీ పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించి, ఈరోజు (గురువారం) గవర్నర్ గారికి చూపించాం. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజల నిరసన, వారి మనోభావాలను గవర్నర్‌కు వివరించాం.

అసంబద్ధంగా ప్రభుత్వ నిర్ణయం..

ఈ రోజు మీ అందరి ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తున్నా. మనం తీసుకునే నిర్ణయాలతో భవిష్యత్ తరాలపై ఎలాంటి ప్రభావం పడుతుందన్నది ఆలోచన చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం స్కూల్స్ ఎందుకు నడుపుతుంది? దేశంలో అన్ని చోట్లా స్కూళ్లు, ఆస్పత్రులు, ఆర్టీసీ బస్సులను ప్రభుత్వమే ఎందుకు నడుపుతుందో ఆలోచించారా? రాష్ట్ర ప్రభుత్వం కనుక వీటిని నడపకపోతే.. పేద, మధ్య తరగతి వారు ప్రైవేటు దోపిడీకి గురై, వారు భరించలేని స్థాయికి వెళ్లిపోతాయి. ఆశ్రయించలేక నష్టపోతారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని ఒక బాధ్యతగా భావించి నిర్వహిస్తాయి. అన్నీ ప్రైవేటీకరిస్తూ పోతే దోపిడీకి చెక్ పడదు. ప్రజలు సేవలు పొందాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుంది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్‌గా చేరాలంటే కనీసం రూ.5 వేలు చార్జి చేస్తారు. కనీస వసతులతో రూమ్ కావాలంటే రోజుకు రూ.10 వేలు, ఐసీయూలో రోజుకు రూ.30వేల నుంచి రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుంది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఈ ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయం.

మెడికల్ కాలేజీతో ఉచితంగా అత్యుత్తమ వైద్య సేవలు..

మా ప్రభుత్వ హయాంలో ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లాగా చేయడంతో పాటు ప్రతి జిల్లా కేంద్రంలో కొత్త మెడికల్ కాలేజీకి శ్రీకారం చుట్టాం. మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తే, అక్కడ టీచింగ్ ఆస్పత్రి అందుబాటులోకి వస్తుంది. అప్పుడు ఆ ఆస్పత్రిలో, మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ స్టూడెంట్స్, మెడికోస్, నర్సింగ్ స్టూడెంట్లు.. అందరూ అందుబాటులో ఉంటారు. దీంతో పేదలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయి. దాని వల్ల చుట్టు పక్కల ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు ఇష్టం వచ్చినట్లు ఛార్జ్ చేయలేవు. మేం నాడు తలపెట్టిన 17 మెడికల్ కాలేజీలన్నీ ప్రారంభమైతే మన పిల్లలకు మరిన్ని మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. దాని వల్ల వైద్య విద్య చదవాలని కోరుకునే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుంది.

నిధుల కొరత అబద్ధం..

మా హయాంలో ప్రతి చోటా 50 ఎకరాలు ఉండేలా 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టాం. వాటికి నాబార్డ్, ఇతర బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ నిధులు టైఅప్ చేశాం. వాటిలో 7 కాలేజీలు పూర్తి కూడా చేశాం. అవి ఇప్పుడు రన్నింగ్‌లో ఉన్నాయి. వాటి ద్వారా 800 మెడికల్ సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన కాలేజీలు పూర్తి చేసేందుకు ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు అవసరం. మరి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఆ మాత్రం నిధులు ఖర్చు చేయలేదా? పోనీ మీరు ఖర్చు చేయలేకపోతే వదిలేయండి.. మేం వచ్చాక వాటిని పూర్తి చేస్తాం. చంద్రబాబుకు గట్టిగా తగిలేటట్టుగా గవర్నర్‌గారి దృష్టికి అన్ని విషయాలు తీసుకెళ్లాం. మెడికల్ కాలేజీలు పూర్తి చేస్తే, మాకు క్రెడిట్ దక్కుతుందన్న అక్కసుతో చంద్రబాబు పేదలకు నష్టం చేస్తున్నారు. మరోవైపు ప్రైవేటీకరణతో స్కామ్‌లు చేస్తున్నారు. నిజానికి ఆ మెడికల్ కాలేజీలన్నీ భవిష్యత్‌లో రూ.లక్ష కోట్ల విలువైన ఆస్తి అవుతాయి. కొన్ని కోట్ల మందికి ఉచిత వైద్యం అందిస్తూ, వెల కట్టలేని సేవలందిస్తూ కోట్లాది మందిలో వెలుగులు నింపుతాయి.

కలసి కట్టుగా అడ్డుకుందాం..

చంద్రబాబు తోలు మందం కాబట్టి ఆయన మారకపోవచ్చు. కాబట్టి అందరూ కలసి రావాలి. అందరం కలసికట్టుగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుందాం. మనం ఇప్పుడు ఆ పని చేయకపోతే, రేపొద్దున వైద్యం కోసం ఒక్కొక్కరు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు చెల్లించాల్సి వస్తుంది. గవర్నర్‌కు గానీ, మనసున్న ఏ వ్యక్తికైనాగానీ చంద్రబాబు చేసేది తప్పు అని అర్థమవుతుంది. ఇదే గవర్నర్ ఇంట్లో పని చేసే వ్యక్తులు మెడికల్ కాలేజీకి వెళ్తే ఉచితంగా వైద్యం అందుతుంది. గవర్నర్‌ది మంచి మనసు. ఆయన అన్నీ అర్థం చేసుకున్నారు.

న్యాయ పోరాటం.. ప్రజా పోరాటం..

మెడికల్ కాలేజీలను కాపాడుకునేందుకు ప్రతి ద్వారం తొక్కుతాం. కోర్టుల ద్వారా వీటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తాం. ఇంకా ఉద్యమం కొనసాగుతుంది. ప్రజలతో కలసి వీధి పోరాటం కూడా చేస్తాం. ఇది కచ్చితంగా స్కామ్. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణే ఒక స్కామ్ అయితే, ఆ తర్వాత రెండేళ్ల పాటు ఆ కాలేజీల సిబ్బందికి ప్రభుత్వమే జీతాలు ఇవ్వడం మరో స్కామ్. అంటే.. అక్కడున్న భూమి, భవనాలు, పని చేసే వారంతా ప్రభుత్వ ఉద్యోగులు. కానీ, నిర్వహణ మాత్రం ప్రైవేటువారిది. ఖర్చు ప్రభుత్వానిది.. సంపద మాత్రం ప్రైవేటువారికి. ఒక మెడికల్ కాలేజీలో జీతాలు ఏడాదికి కనీసం రూ.60 కోట్లు... రెండేళ్లకు రూ.120 కోట్లు అవుతాయి. ఆ లెక్కన 10 మెడికల్ కాలేజీల సిబ్బందికి రెండేళ్ల పాటు జీతంగా కనీసం రూ.1,200 కోట్లు అవుతుంది. అన్నీ ప్రభుత్వానివే.. అప్పగించేది మాత్రం ప్రైవేటు వ్యక్తులకా? ఇలాంటి స్కామ్‌లు ప్రపంచంలో ఎక్కడా ఉండవు..! పైగా ప్రజలను మోసం చేసేందుకు.. డైవర్షన్ చేసేందుకు.. కళాశాలలన్నీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతూ గవర్నమెంట్ పేరు పెడతాడట! రేపొద్దున హెరిటేజ్ కంపెనీ ముందు గవర్నమెంట్ పేరు పెట్టి కింద హెరిటేజ్ అని చిన్నగా పేరు పెడితే ఆ హెరిటేజ్ కంపెనీ ప్రభుత్వానిది అయిపోతుందా? అందరూ ఆలోచన చేయాలి. ప్రజలంటే ఎలా కనిపిస్తున్నారు? మరీ ఇంత దారుణంగా చెవిలో పూలు పెడితే ఎలా? సూపర్ 6 ఒక మోసం.. సూపర్–7 ఒక మోసం.. ఎన్నికలప్పుడు జగన్ ఇచ్చే సంక్షేమ పథకాలన్నీ ఇస్తూనే, వాటికి అదనంగా సూపర్ సిక్స్, సెవన్ ఇస్తామన్నారు. ఇప్పుడు చూస్తే పలావు పోయింది... బిర్యానీ పోయింది! ప్రజలు పూర్తిగా రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదు.. డిసెంబర్ నెల ముగిస్తే 8 క్వార్టర్స్ బకాయిలు ఇవ్వాలి. విద్యాదీవెన లేదు.. వసతి దీవెన లేదు... పిల్లలు చదువులు మానేస్తున్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలు (జీఈఆర్) తగ్గాయి. ఆరోగ్యశ్రీ లేదు.. నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వక పోవడంతో బోర్డులు తిప్పేశారు. మరోవైపు గవర్నమెంట్ ఆస్పత్రులు దారుణంగా ఉన్నాయి.

గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిసేందుకు వెళుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

మస్తాన్‌వలి (ఫైల్)

ఫిరంగిపురం: అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం మేరికపూడిలో గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి(69) ఐదెకరాల పొలం కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. దిగుబడి రాక, గిట్టుబాటు ధర లేకపోవడంతో రూ.12 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక బుధవారం సాయంత్రం పొలానికి వెళ్లి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా.. ఉదయం పొలంలో విగతజీవిగా కనిపించాడు.

స్క్రబ్ టైఫస్‌తో ఒకరి మృతి

అనంతపురం (మెడికల్), చిత్తూరు రూరల్ (కాణిపాకం), ముత్తుకూరు(పొదలకూరు): శ్రీసత్యసాయి జిల్లాలో స్క్రబ్ టైఫస్‌తో ఓ వృద్ధురాలు మృతి చెందింది. గాండ్లపెంట మండలం రెడ్డివారిపల్లికి చెందిన 72 ఏళ్ల వృద్ధురాలు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో స్క్రబ్ టైఫస్‌తో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. కాగా, ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 11, చిత్తూరు జిల్లాలో గురువారం రెండు, నెల్లూరు జిల్లాలో మరో రెండు స్క్రబ్ టైఫస్ కేసులు నమోదైనట్లు వైద్య అధికారులు తెలిపారు.

పోలవరం నిర్వాసితుల్ని పట్టించుకోని ప్రభుత్వం

- పరిహారం, పునరావాసంపై పార్లమెంటరీ కమిటీ సీరియస్
- పునరావాసం 22.66 శాతమేనా? • భూమికి భూమి ఇవ్వకుండా నగదు ఎర
- గిరిజన ప్రాంతాల్లో గ్రామసభల నిర్వహణ డొల్ల
- కాలనీల్లో సౌకర్యాలు లేకుండానే నిర్వాసితుల గెంటివేత
- లోక్‌సభలో నివేదిక సమర్పించిన గ్రామీణాభివృద్ధి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

2024 నవంబర్ నాటికి ఇదీ పోలవరం పరిస్థితి				
మొత్తం ముంపు గ్రామాలు 222 రెవెన్యూ గ్రామాలు	నిర్వాసిత కుటుంబాలు 1,06,006	తరలించినవి 12,797 కుటుంబాలు	భూసేకరణ లక్ష్యం: 1,67,765 ఎకరాలు	భూ సేకరణ, పునరావాసం పురోగతి 22.66 శాతం
	ఇంకా సేకరించాల్సింది 54,640 ఎకరాలు		ప్రాజెక్టు ఓవరాల్ పురోగతి 53.47 శాతం	

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ ప్రాజెక్టు పోలవరం కోసం సర్వస్వం కోల్పోయిన నిర్వాసితుల బతుకులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయని గ్రామీణాభివృద్ధి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (2025–26) ఆగ్రహం వ్యక్తం చేసింది. నిర్వాసితులకు న్యాయం చేయడం లేదని కమిటీ లోక్‌సభకు సమర్పించిన 24వ నివేదికలో తీవ్రస్థాయిలో మండిపడింది. గిరిజనులకు చట్టప్రకారం దక్కాల్సిన భూమికి భూమి హక్కును కాలరాస్తున్నారని, పునరావాస ప్యాకేజీ (ఆర్ అండ్ ఆర్) అమలులో తీవ్రమైన లోపాలున్నాయని తెలిపింది. 2024 నవంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు ఓవరాల్‌గా 53.47 శాతం.. హెడ్ వర్క్స్ 74.27 శాతం, ప్రధాన డ్యామ్ పనులు 75.60 శాతం పూర్తయ్యాయని తెలిపింది. కానీ ప్రాజెక్టులో అతి ముఖ్యమైన భూసేకరణ, పునరావాసం పనులు మాత్రం 22.66 శాతం మాత్రమే పూర్తయ్యాయని పేర్కొంది. ప్రాజెక్టు నిర్మాణం చివరిదశకు చేరుకుంటున్నప్పటికీ, నిర్వాసితులకు పరిహారం ఇవ్వడంలో ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారని కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది.

గిరిజనులకు తీవ్ర అన్యాయం

పోలవరం ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని సుమారు 371 ఆవాసాలు, 222 రెవెన్యూ గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని తెలిపింది. పోలవరం ముంపులో ఉన్న 1,06,006 కుటుంబాల్లో సగానికి పైగా (56,504 కుటుంబాలు) గిరిజనులే ఉన్నారని పేర్కొంది. 2013 భూసేకరణ చట్టం సెక్షన్ 41–42 ప్రకారం గిరిజన కుటుంబాలు భూమి కోల్పోతే వారికి ప్రత్యామ్నాయంగా సాగుభూమి ఇవ్వాలని, కానీ క్షేత్రస్థాయిలో ఇది అమలు కావడం లేదని తెలిపింది. తగిన భూమి దొరకలేదనే సాకుతో గిరిజనులకు నచ్చజెప్పి నగదు పరిహారాన్ని అంటగడుతున్నారని, ఇది స్వచ్ఛందంగా జరుగుతున్నట్లు కనిపించడం లేదని పేర్కొంది. గిరిజన ప్రాంతాల్లో భూసేకరణకు ముందు గ్రామసభల అనుమతి తప్పనిసరని తెలిపింది. అటవీ హక్కుల చట్టం కింద గిరిజనుల వ్యక్తిగత, సామూహిక హక్కులను పూర్తిగా నిర్ధారించకముందే హడావుడిగా గ్రామసభలు నిర్వహిస్తున్నారని తప్పుబట్టింది. పోడుభూములు సాగుచేసుకునేవారిని, భూమిలేని కూలీలను, మత్స్యకారులను నిర్వాసితుల జాబితాలో చేర్చడంలో అధికారులు విఫలమయ్యారని ఎత్తిచూపింది.

పాతరేట్లతో పరిహారం

చట్టంలోని సెక్షన్ 26–30 ప్రకారం పరిహారం చెల్లించడంలో లోపాలున్నాయని కమిటీ నివేదికలో పేర్కొంది. భూమి విలువను నిర్ణయించేటప్పుడు పాత సర్కిల్ రేట్లనే ప్రామాణికంగా తీసుకుంటున్నారని, దీనివల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపింది. కేవలం భూమి విలువనే కాకుండా అందులో ఉన్న ఆస్తుల విలువను పరిహారంలో సరిగ్గా లెక్కించడం లేదని పేర్కొంది.

వసతులు కల్పించకుండానే నిర్వాసితుల తరలింపు

చట్టంలోని సెక్షన్ 37–38 ప్రకారం పరిహారం మొత్తం చెల్లించి, పునరావాస కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పించేంతవరకు నిర్వాసితుల నుంచి భూమిని స్వాధీనం చేసుకోకూడదని, వారిని ఖాళీ చేయించకూడదని తెలిపింది. పునరావాస కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ, పాఠశాలలు, ఆస్పత్రులు వంటి కనీస సౌకర్యాలు కల్పించకముందే నిర్వాసితులను తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. పరిహారం పూర్తిగా చెల్లించి, పునరావాస కాలనీలు సిద్ధమయ్యేంతవరకు నిర్వాసితుల నుంచి భూమిని స్వాధీనం చేసుకోకూడదని స్పష్టం చేసింది. పరిహారం, పునరావాస పనుల్లో పారదర్శకత కోసం గ్రామాల వారీగా వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉంచాలని కమిటీ సిఫార్సు చేసింది.

అంతర్రాష్ట్ర చిక్కుముడి

ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో ముంపు ప్రభావంపై ఇంకా స్పష్టత రాలేదని తెలిపింది. గోదావరి వరద ఉధృతిని 36లక్షల క్యూసెక్కులుగా కాకుండా, 50లక్షల క్యూసెక్కులుగా పరిగణించి రక్షణ చర్యలు చేపట్టాలని ఆ రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయంది. ఈ వివాదం సుప్రీంలో ఉండటంతో, ఆయా రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరగలేదని నివేదిక తెలిపింది.

ఏం.. మంత్రి చెబితేనే ఇస్తారా?

- కర్నూలులో మంత్రి, ఎమ్మెల్యేల మధ్య ఉద్యోగాల చిచ్చు
- సెక్యూరిటీ గార్డు పోస్టులపై కర్నూలు పెద్దాసుపత్రిలో కోడుమూరు టీడీపీ ఎమ్మెల్యే రచ్చ
- తమ వారికి సెక్యూరిటీ పోస్టులు ఇవ్వడం లేదని ఆగ్రహం
- రోగుల మధ్యే ఆసుపత్రిలో గందరగోళం

ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో కోడుమూరు టీడీపీ ఎమ్మెల్యే వాగ్వాదం

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సెక్యూరిటీ గార్డు నియామకాలపై మంత్రి టీజీ భరత్, కోడుమూరు టీడీపీ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. ఆసుపత్రిలో గత ఆరు నెలలుగా సెక్యూరిటీ బాధ్యతలను ఈగల్ హంటర్ సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహిస్తోంది. అప్పటి నుంచి ఆ ఏజెన్సీ నుంచి సబ్‌లీజ్ తీసుకోవాలని మంత్రి టీజీ భరత్, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో కొంతకాలం విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు సబ్‌లీజ్‌కు తీసుకుని నడిపించే ప్రయత్నం చేశారు. విషయం తెలిసిన మంత్రి టీజీ భరత్ అనుచరులు కార్యాలయానికి వచ్చి ఫర్నిచర్‌ను ఎత్తిపారేసి అలజడి సృష్టించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. దీంతో మళ్లీ ఈగల్ హంటర్ సంస్థ వారే సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహణ బాధ్యతలను కొనసాగిస్తున్నారు. అయితే ఈ క్రమంలో ఏజెన్సీ నిర్వహణ బాధ్యత మంత్రి టీజీ భరత్ అనుచరులు చేజిక్కించుకున్నారని, తమ ఇష్టానుసారం సెక్యూరిటీ గార్డు పోస్టులు భర్తీ చేసుకుంటున్నారని ప్రచారం మొదలైంది. దీంతో విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దస్తగిరి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఎమ్మెల్యేతో కలిసి వాహనాల్లో వారు ఆసుపత్రిలోని సెక్యూరిటీ కార్యాలయానికి చేరుకున్నారు. రోగులు, బంధువుల మధ్యే ఎమ్మెల్యే సెక్యూరిటీ సూపర్‌వైజర్లతో వాగ్వాదానికి దిగారు. తమ వర్గానికి ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డు పోస్టులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పెద్దాసుపత్రిలో మంత్రి భరత్‌కు ఎంత వాటా ఉందో.. కోడుమూరు ఎమ్మెల్యేగా తనకూ అంతే వాటా ఉందని అన్నారు. తాము కోరినప్పటికీ పోస్టులు ఇవ్వకుండా మంత్రి భరత్ చెప్పిన వారికి ఎలా ఇస్తారని మండిపడ్డారు. ఈ సమయంలో ఈగల్ హంటర్ ప్రతినిధులు లేకపోవడంతో ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే అక్కడికి రప్పించారు. 'లెక్క ప్రకారం మాకు దక్కాల్సిన పోస్టులు మాకు ఇప్పించాల్సిందే' అంటూ ఆయనతో వాగ్వాదానికి దిగారు.

చంద్రబాబు హయాంలోనే డయాఫ్రం వాల్ తప్పిదం

- ఇందులో మాజీ సీఎం వైఎస్ జగన్‌కు సంబంధం లేదు
- మాజీ ఎంపీ ఉండవల్లి

సాక్షి, రాజమహేంద్రవరం: పోలవరం ప్రాజెక్టులో భాగంగా రూ.448 కోట్లతో నిర్మించిన డయాఫ్రం వాల్ చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే కొట్టుకుపోయిందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం రాజమహేంద్రవరంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అల్లు బాబీతో కలసి మీడియాతో ఉండవల్లి మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్‌పై సందేహాలను నివృత్తి చేయాలన్నారు. గతంలో కట్టిన డయాఫ్రం వాల్ కొట్టుకుపోగా.. ప్రస్తుతం రూ.990 కోట్లతో మళ్లీ నిర్మిస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో కట్టిన ఈ నిర్మాణం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన అనంతరం వరదలకు కొట్టుకుపోయిందని గుర్తు చేశారు. దీంతో వైఎస్ జగన్‌కు ఎలాంటి నంబంధం లేదన్నారు. గతంలో కట్టిన సంస్థే ఇప్పుడు కూడా డయాఫ్రం వాల్ కడుతోందన్నారు. అంత పెద్ద డ్యామేజ్ జరిగినా.. ఎందుకు విచారణ జరిపించడం లేదని, బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని చంద్రబాబుని ప్రశ్నించారు. ఇప్పుడు కట్టినా ఉంటుందా.. పోతుందా.. అనే అనుమానం కలుగుతోందని, దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాస్తవ పరిస్థితి ఎందుకు కప్పిపుచ్చుతున్నారని ప్రశ్నించారు. మీడియాను తీసుకుని పోలవరం వెళ్తానంటే.. తనతో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఇవ్వడమేమిటని నిలదీశారు. ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులతో ప్రజలకు ముఖాముఖి ఏర్పాటు చేసి అనుమానాలు నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్యానల్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ కమిటీ ప్రాజెక్ట్ పనులను పరిశీలించి అక్టోబర్‌లో నివేదిక ఇచ్చిందని ఉండవల్లి చెప్పారు. అందులో ఏముందో వెల్లడించలేదన్నారు. ఆ నివేదిక కాపీ ఇప్పించాలంటూ న్యాయవాది రమేష్ సమాచార చట్టం ద్వారా కోరారన్నారు. ఆ నివేదిక ఎవరికైనా ఇస్తే కాపీరైట్ చట్టం కిందకి వస్తుందని రిప్లై ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. నిజానికి ఆ నివేదికలో ప్రభుత్వం చెప్పినట్టే రాస్తారని, అయినా ఎందుకలా అన్నారో అర్థం కావడం లేదన్నారు. గతంలో ప్రభుత్వం ఎన్నో శ్వేతపత్రాలు విడుదల చేసిందని, పోలవరం ప్రాజెక్ట్ సందేహాల నేపథ్యంలో శ్వేతపత్రం విడుదల చేయాలని ఉండవల్లి డిమాండ్ చేశారు.

విశ్వాసము గలిగి మంచి పనులు చేయువారు పాప క్షమాపణ నొందెదరు. వారికి గొప్ప బహుమానము లభించును. ఇది అల్లాహ్ చేసిన వాగ్దానము.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 19 డిసెంబర్ 2025

వాయు కాలుష్యం ఎన్నాళ్లు?

మనం పీల్చే ప్రాణవాయువు కొంచెం కొంచెంగా మన ప్రాణాన్ని తోడేస్తున్నదంటే నమ్మబుద్ధి కాదు. ఈ సంగతి కొన్ని దశాబ్దాలుగా తెలుస్తూనే ఉన్నా ప్రతి ఏటా దేశ రాజధాని పౌరులు చలికాలం ఉన్నన్నాళ్లూ శిక్ష అనుభవిస్తున్నారు. ఇటీవల ఏటికేడాదీ అది తప్పడం లేదు. కాకపోతే శీతకాలంలో మాత్రమే మన వ్యవస్థలన్నీ మేల్కొంటాయి. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలూ, ప్రభుత్వాల నియమ నిబంధనలూ, విపక్షాల విమర్శలూ, సామాన్యుల అరణ్య రోదనలూ... అన్నీ అప్పుడే! బీసీసీఐ సైతం దేశంలో దక్షిణాది రాష్ట్రాలు ఉన్నాయన్న సంగతే మరిచి ఇదే సీజన్‌లో ఢిల్లీలో, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో క్రికెట్ సంబరాల నిర్వహణకు సన్నాహాలు చేస్తుంది. ఈసారి కూడా రివాజు తప్పకుండా ఇవన్నీ ఒకదాని వెంబడి మరొకటి సాగుతున్నాయి.

పొగమంచు కమ్మేస్తున్న పర్యవసానంగా ఢిల్లీ ప్రభుత్వం అత్యవసర చర్యలకు ఉపక్రమించింది. గురువారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో 50 శాతం మంది ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' మొదలైంది. ఉద్యోగులు సొంత వాహనాల్లో కాక, 'కార్ పూలింగ్' ద్వారా వచ్చేలా ప్రోత్సహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రాజధాని వెలుపల రిజిస్టరై, బీఎస్–4 ప్రమాణాలు లేని వాహనాల రాకపోకల్ని నిషేధించారు. కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ లేని వాహనాలకు ఇంధనం విక్రయించరాదంటూ పెట్రోల్ బంకులకు ఆదేశాలు పోయాయి. 16 రోజుల పాటు అమల్లో ఉండేలా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్(గ్రాప్)–3 విధించారు. ఈ సమయమంతా నిర్మాణ పనులు నిలిచిపోవాలి. బీఎస్–3 పెట్రోల్, బీఎస్–4 డీజిల్ వాహనాలను అనుమతించబోరు. ఇవి 12 లక్షల వరకూ ఉంటాయని లెక్కేస్తున్నారు. మొత్తంగా ఉండే కోటిన్నర వాహనాల్లో ఇవి ఏపాటి? నమోదు చేసుకున్న నిర్మాణ కార్మికులు ఆంక్షల కారణంగా పనులు కోల్పోతే రూ. 10,000 చొప్పున అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ అలా నమోదైన వారు కేవలం 2.57 లక్షలమంది మాత్రమే. ఇంతకు నాలుగైదు రెట్లు ఎక్కువగా ఢిల్లీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్నారని అంచనా.

ఇవన్నీ మెచ్చదగ్గ చర్యలే. కానీ అసలు ఢిల్లీ సవ్యంగా ఉన్నదెప్పుడు? ఇటీవలి కాలంలో అది నిరంతరం కాలుష్యంలోనే మునిగి తేలుతోంది. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పరస్పర విరుద్ధాంశాలన్నట్టు ప్రభుత్వాలు ప్రవర్తిస్తున్నాయి. కేంద్రీకృత నగర వ్యవస్థల వల్లనే ఈ అవస్థలన్నీ దాపురిస్తున్నాయని తెలిసినా వాటిని మానుకోవడం లేదు. ఢిల్లీలో వాయునాణ్యత అతి తీవ్ర స్థాయిలో... అంటే సగటు వాయునాణ్యతా సూచిక (ఏక్యూఐ) 400కు మించి ఉన్నదని తేలింది. ఇది వరుసగా మూడు రోజులుండగా, ఆ తర్వాత అది 'దయనీయ స్థితి'(వెరీ పూర్)కి... అంటే ఏక్యూఐ 300–400 పరిధిలో కొచ్చింది. కాలుష్యం గురించి దీపావళి పండుగకు ముందో, పంజాబ్‌లో పంట కోతల సమయంలోనో గుర్తుకురావటం వల్లే ఈ సమస్యంతా! కొన్నాళ్లపాటు మొత్తంగా టపాసులు కాల్చటానికి వీల్లేదని నిషేధం విధిస్తే 'మా పండుగకే ఇలాంటివి గుర్తొస్తాయా?' అనే తర్కం తలెత్తదు. బ్యాంకుల ద్వారా వాయిదాల్లో వాహనాల కొనుగోలును కొన్నాళ్లు ఆపేస్తే ఇంత చేటు కాలుష్యం ఉండదు. అసలు ప్రజా రవాణా వ్యవస్థను పటిష్ఠం చేస్తే అత్యధికులు వాహనాల జోలికిపోరు. పరిశ్రమలు వెదజల్లుతున్న ఉద్గారాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటే కాలుష్య భూతం అదుపులో ఉంటుంది.

ఇవన్నీ పట్టనట్టు నవంబర్– జనవరి మధ్య క్రికెట్ మ్యాచ్‌లకు బీసీసీఐ ఉత్తరాదిని ఎంచుకుని నగుబాటు పాలవుతోంది. లక్నోలో వాయునాణ్యత 400 మించటంతో శుక్రవారం జరగాల్సిన మ్యాచ్‌ను రద్దుచేశారు. ఇప్పుడే కాదు... 2017లో ఢిల్లీలో భారత–శ్రీలంక మ్యాచ్ సమయంలో పలుమార్లు అంతరాయం ఏర్పడింది. ఆటగాళ్లకు శ్వాసకోశ సమస్య లొచ్చాయి. కొందరైతే ఆడుతూ వాంతులు చేసుకున్నారు. 2019లో భారత–బంగ్లా మ్యాచ్ సమయంలోనూ ఇంతే! రెండేళ్ల క్రితం బంగ్లా–శ్రీలంక వరల్డ్ కప్ మ్యాచ్ చివరి నిమిషంలో రద్దయింది. కనీసం ఈ సమయంలోనైనా దక్షిణాదిని ఎంచుకుందామని బీసీసీఐకి తోచదు. ఇలా ఎవరికి తోచినట్టు వారు ప్రవర్తించకుండా ప్రభుత్వ విభాగాలన్నీ సమన్వయంతో పనిచేస్తే, ఏడాది పొడవునా అమలయ్యే చర్యలుంటే ఢిల్లీ కాస్తయినా మెరుగుపడుతుంది. కాలుష్య భూతాన్ని నియంత్రణలో ఉంచడం సాధ్యమవుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** అమావాస్య తె.6.27 వరకు (తెల్లవారితే శనివారం) తదుపరి పుష్య శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.10.56 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.39 నుండి 9.23 వరకు, తదుపరి ప.12.19 నుండి 1.03 వరకు, **అమృత ఘడియలు:** ఉ.1.06 నుండి 2.54 వరకు.

సూర్యోదయం: 6.28
సూర్యాస్తమయం: 5.25
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

మౌనం



మీరిప్పుడు మౌనంగా ఉండిపోతే తర్వాత బాధపడవలసి వస్తుంది. అప్పుడిక ఫిర్యాదు చేసే హక్కును కూడా కోల్పోతారు. సంశయాలనూ, సంకోచాలనూ తీసి పక్కన పెట్టండి. ఎక్కడికక్కడే సమస్యను తేల్చేయండి. మౌనం సమస్యే తప్ప, పరిష్కారం కాదు.

– గోవింద్ నిహలానీ, దర్శక దిగ్గజం

రానివ్వండి!

కృత్రిమ మేధ (ఏఐ) విద్యుత్తులా మారిపోతోంది. ఏళ్లుగా మనం విద్యుత్తును వాడుతున్నాం. ఇదీ అంతే! ఏఐ వచ్చేస్తోందంటే భయం అక్కర్లేదు. రానివ్వండి. విద్యుత్తులా దానిని ఉపయోగించండి. నిజానికి ఇప్పటికే ఏఐని 'వాడటం' మొదలు పెట్టేశాం కూడా!

– సి.పి. గుర్నానీ, ఎలాన్ ఓఎస్, కో–ఫౌండర్

లెక్క ఉండదు!

ఆటలోకి దిగాక నేను ఇన్నింగ్స్ మొదలుపెట్టడానికి మాత్రమే సిద్ధంగా ఉండే వాడిని. 100 పరుగులు లేదా 50 తీయటం నా ఆలోచన కాదు. కొత్త బంతిని పాతబడేలా చేయటమే నా పని. రన్స్ కొట్టడమే నా ప్రధాన కర్తవ్యం. వంద, యాభై అనేవి 'ఉప–ఉత్పత్తులు'.

– నయన్ మోంగియా, మాజీ క్రికెటర్

నీడలేని దారి

అబద్ధం అనేది నీడనిచ్చే అనేక దారుల నెట్‌వర్క్. ఆ నీడ పట్టున మనం గంటల తరబడి దాక్కోవచ్చు. కానీ నిజం అనేది ఎండ నుండి నీడనిచ్చేందుకు చెట్టు కూడా లేని సరళమైన రహదారి వంటిది. కానివ్వండి. అబద్ధంలా నిజం లోలోపల దహించి వేయదు.

– మానవ్ కౌల్, రంగస్థల దర్శకుడు

ఎదగండి!

కళ్లను విప్పార్చి చూసే ఆ అమాయకమైన అమ్మాయి దశ నుండి, స్త్రీగా ఇవాళ నేను రూపాంతరం చెందటం వరకు ప్రతి సవాలూ నాలో బలం నింపింది. ప్రతి విజయం నన్ను కృతజ్ఞతతో నింపింది. ఎదుగుదల ఎప్పుడూ గర్జించదు. మృదువుగా నవ్వుతుందంతే!

– అంకిత లోఖండే, టీవీ నటి

మీ విజన్

ఒక పని ఎలా చేయాలో మీకు 'విజన్' ఉంటే ఆ ప్రకారం ముందుకు వెళ్లి పని మొదలు పెట్టేయండి. మీ 'విజన్'తో వ్యతిరేకించేవారితో వాదిస్తూ కూర్చుంటే దానంత నిష్ప్రయోజనమైన పని వేరొకటి ఉండదు. ముఖ్యంగా ఏఐ రంగంలో మీరిది గమనించాలి.

– డారియో అమోడే, 'ఆంత్రోపిక్' సీఈవో

పని హక్కును కాలరాసిన బిల్లు

అభిప్రాయం

వి. వెంకటేశ్వర్లు

2005 నాటి 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం'(ఎంజీఎన్ ఆర్ఈజీఏ–ఎంజీ నరేగా)ను రద్దుపరచి, ఆ స్థానంలో తెచ్చిన 2025 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)–వీబీ జీ రామ్ జీ– బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులకు అనుగుణంగా రెండు దశాబ్దాల క్రితం తెచ్చిన పాత చట్టం స్థానంలో సరికొత్త ఆదర్శాలు, లక్ష్యాలతో ఈ కొత్త చట్టాన్ని తెస్తున్నామని ఎన్డీయే ప్రభుత్వం చెబుతోంది. పాతదానికంటే ఇది అత్యంత పారదర్శకమైనదనీ, గ్రామీణ పేదలకు మరిన్ని ఎక్కువ పనిదినాలు కల్పించడమే కాకుండా తాగు, సాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం దక్కుతుందనీ మోదీ ప్రభుత్వం చెబుతోంది. కానీ అసలు ఈ చట్టాన్ని ఎందుకు మార్చవలసి వచ్చింది?

తిండి పెట్టిన చట్టం పోయి...

నూటికి 60% మంది వ్యవసాయ రంగంపై ఆధారపడిన దేశం మనది. నూటికి 70% మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు అనేక లెక్కలు చెబుతున్నాయి. మన లాంటి దేశంలో గ్రామీణ ప్రాంతంలో ఏడాదికి 100 రోజులు హక్కుగా పని కల్పించిన చట్టం పాతది. ఈ చట్టం బాగా అమలు జరిగిన చోట పేదల కొనుగోలు శక్తి పెరిగింది, వలసలు తగ్గాయి, సంపన్నులతో పేదలు బేరమాడే శక్తి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రంలో సుమారు 25 లక్షల ఎకరాల సన్న, చిన్నకారు రైతుల భూములు అభివృద్ధి కావడమే కాకుండా పంట కాలువలు, చెరువుల పూడికలు తీయడం వల్ల భూగర్భ జలాలు పెరిగాయని కేంద్ర ప్రభుత్వమే ప్రకటించింది. అంతేకాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభాలు వచ్చినప్పుడు మన లాంటి దేశంలో వాటిని తట్టుకుని నిలబడటానికి గ్రామీణ ఉపాధి హామీ చట్టం తోడ్పడింది. రెండు దశాబ్దాలుగా వ్యవసాయ కూలీలకు ఆత్మస్థైర్యాన్ని, ఆర్థిక స్వావలంబనను, భూస్వామ్య బంధనాల నుండి స్వాతంత్ర్యాన్ని కల్పిస్తూ గ్రామీణ ఆర్థిక, సామాజిక ముఖచిత్రాన్ని మార్చిన చట్టాన్ని ఎటువంటి బాధ్యతలూ లేని, పరిమిత బడ్జెట్ పథకంగా మార్చివేశారు.

రాష్ట్రాల అధికారం పోయి...

ఇప్పటివరకు పని కల్పించే బాధ్యత గ్రామసభల ద్వారా రాష్ట్రాలకు ఉండేది. అన్ని అధికారాలనూ ఇకపై కేంద్రం లాగేసుకుంటుంది. 'ఎంజీ నరేగా' ప్రకారం ఏ గ్రామంలోనైనా నిరుపేదలు, రైతులు, చేతి వృత్తిదారులు పని కావాలని అడిగితే 15 రోజుల లోపల వారికి పని కల్పించవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండేది. కానీ, కొత్త బిల్లు సెక్షన్ 5(1) ప్రకారం, ఎక్కడ పని కల్పించాలో కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే కల్పిస్తారు. అంటే కేంద్ర ప్రభుత్వం ఏ ప్రాంతాన్ని నోటిఫై చేయలేదో ఆ ప్రాంత ప్రజలకు హక్కు ఉండదు. అంటే సార్వజనీనంగా, సార్వకాలీనంగా ఉన్న హామీని కాలరాసి ఇతర సాధారణ పథకం లాగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని మార్చేసింది.

◆ కరోనా కాలంలో పరిశ్రమలు, రవాణా, మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థే కుదేలైనప్పుడు, కేవలం 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' మాత్రమే గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెట్టింది. అలాంటి చట్టాన్ని రద్దుపరచి, 'వీబీ జీ రామ్ జీ' బిల్లును ఆమోదించడం ప్రజల జీవించే హక్కును కాలరాయడమే!

పాత చట్టంలో డిమాండ్ చేసిన 15 రోజుల్లోపు పని కల్పించవలసి ఉంటుంది. అలా కల్పించక పోతే నిరుద్యోగ భృతి చెల్లించాలి. కార్మికులకు ఇచ్చే వేతనాలలో 100% నిధులు కేంద్ర ప్రభుత్వానివే. కానీ కొత్త బిల్లు సెక్షన్ 4(5) ప్రకారం, కేంద్ర ప్రభుత్వం కార్మికుల పని డిమాండును బట్టి నిధులు కాకుండా రాష్ట్రాల వారీగా నిధులు కేటాయిస్తుంది. ఉదా: కేరళ లాంటి వామపక్ష పాలన, లేదా ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఈ చట్టం ఆధారపడి ఉంటుంది. సెక్షన్ 4(6) ప్రకారం, కేటాయింపుల్లోని మొత్తం కంటే ఎక్కువ ఖర్చుపెడితే ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలి. ఇది కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం నిధులు ఇచ్చే పరిస్థితిని కల్పిస్తుంది. అంటే డిమాండ్‌ను బట్టి నిధులు ఇచ్చే పద్ధతికి బదులు, కేటాయింపులకు అనుగుణంగా డిమాండ్‌ను సర్దుబాటు చేసుకునే పరిస్థితి వస్తుంది.

జీవించే హక్కు పోయి...

పాత చట్టం ప్రకారం, కార్మికుల వేతనాలకు 100%, మెటీరియల్‌కు 75% కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. అంటే 90:10 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. కొత్త బిల్లు ప్రకారం ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు 90:10, ఇతర రాష్ట్రాలు 60:40 నిష్పత్తిలో భరించాలి. 2020–21 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీకి లక్షా పదివేల కోట్లు కేటాయించింది. ఆనాడు కేంద్రం రూ. 99 వేల కోట్లు భరిస్తే, రాష్ట్రాలు రూ. 11 వేల కోట్లు మాత్రమే భరించాయి. కానీ, ఈ బిల్లు ప్రకారం రూ. 44 వేల కోట్లు భరించాలి. దీనివల్ల రాష్ట్రాలపై భారం పడుతుంది. పేద, వలస కార్మికులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు నష్టపోతాయి. నిధుల భారం పెరిగితే రాష్ట్రాలు కార్మికుల డిమాండ్‌ను నమోదు చేయకుండా తప్పించుకునే ప్రమాదం ఉంది. లక్షల కోట్లు అప్పులు తెచ్చి రోజువారీ పబ్బం గడుపుతున్న ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రం నిధులు లేవనే పేరుతో చట్టానికే మంగళం పాడే ప్రమాదం ఉంది.

పాత చట్టంలో పనుల ప్లానింగ్ గ్రామ సభల స్థాయిలో జరిగేది. కానీ, ఈ బిల్లు పనుల ప్లానింగ్‌ను కేంద్రీకృతం చేస్తోంది. దీనివల్ల పంచాయతీల అధికారాలు హరించుకుపోతాయి. నేడున్న సాంకేతిక విధానాల వల్ల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలిసిందే. ఈ కొత్త బిల్లు బయోమెట్రిక్ అటెండెన్స్, జియోస్పేషియల్ టెక్నాలజీ వంటి పర్యవేక్షణ పద్ధతులను ప్రవేశపెడుతోంది. దీనివల్ల కార్మికులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో భాగంగా పాత చట్టం పని హక్కును కల్పించింది. కానీ ఈ బిల్లు ఆ హక్కును నిరాకరిస్తోంది. పేదరికం, నిరుద్యోగం విస్తరిస్తున్న ఈ తరుణంలో ఈ బిల్లు గ్రామీణ నిరుద్యోగాన్ని మరింతగా పెంచి, వెట్టిచాకిరీ వైపు నడిపిస్తుంది. ఈ కొత్త బిల్లు సామాజిక పురోగమనానికి కాకుండా, భూస్వామ్య సంస్కృతికి జీవం పోస్తుంది. కోట్లాది మంది పొట్టగొట్టే ఇలాంటి బిల్లుకు కూటమి ఎంపీలు మద్దతివ్వడం శోచనీయం.

వ్యాసకర్త ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి

చిక్కుముడులు... చీకటి కోణాలు

వ్యూ పాయింట్:

పాడ్‌కాస్ట్: ద దేశీ క్రైమ్

అతిథి: రాకేశ్ మారియా, ముంబై మాజీ పోలీస్ కమిషనర్

హోస్ట్(లు): ఆర్యన్ మిశ్రా, ఐశ్వర్యా సింగ్

నేర దర్యాప్తు బాధ్యతల్లో ఉన్నప్పుడు మోయలేనంతగా భావోద్వేగ భారం ఉంటుందని ముంబై మాజీ పోలీస్ కమిషనర్ అంటున్నారు. అయినప్పటికీ బాధిత కుటుంబాలకు న్యాయం జరగాలన్న సంకల్పం తమను ముందుకు నడిపిస్తుందని 'ద దేశీ క్రైమ్' పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

రక్తం... బీభత్సం... గందరగోళం!

''భారతదేశ ఆర్థిక రాజధానిపై జరిగిన 26/11 ఉగ్రదాడి దర్యాప్తు బాధ్యతను ముంబై నగర పోలీసుల బృందం చేపట్టింది. ఆ బృందానికి నేను అధిపతిని. ఉగ్రవాదులలో ఎక్కువ మంది లష్కరే తోయిబా ద్వారా శిక్షణ పొంది వచ్చినవారు. రక్తం, బీభత్సం, గందరగోళం మధ్య మా దర్యాప్తు మొదలైంది. ఎట్టకేలకు అజ్మల్ కసబ్ అరెస్టుకు, ఉగ్రవాద నెట్‌వర్క్‌లోని మూలాలను నిర్వీర్యం చేయడానికి పనికొచ్చే ఆధారాలను సేకరించాం.

ఉగ్రదాడుల వెనుక 'డి–కంపెనీ'

''మా దర్యాప్తులో ప్రధాన భాగం 'డి–కంపెనీ' పాత్రను కనిపెట్టడం. దావూద్ ఇబ్రహీం నడుపుతున్న అండర్ వరల్డ్ సామ్రాజ్యం 'డి–కంపెనీ'. మనీలాండరింగ్, ఆయుధ అక్రమ రవాణా, ఉగ్రవాద నిధుల వ్యవస్థల గురించి కూపీ లాగుతున్నప్పుడు 26/11 ఉగ్రదాడులకు 'సదుపాయ మద్దతు' (లాజిస్టిక్ సపోర్ట్)ను అందించడంలో 'డి–కంపెనీ' ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు గుర్తించాం. దేశ, విదేశాలలోని నిఘా సంస్థలతో దగ్గరగా పనిచేసి, ఆర్థిక లావాదేవీలను ఆరా తీశాం. కమ్యూనికేషన్‌లను అడ్డుకున్నాం. ఉగ్రవాద దాడులకు, దావూద్ నెట్‌వర్క్‌కు సంబంధం ఉందని నిరూపించే ప్రతి సాక్ష్యాన్నీ సేకరించాం.

రాకేశ్ మారియా, ఐశ్వర్యా సింగ్

ఇంద్రాణీ ముఖర్జీ హత్య కేసు

''మా బృందానికి పరీక్ష పెట్టిన మరొక కేసు ఇంద్రాణీ ముఖర్జీకి ప్రమేయం ఉన్న షీనా బోరా హత్య. పైకి చూస్తే ఇదొక మామూలు హత్యలా అనిపించింది. కానీ మేము లోతుగా వెళుతున్న కొద్దీ అబద్ధాలు, ద్రోహబుద్ధులు, వక్రీకరణల వంటివెన్నో మమ్మల్ని ఆశ్చర్యానికి గురి చేశాయి. హై సొసైటీకి చెందిన ఇంద్రాణి పైకి చాలా ప్రశాంతంగా కనిపించేవారు. కానీ ఆమె వ్యక్తిగత జీవితం నిండా రహస్యాలే. కూతురు షీనాతో ఆమెకి ఉన్న సంక్లిష్టమైన సంబంధం ఆ రహస్యాలలో ఒకటి మాత్రమే. దురాశ, దాపరికాలు, స్వాధీన కాంక్ష కలగలిసిన వ్యూహాత్మక హత్య షీనా బోరాది. మొత్తానికి షీనా ఆత్మకు న్యాయం చేయగలిగాం. ఈ ప్రయత్నంలో మానవ స్వభావంలోని పలు చీకటి కోణాలు కూడా బహిర్గతమయ్యాయి.

దర్యాప్తుకు ఇంటెలిజెన్సే కీలకం

''ఉగ్రదాడుల్ని నిరోధించటానికి మీరు ఎప్పుడూ కూడా శత్రువు కంటే రెండు అడుగులు ముందుండాలి. ఆర్థిక లావాదేవీల జాడల్ని కనిపెట్టడం, ఫోన్ కాల్స్‌ని అడ్డగించి వినటం, లేదా ఇన్ఫార్మర్ల నుండి 'టిప్స్' సేకరించడం... ఇవన్నీ కూడా ఇంటెలిజెన్స్‌తో మాత్రమే జరిగేవి. మీరు సరిహద్దు ఉగ్రవాదం, ప్రపంచ వ్యవస్థీకృత నేరాలతో వ్యవహరిస్తున్నప్పుడు, అంతర్జాతీయ సంస్థల సహకారం చాలా అవసరం. 26/11 దర్యాప్తు సమయంలో మేము ఎఫ్.బి.ఐ., ఇంటర్‌పోల్ వంటి ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని డబ్బు ప్రవాహాన్ని కనిపెట్టాం. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను పసిగట్టాం.

వృత్తిపై భావోద్వేగాల ఒత్తిడి

''పోలీసు టీమ్‌లో పనిచేయడం వల్ల భావోద్వేగ భారం ఉంటుంది, ముఖ్యంగా 26/11 లేదా షీనా బోరా కేసు వంటి హై–ప్రొఫైల్ కేసుల దర్యాప్తులో ఛిద్రమైన శరీర భాగాలను, దుఃఖిస్తున్న కుటుంబాలను చూస్తున్నప్పుడు మానసికమైన ఆ బరువును తట్టుకోవటం చాలా కష్టంగా ఉంటుంది. తీవ్ర ఒత్తిడిలో కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది. నేను తగినంతగా చేస్తున్నానా, నేను నా కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకుంటున్నానా, నా మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతోందా అని నేను ఆలోచించిన సందర్భాలూ ఉన్నాయి. కానీ బాధిత కుటుంబాలకు న్యాయం జరగాలన్న సంకల్పం మనల్ని ముందుకు నడిపిస్తుంది.

❑ ఎడిటోరియల్ టీమ్

చిన్న కథ... పెద్ద ఆలోచన

ఇన్ బాక్స్

సినిమా అనే విస్తారమైన కళాసాగరంలో షార్ట్ ఫిల్మ్ ఒక చిన్న అలలా ఎగిసినట్టు కనిపించినా, దాని ప్రభావం మాత్రం లోతుగా ఉంటుంది. మామూలు సినిమాలో కథ చెప్పడమంటే పెద్ద సెట్లు, రెండు మూడు గంటల నిడివి, వందల డైలాగులు కావాలి. కానీ షార్ట్ ఫిల్మ్ తక్కువ సమయంలో, తక్కువ మాటల్లో, ఎక్కువ భావాన్ని పంచగలిగే శక్తిని కలిగిన సంభావ్య కళారూపం. సాధారణంగా 1 నుంచి 40 నిమిషాల చిన్న కథకు దృశ్య రూపమిచ్చే సినిమాను లఘుచిత్రం అంటారు. ఒక భావాన్ని, సంఘటనను, సన్నివేశాన్ని గాఢంగా చూపిస్తూ ప్రేక్షకుడిలో ప్రతిస్పందనను సృష్టించడమే లఘు చిత్రం లక్ష్యం. వాణిజ్యపరమైన ఒత్తిళ్లకు దూరంగా, దర్శకుడు, రచయిత, నటులు తమ లోపలి ఆలోచనలను అంతర్మథనాలను, కొత్త ఆలోచనలను స్వేచ్ఛగా పంచుకునే రంగమిది.

వర్తమాన డిజిటల్ యుగం షార్ట్ ఫిల్మ్‌కు అద్భుతమైన అవకాశాల్ని కల్పిస్తున్నది. యూట్యూబ్, ఫిల్మ్ కంపానియన్ వంటి అనేక ప్లాట్‌ఫామ్స్ ద్వారా లఘు చిత్రాలకు కొత్త ప్రేక్షకులు దొరికారు.

'కాన్ షార్ట్ ఫిల్మ్ కార్నర్', 'సండేన్ షార్ట్స్', 'బెర్లిన్ షార్ట్స్' వంటి అంతర్జాతీయ వేదికలపై భారతీయ షార్ట్ ఫిల్మ్స్ గుర్తింపు తెచ్చుకున్నాయి. 'పీరియడ్. ఎండ్ ఆఫ్ సెంటెన్స్' లాంటి చిత్రం ఆస్కార్‌ను కూడా గెలుచుకుంది. ఇవ్వాళ షార్ట్‌ఫిల్మ్ కొత్త దర్శకులకు ఒక నవ్య వేదికగా మారింది. మన కాలపు అత్యంత స్పష్టమైన ధోరణులు షార్ట్‌ఫిల్మ్స్‌లో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా డిజిటల్ ఒంటరితనం, వలసలు, ఐడెంటిటీ ప్రశ్నలు, మానసిక ఆరోగ్యం, ఏఐ భయాలు, పర్యావరణ సంక్షోభాలు తదితర ఎన్నో విషయాలు చిన్న సినిమాకు ముఖ్యాంశాలు అవుతున్నాయి. ప్రస్తుతం అత్యంత ప్రజాస్వామికమైన, సులభంగా ప్రేక్షకుల్ని చేరగలిగే, ప్రయోగాత్మకమైన సినీ రూపం ఇది.

అలాంటి చిన్న సినిమాకు మన పెద్ద నగరం (హైదరాబాద్)లో వేదిక కల్పించడం అభినందించాల్సిన విషయం. గతంలో 'కరీంనగర్ ఫిలిం సొసైటీ' అయిదారు ఏళ్లపాటు జాతీయ స్థాయిలో లఘు చిత్రాల పోటీలను నిర్వహించి 'పాలపిట్ట' అవార్డులు ఇచ్చింది. 'ఫిలిం తెలంగాణ' లాంటి ఉత్సవాలూ జరిగాయి. ఇప్పుడు దర్శకుడు సి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో తెలంగాణ చలన చిత్రాభివృద్ధి సంస్థ– టూరిజం శాఖ సంయుక్తంగా అంతర్జాతీయ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించడం అభినందించాల్సిన విషయం. ఆసక్తి, అభినివేశం ఉన్న యువతకు ప్రోత్సాహమిది.

– వారాల ఆనంద్ । కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత

(డిసెంబర్ 19–21 వరకు హైదరాబాద్‌లో అంతర్జాతీయ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్)

మెడికల్ వీసాల హవా

డేటా పాయింట్

మనదేశం మెడికల్ టూరిజానికి ప్రసిద్ధి పొందుతోంది. 2020 నుంచి 2024 వరకు 19.89 లక్షలకు పైగా మెడికల్ వీసాలు జారీ కావడమే అందుకు నిదర్శనం.

సంవత్సరాల వారీగా జారీ అయిన వీసాలు

2020	1,52,659
2021	3,38,399
2022	4,37,384
2023	5,97,227
2024	4,63,724

ఆధారం: కేంద్ర పర్యాటక శాఖ

భూభారం

జ్యోతిర్మయం

'ధరణికి గిరి భారమా? గిరికి తరువు భారమా? తరువుకు కాయ భారమా? కని పెంచే తల్లికి పిల్ల భారమా?' అని ప్రశ్నిస్తాడొక కవికుమారుడు. నిజమే! ధరణికి గిరులూ, ఝరులూ, నదులూ, సంద్రాలూ భారం కాదు. కానీ ఒక బరువు మాత్రం ఆమె మోయలేదట. ''**సర్వం సోఢుం అలం మన్యే, ఋతే అలీక పరం నరమ్** – నేను అన్ని భారాలూ భరించగలను, అబద్ధాల కోరూ, అసత్య భాషణతత్పరుడూ అయిన నరుడి బరువు తప్ప'' – అని భూదేవి మొరపెట్టుకోవడం భాగవతంలో కనిపిస్తుంది. దర్పంతో మదాంధులయిన దుర్మార్గుల రూపంలో వందలు, వేల దైత్యులు చెలరేగినప్పుడు ఆ భారం భూమాత భరించలేదు. సృష్టికర్త బ్రహ్మకూ, సృష్టి అయిన జగత్తుకు సంరక్షకుడైన నారాయణుడికీ తన గోడు చెప్పుకొని ఎలాగయినా ఆ భారాన్ని తగ్గించమని వేడుకొంటుంది. అప్పుడు సర్వేశ్వరుడు తనకున్న 'కాలం' అనే శక్తి ద్వారా ఆ రాక్షసులనూ, రాక్షసత్వాన్నీ మట్టుపెడుతూ ఉర్వీ భారం తగ్గించి వెళతాడట.

శ్రీకృష్ణుడి అవతారానికి ముందు ఇలాంటి పరిస్థితే ఏర్పడింది. కంసుడూ, ఆయన అధీనంలో ఉన్న అనేక మంది రాక్షసులూ, శిశుపాల జరాసంధులూ, ధేనుకాసురుడూ, అఘాసురుడూ, వృషాసురుడూ, కాళీయుడూ వంటి దుర్మార్గులెందరో నిరాఘాటంగా విజృంభించారు. భూమాత దేవతలను ప్రార్థించగా, వాళ్ళు దేవదేవుడిని భారం తగ్గించమని ఇలా ప్రార్థించారు: '**గురు పాఠీనమవై, జల గ్రహమవై, కోలంబవై, శ్రీ నృకే/ సరివై, భిక్షుడవై, హయాననుడవై, క్ష్మాదేవతా భర్తవై,/ ధరణీనాథుడవై, దయా గుణగణో దారుండవై, లోకముల్/ పరిరక్షించిన నీకు మ్రొక్కెదము! ఇలా భారంబు వారింపవే!**– కూర్మ, మత్స్య, వరాహ, నృసింహ, వామన, హయగ్రీవ, పరశురామ, శ్రీరామ అవతారాలతో పూర్వం లోకాన్ని రక్షించావు! మరోసారి అవతరించి భూభారం తగ్గించు!'. ఆయన అంగీకరించి, కృష్ణుడిగా జన్మించి, ఆజన్మాంతం దుష్టశిక్షణ చేసి, ధరణి తల్లి బరువు తగ్గించాడు. అది ద్వాపర యుగం మాట. ఇప్పుడు, కలి మహిమ వలన కాబోలు, అసత్య భాషణా తత్పరులూ, నిత్య అసత్య వ్రతులూ సర్వత్రా రెచ్చిపోతున్న తీరు చూస్తే భూమాత మీద సానుభూతి కలిగే పరిస్థితిగానే ఉంది!

– ఎం. మారుతి శాస్త్రి

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్

గుడివాడ టౌన్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ సూచించారు. కృష్ణా జిల్లా గుడివాడలోని ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించినప్పుడే నిజమైన నాయకులు వెలుగులోకి వస్తారన్నారు. సీఎం చంద్రబాబుతో పాటు వేదికపై ఉన్న వెంకయ్యనాయుడు, కావూరి సాంబశివరావు, తాను కూడా విద్యార్థి సంఘాల అధ్యక్షులుగా పనిచేసిన వారిమని చెప్పారు. ప్రతి పాఠశాలలో, కళాశాలలో విద్యార్థి సంఘ నాయకుల ఎంపిక విధానం అమలు చేయాలని కోరారు.

కుటుంబ వ్యవస్థ బలపడాలి..

కుటుంబ వ్యవస్థ గొప్పదని.. దానిని పటిష్టపర్చాల్సిన బాధ్యత యువతపై ఉందని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. తల్లిదండ్రుల బాధ్యత బిడ్డలు తీసుకునేలా వారికి బోధనలు జరగాలని సూచించారు. అక్కినేని నాగేశ్వరరావు నటుడుగా, విద్యాదాతగా తెలుగుజాతికి ఎప్పటికీ గుర్తుండిపోతారన్నారు.

కేంద్ర మంత్రి ఫ్లెక్సీ కడుతుండగా ప్రమాదం

ఒకరి పరిస్థితి విషమం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం మండల పరిధిలోని రాగోలు గ్రామానికి చెందిన నక్క ప్రసాద్, కన్నేపల్లి తిరుపతిరావులు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పుట్టినరోజు వేడుకల సందర్భంగా బుధవారం రాగోలు కూడలి వద్ద ఫ్లెక్సీ కడుతుండగా 33కేవీ విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాదానికి గురై గాయపడ్డారు. స్థానికులు వీరిని జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కిశోర్ చేయి, కాలికి పూర్తిగా గాయాలు కావడంతో ఆయన కనీసం కదల్లేని పరిస్థితి ఉందని జెమ్స్ వైద్యులు తెలిపారు. అదేవిధంగా నక్క ప్రసాద్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదని రూరల్ ఎస్‌ఐ రాము తెలిపారు.

మార్కాపురం మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం రద్దు

చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న వైఎస్సార్‌సీపీ నేత బాలమురళీకృష్ణ

మార్కాపురం టౌన్: ప్రకాశం జిల్లా మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణపై ఈ ఏడాది జూన్ 11న టీడీపీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని రద్దు చేస్తూ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులు గత నెల 27వ తేదీ జారీ అయినప్పటికీ జీవో కాపీ గురువారం బయటకు వచ్చింది. అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా 24 మంది కౌన్సిల్ సభ్యులు సంతకాలు చేసి ప్రభుత్వానికి పంపారు. జూన్ 11న మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగిన ప్రత్యేక సమావేశంలో 19 మంది మాత్రమే తీర్మానానికి మద్దతుగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాంకేతికంగా అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాకపోవడంతో అవిశ్వాస తీర్మానాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీంతో మళ్లీ మున్సిపల్ చైర్మన్ బాధ్యతలను వైఎస్సార్‌సీపీకి చెందిన చిర్లంచర్ల బాలమురళీకృష్ణ చేపట్టనున్నారు.

ఎట్టకేలకు నరసరావుపేట ఏఎస్‌ఐ సస్పెన్షన్

హైవేపై ప్రమాదానికి కారణమైన ఆయన కుమారుడు

కొడుకు అక్రమాలకు తండ్రి సహకరిస్తున్నాడని విచారణలో వెల్లడి

దీంతో తొలుత బదిలీ..తీవ్ర విమర్శలు రావడంతో ఆపై సస్పెన్షన్

ఏఎస్‌ఐ శ్రీనివాసరావు

సాక్షి, నరసరావుపేట: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐదుగురు విద్యార్థుల మరణానికి కారణమైన ప్రధాన నిందితుడి తండ్రి నరసరావుపేట ఏఎస్‌ఐ మదమంచి శ్రీనివాసరావును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ నెల 4న పల్నాడు జిల్లా చిలకలూరిపేట హైవేపై అక్రమంగా డబ్బులు వసూలు చేసేందుకు నరసరావుపేట ఏఎస్‌ఐ కుమారుడు వెంకట్‌నాయుడు తన గ్యాంగ్‌తో కంటైనర్‌ను నిలిపింది. ఈ కంటైనర్‌ను వెనుక నుంచి మరో వాహనం ఢీకొని అందులో ప్రయాణిస్తోన్న ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి ఈ కేసులో ఐదుగురు నిందితుల్ని అరెస్ట్ చేశారు. నిందితులు వినియోగించిన కారుకి ఉన్నది నకిలీ నంబర్ అని తేలడంతో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేశారు. విచారణలో ఏఎస్‌ఐ కుమారుడు వెంకట్‌నాయుడు అనేక దొంగకార్లను వినియోగించినట్లు గుర్తించి కొన్ని కార్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ బంగారం పేరిట గతంలో వెంకట్‌నాయుడు మోసానికి పాల్పడి రూ.40 లక్షలు కాజేశాడు. ఈ వ్యవహారంపై నరసరావుపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి వెంకట్‌నాయుడుపై రౌడీషీట్ తెరిచారు. తండ్రి ఉద్యోగాన్ని అడ్డుపెట్టుకొని వెంకట్‌నాయుడు అనేక నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు కుమారుడి అక్రమాలకు సహకరిస్తున్నాడన్న ఆరోపణలపై నరసరావుపేట ఏఎస్‌ఐ మదమంచి శ్రీనివాసరావును తొలుత వెల్దుర్తికి బదిలీ చేశారు. ఘటన జరిగిన రోజు నిందితుల్లో ఒకరు చిలకలూరిపేట పట్టణ ఎస్‌ఐ రహంతుల్లాకు ఫోన్ చేశారన్న కారణంతో అతడిని కూడా సస్పెండ్ చేశారు. దర్యాప్తులో కీలకంగా వ్యవహరిస్తోన్న ఏఎస్‌ఐ సుబ్బారావుతో పాటు మరో ముగ్గురిపైనా ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

ఓపెన్ టెండరు నోటీస్ నం. : B-E29-TRD-TNDR-30-2025-26
తేది: 16-12-2025
PUB/1619

భారత రాష్ట్రపతి తరఫున క్రింది సంతకందారు దిగువ తెలిపిన పని కోసం ఇ-టెండర్లు కోరుతున్నారు.

టెండరు నం. B-E29-TRD-TNDR-30-2025-26. **పని పేరు:** విజయవాడ డివిజన్ - విజయవాడ డివిజన్‌లోని GDR-BZA సెక్షన్‌లో చీరాల మరియు స్టువర్ట్‌పురం స్టేషన్ల మధ్య Loc 342/25-29 వద్ద 4 లేన్ ROB ప్రతిపాదిత నిర్మాణానికి సంబంధించి OHEకి మార్పులు, చేర్పులు. **సుమారు విలువ:** రూ.40,65,318.14, **పూర్తి చేయుకాల వ్యవధి:** 12 నెలలు, **బిడ్ సెక్యూరిటీ (EMD):** రూ.81,300/-, **ముగింపు తేది:** 08-01-2026, **టెండరు ఫారం ధర:** లేదు.

పూర్తి వివరాలు మరియు నిబంధనల కోసం "www.ireps.gov.in" వద్ద మా సైట్‌ను దర్శించండి.
N.B: తెరచు తేది సెలవు రోజు అయితే టెండరు మరుసటి పని రోజున తెరువబడును.

సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, TrD, విజయవాడ.
A2056

తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్, సెంట్రల్ ఆఫీస్

రీఫండ్ ప్రకటన
సఫాయి కర్మచారి సహిత సబ్-స్టాఫ్ మరియు/లేదా సబ్-స్టాఫ్ 2024-25 నియామకం కొరకు దరఖాస్తు ఫీజు/ఇంటిమేషన్ చార్జీల రీఫండ్

రీఫండ్ నోటిఫికేషన్ తేది 01.02.2025 కు సంబంధించి సఫాయి కర్మచారి సహిత సబ్-స్టాఫ్ మరియు/లేదా సబ్-స్టాఫ్ (నియామకపు నోటిఫికేషన్ తేది: 19.12.2023 మరియు 06.06.2024) ను అనుసరించి బ్యాంకు వారు మొదటి విడత రీఫండ్‌ను 07.02.2025 నుండి 22.02.2025 సమయములో అందుకున్న వివరములకు ...

జనరల్ మేనేజర్-HCM

మున్సిపల్ కార్మికులపై విరిగిన లాఠీ

మహిళలపైనా విరుచుకుపడిన పోలీసులు

స్త్రీలను తాకరాని చోట తాకిన ఖాకీలు

నెల్లూరులో దారుణం

కార్మికుడిపై లాఠీ ఝుళిపిస్తున్న పోలీసులు

నెల్లూరు (బారకాసు): సమస్యల పరిష్కారం కోరుతూ నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టేందుకు వెళ్తున్న మున్సిపల్ కార్మికులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. మహిళలని కూడా చూడకుండా తోసేశారు. దీంతో తోపులాట చోటుచేసుకుంది. కిందపడి పోయిన కొందరు.. లాఠీచార్జీలో మరికొందరు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందర్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు 45 రోజులుగా సమ్మె చేస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. దీంతో వారంతా గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం ముట్టడించేందుకు కార్యాలయ సమీపానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా వచ్చేందుకు యత్నించారు. మరోవైపు మేయర్ స్రవంతి రాజీనామా ఆమోదం కోసం కౌన్సిల్ అత్యవసర సమావేశం జరుగుతోంది. తమ సమస్యలపై వినతిపత్రాన్ని అధికారులకు అందజేయాలనే ఉద్దేశంతో కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు కార్మికుల్ని అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగింది. పోలీసులు ఒక్కసారిగా లాఠీలు ఝుళిపించడంతో కార్మికులు కిందపడిపోయారు. మహిళలని కూడా చూడకుండా మగ పోలీసులు తాకరాని చోట తాకుతూ గందరగోళం సృష్టించారు. కార్మికులను ఇష్టానుసారం లాఠీలతో కొట్టారు. సీఐటీయూ నేతలు, కార్యకర్తలతో పాటు అనేకమంది మహిళా కార్మికులకు గాయాలయ్యాయి. రక్తగాయాలైన మహిళల్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం 63 మంది కార్మికులు, యూనియన్ నేతలను అరెస్ట్ చేసి పోలీస్ వ్యాన్లో ఎక్కించి ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కౌన్సిల్ సమావేశం ముగిసిన అనంతరం రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ నందన్, ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ వచ్చి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడుతామని చెప్పగా కార్మికులు అంగీకరించలేదు. మంత్రి నారాయణ, కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. చివరికి అరెస్ట్ చేసిన వారిని తీసుకొచ్చి కార్పొరేషన్ కార్యాలయం వద్ద విడిచి పెట్టడంతో నిరసనను తాత్కాలికంగా విరమించారు.

బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి

ప్రముఖ సినీ నటుడు సుమన్ డిమాండ్

సుమన్‌ను బీసీ రత్న అవార్డుతో సత్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రాష్ట్రంలో బీసీలకు ఒక ఉప ముఖ్యమంత్రి పదవి కేటాయించాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ డిమాండ్ చేశారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో కాకినాడలో గురువారం నిర్వహించిన బీసీ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. ఐక్యంగా ఉన్నప్పుడే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి చోటా బీసీలు పోటీ చేయాలని.. వారి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శొంఠి నాగరాజు మాట్లాడుతూ.. కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు బీసీలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీసీలకు న్యాయంగా రావాల్సిన రిజర్వేషన్లు దక్కడం లేదని వాపోయారు. అనంతరం సుమన్‌ను బీసీ రత్న అవార్డుతో నాయకులు సత్కరించారు.

బెట్టింగ్‌కు బానిసై వ్యక్తి బలవన్మరణం

అప్పుల బాధతో పీక కోసుకున్న వైనం

ఆత్మహత్యకు పాల్పడిన మహ్మద్ ఇబ్రహీం

జగ్గయ్యపేట అర్బన్: బెట్టింగ్ వ్యసనానికి లోనైన ఓ వ్యక్తి చేసిన అప్పులు తీర్చలేక పీక కోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో గురువారం జరిగింది. పట్టణంలోని డాలర్స్ కాలనీలో ఎస్‌వీఎస్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న మహ్మద్ ఇబ్రహీం(30) హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు భార్య, 4ఏళ్ల కూతురు ఉన్నారు. బెట్టింగ్‌కి బానిసై తీవ్రంగా నష్టపోయి అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిడి తట్టుకోలేక ఇటీవల జగ్గయ్యపేటకు వచ్చిన ఇబ్రహీం.. బుధవారం రాత్రి పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూలు పక్కన ఖాళీ స్థలంలోకి వెళ్లి చాకుతో పీక కోసుకున్నాడు. అటుగా వచ్చిన ఒకరు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. పోలీసులు రక్తం మడుగులో పడి ఉన్న ఇబ్రహీంను ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాసిన సూసైడ్ నోట్‌ను మృతుడి వద్ద నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.రాజు తెలిపారు.

శ్రీవారి ఆలయం ముందు రాజకీయ ఫ్లెక్సీ

శ్రీవారి ఆలయం ముందు ప్రదర్శించిన రాజకీయ ఫ్లెక్సీ

తిరుపతి క్రైమ్: తిరుమల శ్రీవారి ఆలయం ముందు తమిళనాడు యువకులు గురువారం రాజకీయ ఫ్లెక్సీతో ఫొటోలు, వీడియోలు తీసి కలకలం సృష్టించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జయలలిత, పళనిస్వామి, అన్నా డీఎంకే నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని తమిళనాడు యువకులు శ్రీవారి ఆలయం ఎదుట ప్రదర్శించారు. యథేచ్ఛగా వీడియో, ఫొటోలు తీసుకున్నారు. అయినా టీటీడీ సిబ్బంది పట్టించుకోకపోవడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలిపిరిలో అసలు తనిఖీలు జరుగుతున్నాయా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి ఆలయ భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా ఆందోళన

నిరసన చేస్తున్న రైతులు

కొయ్యలగూడెం: ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బోడిగూడెంలో నావెల్ డాక్ యార్డ్ (నేవీ ఆయుధ డిపో) నిర్మాణానికి వ్యతిరేకంగా రైతులు గురువారం ఆందోళన చేశారు. బోడిగూడెం, మంగపతి దేవిపేట గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు బోడిగూడెంలోని సెంటర్‌లో నిరసన చేశారు. ఈ డిపోనకు 1,200 ఎకరాల సేకరణతో తామంతా జీవనాధారం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి సర్వే నిర్వహణకు ఉన్నతాధికారులు వస్తున్నారన్న సమాచారంతో పరిసర గ్రామాల నుంచి రైతులు పెద్దఎత్తున ప్రధాన రహదారిపై శిబిరం ఏర్పాటు చేసి, ఆందోళనకు దిగారు. ప్రభుత్వం డిపో ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. వేరొక ప్రాంతంలో డిపో మంజూరు కాగా అక్కడివారు వ్యతిరేకించిన నేపథ్యంలో దానిని తీసుకువచ్చి తమపై రుద్దడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు

ఆలయం వెలుపల హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీ రమణ

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీ రమణ దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వీరికి ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

YUG SHAKTI SHAKSHAN EVAM SAMAJIK VIKAS SANSTHAN SAMITI
Recruitment of Vocational Trainers (On Contractual Basis)
Yug Shakti, an NSDC empaneled Training Partner, invites Applications from candidates with prescribed qualification & experience for Engagement as Vocational Trainers in Secondary and Higher Secondary, KGBV and Model Schools in Andhra Pradesh
Gross Honorarium - RS. 24,000/- PER MONTH Fixed For all the post's
Age Limit: 21-37
Note - Candidate should be Resident of Andhra Pradesh

Recruitment of Vocational TRAINERS and COORDINATORS For Implementing Vocational Education across Govt. schools in Andhra Pradesh
Only Qualified candidates will be called for the examination process. All positions are purely on Contractual basis. This is not a Government job and the selection process is strictly based on Merit.

JOB OPPORTUNITY
Under Skill Tree Consulting Limited (Contractual Basis)
Corporate Lotus Park, Goregaon, Mumbai-400063, INDIA

WALK-IN INTERVIEW
Position : AREA CREDIT MANAGER (Age:25 to 35 Years)
Qualification : Any Graduate /Post Graduate (Preferably MBA/ MCom/B Com)
Experience : 2+ Yrs experience in Credit (SME/HL/LAP)Loans
Salary : Best in Industry
Job Location : ONGOLE, NELLORE,TIRUPATI, KADAPA, ANANTHAPUR & KURNOOL
Interview Date: 20-12-2025 (10.00 AM to 02.00 PM)
SHRIRAM FINANCE LIMITED
TIRUPATI -517501.
Ph: 8008400582

VALEUR FABTEX — Engagement of Vocational Trainers
Valeur Fabtex Private Limited, invites applications from candidates with prescribed qualification & Experience for Engagement as Vocational Trainers - Agriculture & Beauty & Wellness to be engaged in Government Schools in the Andhra Pradesh
Vocational Trainer — Agriculture — Post-Graduation in Agriculture/Horticulture OR BSc/ B.Tech Agriculture/ Horticulture OR B. Voc (Bachelor of Vocation) in any Science discipline. All-inclusive Gross Honorarium ₹ 24,000/- Per month

INDUS EDUTRAIN — JOB OPPORTUNITY

S.R.R PROJECTS
Recruitment of Vocational Trainers & Vocational Coordinators (On Contractual Basis)

APPOINTMENTS
SAKSHI

బలీయ బంధం

ఒమన్ సుల్తాన్ హైథమ్ బిన్ తారిఖ్‌తో ప్రధాని మోదీ భేటీ

- ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృత చర్చ
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై మోదీ హర్షం
- ఇదొక నూతన, సువర్ణ అధ్యాయం అని ఉద్ఘాటన
- పలు అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేసిన భారత్, ఒమన్

మస్కట్: భారత ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మస్కట్‌లో ఒమన్ సుల్తాన్ హైథమ్ బిన్ తారిఖ్‌తో సమావేశమయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి అందుబాటులో ఉన్న మార్గాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. అంతకుముందు అల్ బరకా ప్యాలెస్‌కు చేరుకున్న మోదీకి సుల్తాన్ ఘనంగా స్వాగతం పలికారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ప్రాంతీయ శాంతి, సుస్థిరత పట్ల తమ అంకితభావాన్ని ప్రకటించారు. రక్షణ రంగంలో పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని తీర్మానించారు. భారత్, ఒమన్ మధ్య చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం పట్ల సుల్తాన్ కృషి ధారి ఉందని మోదీ కొనియాడారు. ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఒప్పందం ఇరుదేశాల సంబంధాల్లో నూతన, సువర్ణ అధ్యాయం అని అభివర్ణించారు. రెండుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను పెంచడంపై ఒమన్ సుల్తాన్‌తో చర్చించినట్లు తెలిపారు. ఇంధనం, అరుదైన ఖనిజాలు, వ్యవసాయం, ఎరువులు, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో సంబంధాలను మరింత మెరుగుపర్చుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అలాగే ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాలు బలపడేలా కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు వివరించారు. భారత్–ఒమన్ వాణిజ్యం 10 బిలియన్ డాలర్లు దాటడం పట్ల మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఇంధన రంగాల్లో ఒప్పందాలు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులపై మోదీ, సుల్తాన్ మధ్య సంప్రదింపులు జరిగినట్లు భారత విదేశాంగ శాఖ పేర్కొంది. మరోవైపు భారత్, ఒమన్ మధ్య ప్రతినిధుల స్థాయిలోనూ చర్చలు జరిగాయి. మరోవైపు, మారిటైమ్ హెరిటేజ్, మ్యూజియమ్స్, వ్యవసాయం–అనుబంధ రంగాలు, ఉన్నత విద్యకు సంబంధించి పలు అవగాహనా ఒప్పందాలపై(ఎంఓయూ) భారత్, ఒమన్ సంతకాలు చేశాయి.

ద్వైపాక్షిక సంబంధాలకు నూతన శక్తి

సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం(సెపా)తో 21వ శతాబ్దంలో భారత్, ఒమన్ సంబంధాలకు నూతన శక్తి, విశ్వాసం సమకూరుతాయని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. ఆయన మస్కట్‌లో ఇండియా–ఒమన్ బిజినెస్ ఫోరమ్ సదస్సులో ప్రసంగించారు. ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. దీని ప్రభావం రాబోయే కొన్ని దశాబ్దాలపాటు ప్రతిధ్వనిస్తుందన్నారు. ప్రతిశీలం, స్వయం పోడకమే భారత్ స్వభావం అని వ్యాఖ్యానించారు. భారత్ అభివృద్ధి సాధిస్తే తమ మిత్రదేశాలు సైతం అభివృద్ధి బాటలో నడుస్తాయన్నారు. భారత్ త్వరలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనుందని, దీనివల్ల ప్రపంచం మొత్తం లబ్ధి పొందుతుందని వివరించారు. అంతకంటే ఎక్కువగా ఒమన్‌కు లాభం కలుగుతుందని పేర్కొన్నారు. ఒమన్ తమకు కన్నిహిత మిత్రదేశమని గుర్తుచేశారు. భారతదేశ ప్రగతి చరిత్రలో భాగస్వాములుగా మారాలని ఒమన్ కంపెనీలకు మోదీ పిలుపునిచ్చారు. ఇండియాలో కీలక రంగాల్లో అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, పెట్టుబడులతో ముందుకు రావాలని సూచించారు.

ప్రపంచానికి మన దీపం వెలుగులు

21వ శతాబ్దంలో భారత్ భారీ నిర్ణయాలు, వేగవంతమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకొని, గడువులోగా ఫలితాలు సాధిస్తోందని చెప్పారు. మోదీ మస్కట్‌లో 'మైత్రి పర్వ్' కార్యక్రమంలో భారతీయ విద్యార్థులు, ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. వారిని 'మినీ–ఇండియా'గా అభివర్ణించారు. మన మంతా ఒకే కుటుంబమని, టీమ్ ఇండియా అని వ్యాఖ్యానించారు. భారతదేశ సంస్కృతికి వైవిధ్యమే పునాది అని స్పష్టంచేశారు. కలిసి జీవించడం, పరస్పరం సహకరించుకోవడం ప్రవాస భారతీయుల హాల్‌మార్క్ అని ప్రశంసించారు. ఇండియా సాధిస్తున్న ప్రగతిని ప్రస్తావించారు. దేశంలో 8 శాతానికి పైగా వృద్ధి రేటు నమోదవుతోందని హర్షం వ్యక్తంచేశారు. ఒకవైపు ప్రపంచ దేశాలు సంక్షోభంలో చిక్కుకోగా, ఇండియా ప్రగతి ప్రయాణం మాత్రం ఎక్కడా ఆగడం లేదన్నారు. ఇండియా–ఒమన్ సంబంధాలకు విజ్ఞానమే మూలకేంద్రమని చెప్పారు. రాబోయే 50 ఏళ్లపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. పెద్ద కలలు కనాలని, విజ్ఞానం పెంచుకోవాలని, మానవాళి బాగు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. దీపావళి పండుగను కల్చరల్ హెరిటేజ్ జాబితాలో చేర్చాలని 'యునెస్కో' ఐటీవల నిర్ణయించిందని ప్రధానమంత్రి తెలియజేశారు. మన దీపం మన ఇంటికి కాకుండా మొత్తం ప్రపంచానికి వెలుగులు పంచుతోందని పేర్కొన్నారు. ఇండియా అంటే కేవలం మార్కెట్ కాదని.. ప్రపంచానికి ఒక మోడల్ అని మోదీ తేల్చిచెప్పారు.

మస్కట్‌లో ప్రధాని మోదీ, హైతమ్ బిన్ తారిఖ్ చర్చలు

మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' ప్రదానం

ఒమన్ ప్రభుత్వం తమ విశిష్ట పౌర గుర్తింపు గౌరవం 'ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను భారత ప్రధాని నరేంద్ర మోదీకి ప్రదానం చేసింది. భారత్–ఒమన్ సంబంధాలను బలోపేతం చేయడానికి తన వంతు పాత్ర పోషించడంతోపాటు అద్భుతమైన నాయకత్వ ప్రతిభ ప్రదర్శిస్తున్నందుకు ఒమన్ సుల్తాన్ హైథమ్ బిన్ తారిఖ్ ఆయనకు ఈ పురస్కారం అందజేశారు. 'ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను స్వీకరించడం ఆనందంగా ఉందని మోదీ పేర్కొన్నారు. ఒమన్ సుల్తాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇరుదేశాల ప్రజల మధ్య విశ్వాసం, ఆప్యాయతలకు ఈ గౌరవం ఒక ప్రతీక అని పేర్కొన్నారు. శతాబ్దాలుగా భారత్, ఒమన్ బంధానికి బాటలు వేసిన సముద్ర ప్రయాణికులకు ఆయన ఈ పురస్కారాన్ని అంకితం ఇచ్చారు.

ఇక స్వేచ్ఛా వాణిజ్యం

ఎఫ్‌టీఏపై సంతకాలు చేసిన భారత్, ఒమన్

- 98 శాతానికిపైగా భారతీయ ఉత్పత్తులపై సున్నా టారిఫ్‌లు
- ఒమన్ ఖర్జూరం, మార్బుల్స్, పెట్రో కెమికల్స్‌పై సుంకాలు తగ్గించనున్న భారత్
- స్వదేశీ పరిశ్రమలు, రైతుల సంక్షేమం కోసం కొన్ని ఉత్పత్తులపై మినహాయింపులు ఇవ్వని ప్రభుత్వం
- భారతీయ వృత్తి నిపుణులకు ఉద్యోగాలు కల్పించేందుకు అంగీకారం

మస్కట్: భారత్, ఒమన్ ద్వైపాక్షిక సంబంధాల్లో కీలక మలుపు చోటుచేసుకుంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)పై ఇరుదేశాలు గురువారం సంతకాలు చేశాయి. ఫలితంగా 98 శాతానికిపైగా భారతీయ ఉత్పత్తులపై ఒమన్‌లో సుంకాలు సున్నాకు చేరుకోనున్నాయి. ఎలాంటి సుంకాలు లేకుండానే భారతీయ వస్త్రాలు, వ్యవసాయ, తోలు సహా పలు ఉత్పత్తులను ఒమన్‌లో విక్రయించుకోవచ్చు. అదేసమయంలో ఒమన్ నుంచి దిగుమతి అయ్యే ఖర్జూరం, మార్బుల్స్, పెట్రో కెమికల్స్ సహా పలు ఉత్పత్తులపై సుంకాలను భారత్ తగ్గించనుంది. ఈ ఒప్పందం వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. భారతీయ ఉత్పత్తులపై ఇప్పటిదాకా ఒమన్ ప్రభుత్వం ఏకంగా 50 శాతం సుంకాలు వసూలు చేస్తున్న నేపథ్యంలో ఒమన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం సానుకూల పరిణామం అని నిపుణులు చెబుతున్నారు. ఒమన్ రాజధాని మస్కట్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో ఎఫ్‌టీఏపై భారత వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, ఒమన్ వాణిజ్య మంత్రి ఖాయిస్ బిన్ మొహమ్మద్ అల్ యూసుఫ్ సంతకాలు చేశారు. దీన్ని అధికారికంగా సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం(సెపా)గా పిలుస్తున్నారు.

ఒప్పందంలో ముఖ్యాంశాలు

- భారతదేశం ఒమన్‌కు చేసే ఎగుమతుల్లో 99.38 శాతం ఉత్పత్తులపై జీరో–డ్యూటీ అమల్లోకి రానుంది.
- భారతీయ సంప్రదాయ ఔషధాలపైనా ఒమన్ సున్నా సుంకాలు విధించబోతోంది. దీనివల్ల ఇండియాలోని ఆయుష్, వెల్‌నెస్ రంగాలకు లబ్ధి చేకూరనుంది.
- భారత్ నుంచి ఎగుమతి అయ్యే బంగారు ఆభరణాలు, తోలు, పాదరక్షలు, క్రీడా పరికరాలు, సామగ్రి, ప్లాస్టిక్, ఫర్నిచర్, వ్యవసాయ ఉత్పత్తులు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, ఫార్మా, వైద్య పరికరాలు, ఆటోమొబైల్ పరికరాలపై ఎలాంటి పన్ను ఉండదు.
- కంప్యూటర్ సంబంధిత సేవలు, వ్యాపార, వృత్తి సేవలు, ఆడియో–విజువల్, పరిశోధన–అభివృద్ధి, విద్య, ఆరోగ్య సేవలపైనా ఒమన్ ప్రభుత్వం సుంకాలు తగ్గించబోతోంది. ఒమన్ 12.52 బిలియన్ డాలర్ల విలువైన సేవలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. ఇందులో ఇండియా వాటా కేవలం 5.31 శాతంగా ఉంది. ఎఫ్‌టీఏతో ఈ వాటా మరింత పెరగనుంది.
- భారతీయ వృత్తి నిపుణులకు ఉద్యోగాలు కల్పించేందుకు ఒమన్ ముందుకొచ్చింది. అకౌంటెన్సీ, ట్యాక్సేషన్, ఆర్కిటెక్చర్, మెడికల్ సంబంధిత రంగాల్లో భారతీయులకు సులువుగా ఉద్యోగాలు లభిస్తాయి.
- అంతేకాకుండా భారతీయ కంపెనీలు ఒమన్ నుంచి 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఎఫ్‌డీఐ)కు ఒమన్ అనుమతి ఇవ్వనుంది.
- ఒమన్ నుంచి దిగుమతి అయ్యే వాటిలో 94.81 శాతం ఉత్పత్తులపై భారత ప్రభుత్వం సుంకాలు రద్దు చేయనుంది.
- భారతీయ పరిశ్రమలు, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కొన్ని రకాల ఉత్పత్తులపై సుంకాలు తగ్గించడం లేదు. ఒమన్ నుంచి వచ్చే వ్యవసాయ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు, టీ, కాఫీ, రబ్బర్, పొగాకు, బంగారం, వెండి ఆభరణాలు, పాదరక్షలు, క్రీడాసామగ్రి, కొన్ని రకాల లోహాలపై ఎలాంటి పన్ను మినహాయింపులు ఉండవు. వీటిని ఒప్పందంలో చేర్చలేదు.

కీలక మిత్రదేశం ఒమన్

- 2006 తర్వాత ఒమన్ ప్రభుత్వం మరో దేశంతో ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోవడం ఇదే మొదటిసారి. అలాగే గత ఆరు నెలల్లో భారత్ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల్లో ఇది రెండోది. ఆరు నెలల క్రితం యూకేతో కలిసి ఎఫ్‌టీఏపై సంతకాలు చేసిన సంగతి తెలిసిందే.
- ఇండియా, ఒమన్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం విలువ 2024–25లో 10.5 బిలియన్ డాలర్లకు చేరుకుంది.
- గల్ఫ్ ప్రాంతంలో భారత్‌కు ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామి ఒమన్. అంతేకాకుండా భారతదేశ సరుకులు, సేవల మధ్యప్రాచ్యం, ఆఫ్రికాలకు చేరడానికి ఒమన్ ఒక ముఖద్వారంగా ఉపయోగపడుతోంది.
- ఒమన్‌లో దాదాపు 7 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. 300 ఏళ్ల క్రితమే స్థిరపడిన భారతీయ వ్యాపార కుటుంబాలు కూడా ఉన్నాయి.
- ఒమన్‌లో 6 వేలకుపైగా భారతీయ కంపెనీలు వివిధ రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయి.
- ఒమన్‌లోని భారతీయులు ప్రతిఏటా 2 బిలియన్ డాలర్లను భారత్‌కు పంపిస్తున్నారు.
- 2000 ఏప్రిల్ నుంచి 2025 సెప్టెంబర్ మధ్య ఒమన్ నుంచి భారత్‌కు 615.54 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి.

కర్మశ్రీ పథకానికి గాంధీజీ పేరు

బెంగాల్ సీఎం మమత ప్రకటన

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో అమలవుతున్న గ్రామీణ ఉపాధి పథకం 'కర్మశ్రీ'కి మహాత్మాగాంధీ పేరు పెడతామని సీఎం మమత ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) పేరును వికసిత్–భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్(గ్రామీణ)(వీబీ–జీ రామ్ జీ)అంటూ మారుస్తూ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఆమె ఈ ప్రకటన చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు జాతిపిత మహాత్మాగాంధీకి కూడా గౌరవం ఇవ్వడం లేదంటూ పరోక్షంగా బీజేపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గురువారం కోల్‌కతాలో వాణిజ్య, పారిశ్రామికవేత్తలతో జరిగిన కార్యక్రమంలో సీఎం మమత మాట్లాడారు. ఎన్‌ఆర్‌ఈజీఏ కార్యక్రమం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించాలని నిర్ణయించడం చూస్తే తనకు బాధ కలుగుతోందన్నారు. జాతి నేతలను వాళ్లు (బీజేపీ)గౌరవించలేకపోతే, మేం ఆ పని చేస్తాం. కర్మశ్రీ పథకాన్ని ఇకపై గాంధీజీ పేరుతో పిలుచుకుంటాం అన్నారు. కర్మశ్రీ పథకం కింద బెంగాల్‌లోని గ్రామీణ ప్రాంతాల వారికి 75 రోజుల పనిదినాలు కల్పిస్తారు.

మమత

'జీ రామ్ జీ'కి జై

- పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం
- విపక్ష సభ్యుల ఆగ్రహం

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్–గ్రామీణ(జీ రామ్ జీ) బిల్లుకు గురువారం పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. తొలుత లోక్‌సభలో విపక్షాల నిరసనల మధ్యే మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించారు. ఈ బిల్లు పట్ల ప్రతిపక్ష సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సభలో బిల్లు ప్రతులను చించేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. మోదీ ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తోందని, గాంధీజీ ఆశయాలు, ఆదర్శాలను నీరుగారుస్తోందని మండిపడ్డారు. పథకం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించడం ఏమిటని నిలదీశారు. గాంధీజీ వారసత్వాన్ని నామరూపాల్లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ కుట్ర అని ఆరోపించారు. జీ రామ్ జీ బిల్లుపై లోక్‌సభలో దాదాపు 8 గంటలపాటు చర్చ జరిగింది. విపక్ష సభ్యులు తమ అభ్యంతరాలు వ్యక్తంచేశారు. ఈ చర్చకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సమాధానమిచ్చారు. ఉపాధి హామీ పథకంలో అవినీతి జరుగుతోందని, లోపాలను సరిదిద్దడానికే బిల్లును తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇప్పటి అవసరాలకు తగ్గట్టుగా పథకంలో మార్పులు చేస్తున్నామని, స్త్రీలకు సృష్టించడం, గ్రామాలను మోడల్ గ్రామాలుగా అభివృద్ధి చేయడం పథకం ఉద్దేశమని వివరించారు. గాంధీజీ ఆదర్శాలను మోదీ ప్రభుత్వం పాటిస్తోందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు సాధించడానికి ఎన్నో పథకాలు అమలు చేస్తోందని గుర్తుచేశారు. రాజకీయ లబ్ధి కోసం గాంధీజీ పేరు వాడుకోవడం ప్రతిపక్షాల హిత అని పలికారు.

పార్లమెంట్‌లో...

- ప్రతి పక్షాల తీవ్ర నిరసనల మధ్య 'జీ రామ్ జీ' బిల్లు లోక్‌సభలో మూజువాణి ఓటుతో గట్టెక్కింది.
- సభలో ప్రతిపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించివేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.
- అనంతరం పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.
- రాజ్యసభలో అర్ధరాత్రి దాటాక జీరామ్‌జీ బిల్లు ఆమోదం పొందింది.
- అణు ఇంధన రంగంలో ప్రైవేట్ సంస్థలకు ప్రవేశం కల్పించడానికి ఉద్దేశించిన 'శాంతి' బిల్లుకు పార్లమెంట్ జై కొట్టింది. బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు గురువారం రాజ్యసభలో ఓకే అయ్యింది.
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో 'సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్ బిల్లు'ను ప్రవేశపెట్టారు.
- స్వల్ప చర్చ అనంతరం ఈ బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపించాలని ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు.

పార్లమెంట్ వద్ద నిరసన తెలుపుతున్న ఖర్గే, సోనియా గాంధీ తదితర ప్రతిపక్ష ఎంపీలు

ప్రభుత్వం దాదాపు రూ.11 లక్షల కోట్లు ఖర్చు చేయనుందని చెప్పారు. ఈ నిధులను నీటి సంరక్షణ, గ్రామీణ, జీవనోపాధి సంబంధిత మౌలిక సదుపాయాలు, ప్రతికూల వాతావరణ సమస్యలను పరిష్కరించే పనుల కోసం వెచ్చించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆయన బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సభలో బిల్లు ప్రతులను చించివేసి దుర్మార్గాల ప్రవర్తించారని ప్రతిపక్షాలపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని గూండాయిజంగా మారుస్తారా? అని ప్రశ్నించారు. బిల్లుకు జీ రామ్ జీ అని పేరు పెడితే తప్పేమిటని ప్రశ్నించారు. పేరుపై రాద్ధాంతం అవసరం లేదని అన్నారు.

రాముడి పేరుపై ఎందుకంత అసహనం?

విస్తృతమైన సంప్రదింపుల తర్వాతే జీ రామ్ జీ బిల్లును రూపొందించామని శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పష్టంచేశారు. గ్రామీణ ఉపాధికి ప్రభుత్వం దాదాపు ... ప్రతిపక్షాలు కేవలం పేరును పట్టుకొని వేలాడుతున్నాయని, తాము మాత్రం పనిపై దృష్టి పెట్టామని స్పష్టంచేశారు. రాముడి పేరు వినిపిస్తే ఎందుకంత అసహనం? అని నిలదీశారు.

విపక్షాల నిరసన ర్యాలీ

జీ రామ్ జీ బిల్లును పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపించాలని లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుడు కె.సి.వేణుగోపాల్ కోరారు. స్పీకర్ ఓం బిర్లా అందుకు అంగీకరించలేదు. దీనిపై మాట్లాడేందుకు అన్ని పార్టీల సభ్యులకు అవకాశం ఇవ్వాలని చెప్పారు. బిల్లును వ్యతిరేకిస్తూ పార్లమెంట్ ప్రాంగణంలో విపక్ష సభ్యులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రేరణ స్థలంలోని గాంధీజీ విగ్రహం నుంచి మకరద్వారం వరకూ నడిచారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం హత్య చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.

రాజ్యసభలో బిల్లు..

జీ రామ్ జీ బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ గురువారం మధ్యాహ్నం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. బిల్లును ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకించారు. సమగ్ర పరిశీలన కోసం పార్లమెంటరీ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశారు. బిల్లులో సవరణలు సూచించడానికి తగినంత సమయం ఇవ్వాలని కోరారు. సుదీర్ఘ చర్చ తర్వాత మూజువాణి ఓటుతో అర్ధరాత్రి దాటాక రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందింది.

భారతీయులకు పెరిగిన హెచ్‌–1బీ కష్టాలు

అక్టోబర్‌కు వాయిదాపడిన వీసా ఇంటర్వ్యూలు

వాషింగ్టన్: తెంపరి ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో అమెరికాకు వెళ్లాలనుకున్న భారతీయుల హెచ్‌–1బీ వీసా కష్టాలు మరింత పెరిగాయి. అమెరికా వ్యతిరేక, పాలస్తీనా అనుకూల వ్యాఖ్యలు, వీడియోలు, పోస్టులు చేసే విదేశీయులను తమ గడ్డమీద అడుగుపెట్టకుండా, హెచ్‌–1బీ, హెచ్‌4 వీసాలు రాకుండా అడ్డుకునేందుకు ట్రంప్ సర్కార్ గత వారం ఆయా వీసా దరఖాస్తుదారుల సోషల్‌మీడియా ఖాతాల ముమ్మర పరిశీలన మొదలెట్టడం తెల్సిందే. అన్ని ఖాతాల పరిశీలనకు సుదీర్ఘకాలం పట్టేనున్న నేపథ్యంలో అప్పటిదాకా హెచ్‌–1బీ వీసాల ఇంటర్వ్యూలను 2026 అక్టోబర్‌దాకా వాయిదావేస్తున్నట్లు చాలా మంది అభ్యర్థులకు సందేశాలు అందాయి. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగం సంపాదించి వీసా కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది నిపుణులైన భారతీయులకు ఈ నిర్ణయం అశనిపాతమైంది. అక్టోబర్‌దాకా తమ వీసా ఇంటర్వ్యూలను మోక్షం లభిస్తుందో లేదో 2027 జనవరికి మరోసారి వాయిదాపడతాయా? అనే సందిగ్ధావస్థ భయాందోళనలు భారతీయులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఈ ఏడాది జరగాల్సిన ఇంటర్వ్యూలను గతంలోనే 2026 ఫిబ్రవరి, మార్చికి రీషెడ్యూల్ చేయడం తెల్సిందే. అయితే, ఫిబ్రవరిలో ఇంటర్వ్యూలు ఖరారైన వేల దరఖాస్తుదారులు వాటిని రద్దుచేసుకుంటే వాళ్ల స్థానంలో తమకు అవకాశం లభిస్తుందేమోనన్న ఆశ ఈ అక్టోబరుకు రీషెడ్యూల్ అయిన దరఖాస్తుదారుల్లో కన్పిస్తోంది.

విద్వేష ప్రసంగ వ్యతిరేక బిల్లు

ఆమోదించిన కర్ణాటక అసెంబ్లీ

బెళగావి: దేశంలోనే మొట్టమొదటిసారిగా తీసుకువచ్చిన విద్వేష ప్రసంగ వ్యతిరేక బిల్లుకు కర్ణాటక అసెంబ్లీ గురువారం ఆమోదించింది. బీజేపీ సభ్యుల తీవ్ర నిరసనల మధ్య సభ 'ది హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్)బిల్లు'కు ఆమోద ముద్ర వేసింది. ఈ బిల్లులో ప్రతిపాదించిన నిబంధనల ప్రకారం...విద్వేష ప్రసంగాలు, నేరాలకు పాల్పడిన వారికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధించేందుకు వీలుంటుంది. ఈ నెల 4వ తేదీన కేబినెట్ ఆమోదం తెలపగా, ఈ నెల 10వ తేదీన అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ప్రకారం, విద్వేష ప్రసంగాలంటే బహిరంగంగా ఒక వ్యక్తి, వ్యక్తుల సమూహం, వర్గం/ సమాజంపై ఏదైనా ప్రతికూల ప్రయోజనాన్ని ఆశించి... హాని, అశాంతి, శత్రుత్వం, ద్వేషం కలిగించాలనే ఉద్దేశంతో, బహిరంగంగా, మాటల ద్వారా రాతపూర్వకంగా, సైగలు దృశ్య రూపాల ద్వారా, ఎల్రక్టానిక్ మాధ్యమాల ద్వారా లేదా మరే ఇతర మార్గం లోనైనా చేసే ప్రకటనలు లేదా వ్యక్తీకరణలు దేశవ్యాప్తంగా ప్రసారం కిందకు వస్తాయి. కాగా, ఈ బిల్లును ప్రతిపక్షం, మీడియా లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన బ్రహ్మాస్త్రంగా బీజేపీ అభివర్ణించింది.

అణు ఇంధన బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ: అణు ఇంధన బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. అణు ఇంధన రంగంలో ప్రైవేట్ సంస్థలకు ప్రవేశం కల్పించడానికి ఉద్దేశించిన 'శాంతి' బిల్లును రాజ్యసభలో గురువారం మూజువాణి ఓటుతో ఆమోదించారు. ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన పలు సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. అలాగే పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపాలన్న డిమాండ్‌ను సైతం తోసిపుచ్చింది. ఈ బిల్లు బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. రాజ్యసభలో జరిగిన చర్చకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సమాధానమిచ్చారు. అణు ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించడానికే శాంతి బిల్లును తీసుకొచ్చినట్లు చెప్పారు. ఇతర ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అణు విద్యుత్ ఉత్పత్తిని పెంచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని స్పష్టంచేశారు. ఇకపై, అణు ఇంధన రంగంలో ప్రైవేట్ సంస్థలను అనుమతిస్తే దేశ సార్వభౌమత్వాన్ని పణంగా పెట్టినట్లే అవుతుందని ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన వ్యక్తంచేశారు.

లోక్‌సభలో 'సెక్యూరిటీస్' బిల్లు

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో 'సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్ బిల్లు'ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లు పట్ల డీఎంకే ఎంపీ అరుణ్ నెహ్రూ, కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ అభ్యంతరాలు వ్యక్తంచేశారు. సెబీ నుంచి మొత్తం అధికారాలు కట్టబెట్టాలనుకోవడం సరైంది కాదని అన్నారు. అధికారాల వికేంద్రీకరణ సూత్రానికి ఇది విరుద్ధమని చెప్పారు. బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపాలని ప్రతిపాదిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ బదులిచ్చారు.

సమస్యల్ని పరిష్కరించా విజయాలెన్నో సాధించా

- వలసవిధానం మొదలు టారిఫ్‌లతో రెవెన్యూపెంపు దాకా ఘనతలెన్నో సాధించానన్న ట్రంప్
- 2025 ముగింపు సందర్భంగా జాతినుద్దేశించి ప్రసంగం

న్యూయార్క్/వాషింగ్టన్: జో బైడెన్ ప్రభుత్వం వారసత్వంగా తనకు ఇచ్చిన సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించి దేశాన్ని అభివృద్ధిపథంలో ఉరకలెత్తిస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. 2025 ఏడాది మరో 20 రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో తన 11 నెలల పాలనపై ట్రంప్ 19 నిమిషాలపాటు గురువారం జాతినుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా తన విజయాల పరంపర ఇదేనంటూ పలు అంశాలను ఏకరువుపెట్టారు. "బైడెన్ తన పాలనలో ప్రపంచంలోనే అమెరికా సరిహద్దులు అత్యంత దుర్భలంగా మార్చారు. నేను దుర్భేద్యంగా పటిష్టపరిచా. ఇలాంటి ఎన్నో సమస్యలతో అధ్వాన్నస్థితిలో అమెరికా పరిపాలనా పగ్గాలను ఆయన నాకు వారసత్వంగా ఇచ్చారు. ఆ సమస్యల అంతుకు నేను సమర్థవంతంగా సరిదిద్దుతున్నా. అమెరికాను పూర్వవైభవం వైపు తీసుకెళ్తున్నా. 10 నెలల్లో ప్రపంచవ్యాప్తంగా 8 ప్రధానమైన యుద్ధాలను నిలువరించా. ఇరాన్ నుంచి పొంచి ఉన్న అణుముప్పును అడ్డుకున్నా. 3,000 సంవత్సరాల్లో సాధ్యంకాని పశ్చిమ సియాలో శాంతిని స్థాపించా. హమాస్–ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపేశా" అని అన్నారు. భారత్–పాకిస్తాన్, థాయిలాండ్–కాంబోడియా, అర్మేనియా–అజర్‌బైజాన్, కొసావో, సెర్బియా, ఇజ్రాయెల్, ఇరాన్, ఈజిప్ట్, ఇథియోపియా, రువాండా, కాంగోల మధ్య సమరాలు నసినిపో యేలా చేశా. బైడెన్ హయాంలోనే అమెరికాలోకి లక్షలాదిగా అక్రమ చొరబాట్లు ఎక్కువయ్యాయి. వీళ్ల కోసం బైడెన్ సర్కార్ అపరిమిత పన్ను వెచ్చించడంతో సొమ్మును అనవసరంగా ఖర్చుచేసింది" అని ట్రంప్ ఆరోపించారు.

వీళ్ల కారణంగానే ఇళ్ల అద్దెలు పెరిగాయి

"విదేశీ వలసదారులు పోటెత్తడంతోనే ఇళ్ల అద్దెలు పెరిగాయి. రెంటల్ మార్కెట్ 60 శాతం పెరగడానికి బైడెన్ ప్రభుత్వ తప్పుడు విధానాలే కారణం. టారిఫ్ అనే పదం నాకెంతో ఇష్టం. టారిఫ్‌ల దెబ్బకు విదేశీ కంపెనీలు అమెరికాలోకి మళ్లీ కర్మాగారాలు క్యూ కట్టేలా చేశా. అమెరికాకు 18 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు రప్పించా. దీంతో ఉద్యోగాలు, జీతభత్యాలు పెంపు, ఆర్థికాభివృద్ధి. కొత్త ఫ్యాక్టరీల ఆరంభాలు, జాతీయ భద్రతను సాకారంచేశా. ఉత్పత్తులను అమెరికాలో నెలకొల్పితే టారిఫ్‌లు ఉండవనేని కంపెనీలకు ఎప్పుడు అర్థమైంది. ఫెంటానిల్ తరహా మాదకద్రవ్యాలను అరికట్టా. టారిఫ్‌ల కారణంగా అమెరికాలోకి డ్రగ్స్ ప్రవాహాన్ని దూరంగా పెట్టాశా. నేల, భూ, సముద్రమార్గాల ద్వారా అమెరికాలోకి విదేశీ మత్తుపదార్థాల రాక 94 శాతం తగ్గింది. గత ఆర్థిక సంవత్సరంలో 6 లక్షల మంది అక్రమవలసదారులు తిరిగి వెళ్లిపోయారు. వాళ్లు వదిలేసిన ఇళ్లు, ఉద్యోగాలు అమెరికన్లకు దక్కుతున్నాయి" అని ట్రంప్ చెప్పుకొచ్చారు.

పర్యాటకులు అమెరికాలో ఎప్పటిదాకా ఉండొచ్చు?

వీసా గడువు తేదీతో సంబంధం లేదంటూ అమెరికా కొత్త మెలిక

వాషింగ్టన్: పలానా తేదీ వరకు అమెరికాలో పర్యటించవచ్చు అంటూ స్వయంగా అమెరికా ప్రభుత్వమే టూరిస్ట్ వీసాను జారీచేసినాసరే ఆ తేదీకంటే ముందే చాలా సందర్భాల్లో విదేశీ టూరిస్ట్ స్వదేశానికి వెనుతిరగాల్సి ఉంటుందని ట్రంప్ సర్కార్ కొత్త మెలిక పెట్టింది. వాస్తవానికి ఈ విభాగంలో వీసా సంబంధ నిబంధన ఎప్పటి నుంచో ఉంటుందని తన వితండవాదాన్ని సమర్థించుకుంది. ప్రయాణికులు ఈ మేరకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం గురువారం తన సామాజిక మాధ్యమం 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్ పెట్టింది. " అంతర్జాతీయ పర్యాటకులకు ముఖ్య గమనిక. అమెరికాలో ఎన్ని రోజుల వరకు పర్యటించవచ్చు అనేది మీకు జారీచేసిన టూరిస్ట్ వీసా మీద ఉన్న గడువు తేదీ నిర్ణయించదు. గడువును అమెరికా కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నిర్ణయిస్తారు. మీరు అమెరికాలో అడుగుపెట్టగానే మీతో ఆయన ఒక ఐ–94 దరఖాస్తును నింపిస్తారు. అందులో మీ చట్టబద్ధ పర్యాటకానికి చివరి తేదీ రాసి ఉంటుంది. ఆ తేదీ ఏంటో తెలుసుకోవాలంటే https://i94.cbp.dhs.gov/ home వెబ్‌సైట్‌ను సందర్శించి అందులో మీ టూరిస్ట్ వీసా సంబంధిత వివరాలను సరిచూసుకోండి. ఐ–94 దరఖాస్తులో 'అడ్మిట్ అంటిల్ డేట్' అని ఒక తేదీ రాసి ఉంటుంది. అదే మీ చట్టబద్ధ పర్యటనకు ఆఖరి గడువు తేదీ. టూరిస్ట్‌వీసా గడువు తేదీ, 'అడ్మిట్ అంటిల్ డేట్' తేదీలు ఒకేలా ఉండాలనే నియమం ఏమీలేదు. సాధారణంగా టూరిస్ట్‌వీసా గడువు కంటే ముందే తేదీ ఉంటుంది 'అడ్మిట్ అంటిల్ డేట్ ముగుస్తుంది" అని అమెరికా రాయబార కార్యాలయం పేర్కొంది.

సాక్షి గుంటూరు

శుక్రవారం | 19 | డిసెంబర్ | 2025

సీఎం సమీక్షలో కలెక్టర్, ఎస్పీ

గుంటూరు వెస్ట్: అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ పాల్గొన్నారు.

23న విగ్రహాల పునఃప్రతిష్ట

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరులోని శ్రీ కట్లమ్మతల్లి పరివార దేవతల విగ్రహాల పునఃప్రతిష్ట ఈ నెల 23న జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.600, గరిష్ట ధర రూ.1000, మోడల్ ధర రూ.800 వరకు పలికింది.

న్యూస్‌రీల్

నల్లబర్లీ సాగు చేస్తే కఠిన చర్యలు

ప్రత్తిపాడు: నల్లబర్లీ సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి అన్నారు. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెంలో గురువారం ఆమె పర్యటించి రైతులతో మాట్లాడారు. నల్లబర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించిందని, సాగు చేయవద్దని చెప్పారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం జీవో నంబర్ 740 జారీ చేసిందని, అతిక్రమించి సాగు చేస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ టీంలు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది నల్లబర్లీ సాగు చేయవద్దంటూ అవగాహన కలిప్తున్నా, కొందరు రైతులు వినడం లేదన్నారు. అందుకే గ్రామాల్లో పర్యటించి సేకరించిన వివరాలను జిల్లా టాస్క్‌ఫోర్స్ టీంకు పంపి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆమె వెంట మార్క్‌ఫెడ్ మేనేజర్ నరసింహా రెడ్డి, గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.మోహన్‌రావు, తహసీల్దార్ ఉన్నారు.

గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



మాచర్ల: మాచర్ల బస్టాండ్ ప్రాంతంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం అర్చకులు అడిగొప్పల చెన్నకేశవాచార్యుల ఆధ్వర్యంలో పంచామృతాలతో గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది మహిళలు పూజలో పాల్గొన్నారు. పాత మాచర్లలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు కొండవీటి రాఘవాచార్యులు, అధ్యక్షులు భవనాశి వెంకటేశ్వర్లు, పట్టణంలోని ప్రధాన వీధిలోని కోదండ రామాలయంలో అర్చకులు కొండవీటి వేణుగోపాలాచార్యులు, అధ్యక్షులు బచ్చు రామారావులు ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు.

నేడు గోవాడలో కోటి కుంకుమార్చన

అమృతలూరు(భట్టిప్రోలు):గోవాడలోని గంగా పార్వతి సమేత బాలకోటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కోటి కుంకుమార్చన, సామూహిక లలితా పారాయణ మహోత్సవం జరుగుతుందని ఎస్‌ఎస్‌ఎఫ్ బాపట్ల దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు. దేవస్థాన కార్యనిర్వాహణాధికారి మంతెన విఠల శ్రీనివాసవర్మ, చైర్మన్ పావులూరి రమేష్ ఆధ్వర్యంలో జరుగుతుందని పేర్కొన్నారు. ప్రధాన అర్చకులు, ఎక్స్ అఫిషియో సభ్యులు స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ, ఉపముఖ్య అర్చకులు చావలి శ్రీధరశర్మ, ఆధ్యాత్మికవేత్త పావులూరి వరలక్ష్మి పాల్గొంటారని తెలిపారు. అన్నదానం కూడా చేస్తున్నట్టు వివరించారు.

21న రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్



తాడికొండ: మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో ఈనెల 21వ తేదీన రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్–2025 నిర్వహిస్తున్నట్లు చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు గురువారం తెలిపారు. ఆనంద్ ఈ చెస్ వింగ్స్, ఏపీసీఏ విభాగం, గుంటూరు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. అన్ని కళాశాలల నుంచి ఏ వయసు వారైనా పాల్గొనవచ్చన్నారు. ఎంట్రీ ఫీజు రూ.500 అని తెలిపారు. విజేతలకు నగదు బహుమతిగా రూ.50 వేలు ప్రకటించారు. ఈ నెల 20వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన వారు మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో సంప్రదించాలని సూచించారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు, భోజన వసతి ఉంటుందన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ నల్లాని వెంకట రామారావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

మరణ మృదంగం

ఆరుగాలం కష్టపడిన రైతన్నలు పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధర రాక అప్పుల పాలు కావడంతో మృత్యువును ఆశ్రయిస్తున్నారు. కొందరు పొలాల్లో ఉరికొయ్యలకు వేలాడుతుండగా, మరికొందరు సాగు చేసిన భూమిలోనే పురుగుమందు తాగి తనువు చాలిస్తున్నారు. జిల్లాలో ఒక్క రోజు వ్యవధిలోనే ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది.



- అప్పుల బాధ భరించలేక రైతుల బలవన్మరణాలు
- ఒక్కరోజు వ్యవధిలోనే గుంటూరు జిల్లాలో ఇద్దరు ఆత్మహత్య
- మిర్చి, పత్తి పంట సాగులో నష్టాలతో అన్నదాతలు కుదేలు
- చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక దక్కని గిట్టుబాటు ధర
- అప్పుల ఊబిలో చిక్కుకొని రైతుల విలవిల
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కొనసాగుతున్న ఆత్మహత్యలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఫిరంగిపురం మండలం గొల్లపాలెంకు చెందిన ఎం.బొల్లయ్య రెండు ఎకరాల్లో మిర్చి, తొమ్మిది ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పంటలు సరిగ్గా పండక, పండిన కొద్ది పంటకు కూడా గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పుల పాలయ్యాడు. పొలానికి వెళ్లి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అదే మండలం మెరికపూడి గ్రామానికి చెందిన ఎస్‌కే మస్తాన్ వలి ఐదు ఎకరాలలో పత్తి పంట వేశాడు. పంట పండక అప్పులు కావడంతో బుధవారం పొలానికి వెళ్లాడు. చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయాడు. రాత్రంతా వెతికిన కుటుంబసభ్యులు మరునాడు ఉదయం ఈ దారుణాన్ని గమనించారు.

రోజురోజుకూ..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రోజురోజుకూ రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. వ్యవసాయ ఖర్చులు అధికం కావడం, అరకొర దిగుబడులు, పంట చేతికొచ్చే సమయానికి తుపాన్లు, భారీ వర్షాలు ఇబ్బంది పెట్టాయి. అన్నీ గట్టెక్కినా చివరికి గిట్టుబాటు ధర లేకపోవడం, వడ్డీలకు తెచ్చిన అప్పులు రెట్టింపు అవుతుండటం, వాటిని తీర్చలేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత ఇప్పటి వరకు ఒక్క ప్రత్తిపాడు నియోజకవర్గంలోనే పది మంది రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఫిరంగిపురం మండలంలో ఇద్దరు, చిలకలూరిపేట నియోజకవర్గంలో ముగ్గురు, వినుకొండలో ఒకరు, పెదకూరపాడు నియోజకవర్గంలో మరొకరు ఈ ఏడాది కాలంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు.

గత ప్రభుత్వంలో వెంటనే సాయం..

గత వైఎస్సార్‌సీపీ సర్కారు హయాంలో రైతులకు అన్నివిధాలా లాభం చేకూర్చేలా వ్యవసాయ రంగంలో పరిస్థితులు ఉండేవి. రైతు భరోసా పేరిట పెట్టుబడి సాయం దగ్గర్నుంచి ఎరువులు సకాలంలో అందించడం, గిట్టుబాటు ధర లభించేలా చూడటం వరకు సజావుగా సాగేవి. విధి లేని పరిస్థితిలో ఎవరైనా రైతు బలవన్మరణానికి పాల్పడితే సాయం అందించేవారు. కానీ ఇప్పుడు కనీసం వారిపై ఆధారపడిన కుటుంబాన్ని ఆదుకునే విషయంలోనూ చంద్రబాబు ప్రభుత్వానికి మనసు రావడం లేదు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో మండల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా నేరుగా జిల్లా కలెక్టర్ సదరు రైతు కుటుంబానికి ఏకంగా రూ. ఏడు లక్షల పరిహారాన్ని నెల, రెండు నెలల వ్యవధిలోనే అందించారు. ఇప్పుడు కనీసం బాధిత కుటుంబాలను పరామర్శించే పరిస్థితి కూడా లేకుండాపోయింది.

ముంచేసిన పత్తి, మిర్చి, పొగాకు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పత్తి, మిర్చి పంటలనే ఎక్కువ సాగు చేస్తున్నారు. గత ఏడాది గులాబీ రంగు పురుగు అధికంగా ఉండటంతో పత్తి రైతులు నిలువునా నష్టపోయారు. మిర్చిని నల్లి తామర ముంచెత్తడంతో పంటను పీకేయాల్సి వచ్చింది. పత్తికి, మిర్చికి ఎకరాకు సుమారు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు పెట్టుబడులు పెట్టారు. ఆరుగాలం శ్రమించి పండించుకున్న పంటలకు కనీస గిట్టుబాటు ధర కూడా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మిర్చి సాగు చేసి నట్టేట మునిగిపోయిన రైతులు పంటను పీకివేసి, నల్లబర్లీ పొగాకు సాగు చేశారు. తీరా పంట దిగుబడులు చేతికొచ్చే సమయానికి ధర లేకపోవడంతో రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. గతంలో క్వింటా రూ.పదిహేను వేల వరకు అమ్మిన నల్లబర్లీని ఈ సారి రూ. మూడు వేలు నుంచి రూ. నాలుగు వేలకు కూడా కొనలేదు. ఈ ఏడాది నల్లబర్లీ పొగాకు సాగు చేయవద్దని చంద్రబాబు ప్రభుత్వం నిషేధం విధించింది. పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా తేమ ఎక్కువ ఉందనే సాకుతో వెనక్కి పంపుతున్నారు. దీనివల్ల పత్తి రైతులు తీవ్ర నష్టాల్లోకి వెళ్లిపోయారు. మరోవైపు పొగమంచు కారణంగా పత్తిలో తేమశాతం తగ్గడం లేదు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సేకరించిన కోటి సంతకాల ప్రతులను గవర్నర్‌కు అందించే సందర్భాన్ని పురస్కరించుకొని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల రెడ్డి తదితరులు

పరిశోధన ప్రణాళికపై వర్క్‌షాప్

మాట్లాడుతున్న వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి

గుంటూరు రూరల్: హైదరాబాద్‌కు చెందిన ఐసీఏఆర్ జాతీయ నూనెగింజల పరిశోధన సంస్థ, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో గుర్తించిన వ్యవసాయ ప్రాముఖ్యత అంశాల ఆధారంగా పరిశోధన ప్రణాళికను సిద్ధం చేసేందుకు రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. గురువారం నగర శివారులోని లాంఫాం దున్న విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జాతీయ పరిశోధన స్థానాలకు చెందిన ప్రతినిధులు, రాష్ట్రస్థాయి పరిశోధన సంస్థల ప్రతినిధులు, వ్యవసాయ పశుసంవర్ధక, ఉద్యాన శాఖల ప్రతినిధులు, ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐఐఓఆర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్‌కే మాథుర్ మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాలకు వరి, మొక్కజొన్న, పత్తి, మిరప, అపరాలు, మామిడి తదితర పంటల్లో పరిశోధన, విస్తరణ అవసరాల ఆధారంగా తయారు చేసిన ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం, ఐసీఏఆర్‌కు పంపుతామన్నారు. విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ పంటల్లో అవసరమైన కార్యాచరణను వివరించారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ, విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివన్నారాయణ, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలోని బాల ఏసు దేవాలయం

మహిమాన్వితం.. బాల ఏసు ఆలయం

- రాష్ట్రంలోనే ఎత్తయిన చర్చిగా గుర్తింపు
- ఆలయానికి 134 సంవత్సరాల చరిత్ర
- ఘనంగా క్రీస్తు జయంతి ఉత్సవాలు

ఫిరంగిపురం: బాల ఏసుకు జన్మనిచ్చిన మరియ మాత తన పుత్రుడిపై చూపే ప్రేమను గుర్తుకు తెచ్చే మహిమాన్విత పుణ్యక్షేత్రం గుంటూరు జిల్లా ఫిరంగిపురంలోని బాల ఏసు దేవాలయం. ఎత్తయిన గోపురంతో ఎలాంటి ఆధారం లేకుండా లండన్ మిల్‌హిల్‌కు చెందిన విచారణ గురువు ఫాదర్ డిక్మన్ ఆధ్వర్యంలో దీనిని నిర్మించారు. అందుకే రాష్ట్రంలోనే ఎత్తయిన బాల ఏసు కథెడ్రల్ ఆలయంగా ఇది ప్రసిద్ధి చెందింది. ఇక్కడ నిర్వహించే క్రిస్మస్ ఉత్సవాలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో పలు ప్రాంతాల నుంచి మత గురువులు వచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాలుపంచుకుంటారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 23, 24, 25 తేదీల్లో క్రీస్తు జయంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి తెలిపారు. ఈ ఆలయానికి విచారణ గురువులుగా వచ్చిన అనేక మంది ఆలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. విద్య, వైద్య, సామాజిక రంగాల్లో గ్రామాభివృద్ధికి ఎంతో పాటు పడ్డారు. ఆలయ పరిసరాల్లో అభివృద్ధి పనులలో భాగంగా వ్యాకుల మాత విగ్రహం, బెల్ టవర్, పునీత గురువుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆలయం లోపల క్రీస్తు జన్మ వృత్తాంతం తెలిపేలా పశువుల పాకను ఏర్పాటు చేశారు.

ఆలయ చరిత్ర ఇదీ...

18 శతాబ్దంలో కథోళిక సంఘం ఫిరంగిపురంలో ఏర్పాటు చేశారు. కొండమెట్లకు వెళ్లే దారిలో చిన్న ఆలయం ఉండేది. దానికి విచారణ గురువులుగా లండన్ మిల్‌హిల్‌కు చెందిన థియోడర్ డిక్మన్ వచ్చారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని చూసి ఆయన బాధపడ్డారు. 1888లో ఆలయ పునర్నిర్మాణానికి తన సొంత నిధులను వెచ్చించి శంకుస్థాపన చేశారు. 1891 నాటికి అద్భుతంగా బాల

ఆలయం లోపలి భాగం

ఫాదర్ డిక్మన్ విగ్రహం

ఏసు దేవాలయం నిర్మాణం పూర్తి చేశారు. ఈ ఆలయం పూర్తిగా ఫ్రెంచి నిర్మాణ శైలిలో ఉండటం విశేషం. ఆలయం పైభాగంలో ఉన్న డోమ్‌కు ఎటువంటి ఆచ్ఛాదన లేకుండా దీనిని నిర్మించారు.

పండుగకు సర్వం సిద్ధం

క్రిస్మస్ సందర్భంగా 15వ తేదీ నుంచే ఆలయంలో నవ దిన ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. 23న సహాయ విచారణ గురువు కె.సాగర్ దివ్యపూజాబలి నిర్వహించనున్నారు. 24న బాల ఏసు దేవాలయ విచారణ గురువు ఫాతిమా మర్రెడ్డి దివ్యపూజాబలి నిర్వహిస్తారు. రాత్రి 11 గంటలకు క్రీస్తు జయంతి మహోత్సవాలు, దివ్యపూజాబలి ఉంటాయి. గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య పాల్గొంటారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై దివ్యపూజాబలి నిర్వహిస్తారు. 25న విచారణ క్రైస్తవుల ఆత్మ శరీర మేలు కోసం దివ్యపూజాబలి నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ప్రధాన యాజకులుగా ఫాతిమా మర్రెడ్డి, టి.కమలేష్‌లు వ్యవహరిస్తారు. రాత్రి బాల ఏసు కథెడ్రల్ దేవాలయ రథోత్సవం (తేరు ప్రదక్షిణ) నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమాలలో మఠకన్యలు, గుడి పెద్దలు, సోడాలిటీ సభ్యులు, మరియ దళ సభ్యులు, కథోళిక సంఘ సభ్యులు కీలక భూమిక పోషిస్తారని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ శివరామకృష్ణ తెలిపారు. వాహనాల పార్కింగ్ ప్రాంతాలను ఇప్పటికే తాము పరిశీలించామన్నారు.

జయహో జగన్

పొన్నూరు నుంచి విజయవాడలోని లోక్‌భవన్ వరకు ప్రతిధ్వనించిన కోటి గళాల సింహగర్జన

- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట కదిలిన జన చైతన్యం
- కోటి సంతకాల ప్రతుల అందజేత కార్యక్రమానికి భారీగా తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- దారి పొడవునా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు
- చంద్రబాబు ప్రభుత్వంలో వైద్య విద్య, వైద్యం పేదలకు దూరం కానుందంటూ నినాదాలు

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పొన్నూరు నియోజకవర్గం నుంచి భారీగా తరలిన పార్టీ శ్రేణులు

పొన్నూరు/తాడేపల్లి రూరల్: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఉద్యమంలో నిరంతరం పాల్గొని, చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రజలకు అండగా ఉండటంలో పార్టీ నాయకులు ముందుండాలని పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన కోటి నాలుగు లక్షల సంతకాలను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర గవర్నర్‌కు అందజేయనున్న నేపథ్యంలో గురువారం జగనన్న వెంట నడిచేందుకు పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో పొన్నూరు మండల పార్టీ అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు రుద్రపాటి నాగేశ్వరరావు, మండల ప్రచార విభాగం అధ్యక్షుడు తురిమెళ్ళ రాజశేఖర్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు మరియరాణి, నాయకులు షేక్ నాజర్, డక్కుమల్ల రవి, షేక్ షరీఫ్, కాలింత సునీల్, పెరికల చైతన్య, దేవరకొండ గోపి, కాలింత రమేష్, పెదకాకాని చేబ్రోలు మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తరలివచ్చిన మంగళగిరి నాయకులు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడానికి వ్యతిరేకిస్తూ మంగళగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు ప్రజల వద్ద సంతకాలు సేకరించారు. గురువారం ఆ పత్రాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్‌కు అందజేసే కార్యక్రమానికి పిలుపునివ్వడంతో మంగళగిరి నియోజకవర్గంలో సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు

కేంద్ర కార్యాలయానికి వైఎస్సార్‌సీపీ నాయకులతో తరలివెళుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

ఆకురాతి రాజేష్, మంగళగిరి తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు నాలి వెంకట కృష్ణ, అమరా నాగయ్య, దుగ్గిరాల అధ్యక్షుడు శివగోపయ్యల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకున్నారు. పాదయాత్రగా కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి దొంతిరెడ్డి వేమారెడ్డి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలకు విద్యతోపాటు వైద్య విద్యను ఉచితంగా అందించే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందన్నారు. కాసుల కోసమే చంద్రబాబు ప్రభుత్వం ఈ దారుణానికి ఒడిగట్టిందని, ప్రైవేటు వ్యక్తులకు బహుమతిగా ఇచ్చినందుకు టీడీపీ నాయకులు భారీగా లబ్ధి పొందుతున్నారని విమర్శించారు. సంబంధిత జీవోను పరిశీలిస్తే మెడికల్ కాలేజీల్లో పని చేసే సిబ్బందికి సైతం రెండు సంవత్సరాలు జీతాలు ప్రభుత్వం ఇస్తుందని ఆయన అన్నారు. ప్రజల సొమ్ము చంద్రబాబు అనుయాయులకు ధారాదత్తం చేయడం దుర్మార్గమైన విషయమని అన్నారు. ప్రైవేటీకరణను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, రాబోయే కాలంలో ప్రజలు ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి, మంగళగిరి పట్టణ రూరల్, దుగ్గిరాల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు నుంచి నేతలు, కార్యకర్తలు...

గుంటూరు రూరల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సేకరించిన సంతకాల పత్రాలను గవర్నర్‌కు అందజేసేందుకు నియోజకవర్గం నుంచి విజయవాడకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నేతలు, కార్యకర్తలు తరలి వెళ్లారు. కార్యక్రమం అనంతరం అక్కడి స్వరాజ్ మైదాన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు షేక్ గులాం రసూల్ తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసంలో గురువారం బలసాని కిరణ్‌కుమార్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

క్లుప్తంగా

లైసెన్స్ లేకుండా వైట్ ఆయిల్ విక్రయాలు

రూ.93 వేలు ఖరీదు చేసే 1,170 లీటర్ల ఆయిల్ స్వాధీనం

నగరంపాలెం: స్థానిక ఏటుకూర్ బైపాస్ రోడ్‌లో లారీ పార్కింగ్ కార్యాలయంలో గురువారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అధికారి డి.సూర్య శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు తనిఖీలు జరగ్గా, లైసెన్స్ / బిల్లుల్లేకుండా వైట్ ఆయిల్ (బయోడీజిల్)ను వాహనాలకు అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దర్ని గుర్తించారు. ఈ మేరకు రూ.93 వేలు ఖరీదు చేసే ఆరు డ్రమ్ములు (1,170 లీటర్లు) వైట్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిపై పలు కేసులు నమోదు చేసి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ కె.చంద్రశేఖర్, తహసీల్దార్ లక్ష్మీమాధవి, ఎస్‌ఐ అమీర్, సీఎస్‌డీటీ దుర్గారావు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సునీల్, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం

(గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	50,648
అమ్మకాలు	51,757
నిల్వ	11,711

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–17,300
నంబరు–5	12,000–15,400
273	11,500–14,400
341	10,500–16,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–16,800
నంబరు–5	11,000–15,200
341	11,000–16,600
4884	11,500–14,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 16,000
బాడిగ–355	10,500 – 16,500
దేవనూరు డీలక్స్	11,000 – 17,500
ఆర్మూర్	10,000 – 12,700
తాలుకాయలు	5,000 – 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,500–14,800
బాడిగ – 355	10,000–16,300
దేవనూరు డీలక్స్	10,500–15,800
తాలు	5,200 –6,800

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు

(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 205

కొమ్ములు : 182 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,500	12,811	12,811

కాయలు : 59 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,700	11,900	11,900

మొత్తం అమ్మకాలు : 153.75 క్వింటాళ్లు

–దుగ్గిరాల

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సిగ్గు చేటు

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు
- గుంటూరు కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా

ధర్నాలో పాల్గొన్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కోటా మాల్యాద్రి, అరుణ్, షేక్ వలి తదితరులు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగించడం సిగ్గుచేటు చర్యగా సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు అభివర్ణించారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించే నిర్ణయం పేద, మధ్యతరగతి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. గతంలో జీఓలు 590, 107, 108లను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు మాటతప్పి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ విధానంతో వైద్య విద్య ఖర్చు పెరిగి, సామాన్యులకు అందని ద్రాక్షగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని, ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పూర్తిగా ప్రజా ప్రయోజనాల కోసం కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా మరిచిపోయి రాష్ట్ర ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతున్నారని విమర్శించారు.

- ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.వలి మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 17 మెడికల్ కళాశాలలను చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధమైందని ఆరోపించారు. చంద్రబాబు పీపీపీ విధానాన్ని రాష్ట్ర ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని తెలిపారు. ఈ ధర్నాలో సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్, బీమా ఉద్యోగ సంఘాల నిరసన ప్రదర్శన

నిరసన తెలుపుతున్న బ్యాంక్, బీమా ఉద్యోగ సంఘాల నాయకులు

కొరిటెపాడు(గుంటూరు వెస్ట్) : 'సబ్‌కా బీమా సబ్‌కీ రక్ష–2025 (ఇన్సూరెన్స్ చట్టాల సవరణ) పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా బిల్లును పార్లమెంటు ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ బీమా, బ్యాంకింగ్ అధికారులు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో గుంటూరులో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు.

- అరండల్‌పేట నాలుగవ లైన్‌లో ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద జరిగిన ప్రదర్శనలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ పూర్వ కార్యదర్శి వి.వి.కే. సురేష్ మాట్లాడుతూ బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని ప్రస్తుతం ఉన్న 74 నుంచి వంద శాతానికి పెంచడం దేశ ఆర్థిక ప్రయోజనాలకు హానికరమన్నారు.
- ఈ నిర్ణయం దేశ ప్రజల విలువైన పొదుపు మొత్తాలను విదేశీ కంపెనీల శక్తుల చేతుల్లో పెట్టడమేనని ఆరోపించారు. ఇప్పటికే ఉన్న 74 శాతం పరిమితిని కూడా బీమా కంపెనీలు పూర్తిగా వినియోగించుకోలేదని చెప్పారు.
- ప్రస్తుతం సగటున 32.67 శాతం వరకు మాత్రమే విదేశీ పెట్టుబడులు వచ్చాయని, కాబట్టి వంద శాతం వరకు అనుమతి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.
- బ్యాంకింగ్ అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు పి.కిశోర్ కుమార్, కె. కోటిరెడ్డి, పి.కళ్యాణ్‌లు మాట్లాడుతూ జాతీయకరణ నాటి నుంచి దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను, ఎల్‌ఐసీని బలహీన పరిచే విధానాలను ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సయ్యద్ బాషా, ఎం.సాంబశివరావు, ఆర్.వి.ఎస్. శ్రీనివాస్, రాంబాబు, ఎం.నాగపావని, పి.హనుమంతరావు, సి.హెచ్.మధుబాల, సీఐటీయూ నాయకులు టి.వి.జి.రవిశంకర్, డి.సైదులు, వి.ఆర్.గోపాలకృష్ణ, జే. ప్రశాంత్ కుమార్, ఎం.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధుల నియంత్రణలో భాగస్వాములు కావాలి

డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్

డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని సన్మానిస్తున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్, పక్కన ఐఎంఏ నేతలు

గుంటూరు మెడికల్: రాష్ట్రంలో ప్రబలుతున్న అంటు వ్యాధుల వ్యాప్తిని అరికట్టడంలో వైద్యులందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ జి.రఘునందన్ విజ్ఞప్తి చేశారు. బుధవారం రాత్రి స్థానిక జి. ఎం.ఎ హాల్లో సిడ్స్ రాష్ట్ర శాఖ, ఐఎంఏ గుంటూరు శాఖ సంయుక్తంగా 'మెలియోడో సిస్, స్క్రబ్ టైఫస్ అంటు వ్యాధుల వ్యాప్తి, లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స, నియంత్రణ, నిరోధక చర్యలు' అంశంపై వైద్య నిపుణులతో ఏర్పాటు చేసిన చర్చ కార్యక్రమంలో డాక్టర్ జి.రఘునందన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవ కుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ జి.రఘునందన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ కొత్తగా అంటువ్యాధులు వెలుగుచూసినా, రాష్ట్ర అధికారులకు ముందుగా గుంటూరు వైద్యులే గుర్తుకు వస్తారన్నారు. వ్యాధి నిర్ధారణ తొలిదశలోనే జరగటం వల్ల అంటు వ్యాధుల మరణాలను చాలావరకు నిరోధించగలిగామని చెప్పారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రవీణ్ మాట్లాడుతూ అంటు వ్యాధుల్ని గుర్తించిన వైద్యులు ఆ వ్యాధుల సమాచారాన్ని తమకు తెలియజేయాలని కోరారు. ఆ వ్యాధుల నియంత్రణ చర్యలల్లో కేంద్ర ప్రభుత్వం కూడా పాలుపంచుకోవడం జరుగుతుందన్నారు. ఐఎంఏ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మెలియోడొసిస్, స్క్రబ్ టైఫస్ వ్యాధులను గుర్తించిన వెంటనే రాష్ట్రంలోని ప్రైవేటు వైద్యులందరినీ అప్రమత్తం చేశామన్నారు. డాక్టర్ టి.సేవ కుమార్, సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ జి.బాబురావు, సిడ్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కోగంటి కళ్యాణ్ చక్రవర్తిలు మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు నాగేంద్ర ప్రసాద్, కె.శ్రీనివాసరావు, సిహెచ్ మనోజ్ కుమార్, వైవీఎస్ ప్రభాకర్, వేమూరి రామ తారకనాథ్, సుమిత్ర రాయ్, రామకృష్ణ, హరి కృష్ణ, ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ మోపర్తి శివప్రసాద్, కార్యదర్శి డాక్టర్ బి.సాయి కృష్ణ, సంయుక్త కార్యదర్శి డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరెడ్డి, నగర వైద్యులు పాల్గొన్నారు.

బీఫార్మసీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ(పెదకాకాని): బీఫార్మసీ రెండు, మూడు సెమిస్టర్‌ల రెగ్యులర్ ఫలితాలను గురువారం సీఈ ఆలపాటి శివప్రసాద్ విడుదల చేశారు. ఈ నెల 30వ తేదీలోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తులను పీజీ కోఆర్డినేటర్ కార్యాలయంలో 31వ తేదీలోగా సమర్పించాలన్నారు. ఒక్కొక్క సబ్జెక్ట్‌కు ఫీజు రూ.2070 చెల్లించాలన్నారు. అలానే వ్యక్తిగత పరిశీలనకు రూ.2190 చెల్లించాలని సూచించారు.

ఏఎన్‌యూలో 24 నుంచి క్రిస్మస్ సెలవులు

ఏఎన్‌యూ(పెదకాకాని): క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని డిసెంబరు 24వ తేదీ నుంచి 27 వరకు యూనివర్సిటీకి సెలవు దినాలు ప్రకటించామని ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 24వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు సెలవులు ఇస్తున్నట్లు తెలిపారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం

పర్చూరు(చినగంజాం): మండలంలోని ఉప్పుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కందుల నిషి జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. జాతీయ వినియోగదారుల దినోత్సవ సందర్భంగా గురువారం బాపట్ల జిల్లా స్థాయిలో 'డిజిటల్ న్యాయవ్యవస్థ ద్వారా సమర్థవంతమైన వేగవంతమైన పరిష్కారం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కందుల నిషి సత్తా చాటినట్లు జిల్లా సైన్సు అధికారి సాధిక్ ప్రకటించారు.

ముగిసిన 'అన్వేషణ్ - 2025'

ముగింపు వేడుకల్లో పాల్గొన్న అతిథులు

తాడికొండ: భారత విశ్వవిద్యాలయాల సంఘం (ఏఐయూ) నిర్వహించిన విద్యార్థుల పరిశోధన – ఆవిష్కరణ పోటీ (సౌత్ జోన్) అన్వేషణ్–2025, గురువారం వీఐటీ–ఏపీ విశ్వ విద్యాలయంలో విజయవంతంగా ముగిసింది. 17,18 తేదీలలో నిర్వహించిన ఈ కార్యక్రమం భారతదేశంలోనే అతిపెద్ద పరిశోధన మరియు ఆవిష్కరణ పోటీగా కళాశాల యాజమాన్యం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగళగిరి ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అహంతెం శాంతా సింగ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత నేతృత్వంలోని పరిశోధనలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. గౌరవ అతిథి జీనియస్ ఫిల్టర్స్ అండ్ సిస్టమ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పంచుమర్తి లక్ష్మీ భీమేష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిశోధనా కార్యకలాపాలను వాస్తవ ప్రపంచ పారిశ్రామిక సామాజిక సవాళ్లతో అనుసంధానించాలన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర పాణి ప్రత్యేక అతిథిగా హాజరై పాల్గొన్న వారితో పాటు అవార్డు గ్రహీతలను అభినందించారు. అత్యుత్తమ విద్యార్థి పరిశోధన ప్రాజెక్టులను పోస్టర్ ప్రజెంటేషన్ పోడియం ప్రజెంటేషన్ రెండింటి నుంచి ఎంపిక చేశారు. ప్రతి ట్రాక్ నుంచి మొదటి, రెండవ మరియు మూడవ స్థానాల్లో నిలిచిన విజేతలను సత్కరించారు. వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.అరుల్మోళి వర్మన్, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి హాజరయ్యారు.

నిర్బంధ తీరులో పని చేయించడం తగదు

డీఈఓ సలీమ్‌బాషాకు ఏపీటీఎఫ్ నేతల వినతి

డీఈఓ సలీమ్ బాషాకు సమస్యలు వివరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ వంద రోజుల యాక్షన్ ప్లాన్ పేరుతో ఉపాధ్యాయులను నిర్బంధ తీరులో పనిచేయిస్తూ ఆందోళనకు గురిచేయడాన్ని విద్యా శాఖాధికారుల విరమించుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై గురువారం జిల్లా విద్యా శాఖాధికారి షేక్ సలీమ్ బాషాను డీఈఓ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ దశాబ్దాల అనుభవం ఉన్న ఉపాధ్యాయులను సొంత బోధన ప్రణాళికకు అవకాశం లేకుండా ఎస్‌సీఈఆర్టీ రూపొందించిన యాక్షన్ ప్లాన్‌నే అమలు చేయాలని నిర్బంధం చేయడం తగదన్నారు. ఉపాధ్యాయుని అనుభవంతో సంబంధం లేకుండా రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన యాక్షన్ ప్లాన్ ఒక్కటే అమలు పరిస్తే ఫలితాలు ఎలా ఉన్నా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. విద్యార్థులందరికీ 100 శాతం మార్కులు రావాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. ఉపాధ్యాయులుగా 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అదనపు తరగతులు నిర్వహిస్తూ ఉపాధ్యాయులు కష్టపడుతుంటే ఇంకా, ఇంకా చేయాలని ఒత్తిడి చేయడం, ప్రతి రోజు స్లిప్ టెస్ట్ పెట్టి మార్కులను ఆన్‌లైన్ చేయాలనడం తగదన్నారు. బోధనా పద్ధతులు ప్రోత్సాహక తీరులో కోసాగినప్పుడే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ శిక్షణల పేరుతో ఉపాధ్యాయులను శిక్షించడం మానుకోవాలన్నారు. ఈ సందర్భంగా 15 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. డీఈఓ కలసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ, పి.జనార్ధనరావు, జి.దాస్, జిల్లా కార్యదర్శి చక్కా వెంకటేశ్వరావు, ఆదినారాయణ, జహంగీర్, కృష్ణారావు, అప్పారావు, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అజీజ్, సీఐ వెంకట ప్రసాద్, చిత్రంలో ముసుగులో నిందితుడు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, పాతగుంటూరు పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో వెంకటప్రసాద్ వివరాలను మీడియాకు వెల్లడించారు. హౌసింగ్‌బోర్డు కాలనీ ఆదర్శనగర్‌కు చెందిన దొంత ప్రవీణ్‌కుమార్ అనే యువకుడు గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసగా మారాడు. తన చెడు వ్యసనాల కోసం గోవా, విశాఖపట్నం నుంచి గంజాయి తెచ్చి గుంటూరులో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో అతని వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన పాతగుంటూరు పోలీసుస్టేషన్ ఎస్ఐ రెహమాన్, సిబ్బంది మోహన్, నూరుద్దీన్, రామారావులను జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించినట్లు తెలిపారు.

స్కిప్పింగ్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

సాధించిన పతకాలతో కీడ్రాకారులు

మంగళగిరి టౌన్: జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో మంగళగిరి నియోజకవర్గ క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు గెలుపొందారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు రాయగఢ జిల్లా అలీబాగ్ నగరంలో ఇండియన్ రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో మంగళగిరి నియోజకవర్గ క్రీడాకారులు పాల్గొన్నారు. తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన మోక్ష అండర్–12 బాలికల విభాగంలో పాల్గొని స్పీడ్ డబుల్ అండర్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్, ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో గోల్డ్ మెడల్, డబుల్ డచ్ టీమ్ ఈవెంట్‌లో గోల్డ్ మెడల్ సాధించి ప్రతిభ చాటింది. మంగళగిరి పట్టణానికి చెందిన హేమ శివశంకర్ అండర్–12 బాలుర విభాగంలో పాల్గొని ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో బ్రాంజ్ మెడల్, స్పీడ్ అండ్ డబుల్ అండర్ రిలే విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ మేరకు కోచ్, జిల్లా రోప్ స్కిప్పింగ్ కార్యదర్శి తిరుపతిరావు క్రీడాకారులను అభినందించారు.

టెట్‌పై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలి

యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు వెస్ట్: ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని, బేషరతుగా ఇన్ సర్వీస్ టీచర్లందరినీ టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) నుంచి మినహాయించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ అవసరమైన మేరకు విద్య హక్కు చట్టంలో అర్హతల నిబంధనలను సెక్షన్ 23 (2) సవరణ చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖరరావు, కళాధర్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక ఎలిమిటెడ్ విద్యార్థులకు 75 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్న ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలన్నారు. జనరల్ సెలవు దినాలు, పండగ రోజుల్లో తరగతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస పని దినాలు సరిపోతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు సెలవు దినాలలో కూడా పాఠశాలలు నిర్వహించడం తగదన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షురాలు ఎండీ షకీలా బేగం, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, కె.సాంబశివరావు, ఎం.గోవిందయ్య, ఎ.శ్రీనివాసరావు, రంగారావు, కోటిరెడ్డి, ప్రసాదు, కమిటీ సభ్యులు కె ప్రేమ్ కుమార్, వినోద్, ఏఎల్ శివపార్వతి పాల్గొన్నారు.

కొలకలూరులో 'గ్రామీణ కృషి అనుభవం'

కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, ఏరువాక కేంద్రం, లాంఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో, గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమాన్ని కొలకలూరు గ్రామంలో నిర్వహించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివన్నారాయణ, సహా పరిశోధన సంచాలకులు డా.ఎన్‌వీవీఎస్ దుర్గా ప్రసాద్‌లు మాట్లాడుతూ వ్యవసాయ ప్రదర్శనలో రైతులు ఖర్చు తగ్గించుకుని ఆదాయాన్ని పెంచుకొనే దిశలో జిలాల్లో ఉన్న ప్రధాన పంటలలో వివిధ మోడల్స్‌ని ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు శాస్త్రవేత్తల చర్చా ఘోష్టి కార్యక్రమం నిర్వహించారు. రబీ పంటలైన జొన్న, మొక్కజొన్న, అపరాలు నూనె గింజల పంటలలో సమగ్ర పంట యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉదయగిరి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి, మార్కాపురం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.వి.ఎస్.కె రెడ్డి, బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఆర్.కోటేశ్వరరావు, విస్తరణ విభాధిపతి డాక్టర్ పీ గోపికృష్ణ, ప్రధాన శాస్త్రవేత్త (పప్పుధాన్యాలు) డాక్టర్ డి. మోహన్‌రెడ్డి, పురుగుల విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ అన్నీ డయానా గ్రేస్, బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జి. బిందుమాధవి, సహ డీన్ డాక్టర్ భరద్వాజ్, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

- జిల్లా కేంద్రం నరసరావుపేటలో బైపాస్ రోడ్డుకు దగ్గరగా అతి తక్కువ ధరకు ఇంటి స్థలాలు లభించును. వివరాలకు: 73869 48543

PLOT FOR SALE

- గుంటూరు జిల్లా, చేబ్రోలు గ్రామంలో 172 చ.గ.ల పడమర ఫేసింగ్ నివాస ఖాళీ స్థలం అమ్మకానికి కలదు. 16లక్షలు. 6303031167, 89859 65594

SERVICES

BUSINESS OFFER

- చిన్న వ్యాపార యజమానులకు మంచి అవకాశం. ZED MSME ప్రభుత్వ పథకంలో RSJతో భాగస్వామ్యం చేయండి. ఈ అవకాశాన్ని మిస్ కావద్దు. ✆ 8595924917

GOLD FINANCE

- బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్: 81422 92071
- బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 8333833368
- బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. ✆ 87907 41166

WANTED

- పెదకాకాని, నంబూరు, గుంటూరు ఆటోనగర్‌లలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12గం. జీతం: 12–13 వేలు, వ: 50సం, సంప్ర॥ 9676107661
- గుంటూరు జిన్నాటవర్ సెంటర్ రామా ఎంటర్ ప్రైజెస్ నందు పని చేయుటకు 2సం॥ సేల్స్ అనుభవం కలిగిన లేడీ కావలెను. అర్హత ఇంటర్, టైం: 3 to 9. . జీతం: 10k. 8 to 9am 9441665758
- అకౌంటెంట్ కమ్ ఆఫీసు అసిస్టెంట్ కావలెను. బి.కాం, 3సం॥లు కంప్యూటర్ అకౌంట్స్‌పై అనుభవం, తెలుగు, ఇంగ్లీష్ భాషలపై పరిజ్ఞానం, రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.
- గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు సీనియర్ కన్‌స్ట్రక్షన్ సైట్ ఇన్‌చార్జ్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతం: 50,000 నుండి 60,000 వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: సివిల్ డిప్లొమా మరియు సివిల్ ఇంజనీరింగ్, వయస్సు: 30సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480429
- గుంటూరు మెయిన్‌రోడ్డు లక్ష్మీపురం నందు ట్రాన్స్ మీడియా టెక్నాలజీస్(ఏ.పి) ప్రై॥లి॥ కంపెనీలో పనిచేయుటకు టెక్నీషియన్స్ (M) కావలెను. 9059812327, 9603433369
- నరసరావుపేట ఊర్లో ప్రముఖ హాస్పిటల్ లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8గం॥డ్యూటీ, జీ: 11 వేలు, ESI, PF కలదు ✆ 7386688787
- గుంటూరుసిటీ ప్రముఖ హోటల్ నందు హౌస్‌కీపింగ్ స్టాఫ్, రూమ్ బాయ్స్ కావలెను. (హోటల్ మేనేజ్మెంట్ వారికి ప్రాధాన్యత) 8185826270, 8247814976
- ఉద్యోగ అవకాశం డిగ్రీ పూర్తిచేసిన వారికి ఫీల్డ్‌వర్క్ (Field Work) కోసం అవకాశం, వయస్సు : 30 సం॥లోపు. ✆ +91 88006 29648. RSJ Inspection Service Ltd.
- ప్రముఖ కార్పొరేట్ ఆఫీస్‌లో వర్క్ ఫ్రమ్ హోం పని చేయుటకు మేనేజర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, ఆఫీస్ ఇంచార్జి, AGM, DJM, CJM కావలెను. జీతం 20–30 వేలు. 9573411570

ఈ పేజీలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం.54-15-4ఐ, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ ఏపి-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

[illegible]

ఇ-వేలం తేది & సమయం: 07.01.2026, మ॥ 2.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 07.01.2026, మ॥ 12.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 07.01.2026, మ॥ 12.00 గం॥ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

రుణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడకు బదిలీ చేయడమైనవి)	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
[illegible] బ్రాంచ్, గుంటూరు M/s [illegible] 1) ప్రొప్రయిటర్ : [illegible], 2) హామీదారు : [illegible], 3) హామీదారు : [illegible] బకాయి మొత్తం : తేది.30.11.2025 నాటికి రూ.2,56,41,307.61/- + వడ్డీ + ఇతర ఖర్చులు	ఆస్తి–1 : గుంటూరు జిల్లా, [illegible] మండలం, [illegible] గ్రామ పంచాయితీ, డోర్ నెం.1-74, [illegible] విస్తీర్ణం 131.60 చ.గ.[illegible] గ్రౌండ్ ఫ్లోర్ [illegible]	రూ. 6.50 లక్షలు	రూ. 0.55 లక్షలు
	ఆస్తి–2 : గుంటూరు, [illegible] సర్వే నెం.152/2 నందు [illegible] 39.504 చ.గ.[illegible] 1000 చ.[illegible] రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.416 [illegible]	రూ. 25.00 లక్షలు	రూ. 2.50 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం: 05.01.2026, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥4.00 గం॥ల వరకు. అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8331011695

ఈ బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.

ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/eauction-psb హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051. ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 16.12.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

క్లుప్తంగా

మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

తాడేపల్లి రూరల్: వినియోగదారులను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని తెనాలి డివిజన్ లీగల్ మెట్రాలజీ సీఐ శేషసాయి హెచ్చరించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఒక సూపర్ మార్కెట్‌లో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శేషసాయి మాట్లాడుతూ.. ఈనెల 24వ తేదీన జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని లీగల్ మెట్రాలజీ అధికారులు, వినియోగదారులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా పలు సూపర్ మార్కెట్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం సూపర్ మార్కెట్ వచ్చిన పలువురు వినియోగదారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రవి కిషోర్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం, సేవా భావం అలవర్చుకోవాలి

తెనాలిటౌన్: నేటి యువత మానవత్వం, సేవా భావాన్ని అలవర్చుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కఠెవరం మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు సూచించారు. స్థానిక మారీసుపేటలోని కార్యాలయంలో గురువారం నిరుపేద కుటుంబానికి, దివ్యాంగులకు నెలకు సరిపడ నిత్యావసరాలు, నగదు సాయం చేశారు. ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు పాల్గొని లబ్ధిదారులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవానిధి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి, దివ్యాంగులైన వారికి రూ.10 వేల రూపాయలు నిత్యావసర సరుకులు, నగదు అందివ్వడం ముదావహమని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ చెర్మన్ ఊరుబండి రామ్మోహనరావు, త్రివిక్రమరావు, శ్యామ్ కుమార్, ఎన్.విఘ్నేష్, పసుపులేటి శ్రీను, తదితరులు ఉన్నారు.

వైకుంఠపురంలో కానుకల లెక్కింపు

తెనాలి: స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు జరిపారు. ఉదయం 8.30 గంటలకు ఆరంభమైన ఈ లెక్కింపు రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. అయిదు నెలల తొమ్మిది రోజుల కాలపరిమితితో ఈ లెక్కింపును చేపట్టామని ఆలయ సహాయకమిషనర్/ కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ వెల్లడించారు. దేవాదాయశాఖ నిబంధనల ప్రకారం ఈసారి మహిళలకు కేవలం నాణేల లెక్కింపును మాత్రమే అప్పగించినట్టు తెలిపారు. పొన్నూరులోని భావనారాయణస్వామి ఆలయం అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరి పరిశీలకులుగా హాజరయ్యారు. కార్తీకమాసం కూడా గడచినందున ఈసారి హుండీ ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నామని తెలియజేశారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు దోహదం

తెనాలిటౌన్: విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు దోహదపడతాయని ఎన్వీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, వీఎస్సార్ ఎన్వీఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక వీఎస్సార్ కళాశాల ప్లే గ్రౌండ్‌లో గురువారం ఎన్వీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, వీఎస్సార్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ పాల్గొని క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు శారీరక దృఢత్వం, క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలకు క్రీడలు ముఖ్య భూమిక పోషిస్తాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల పీడీ కె.ఆశోక్, ఇరు కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన గురువారం పార్టీ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు హాజరయ్యారు.

మంత్రి లోకేష్ కార్మికుల హామీని నెరవేర్చాలి

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని యూనియన్ నాయకులు కె.స్టీవెన్ అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను యూనియన్ నాయకులు సూర్యప్రకాష్, అంకయ్య, నాగేశ్వరరావు, సుభానీలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత 380 రోజులుగా కార్మికులు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఎన్నికలకు ముందు ఈ ప్రాంతంలో పర్యటించిన నారా లోకేష్‌కు కార్మికులు తమ సమస్యను విన్నవించుకున్నారని, అప్పుడు స్పందించిన నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇచ్చిన

దీక్షా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న నాయకులు

హామీని లోకేష్ అమలు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో గురవయ్య, పిచ్చయ్య, ఆశీర్వాదం, తుపాకుల నాగేశ్వరరావు, రమాదేవి, శారద, లక్ష్మి, శారమ్మ, సువర్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బిల్లులు దహనం

తాడేపల్లి రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు మారుస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లును నిరసిస్తూ ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఆ ప్రతులను దహనం చేశారు. తాడేపల్లి రూరల్ పరిధి గుండిమెడలో జరిగిన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు విచ్చేసిన మాట్లాడారు. వామపక్షాలు, ప్రజా సంఘాల పోరాట ఫలితంగా 2006 సంవత్సరంలో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నిందని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార అజీవక కమిషన్ గ్రామీణ బిల్లు

బిల్లు ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పేరుతో తీసుకురావడం జాతిపిత మహాత్మా గాంధీని అవమానించడమేనని అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పల్లె కృష్ణ, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బత్తుల సంసోను, నాగపోగు విజయరాజు, శివయ్య, నాగరాజు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనాలను ఇప్పించాలి

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ అధ్యక్షత వహించారు. సమావేశంలో అమీనాబాద్–1 ఎంపీటీసీ సభ్యుడు గాంధీబుడే మాట్లాడుతూ.. గత 25 నెలలుగా ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు అందడంలేదని, వాటిని ఇప్పించాలని ఎన్నిసార్లు తెలియజేసినా ఎటువంటి ప్రయోజనం లేదని చెప్పారు. ఎంపీడీవో పి.శివ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలకు సంబంధించిన బిల్లు వివరాలు ఉన్నతాధికారులకు పంపించామని, తమ వద్ద ఎటువంటి ఆలస్యం లేదని వివరణ ఇచ్చారు. సమావేశంలో 113.తాళ్లూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయని, కొత్తవాటిని ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ మీసాల రోశయ్య విద్యుత్ అధికారులకు తెలిపారు. ఆదివారం పల్స్ పోలియో నిర్వహిస్తున్నట్లు ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యురాలు ఎం.శ్వేత తెలిపారు. సమావేశంలో ఎంపీపీ షేక్.షహేలా బేగం, వైస్ ఎంపీపీ అమర్లపూడి అనూరాధ, మార్కెట్‌యార్డు చైర్మన్ టి.కేశవరావు, వైస్ ఎంపీడీవో విష్ణువర్ధన్ రావు, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

తాడేపల్లి రూరల్: విశాఖలో ఈనెల 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు జరిగే సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఉండవల్లి సెంటర్‌లో గురువారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాజధాని ప్రాంతంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీఐటీయూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేసిందని, దాని ఫలితంగా కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని గుర్తుచేశారు. కార్మికవర్గంపై పాలక వర్గాలు ముప్పేట దాడి చేస్తున్నాయని విమర్శించారు. కార్పొరేటర్లకు పాలక వర్గాలు తలొగ్గి కార్మిక వర్గం సాధించుకున్న హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. విశాఖలో జరిగే కార్మిక మహా ర్యాలీలో రాజధాని ప్రాంతం నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు.



ఉండవల్లి సెంటర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కార్యక్రమంలో నాయులు రవి, వల్లభాపురం వెంకటేశ్వరరావు, బక్కిరెడ్డి, సుందరరావు, రాఘవయ్య, రామకృష్ణ, మున్సిపల్ యూనియన్ నాయకులు నారాయణ, స్వర్ణకుమారి, సుందరరావు, శ్రావణి, సుజాత, ఈశ్వరమ్మ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంస్థల పేర్లు చెప్పి దందాలు చేస్తే సహించం

విశ్వహిందూ పరిషత్ సభ్యుల హెచ్చరిక

తెనాలిటౌన్: హిందూ సంస్థల పేరు చెప్పుకుంటూ కొందరు వ్యక్తులు పట్టణంలో దందాలు చేస్తున్నారని విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆరోపించారు. అలాంటివారి మాటలు నమ్మొద్దని మీడియా ద్వారా తెలియజేశారు. విశ్వహిందూ పరిషత్ తెనాలి ప్రముఖ్ కోట రాజేష్‌కుమార్, సహకార్యదర్శి తూనుగుంట్ల విజయ్, మొదుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి రామాంజనేయులు, ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహ హనుమంత ప్రసాద్‌లు గురువారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. తెనాలిలో కొంతమంది వ్యక్తులు విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ పేర్లను ఉపయోగించుకొని ప్రముఖుల నుండి డబ్బులు వసూలు చేయుచున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే

సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

దేవాలయ సిబ్బందిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని తెలిపారు. వీరిలో ఎవరికి తమ విశ్వహిందూ పరిషత్ తరపున బాధ్యతగాని ఆర్ఎస్ఎస్ బాధ్యతగాని బజరంగ్ దళ్ బాధ్యతగాని లేదన్నారు. వీరి బ్లాక్‌మెయిల్‌తో తెనాలి వైకుంఠపురంలో మహిళా సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివవరించారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన

దుగ్గిరాల: రైతులు విరివిగా విత్తన శుద్ధి చేయాలని.. తద్వారా పంట వ్యాధుల బారిన పడకుండా పంట దిగుబడి అధికంగా ఉంటుందని ఇన్‌చార్జి ఏడీఏ ఆర్.విజయబాబు తెలిపారు. గురువారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవ సిలీంద్ర నాసిని ట్రైకోడెర్మావిరిడితో విత్తన శుద్ధి, పశువుల ఎరువుతో అభివృద్ధి చేయడంపై డెమో నిర్వహించామని విజయబాబు తెలిపారు. జొన్న, మొక్కజొన్న విత్తనాలను 5 నుంచి 8 ట్రైకోడెర్మా పొడితో రైతులతో విత్తన శుద్ధి చేయించామని ఆయన పేర్కొన్నారు.

మైనార్టీ హక్కులపై అవగాహన పెంచుకోవాలి

దుగ్గిరాల: భారతదేశంలో మైనార్టీ హక్కులపై అవగాహన పెంచుకుని.. వాటి సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభానీ అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాల ముర్తాజానగర్‌లో గురువారం మైనార్టీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభానీ మాట్లాడారు. మైనార్టీ హక్కుల దినోత్సవం సందర్భంగా మైనార్టీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని.. అందరూ రాజ్యాంగానికి లోబడి హక్కులను పొందుతూ బాధ్యతగా ఉండాలని వివరించారు. సమావేశంలో మైనార్టీ నాయకులు షేక్ రషీద్, షేక్ హుస్సేన్, పఠాన్ మస్తాన్ వలి, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో బెంగాల్‌కు చెందిన ఆటోడ్రైవర్ మృతి

తాడికొండ: బెంగాల్‌కు చెందిన ఆటోడ్రైవర్ ఉరేసుకుని మృతిచెందిన ఘటన తుళ్లూరు మండలం ఐనవోలులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగాల్ నుంచి ఉపాధి నిమిత్తం వచ్చిన కార్మికుడు అర్జున్‌దాస్(34) ఐనవోలులోని టిడ్కో గృహాలలో నివాసం ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. గత రెండు రోజులుగా విధులకు హాజరు కాకపోవడం, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆటో ఓనర్ మెహమాటం జ్యోతి వెళ్లి చూడగా ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఓనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు పోలీసులు తెలిపారు.

కొల్లిపర హైస్కూల్లో మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

కొల్లిపర: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లో మండల విద్యాశాఖ అధికారి ఎం.రూన్సీ లత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఆరు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ఉత్తమ విద్యార్థులను సైన్స్‌ఎగ్జిబిషన్లో పాల్గొన్నారు. గ్రూపు విద్యార్థుల పోటీలో ప్రథమ బహుమతి విద్యార్థులు ఎన్.అమూల్య, బి.అక్షయ, తృతీయ విద్యార్థులు తూములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులు బి.నాగ వైష్ణవి, బి.ప్రశాంతి, శృతి విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి రూన్సీలత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకట్రావు, సైన్స్ ఉపాధ్యాయులు, అన్నవరపులంక హెచ్ఎం నాగమల్లేశ్వరరావు, సీఆర్ఎంటి పిడపర్తి రమేష్ బాబు, బి.అలేఖ్య ఉన్నారు.

ఐక్యగ్రాండ్ క్రిస్మస్ పోస్టర్ ఆవిష్కరణ

తెనాలి: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని హోటల్ గౌతమ్ గ్రాండ్‌లో గురువారం సేవారత్న సుద్దపల్లి నాగరాజు అధ్యక్షతన ఈ నెల 23వ తారీకు జరగనున్న 23వ ఐక్య గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుక పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ప్రముఖ దైవజనులు బిషప్ పినపాటి జాన్‌పాల్, పాస్టర్ సాల్మన్, పాస్టర్ విలియం కెరి, కేఎస్‌కే విద్యాసంస్థల సీఈవో కత్తెర డేవిడ్, ప్రముఖ రాజకీయ, దళిత నాయకులు అత్తోట శరత్, ఇందుపల్లి రాజారామ్, పినపాటి సురేష్, అత్తోట శ్యాం, కూచిపూడి మోహన్, కొక్కిలిగడ్డ సునీల్, లింగాల రమేష్, దేవా, కోట్ల దిలీప్, కొలకలూరి కిరణ్, రాయల వినయ్, రావూరి సతీష్, 'మాస్' సంస్థ నాయకులు పాల్గొన్నారు. ఇదేరోజు జన్మదినోత్సవం జరుపుకుంటున్న మేకల సురేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గుండెపోటుతో లైన్‌మెన్ మృతి

తాడేపల్లి రూరల్: తాడేపల్లిలోని విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్ సురేంద్ర(53) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. సురేంద్ర మరణవార్త తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు ఆయన నివాసానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంజీవరావు మాట్లాడుతూ సురేంద్ర గుండెపోటుతో మృతిచెందడం చాలా బాధకరమని అన్నారు. డిపార్ట్‌మెంట్ తరుపున కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. సురేంద్ర కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలను అందజేశారు. నివాళులరించిన వారిలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్‌బాబు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మి నారాయణ, కుంచనపల్లి విద్యుత్‌శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

లైన్‌మెన్ సురేంద్ర (ఫైల్)

పారిశుద్ధ్య విభాగ అధికారులకు అవగాహన సదస్సు

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగం ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది, స్వచ్ఛ అంబాసిడర్లకు గురువారం అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటీసీ, మారి సంస్థ సమన్వయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్త సేకరణలో భాగంగా పొడిచెత్తను సంపద కింద మార్చే ప్రక్రియను స్వచ్ఛ మిత్ర ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. అందుకోసం ఐటీసీ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. పొడి చెత్తను ప్రత్యేకమైన మిషన్లలో శుభ్రపరచి పలు కంపెనీలకు సరఫరా చేయవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఐటీసీ సంస్థ సిబ్బంది తడి, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో

మాట్లాడుతున్న ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా

డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాసరావు, సెక్రటరీ ఆర్.మురళీ, ఐటీసీ, మారి ప్రతినిధులు ఉమాకాంత్, సుధ, శానిటరీ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది, సూపర్ వైజర్లు, స్వచ్ఛ అంబాసిడర్లు పాల్గొన్నారు.

దైవ సేవకురాలు తాటిపత్రి జ్ఞానమ్మ

జ్ఞానమ్మ 150 వర్ధంతి రేపు

ఫిరంగిపురం: సెయింట్‌ఆన్స్ సంస్థను స్థాపించి ఎందరో మహిళలకు విద్యను అందించిన సేవకురాలుగా పేరు పొందిన తాడిపత్రి జ్ఞానమ్మ 150వ వర్ధంతి కార్యక్రమం ఈనెల 20న ఫిరంగిపురంలో నిర్వహించనున్నారు. ఆమె జీవిత చరిత్రను తెలిపేలా

సెయింట్‌ఆన్స్ సంస్థ స్థాపకురాలు జ్ఞానమ్మ

మ్యూజియాన్ని స్థాపించి అందులో జ్ఞానమ్మకు చెందిన చిత్రాలు, ఎన్నో వస్తువులు ఏర్పాటు చేస్తున్నారు. సెయింట్‌ఆన్స్ సంస్థ వ్యవస్థాపకురాలు తాడిపత్రి జ్ఞానమ్మ 150 వర్ధంతి సందర్భంగా జూబిలీ వేడుకలు నిర్వహించనున్నట్లు సెయింట్ ఆన్స్ సంస్థ మదర్ జనరల్ సిస్టర్ పైరెడ్డి అంతోనమ్మ గురువారం తెలిపారు. ఫిరంగిపురంలోని సంస్థ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. సేవకురాలు జ్ఞానమ్మ మ్యూజియాన్ని కార్డినల్ బిషప్(

ప్రారంభం కానున్న మ్యూజియం

హైదరాబాద్) హిజ్ ఎక్స్‌లెన్సీ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ పూల అంతోని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. దివ్యపూజాబలి, విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలలో పలు ప్రాంతాల నుంచి పునీత అన్నాంబ సంస్థకు చెందిన మఠకన్యాస్త్రీలు, ప్రాంతీయ విభాగాల అధినేత్రులు, మేత్రానులు, మేత్రాసన గురువులు, కన్యాస్త్రీలు, సంస్థ సహాయకారులు పాల్గొంటారన్నారు.

అమీనాబాద్ పంచాయతీ విభజించవద్దంటూ వినతి

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామ పంచాయతీని విభజించవద్దంటూ తహసీల్దార్ జె.ప్రసాదరావుకు గురువారం వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అమీనాబాద్ పంచాయతీ పరిధిలో వేములూరిపాడు ఉందని అన్నారు. గతంలో పంచాయతీని రెండుగా విభజించేందుకు అనుమతులు రావడంతో రెండు గ్రామాల ప్రజలు హైకోర్టు వరకూ వెళ్లి స్టే తెచ్చుకున్నారని గుర్తుచేశారు. దీంతో 1996 నుంచి 2000 సంవత్సరం వరకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిధులు రాక అభివృద్ధి కుంటుపడిందని వాపోయారు. తిరిగి విభజించాలంటూ ప్రయత్నిస్తున్నారని.. అటువంటి విభజన వద్దంటూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గాంధీ బుడే, కో–ఆప్షన్ మెంబర్ షేక్.సుభానీ, అమర్లపూడి రత్నం, సయ్యద్ సైదుసాహెబ్, దండె వెంకట్రావు, షేక్ అమానుల్లా పాల్గొన్నారు.

తహసీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉండవల్లిలో మద్యంబాబుల హల్‌చల్!

రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడి

తాడేపల్లి రూరల్: ఉండవల్లి సెంటర్ నాలుగు రోడ్ల కూడలి నుంచి తాడేపల్లి రోడ్డులోకి వెళ్లే మార్గంలో మద్యం షాపు వద్ద గురువారం మద్యంమత్తులో ఉన్న యువకులు రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు ముష్టియుద్ధం చేసుకున్నారు. మద్యం బాటిళ్లను ఒకరి మీద మరొకరు విసురుకోవడంతో ఆ రోడ్డులో ప్రయాణించేవారు భయభ్రాంతులకు గురయ్యారు. సీతానగరంకు చెందిన ఇద్దరు రౌడీషీటర్లు, తాడేపల్లి పట్టణ పరిధిలో నివాసం ఉండే జేబుదొంగల మధ్య మద్యం తాగే సమయంలో చిన్నపాటి వివాదం చోటుచేసుకుంది. ఇది కాస్తా ముదిరి ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకునే వరకూ వెళ్లింది. నోటికి వచ్చినట్లు బూతులు తిట్టుకుంటూ రోడ్డుపై కేకలు వేయడంతో ఆ రోడ్డులో ప్రయాణించే విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అటు, ఇటు పెద్దలు రావడంతో ఆ పంచాయితీ తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసులు ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. ఈ గొడవకు కారణమైన రౌడీ షీటర్లు పలు గొడవల్లో తలదూర్చి గొడవలు చేసి దాడి చేయడంతో గతంలో తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. తాడేపల్లిలో నివాసం ఉండే పిక్‌పాకెట్‌పై పలు రాష్ట్రాలోనూ కేసులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రేమ తత్వమే క్రీస్తు సందేశం

మంగళగిరి టౌన్: ప్రతి ఒక్కరిపై ప్రేమతత్వం చూపించడమే క్రీస్తు సందేశమని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళగిరి ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. క్రీస్తు ప్రపంచ మానవాళికి శాంతి సందేశాన్ని ఇస్తూ ఎన్నో బోధనలు చేశారని, క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష, డీపీఎంవో డాక్టర్ సుజాత, ఎన్‌సీడీసీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి తదితరులు పాల్గొన్నారు. మంగళగిరి రూరల్ నవులూరులో అపోస్తలిక సిలోహు పెంతెకోస్తు మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నెల్లూరు హోసన్న ప్రార్థనా మందిరం పాస్టర్ ఆనందజయకుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక క్రైస్తవ సోదరులు, విశ్వాసులు, సంఘ కాపరి స్టీఫెన్ పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ విజయలక్ష్మి

వస్త్రాల పంపిణీ

తెనాలిరూరల్: పేదలను ఆదుకోవడంలోనే క్రిస్మస్ ఉందని సినీ దర్శకుడు, పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు దిలీప్ రాజా అన్నారు. పెదరావూరు గ్రామంలోని పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ సెమీ క్రిస్మస్ వేడుకలను గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి అధ్యక్షత వహించారు. వృద్ధాప్యంలో ఉన్న జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఆదరించడంలో బిడ్డగా రుణం తీర్చుకున్నట్లు అవుతుందని దిలీప్ రాజా అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వితంతువులకు ఆయన నూతన వస్త్రాలను, నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ దర్శకులు నరేష్ దోనె, యషయ పాల్గొన్నారు.

సంరక్షణ కేంద్రానికి బాలుడు

తెనాలి రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు బాలుడిని వదిలి వెళ్లారంటూ ఓ హోటల్ కార్మికుడు త్రీటౌన్ పోలీసులకు బుధవారం రాత్రి సుమారు రెండున్నరేళ్ల బాలుడిని అప్పగించిన విషయం తెలిసిందే. బాలుడి తలిదండ్రుల వివరాలు సేకరించేందుకు పోలీసులు గురువారం తెల్లవారుజాము వరకు తీవ్రంగా కృషి చేశారు. ఎన్నో ట్విస్ట్‌ల నడుమ బాలుడి వివరాలు తెలుసుకోగలిగినా చివరకు బాలల సంరక్షణ కేంద్రానికి పంపారు. స్టేషన్‌లో బాలుడిని చూసిన త్రీ టౌన్ సీఐ సాంబశివరావు చలించిపోయారు. బాలుడిని తన వాహనంలో ఒడిలో పడుకోబెట్టుకుని రాత్రంతా పట్టణంలో విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియకపోడంతో బాలుడిని గుంటూరులోని బాలల సంరక్షణ కేంద్రానికి గురువారం పంపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

సోషల్ మీడియాలో బాబు ప్రచారం కోసం..

- డిజిటల్ కార్పొరేషన్‌లో భారీ వేతనాలతో మరో రెండేళ్లపాటు 85మంది కొనసాగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన సాధారణ పరిపాలన శాఖ

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు ప్రభుత్వం గురించి సోషల్ మీడియాలో ప్రచారం చేసేందుకు ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో భారీ వేతనాలతో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో చేపట్టిన నియామకాలను మరో రెండేళ్లపాటు కొనసాగిస్తూ సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఔట్ సోర్సింగ్ విధానంలో 58 మందిని రెండేళ్లపాటు కొనసాగించనున్నారు. వీరిలో సోషల్ మీడియా ప్రత్యేక ఆఫీసర్‌కు నెలకు రూ.1.20 లక్షలు చెల్లించనున్నారు. 12 మంది కంటెంట్ డెవలపర్స్‌కు నెలకు రూ.75 వేల చొప్పున, 30 మంది సోషల్ మీడియా ఎనలిస్ట్‌లకు నెలకు రూ.30 వేలు చొప్పున, 15 మంది డిజిటల్ ప్రచారకులకు నెలకు రూ.25 వేల చొప్పున వేతనాలు ఇస్తారు. మరో 27 మందిని ఔట్ సోర్సింగ్ కింద రెండేళ్లపాటు కొనసాగించనున్నారు. వీరిలో డిజిటల్ డైరెక్టర్‌కు నెలకు రూ.1.75 లక్షలు, క్రియేటివ్ కన్సల్టెంట్‌కు నెలకు రూ.లక్ష, మిగతా వారికి నెలకు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు వేతనాలను చెల్లించనున్నారు.

ఢిల్లీ పర్యటనలో సీఎం చంద్రబాబు

సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు.అనంతరం అందుబాటులో ఉన్న ఎంపీలతో సమావేశమయ్యారు. శుక్రవారం ఉదయం ఆయన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీని కలవనున్నారు. సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కూడా కలిసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ భేటీ అనంతరం ఆయన తిరిగి ఏపీకి పయనమవుతారు.

సీఎంఏ నూతన అధ్యక్షునిగా పార్థ్ జిందాల్

లబ్బీపేట (విజయవాడ తూర్పు): సిమెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (సీఎంఏ) జాతీయ అధ్యక్షుడిగా ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ జేఎస్‌డబ్ల్యూ మేనేజింగ్ డైరెక్టర్ పార్థ్ జిందాల్‌ను ఎన్నుకున్నట్టు అసోసియేషన్ విజయవాడ చాప్టర్ ప్రతినిధి నివాసన్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా జేకే సిమెంట్స్ ఎండీ డాక్టర్ రాఘవపత్ సింఘానియాను ఎన్నుకున్నట్లు తెలిపారు. గురువారం జరిగిన సీఎంఏ వార్షిక సర్వసభ్య సమావేశంలో నివాసన్ మాట్లాడుతూ సీఎంఏ చరిత్రలో తొలిసారిగా యువతరానికి చెందిన ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ నేతృత్వంలో అసోసియేషన్ నడుస్తుందని పేర్కొన్నారు. భారతీయ సిమెంట్ పరిశ్రమ ఎదుర్కొంటున్న కీలక సవాళ్లను పరిష్కరించేందుకు నూతన కార్యవర్గం నాయకత్వంలో తామంతా పనిచేస్తామని ఆయన తెలిపారు.

కృష్ణాజలాల మళ్లింపుపై నిషేధం లేదు

- మళ్లింపునకు బచావత్ ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చింది
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు

సాక్షి, అమరావతి: కృష్ణానది జలాలను ఇతర నదీపరివాహక ప్రాంతాల (బేసిన్)కు మళ్లించడానికి బచావత్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ–1) అనుమతి ఇచ్చిందని, దీనిపై ఎలాంటి నిషేధం విధించలేదని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కృష్ణా జలాలను పంపిణీ చేయడానికి జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్ర సభ్యులుగా కేంద్రం ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్–2(కేడబ్ల్యూడీటీ) ఎదుట గురువారం ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వరుసగా రెండవరోజూ వాదనలు వినిపించారు. 'కృష్ణా జలాలను ఇతర బేసిన్‌లకు చట్టవిరుద్ధంగా ఏపీ మళ్లిస్తోందని తెలంగాణ చేస్తున్న వాదనలు అసంబద్ధం. ఒక నదీ జలాలను ఇతర నదీ పరివాహక ప్రాంతాలకు మళ్లించేందుకు బచావత్ ట్రిబ్యునల్ ఒక్కటే కాదు.. కావేరి ట్రిబ్యునల్, నర్మదా ట్రిబ్యునల్ కూడా అనుమతి ఇచ్చాయి. రాష్ట్ర విశాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని నదీ జలాల వినియోగంపై నిర్ణయం ఉండాలి. తీవ్ర కరువు పీడిత ప్రాంతమైన రాయలసీమలో ప్రవహించే పెన్నా నదిలో నీటి లభ్యత తక్కువగా ఉంది. ఆ బేసిన్‌కు కృష్ణా జలాలను మళ్లించకపోతే.. రాయలసీమ ఎడారిగా మారిపోతుంది. పైగా రాయలసీమను వెనుకబడిన ప్రాంతంగా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం గుర్తించింది. ఆ ప్రాంతం అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని పేర్కొంది. కృష్ణానదికి ఉత్తరాన ఉన్న తెలంగాణ భూభాగం చాలా ఎత్తులో ఉంది. ఆ ప్రాంతానికి నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది. అదే ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి కాలువల ద్వారా నీటిని సరఫరా చేయవచ్చు. అందుకే రెండు ప్రాంతాలకు సమన్యాయం చేస్తూ సాగునీటికి, విద్యుత్‌కు కృష్ణా జలాలను వినియోగించారు'' అని జైదీప్ గుప్తా వివరించారు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టంలోని సెక్షన్–4 (1) ప్రకారం సుప్రీం కోర్టు డిక్రీతో సమానమని.. దాన్ని పునఃసమీక్షించడం చట్టవిరుద్ధమని తేల్చిచెప్పారు. తదుపరి విచారణను జనవరి 21–23కు ట్రిబ్యునల్ వాయిదా వేసింది.

అయ్యో.. బాబో అన్నా..

పత్తాలేని ఏపీ పోలీస్

బాధితులకు ఆపన్నహస్తంలో అట్టర్ ఫ్లాప్

112కు బాధితుల ఫిర్యాదులపై పోలీసుల నిర్లక్ష్యం

- దేశంలో సగటున 18.28 నిమిషాల్లో స్పందిస్తున్న పోలీసులు
- కేవలం 5.58 నిమిషాల్లోనే రక్షణ కల్పిస్తూ మొదటిస్థానంలో చండీగఢ్ పోలీసులు
- ఏపీలో మాత్రం 25.50 నిమిషాల సమయం తీసుకుంటున్న పోలీసులు
- కేంద్ర ప్రభుత్వం తీవ్ర అసంతృప్తి
- సీఎం చంద్రబాబుకు లేఖలో పేర్కొన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- పోలీసింగ్ ఎలా చేయాలో సూచించిన అమిత్‌షా
- వైఎస్సార్‌సీపీ హయాంలో 5 నుంచి 8 నిమిషాల్లోపే ఘటనాస్థలానికి పోలీసులు

సాక్షి, అమరావతి: 'ఇంటిపేరు కస్తూరి వారు.. ఇల్లంతా గబ్బిలాల కంపు' అన్నట్టుగా తయారైంది చంద్రబాబు ప్రభుత్వ తీరు. టెక్నాలజీకి తాను అంబాసిడర్‌నని, ఐటీ, ఏఐలను తానే కనిపెట్టానని తరచూ గొప్పలు చెప్పుకునే సీఎం చంద్రబాబు బండారం బట్టబయలైంది. ఆపదలో ఉన్న బాధితులకు తక్షణ సహాయం అందించి రక్షణ కల్పించే టోల్ ఫ్రీ నంబర్ 112 వ్యవస్థ పనితీరులో ఏపీ ప్రభుత్వ పనితీరు అత్యంత దారుణంగా ఉంది. బాధితులకు ఆపన్న హస్తం అందించడంలో ఏపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమై దేశంలోనే అట్టడుగు స్థానానికి దిగజారిపోయింది. బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ (ఈఆర్ఎస్ఎస్ 2.0)ను ఏపీ ప్రభుత్వం అసలు అందుబాటులోకి తేనేలేదన్నది తేటతెల్లమైంది. ఈ విషయాన్ని మరెవరో కాదు సాక్షాత్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేయడం గమనార్హం. అంతేకాదు '40 ఇయర్స్ ఇండస్ట్రీ' అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబుకు అసలు ప్రజలకు రక్షణ కల్పించాలంటే ఏమేం చేయాలో ఆయన చెప్పారు. ఇప్పటికైనా స్పందించండి అని అమిత్ షా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ నెల 8న లేఖ రాయడంతో ఏపీ ప్రభుత్వ అసమర్థత జాతీయ స్థాయిలో బట్టబయలైంది.

మొద్దునిద్రలో ఏపీ పోలీస్

అయ్యా.. ఆపదలో ఉన్నాం. సహాయం చేయండి' అని బాధితులు మొరపెట్టుకుంటుంటే.. ఏపీ పోలీసులు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదు. చంద్రబాబు రెడ్‌బుక్ కక్షసాధింపు చర్యలకు కొమ్ముకాసే పనిలో బిజీగా ఉన్నాం.. సామాన్యుల బాధలను పట్టించుకోం అన్నట్టుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బాధితుల ఫిర్యాదులపై తక్షణం స్పందించి ఆపన్న హస్తం అందించడంలో ఏపీ పోలీసులు అట్టర్ ఫ్లాప్ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించిన చేదు వాస్తవం ఇదీ.


अमित शाह
AMIT SHAH

7816
15 DEC 2025

गृह और सहकारिता मंत्री
भारत सरकार
HOME AND COOPERATION MINISTER
GOVERNMENT OF INDIA

D.O. No. 2/4/2020-WS-IVPart-1
Dated, the 08 December, 2025

Shri. Nara Chandra Babu Naidu ji,

The Emergency Response Support System through a single national number 112 has emerged as a real 'friend in need' for the citizens during the emergencies. Since its launch, it has handled around 53 Cr calls out of which 9 Cr were actionable calls. It is noteworthy that on an average we are handling around 3 lakh calls per day under ERSS.

The services like police, ambulance, fire, disasters, railways etc. have been now integrated under 112. There are around 20,000 plus connected vehicles and 3000 plus call takers who work round the clock to provide assistance to the citizens in emergencies.

The average response time, which was 25 minutes in 2019, has now come down to 18.28 minutes. At 5.58-minute average response time, Chandigarh has established a benchmark, which other States and UTs must try to achieve. Currently your States average response time is 25.50 minutes.

బాధితులకు తక్షణ రక్షణ కల్పించడం, సహాయం అందించడంలో ఏపీ పోలీసులు విఫలమయ్యారని కేంద్రహోం మంత్రి అమిత్ షా సీఎం చంద్రబాబుకు రాసిన లేఖ

అగ్రస్థానంలో చండీగఢ్ పోలీసులు

బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు పోలీసు, అగ్నిమాపక, ఇతర అత్యవసర సేవలను ఏకీకృత వ్యవస్థకు తీసుకువస్తూ కేంద్ర ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 112ను ప్రవేశపెట్టింది. ఆ నంబరుకు బాధితులు చేస్తున్న కాల్స్‌పై దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పోలీసులు ఎలా స్పందిస్తున్నారన్న అంశాన్ని కేంద్ర హోంశాఖ పర్యవేక్షిస్తోంది. దేశ వ్యాప్తంగా 112కు వస్తున్న ఫిర్యాదులపై పోలీసుల సగటు స్పందన సమయం 18.28 నిమిషాలుగా ఉంది. అంటే బాధితుల నుంచి ఫోన్ కాల్ రాగానే 18.28 నిముషాల్లోనే పోలీసులు వారికి తగిన సహాయం అందించి రక్షణ కల్పిస్తున్నారు. ఒకప్పుడు ఈ దేశంలో పోలీసుల సగటు స్పందన సమయం 25 నిమిషాలుగా ఉండేది. కేంద్ర హోంశాఖ సమర్థంగా పర్యవేక్షించిన తరువాత సగటు స్పందన సమయం 18.28 నిముషాలకు తగ్గింది. ఇక బాధితులకు తక్షణం సహాయం అందించడంలో కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్ పోలీసులు దేశంలో మొదటి స్థానంలో ఉన్నారు. చండీగఢ్ పోలీసులు కేవలం 5.58 నిమిషాల్లోనే బాధితులకు రక్షణ కల్పిస్తుండటం విశేషం.'' అని అమిత్‌షా లేఖలో పేర్కొన్నారు.

మీరు వెనుకబడి ఉన్నారు.. ఇప్పటికైనా స్పందించండి

పోలీసు వ్యవస్థను పటిష్ట పరచడంలో సీఎం చంద్రబాబు వైఫల్యాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన లేఖలో ఏమాత్రం మొహమాటం లేకుండా ఎత్తిచూపారు. పోలీసు వ్యవస్థలోని లోపాలపై కుండబద్దలు కొట్టారు. బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు చేపట్టాల్సిన చర్యలను ఆయన వివరించారు. బాధితులకు తక్షణం సహాయం అందించేందుకు కేంద్ర హోంశాఖ 'ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ (ఈఆర్ఎస్ఎస్ 2.0)ను ప్రవేశపెట్టిన విషయాన్ని ఆయన ఆ లేఖలో ప్రస్తావించారు. ఈ అత్యాధునిక విధానాన్ని తక్షణం అమలు చేయాల్సిన ఆవశ్యకత గురించి కేంద్ర హోంశాఖ రాష్ట్ర ప్రభుత్వాలతో నిర్వహించిన జోనల్ కౌన్సిల్ సమావేశాల్లో పలుమార్లు దిశానిర్దేశం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయినా సరే ఏపీ ప్రభుత్వం తదనుగుణంగా స్పందించలేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. తద్వారా బహుళ సిగ్నల్స్, ఆర్టిఫీషియల్ / మెషిన్ లెర్నింగ్ ఎనేబుల్డ్ ఫీచర్స్, డేటా ఎనలిటిక్స్, ఇంటర్ ఆపరేటరీ, స్టేట్ డేటా ఎక్స్ఛేంజ్ మొదలైన ఆధునాతన సాంకేతిక మౌలిక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ఈఆర్ఎస్ఎస్ 2.0 ఆపరేషన్ ప్రొసీజర్‌ను 21 రాష్ట్రాలు మాత్రమే ప్రవేశపెట్టాయని అమిత్ షా పేర్కొన్నారు. టెక్నాలజీని తానే కనిపెట్టానని చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం ఏపీలో ఇప్పటివరకు 'ఈఆర్ఎస్ఎస్ 2.ఓ' ను ప్రవేశపెట్టనే లేదన్నది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. 2026, మార్చి 31నాటికి 'ఈఆర్ఎస్ఎస్ 2.0'ను ప్రవేశపెట్టాలని కేంద్ర మంత్రి అమిత్ షా ఆ లేఖలో గుర్తు చేశారు కూడా. ఇక బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు వీలుగా చేపట్టాల్సిన చర్యలనూ అమిత్ షా తన లేఖలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూచించారు.

అమిత్‌షా చేసిన సూచనలు..

- 112సేవలపై విస్తృత ప్రచారం కల్పించండి.
- బాధితులకు 24/7 అత్యవసర సేవలు అందించేలా ఎమర్జెన్సీ వాహనాల సంఖ్య పెంచండి.
- ఎమర్జెన్సీ వాహనాల్లో మొబైల్ డేటా టెర్మినల్స్(ఎండీటీ)లను ఏర్పాటు చేయండి.
- 24 గంటలూ పనిచేసేలా తగినన్ని వర్క్ స్టేషన్లు, కాల్‌సెంటర్లను ఏర్పాటు చేయండి.
- అత్యాధునిక సమాచార సాంకేతికత అందించే ప్రైమరీ రేట్ ఇంటర్‌ఫేస్(పీఆర్ఐ) లైన్లు తగినన్ని ఏర్పాటు చేయండి.
- రాష్ట్రంలో పోలీస్ స్టేషన్లు, అగ్నిమాపక కేంద్రాలు, ఆస్పత్రుల జీఐఎస్ మ్యాప్‌లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయండి.
- డేటా ఇండికేటర్లను ఎప్పటికప్పుడు ఎన్ఎస్ఎస్ పోర్టల్ ద్వారా పర్యవేక్షించండి.
- సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌కంప్యూటింగ్(సిడాక్)తో కనెక్టివిటీ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోండి.
- నేర, ఘటనాస్థలాలకు వీలైనంత త్వరగా వెళ్లే వ్యవస్థను అందుబాటులోకి తీసుకురండి.

బెడిసికొట్టిన సర్కారు కుతంత్రం..

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు చంద్రబాబు సర్కారు ఎస్పీల సమావేశంలో నానాపాట్లు పడింది. ఆపదలో ఉన్న వారికి తక్షణ సహాయం అందించడంలో సత్వరం స్పందిస్తున్నామని నమ్మించేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. సమాచారం అందిన 10 నిమిషాల్లోనే ఈ అత్యవసర సేవలు అందిస్తున్నామని ఆ నివేదికలో పేర్కొంది. కానీ, అత్యవసర సేవలు అందించడంలో రాష్ట్ర పోలీసులు దారుణంగా విఫలమవుతున్నారని స్వయంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షానే ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖలో తీవ్రంగా ఆక్షేపించారు. అత్యవసర సేవలు అందించేందుకు ఏకంగా 25.50 నిమిషాల సుదీర్ఘ సమయం తీసుకుంటున్నారని ఆ లేఖలో ఆయన కుండబద్దలు కొట్టారు. కానీ, 10 నిమిషాల్లోనే ఆ సేవలు అందిస్తున్నామంటూ చంద్రబాబు ప్రభుత్వం అవాస్తవ గణాంకాలను నివేదికలో పేర్కొని అడ్డంగా దొరికిపోయింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో భద్రతకు భరోసా

తక్షణ అత్యవసర సేవలు
పట్టణాల్లో 5 నిమిషాల్లోనే..
గ్రామీణ ప్రాంతాల్లో 8 నిమిషాల్లోనే..

ఆపదలో ఉన్నవారిని తక్షణం ఆదుకోవడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశంలోనే అత్యంత సమర్థంగా వ్యవహరించింది. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో అయితే కేవలం 3 నిముషాల నుంచి 5 నిముషాల్లోనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బాధితులకు రక్షణ కల్పించేవారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో అయితే గరిష్ఠంగా 8 నిషాల్లోనే పోలీసులు బాధితులకు అండగా నిలిచేవారు. హత్యలు, లైంగిక దాడులు జరగకుండా నిరోధించేవారు. దాడులు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేసేవారు. బాధితులను సురక్షితంగా వారి ఇళ్లకు చేర్చేవారు. ఇక ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన దిశ యాప్ మహిళల భద్రతకు పూర్తి భరోసానిచ్చింది. దిశ పోలీస్ స్టేషన్లు, దిశ పెట్రోలింగ్ వాహనాలు, దిశ క్రైమ్ డిటెక్షన్ వాహనాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్, ఫోరెన్సిక్ ల్యాబ్‌లు.. ఇలా అధునాతన వ్యవస్థను నెలకొల్పి దేశానికే ఆదర్శంగా నిలిచారు. అందుకే దిశ యాప్ జాతీయ స్థాయిలో ఏకంగా 22 అవార్డులను గెలుచుకుంది. గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల పోలీసు బృందాలు ఆంధ్ర ప్రదేశ్‌లో పర్యటించి దిశ యాప్ పనితీరును, ఇక్కడి పోలీసులు చేపట్టిన చర్యల గురించి తెలుసుకున్నాయి. ఈ తరహా యాప్‌లనే ఆ రాష్ట్రాల్లోనూ ప్రవేశపెట్టాయి.

చంద్రబాబు, పవన్, లోకేశ్ జిల్లాల్లో..

శాంతిభద్రతలు దారుణం

- సీఎం సమీక్షా సమావేశం నివేదికలో వెల్లడి
- శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వ వైఫల్యం
- పది జిల్లాల్లో నేరాల రేటు పెరుగుదల
- దాడులు, హత్యాయత్నాల్లోనూ ఇదే పరిస్థితి
- అంతకంతకూ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలు

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు సొంత జిల్లా తిరుపతి.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా.. మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న గుంటూరు జిల్లాల్లో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా దిగజారింది. రాష్ట్ర పోలీసు శాఖ అధికారికంగా వెల్లడించిన నివేదిక ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టింది. 2023 డిసెంబరు నుంచి 2024 నవంబరుతో పోలిస్తే.. 2024 డిసెంబరు నుంచి 2025 నవంబరు మధ్య కాలంలో రాష్ట్రంలో దాడులు, దోపిడీలు, ప్రధానంగా ఆర్థిక నేరాలు పెరిగిపోయాయని ఆ నివేదిక పేర్కొంది. రాష్ట్రంలో దారుణంగా దిగజారుతున్న శాంతిభద్రతల పరిస్థితిని కప్పిపుచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం ఎంతగా కనికట్టు చేసేందుకు యత్నించినా వాస్తవాలు మాత్రం బట్టబయలయ్యాయి. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో జరిగిన రెండోరోజు సదస్సులో భాగంగా గురువారం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిని సీఎం చంద్రబాబు సమీక్షించి నివేదికను సమర్పించారు. అందులోని ప్రధాన అంశాలివీ..

పది జిల్లాల్లో నేరాల తీవ్రత పెరుగుదల..

రాష్ట్రంలో కీలకమైన 10 జిల్లాల్లో నేరాల రేటు గణనీయంగా పెరిగింది. అన్నమయ్య, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, గుంటూరు, తిరుపతి, శ్రీసత్యసాయి, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, కర్నూలు జిల్లాల్లో నేరాల తీవ్రత పెరిగింది. అది కూడా ఆరు జిల్లాల్లో 4.8 శాతం నుంచి 9.5 శాతం నేరాలు తీవ్రంగా పెరగడం గమనార్హం.



వామ్మో.. దాడులు, హత్యాయత్నాలు..

- ఇక నేరాల్లో దాడులు, హత్యాయత్నాలు కూడా గణనీయంగా పెరిగాయి. 2024లో 13 దాడుల కేసులు నమోదు కాగా.. 2025లో 19.8 శాతం పెరుగుదలతో 157 కేసులు నమోదయ్యాయి.
- 2024లో 1,291 హత్యాయత్నాలు జరగ్గా.. 2025లో 1,582 జరిగాయి. అంటే.ఈ ఏడాది హత్యాయత్నాలు 22.5 శాతం పెరిగాయి.
- వైఎస్సార్, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఈ దౌర్జన్యాలు, దాడులు పేట్రేగిపోయాయి.
- ఇక పట్టపగలు దోపిడీలు.. ఈ సందర్భంగా హత్యలూ పెరిగినట్లు నివేదిక వెల్లడించింది.
- ఈ తరహా నేరాలు ఎక్కువగా వైఎస్సార్ కడప, అల్లూరి సీతారామరాజు, అన్నమయ్య, పార్వతీపురం మన్యం, గుంటూరు జిల్లాల్లో పెరిగాయి.
- ఇక 2025లో మొత్తం 6,139 గంజాయి, డ్రగ్స్ కేసులు నమోదయ్యాయి.

నేరాల రేటు ఎక్కువ

ఈ సమావేశంలో శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నేరాల రేటు అత్యధికంగా ఉందన్నారు. గంజాయి వ్యాపారానికి అడ్డం వస్తే ఏకంగా హత్యలు చేసేస్తున్నారని.. లేడీ డాన్స్ కూడా తయారవుతున్నారని చెప్పారు. నేరాల నియంత్రణలో జిల్లాల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉందన్నారు. అన్నమయ్య, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, గుంటూరు, తిరుపతి వంటి జిల్లాల్లో నేరాలు పెరుగుతున్నాయని.. దీనిపై విశ్లేషించాలన్నారు. వైఎస్సార్ కడప, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో దోపిడీలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఆర్థిక నేరాల విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధితులకు 15 నిమిషాల్లోనే అత్యవసర సేవలు అందించేలా ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టంను రూపొందించాలని.. తీరప్రాంతాల్లో భద్రత కోసం డ్రోన్లు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఆర్థిక నేరాలూ పైపైకి..

రాష్ట్రంలో ఆర్థిక నేరాలు కూడా అమాంతంగా పెరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2024లో మొత్తం 7,539 కేసులు నమోదు కాగా.. 2025లో ఈ సంఖ్య 8,035కు పెరిగింది. నమ్మకద్రోహంతో ఆర్థిక నేరాలు 2024లో 1,077 కేసులు.. 2025లో 25.6 శాతం పెరిగి 1,353 కేసులు నమోదయ్యాయి. ఇక మోసాలకు సంబంధించి 6,430 కేసులు నమోదు కాగా.. 2025లో 3.6 శాతం పెరుగుదలతో 6,660 కేసులు నమోదయ్యాయి.

రోడ్డు ఎక్కాలంటే భయం..

ఇక రహదారి భద్రతలోనూ చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఫలితంగా.. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. 2024తో పోలిస్తే 2025లో రోడ్డు ప్రమాదాలు 2.2 శాతం పెరుగుదలతో 18,837 సంభవించాయి. తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు 4.6 శాతం పెరిగాయి. అలాగే, ఈ ప్రమాదాల్లో మృతుల సంఖ్య కూడా 4.6 శాతం పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2025లో ఇలా 8,466 మంది మృతిచెందగా.. 10,600 మంది తీవ్రంగా గాయపడ్డారు. మొత్తం రోడ్డు ప్రమాదాల్లో తిరుపతి, విశాఖపట్నం, ఎన్టీఆర్, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, గుంటూరు జిల్లాల్లోనే 29 శాతం సంభవించాయి.

నేరస్తులకు రాజకీయ నేతల అండ

ఇక అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఏమీ చేయలేకపోతున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చెప్పారు. నేరాలకు పాల్పడే వారిని రాజకీయ నేతలు వెనకేసుకొస్తున్నారని అంగీకరించారు. ఫలితంగా.. పోలీసులు నిర్లిప్తంగా ఉండిపోతున్నారని చెప్పారు. విశాఖపట్నంలో కొందరు దాడికి పాల్పడ్డారని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని పవన్‌కళ్యాణ్ ఈ సందర్భంగా ఉదహరించారు.

భూ సమస్యలు కలెక్టర్లే పరిష్కరించాలి

కలెక్టర్ల రెండోరోజు సదస్సులో సీఎం చంద్రబాబునాయుడు

సాక్షి, అమరావతి: భూ సమస్యలను వందశాతం పరిష్కరించి ప్రజలకు సవ్యంగా డాక్యుమెంట్లు ఇవ్వాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. కొందరు ప్రొఫెషనల్స్ కావాలనే భూవివాదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారిపై అవసరమైతే పీడీ చట్టం పెట్టి కఠినంగా వ్యవహరించాలని ఆయన కలెక్టర్లకు సూచించారు. ఈ వివాదాలను పరిష్కరించే బాధ్యతను జాయింట్ కలెక్టర్లకు అప్పజెప్పాలన్నారు. కలెక్టర్ల సదస్సులో భాగంగా గురువారం రెండోరోజు వివిధ అంశాలపై ముఖ్యమంత్రి మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. 22ఏ భూముల విషయంలో సర్వేచేసి సెటిల్ చేయండి. ప్రస్తుతం పెండింగులో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలు జారీచేద్దాం . ప్రింటింగ్ చేసిన చోటు నుంచే వాటిని నేరుగా రైతులకు వెళ్లేలా చర్యలు తీసుకుందాం. రిజిస్ట్రేషన్ చేసుకున్న డాక్యుమెంట్లు కూడా నేరుగా యజమానులకు చేర్చేలా చర్యలు చేపడదాం. హౌసింగ్‌లో పొజిషన్ సర్టిఫికెట్లను కూడా క్లియర్ చేయండి. 20–30 ఏళ్లుగా నివసిస్తున్న ఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్ జారీచేయాలి. విశాఖ, అనకాపల్లి సహా ఐదారు జిల్లాల్లో భూ కబ్జాలు లేకుండా చూడండి. ఇందుకు సంబంధించిన ఫిర్యాదులపై కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోండి. అన్ని రిజిస్ట్రేషన్, ఆస్తి పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతోంది. లింక్ డాక్యుమెంట్లను డేటా వేర్ హౌసింగ్‌లో పెడుతున్నాం. ఇక భూవివాదాల్లో పొలిటికల్ నేతల జోక్యాన్ని సహించొద్దు. జిల్లాల వారీగా రెవెన్యూ రాబడులపై దృష్టిపెట్టండి. పన్ను ఎగవేతలు, మానిప్యులేషన్ లేకుండా కలెక్టర్లు చూడాలి.

28న పాఠశాలల్లో 'ముస్తాబు' కార్యక్రమం..

ఉగాదికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకొస్తాం. రాష్ట్రంలో వర్క్‌ఫోర్స్ పెరగాల్సి ఉంది. మాతాశిశు మరణాల రేటును జీరోకి తీసుకురావాలి. ఈనెల 28న అన్ని పాఠశాలల్లో ముస్తాబు కార్యక్రమం ప్రారంభిద్దాం. పార్వతీపురం మన్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి అభినందనలు. రాష్ట్రంలో జీరో సూసైడ్స్ లక్ష్యంగా పనిచేయాలి. డ్రగ్స్ లాగే టొబాకో ఫ్రీ అనే అంశంపై చైతన్యం కలిగించండి. డ్రగ్స్ నియంత్రణపై కూడా దృష్టిపెట్టాలి. డ్రెయిన్లపై ఆక్రమణలు లేకుండా, కాలుష్యం లేకుండా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలి. 'మార్పు' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయండి. ఎక్సైజ్ శాఖ కూడా దీనిపై అధ్యయనం చేయాలి. కేవలం నిధులతోనే అన్ని ఫలితాలను సాధించలేం.

పీపీపీలో మెడికల్ కాలేజీ నిర్మిస్తే జైల్లో పెడతామంటున్నారు..

పీపీపీ మోడల్‌లో మెడికల్ కళాశాలలు నిర్మించేందుకు ముందుకొస్తే.. అధికారంలోకి వచ్చాక జైల్లో పెడతామని కొందరు బెదిరిస్తున్నారు. పీపీపీతో అభివృద్ధి జరుగుతుంది. పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టులు చేపట్టినా.. అది ప్రభుత్వ ఆస్తిగానే ఉంటుంది. రాజకీయంగా విమర్శలు చెయ్యొచ్చుగానీ, రౌడీయిజం చేస్తామంటే కంట్రోల్ చేస్తాం. కలెక్టర్లు, ఎస్పీలు జిల్లాల్లో జరిగే నేరాలపై కఠినంగా వ్యవహరించాలి. వ్యక్తుల ప్రతిష్టను దిగజార్చేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే సహించొద్దు. జనవరి 15 నుంచి అన్ని శాఖల ఫైల్స్, ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లో ఉండాలి. పరిశ్రమలకు ప్రోత్సాహకం కోసం ఎస్క్రో ఖాతా విధానం తీసుకొచ్చాం. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని ఇప్పుడు అమలుచేయబోతున్నాం. ప్రజల సంతృప్తే అధికారుల పనితీరుకు కొలమానం. ఏప్రిల్ నుంచి సంక్షేమ క్యాలెండర్ అమలు చేస్తాం. తదుపరి కలెక్టర్లు, ఎస్పీల సమావేశం నాటికి మరింతగా మార్పు రావాలి.

భూ వివాదాల్లో రాజకీయ నేతల జోక్యం

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ.. విశాఖపట్నం, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పారిశ్రామిక ప్రాంతాల్లోని పలు భూ వివాదాల్లో రాజకీయ నేతల ప్రమేయం ఉంటున్నట్లు తనకు ఫిర్యాదులు వచ్చాయని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా విశాఖ జోన్‌లో ఇలాంటివి ఎక్కువగా జరుగుతున్నాయని, నాయకుల ప్రమేయంవల్ల అధికారులేమీ మాట్లాడలేకపోతున్నారని ఆయన తెలిపారు. అలాగే, విశాఖలో కొందరు ఆకస్మికంగా వచ్చి దాడిచేస్తే పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోలేదని.. కొందరు నేతలు దీని వెనుక ఉన్నారని ఆయన చెప్పారు. ఇలా చర్యలు తీసుకోకపోవడం.. నేరాల్లో నిర్లిప్తంగా ఉండటం సరికాదన్నారు. అధికారంలో ఉండి కూడా ఏమీచేయడంలేదనే విమర్శలు ఎదుర్కొంటున్నామని.. ఈ విషయాల్లో కఠినంగా వ్యవహరించాలని ఎస్పీలు, కలెక్టర్లను ఆదేశిస్తున్నట్లు పవన్‌కళ్యాణ్ అన్నారు. ప్రజాప్రయోజనాలకు విఘాతం కలిగించేలా జరుగుతున్న నేరాలపట్ల అలక్ష్యంగా ఉండొద్దన్నారు.

చంద్రబాబు సర్కార్‌పై ఎమ్మెల్యే అమిలినేని అసహనం

కళ్యాణదుర్గం: చంద్రబాబు సర్కారుపై సొంత పార్టీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీలలో పారిశుధ్య పనులకు అవసరమైన పరికరాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు కాకుండా కేవలం మండలానికి రెండు గ్రామాలకు చొప్పున మాత్రమే పరికరాలు వచ్చాయని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో పంపిణీ చేసినప్పుడు తన నియోజకవర్గంలో మాత్రం ఎందుకు కొన్ని గ్రామాలకే ఇస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. తాను అసంతృప్తితో ఉన్నానని, ఈ విషయమై జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తానని, కార్యక్రమాన్ని బహిష్కరించి వెళ్తున్నానని మైకులో ప్రకటించి అర్ధంతరంగా వెనుదిరిగారు. ఇదిలా ఉండగా కొంత కాలంగా ఎమ్మెల్యే అమిలినేని టీడీపీ అధిష్టానంపై గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ఈ–స్టాంపుల కుంభకోణం, సీనియర్ నేతల మధ్య సమన్వయ లోపం, మద్యం షాపుల టెండర్లు, తదితర పరిణామాల నేపథ్యంలో అమిలినేని ప్రతిష్ట మసకబారింది. ఈ క్రమంలోనే టీడీపీ అధిష్టానం ప్రాధాన్యత తగ్గించిందని పార్టీ నేతల మధ్య చర్చ జరుగుతోంది.

సుక్మాలో ఎన్‌కౌంటర్

ముగ్గురు మావోయిస్టుల మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మహిళా మావోయిస్టు సహా ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధి సింగనమరుగు అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డీఆర్జీ బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు ఎదురుపడడంతో ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి. అనంతరం అక్కడ గాలింపు చేపట్టగా ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు లభించాయి. మృతుల్లో కిష్టారం ఏరియా కమిటీకి చెందిన ఏసీఎంలు మడవి జోగా, సోది బండి, సుప్పో బజ్జి (మహిళ) ఉన్నారని గుర్తించారు. ఘటనా స్థలం నుంచి వారి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, కాల్పుల్లో కొందరు మావోయిస్టులు గాయపడి ఉండవచ్చని సుక్మా ఎస్పీ కిరణ్‌చవాన్ తెలిపారు.

తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్దకు భారీగా తరలివచ్చిన ప్రజలు, విద్యార్థులు

రాష్ట్ర చరిత్రలో గొప్ప ఉద్యమం

పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశంలో వైఎస్ జగన్

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఒక పెద్ద స్కామ్
- ఆ సిబ్బందికి రెండేళ్ల పాటు వేతనాలు మరో స్కామ్
- అధికారంలోకి రాగానే అవన్నీ రద్దు చేస్తాం
- స్కామ్‌కు పాల్పడిన వారిని జైలుకు పంపుతాం
- రెండు నెలల్లోనే వారిపై అన్ని చర్యలుంటాయి
- చంద్రబాబు గ్రాఫ్ డౌన్ కావడంతో కలెక్టర్లపై నెపం

ప్రసంగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, ముఖ్య నేతలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఒక పెద్ద స్కామ్ అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. కాలేజీలను ప్రైవేటువారికి ఇప్పించడమే కాకుండా వాటిలో పనిచేసే సిబ్బందికి రెండేళ్లు చంద్రబాబు సర్కారే వేతనాలు ఇస్తుందట..! ఇదో మరో స్కామ్ అని స్పష్టం చేశారు. కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన ప్రజా ఉద్యమానికి రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించిందని.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ.. ప్రభుత్వ రంగంలోనే వాటిని నిర్మించి నడపాలని డిమాండ్ చేస్తూ 1,04,11,136 మంది సంతకాలు చేసి ఉద్యమాన్ని విజయవంతం చేశారని వెల్లడించారు. ఈ ప్రజా ఉద్యమానికి వచ్చిన స్పందన చూసైనా చంద్రబాబు సర్కార్ వాస్తవాలు గుర్తించి.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై నిర్ణయం మార్చుకోవాలని హితవు పలికారు. లేదంటే తాము అధికారంలోకి రాగానే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. స్కామ్‌కు పాల్పడిన వారిని జైళ్లకు పంపుతామని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే వారిపై అన్ని చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు. కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సేకరించిన కోటికి పైగా సంతకాలతో కూడిన వాహనాలకు గురువారం ఉదయం వైఎస్ జగన్ జెండా ఊపి లోక్‌భవన్‌కు పంపారు. అనంతరం పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జిల్లాల అధ్యక్షులు, రీజనల్ కో–ఆర్డినేటర్లు, సీనియర్ నేతలతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఏమన్నారంటే..

చరిత్రలో నిల్చిపోయే ఘట్టం

కోటి సంతకాల సేకరణలో మీ కృషి, మీ అందరినీ అభినందించేందుకు ఎన్ని మాటలు చెప్పినా తక్కువే. ఇక్కడి నుంచి మొదలు పెడితే.. ఎంపీలు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, సీనియర్ నాయకులు, గ్రామస్థాయిలో కార్యకర్తల వరకు అంతా నిబద్ధతతో పని చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచాలని, ఆ నిర్ణయం వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తేవాలనే పట్టుదలతో చేపట్టిన ఇంత గొప్ప ఉద్యమం బహుశా రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ జరిగి ఉండదు. ఇన్ని సంతకాలు సేకరించడం, నిజంగా రాష్ట్ర చరిత్రలో నిల్చిపోయే ఘట్టం. ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేస్తున్నా.

స్కామ్ చేసిన వారెవరినీ వదలం..

గవర్నర్‌కు ఈ పత్రాలన్నీ చూపించిన తర్వాత, ఆయనకు చెప్పిన తర్వాత ఈ పత్రాలతో కోర్టు తలుపు కూడా తడతాం. ఆ మేరకు కోర్టులో పిటిషన్ వేస్తాం. మీరెప్పుడు అడిగితే అప్పుడు అఫిడవిట్లు (కోటి సంతకాల పత్రాలు) మీకు చూపించడం కోసం సిద్ధంగా ఉంటామని కోర్టుకు నివేదిస్తాం. కానీ ఇంతటితో చంద్రబాబుకు జ్ఞానోదయం అవుతుందని నేను అనుకోవడం లేదు. గతంలో ఎన్.జనార్ధన్‌రెడ్డి ప్రైవేట్ మెడికల్ కాలేజీకి అనుమతి ఇవ్వడంతో ఏకంగా ముఖ్యమంత్రి పదవికి ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈయనకు (చంద్రబాబు) సిగ్గు లేదో ఇంకొకటి లేదో! ఎడాపెడా గవర్నమెంట్ ఆస్తుల్ని ఇచ్చేస్తూ స్కాములు చేయడానికి ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదు! మనం ఇన్ని ప్రయత్నాలు చేసిన తర్వాత కూడా చంద్రబాబు వినకుండా దీన్ని ముందుకు తీసుకుని పోతే మాత్రం.. ఈ స్కామ్‌లో ఉన్న వారంతా మనం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు నెలలు తిరక్క ముందే జైళ్లలో ఉంటారు. మదర్ ఆఫ్ ఆల్ స్కామ్స్ కింద ఇది నిరూపితం అవుతుంది. గవర్నర్‌తో భేటీ తర్వాత కోర్టుల్లో చేసే యుద్ధం స్టార్ట్ అవుతుంది. ఈలోపు చంద్రబాబునాయుడు ఇంకా మనసు మార్చుకోకుండా ముందుకు అడుగులు వేస్తే చూస్తూ ఊరుకోం. మళ్లీ నియోజకవర్గ స్థాయిలో, జిల్లా స్థాయిలో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తాం. మళ్లీ ప్రజల మధ్యన నిల్చుని ఉద్యమాలు చేసే కార్యక్రమం కొనసాగుతుంది.

బాబు చేసిన మంచి.. బోడి సున్నా!

గవర్నమెంట్ స్కూళ్లు, గవర్నమెంట్ హాస్పిటళ్లు ఎందుకు నడుపుతోంది అని అనుకునే మనిషి బహుశా చంద్రబాబు మినహా ప్రపంచంలో ఎవరూ ఉండరు. నాడు.. మనం ఉన్నాం కాబట్టి ఆర్టీసీ బతికింది. కార్మికులందరినీ గవర్నమెంట్‌లో విలీనం చేశాం. ఇంతకుముందు ఎన్నికల్లో మనం అధికారంలోకి రాకపోయి ఉంటే, చంద్రబాబునాయుడు వచ్చి ఉంటే ఆర్టీసీని కూడా అమ్మేసుండేవారు. మొన్న ఆశ్చర్యకరంగా ఒకమాట విన్నా.. పోలీస్ శాఖను కూడా ప్రైవేటీకరణ చేసే కార్యక్రమం చేస్తాడట. శాంతి భద్రతల పరిరక్షణ ప్రభుత్వ ఆధ్వర్యంలో లేకపోతే ఏం జరుగుతుందో ఒక్కసారి ఆలోచించండి. చంద్రబాబు నోటి నుంచి నిన్న (బుధవారం) కలెక్టర్ల సదస్సులో వచ్చిన మాటలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ప్రజల్లో ఆయన గ్రాఫ్ పడిపోతోంది. దానికి కారణం కలెక్టర్ల పనితీరు సరిగా లేదని వారిపై నెపం వేస్తున్నారు. చంద్రబాబు వచ్చిన తర్వాత ఇప్పటికే రెండు బడ్జెట్లు ప్రవేశపెట్టగా వచ్చే మార్చిలో మూడో బడ్జెట్ పెడుతున్నారు. మరి ప్రజలకు ఏదైనా మంచి జరిగిందా అంటే? బోడి సున్నా కనిపిస్తుంది. అప్పటిదాకా ప్రజలకు అందుబాటులో ఉండే అన్ని స్కీములూ రద్దయిపోయాయి. ఈ కార్యక్రమంలో శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్టీ వివిధ విభాగాలకు చెందిన నేతలు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

విజయవాడలో గవర్నర్‌కు అందించేందుకు తీసుకువెళుతూ అంబేడ్కర్ స్మృతివనం వద్ద నిలిపిన కోటి సంతకాల ప్రతుల వాహనాలు

తాడేపల్లిలో జెండా ఊపి కోటి సంతకాల వాహనాలను పంపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ జగన్‌ను చూసేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం వద్దకు వచ్చిన అభిమానులు

విజయవాడలో బైక్ ర్యాలీగా తరలివస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మింగుతున్న కూటమి సర్కారు పీపీపీ భూతం.. అంటూ వైఎస్సార్‌సీపీ నాయకుల వినూత్న ప్రదర్శన

కోటి సంతకాల ప్రతులు తీసుకొచ్చిన వాహనాలను పరిశీలిస్తున్న గవర్నర్ కార్యాలయ అధికారులు

'పుస్తకం చదివితే
వేయి జీవితాలు
జీవించవచ్చు.
చదవకుంటే ఒక్కటే'...
అన్నాడో మహానుభావుడు.
పుస్తకం చదవడమంటే
మనకోమెదడు ఉందని
గుర్తు చేసుకోవడం.
పుస్తకం చదవడమంటే
మనకో కుతూహలం ఉందని
తెలుసుకోవడం.
ఫోన్... మనకు అక్కర్లేని
వినోదాలను ఇస్తోంది.
పుస్తకం... కచ్చితమైన
దిశను సూచిస్తుంది.
దిశాబద్ధులై ఉండేందుకు
బుక్‌ఫెయిర్ బాట పట్టండి.





నేటి నుంచి డిసెంబర్ 29 వరకు హైదరాబాద్ బుక్‌ఫెయిర్

38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ డిసెంబర్ 19 నుంచి 29 వరకు 11 రోజుల పాటు ఇందిరా పార్కు వద్ద ఉన్న ఎన్టీఆర్ స్టేడియం (కళాభారతి)లో జరగనుంది. రోజూ మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 9 వరకు ప్రవేశవేళలు. విద్యార్థులకు ఉచిత ప్రవేశం. ఈసారి మొత్తం 365 స్టాల్స్ ఏర్పాటు కానున్నాయి. దాదాపు 12 లక్షల మంది సందర్శిస్తారని అంచనా. పుస్తకావిష్కరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చలు చోటు చేసుకుంటాయి.

పుస్తకాలు ఎందుకు చదవాలి?



పుస్తకాలు అందరినీ మనవాళ్లను చేస్తాయి

పుస్తకాలు అనేక మానవ జీవిత అనుభవాల సారాన్ని నింపుకున్న పాత్రలు. అమూల్యమైన జ్ఞానాన్ని పొందడానికి మన కళ్లను తెరిపించే వెలుతురు కిరణాలు. బలహీనులకు బలాన్ని, ధైర్యాన్ని ఇచ్చే టానిక్‌లు. ప్రపంచాన్ని మనకు పరిచయం చేస్తాయి. మన జీవితాలను అర్థం చేసుకోవడం ఎలాగో నేర్పుతాయి. పుస్తకాలు నవ్విస్తాయి, ఏడిపిస్తాయి, దయ, జాలి, కరుణ, ప్రేమ, సహోదర భావనలను మన హృదయాల్లో నింపుతాయి. వాట్సప్, యూట్యూబ్ వంటివి మనల్ని మనం పరాయివారిగా చేస్తే పుస్తకాలు అందరినీ మనవాళ్ళుగా చేసుకోవటం నేర్పుతాయి. పుస్తకాలు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కాదు. అసలైన వివేకం. పుస్తక స్పర్శ కోసం, ప్రపంచాన్ని ఆలింగనం చేసుకోవడం కోసం పుస్తక ప్రదర్శనలకు వెళ్ళాలి. మనం స్వయంగా ఎంచుకుని స్వంతం చేసుకొన్న పుస్తక పఠన అనుభూతిని సాటిచెప్పలేం. పుస్తకం కోసం తహతహలాడటమంత అందమైన అనుభూతి మరొకటి లేదు.

– ఓల్గా, సుప్రసిద్ధ రచయిత్రి

'పుస్తకాలు అపరిచిత మిత్రులకు స్వాగత ద్వారాలు'.

మనిషికి ఏం కావాలి? తనను తాను వ్యక్తపరచుకోవడం కావాలి. అందుకే మాట్లాడాడు. పాడాడు. ఆడాడు. బొమ్మలు గీశాడు. రాశాడు. వాటి ద్వారా తనేమిటో చెప్పాడు. ఇదే మనిషికి సాటి మనిషి ఎలా వ్యక్తమవుతాడో కూడా కావాలి. అతని జీవితం ఎలా ఉంది... ఆలోచనలు ఏమిటి... సమస్యలు ఏమిటి... వాటిని ఎలా ఎదుర్కొన్నాడు.... అందుకే ఆట, పాట, బొమ్మ, కథల్లో సాటి మనిషి గురించి తెలుసుకోవడానికి ఉబలాట పడ్డాడు. ఆ ఇచ్చి పుచ్చుకోవడం సజీవంగా ఉన్నంత కాలం మనిషి సజీవంగా ఉన్నట్టే లెక్క. లేకుంటే పాకుడు నీళ్లతో సమానం. అందుకే పుస్తకాలు చదవాలి. తనను తాను తెలుసుకునేందుకు, ఇతరుల గురించి తెలుసుకునేందుకూ. ఈ విశాల సృష్టిలో మనుషులంతా ఒక్కలాంటి వాళ్లే... రకరకాల పద్ధతుల్లో జీవిస్తూ ఒకేరకమైన ఉద్వేగాలను అనుభవిస్తుంటారని తెలుసుకుని... అందరి నుంచి ఉమ్మడి శక్తిని పొంది వ్యక్తిగత జీవితాన్ని ఒడ్డున చేర్చుకునేందుకు పుస్తకాలు చదవాలి.

పెద్దబాలశిక్షతో మొదలు

పుస్తకం ప్రాథమిక కర్తవ్యం జ్ఞానాన్ని ఇవ్వడమే. అందుకే పుస్తకం విద్యాసాధనం అయ్యింది. అయితే విద్యతో మనిషి ఆగడు. కడుపు నిండిన మనిషి కళ కోసం చూసినట్టే విద్య నేర్చిన మనిషి వికాసం వైపు చూశాడు. వికాసానికి పుస్తకం దారి చూపింది. భాష, సంస్కృతి, సాహిత్యం, చరిత్ర... ఇవన్నీ పుస్తకంలో నిక్షిప్తమయ్యి తరం నుంచి తరానికి అందాయి. అయితే వికాసంతో కూడా మనిషి ఆగడు. వినోదం కావాలి, ఆహ్లాదం కావాలి, అనుభూతి కావాలి, ఉద్వేగం కావాలి, కల్పిత గాథలు... ఫ్యాంటసీ పురాణాలు కావాలి... ఫ్యాంటసీ ప్రపంచాలు కావాలి... అవన్నీ పుస్తకమే ఇచ్చింది. పుస్తకం ఇచ్చేవి తీసుకున్నాడు. పుస్తకాలను నిచ్చెనమెట్లుగా చేసుకుని మనిషి దినదిన ప్రవర్ధమానమయ్యాడు. అయితే పుస్తకాన్ని వదిలిపెట్టినా, నిర్లక్ష్యం చేసినా జాతి చీకటిలో ప్రయాణిస్తుంది. ఆ పుస్తకాన్ని కొనసాగించడం ముఖ్యం. అందుకే యూరోపియన్ దేశాలలో పుస్తకాన్ని వదిలిపెట్టడం అనేది అద్భుతంగా కల్లో కూడా ఊహించరు. మనవాళ్లు పుస్తకం విలువ కనిపెట్టారు కాబట్టే ప్రతి ఇంట్లో కనీసం పెద్ద బాలశిక్ష అయినా ఉండాలని తలిచారు. నేడు మన ఇళ్లల్లో పెద్ద బాలశిక్షకు బదులు ఫోన్లు చేరాయి.

అందరికీ తల ఊపడం మానేలా చేస్తాయి

పుస్తకాలు ఎందుకు చదవాలి? నా చిన్నప్పుడు నన్నెవరన్నా ఈ ప్రశ్న అడిగి ఉంటే ఆశ్చర్యపోయి ఉండేవాడిని. ఎందుకంటే పుస్తకాలు చదవడం వల్లనే నాకు లోకం తెలిసింది. ప్రపంచపు పోకడ తెలిసింది. మానవజాతి గతం గురించి, వర్తమానం గురించి తెలిసింది. మానవుడి భవిష్యత్తు ఎలా ఉండాలన్న దాని మీద కవులూ, రచయితలూ, తత్త్వవేత్తలూ శాస్త్రవేత్తలూ వెలిబుచ్చిన కలలు నాకు తెలిసాయి. నేను పుట్టి పెరిగిన మారుమూల కొండ కింద పల్లెలో ఆ రోజుల్లో నాకు దొరికిన ఆ కొద్దిపాటి పుస్తకాలు ఆ రోజు దొరకకపోయి ఉంటే నా జీవితం గురించి నాకు ఎప్పటికీ అర్థమయ్యే దారి దొరికి ఉండేది కాదు. ఇప్పుడు ఇన్ని మాధ్యమాలు మన అరచేతుల్లోకి అందుబాటులోకి వచ్చాక పుస్తకాలు ఎందుకు చదవాలి అన్న ప్రశ్న తలెత్తుతున్నదేమో! ఇన్ని మాధ్యమాలున్నా పుస్తకాలు చదవకపోతే మనం ఎప్పటికీ పక్కవాడి అభిప్రాయాలకి తలూపుతూ బతుకుతుంటాం. కాబట్టి ఈ మాధ్యమాలన్నిటిలోనూ అత్యంత విశ్వసనీయమైన మాధ్యమం పుస్తకాలు మాత్రమే.

– వాడ్రేవు చినవీరభద్రుడు, సుప్రసిద్ధ రచయిత

జీవితాన్ని మార్చే పుస్తకాలు

పుస్తకాలు జీవితాలను మార్చేస్తాయి. ఒక్క పుస్తకం చదివి లక్ష్యాన్ని ఏర్పరచుకున్నవాళ్లు, ఒక్క పుస్తకం చదివి జీవితాన్ని మార్చుకున్నవాళ్లు, ఒక్కపుస్తకం చదివి శాసనాలను మలుచుకున్నవారు ఉన్నారు. 'విద్య లేని వాడు వింత పశువు' అన్నారు పెద్దలు గానీ 'పుస్తకం చదవని వాడే వింత పశువు' అనుకోక తప్పదు. 'తిని తొంగుంటే మనిషికీ గొడ్డుకీ తేడా ఏం ఉంటుంది' అన్నట్టుగా పుస్తకం చదవకపోతే వివేచన, వివేకం ఎలా జాగ్రత్తమవుతాయి? ఏది న్యాయమో ఏది అన్యాయమో ఎలా తెలుస్తుంది? మనిషిగా పుట్టినందుకు మంచివైపు నిలబడాలన్న బాధ్యత ఎక్కడినుంచి వస్తుంది?

పుస్తకం చిరంజీవి

పుస్తకాన్ని చంపే మారణాయుధాలు ఎన్నో వచ్చాయి. సినిమాలు, టీవీలు, వీడియో కేసెట్లు, వీడియో గేమ్స్, ఓటీటీలు, రీల్సు... ఎన్నో. కాని పుస్తకం చిరంజీవిగానే ఉంది. పుస్తకం వేయి పుటలతో లక్ష కన్నులతో లోకాన్ని చూపుతుంది. సినిమా ఆ పని చేయదు. పుస్తకం ఒక గాథను వాక్య పరిధిలో చూపి కొంత ఊహకు వదిలిపెడుతుంది. అది వీడియో చేయదు. పుస్తకం ప్రశ్నను లేవనెత్తుతుంది. వెంటాడుతుంది. ప్రశ్న లేని మనిషి, ప్రశ్నించని మనిషి శిథిలమయ్యి మానసిక సంపద కోల్పోతాడు. అందుకే 'మనీ ప్లాంట్ సరే. పుస్తకం ఉంచుకోవడం కూడా సంపదతో సమానమే' అని గ్రహించాలి.

మనుషులకు పండగ ఉన్నట్టు పుస్తకాలకు కూడా పండగ ఉంటుంది. ప్రతి సంవత్సరం 'హైదరాబాద్ బుక్‌ఫెయిర్'లో పుస్తకాలన్నీ కూడబలుక్కుని ఒకచోట చేరుతాయి. వాటిని చూడటానికి వెళ్లాలి. చేతుల్లోకి తీసుకోవాలి. వాటితో స్నేహం చేయాలి. ఇంటికి పిల్చుకోవాలి. పుస్తకాలు ఇంటికి వచ్చాక దీపంలా మారడం మీరే గమనిస్తారు. ఆ కాంతులు ఇంటిని వెలిగించడం చూస్తారు. ఆ కాంతుల్లో వర్ధిల్లడం ఎంతటి భాగ్యమో తప్పక తెలుసుకుంటారు.



ముగ్గు ముచ్చట

25 చుక్కలు,
13 వరసలు
సందు చుక్కలు



గరిమెళ్ల పద్మావతి
ఎంవిపి కాలనీ
విశాఖపట్నం

17 చుక్కలు,
5 వరుసలు
అటు ఇటు వదిలి
5 వరకు



లక్ష్మీప్రసన్న
హైదరాబాద్

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
డిసెంబర్ 18న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,33,310	1,13,560	2,00,000
విజయవాడ	1,36,050	1,23,600	2,07,600
విశాఖపట్నం	1,34,840	1,23,600	2,24,000
రాజమండ్రి	1,37,050	1,27,310	2,07,600
ప్రొద్దుటూరు	1,32,300	1,21,720	1,99,000
చెన్నై	1,35,710	1,24,400	2,24,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా

● షానిల్, సుప్రియ, మృణాల్, అడివి శేష్

డెకాయిట్ ఒక హైబ్రిడ్ సినిమా

– అడివి శేష్

''డెకాయిట్' ప్రాపర్ తెలుగు, హిందీ సినిమా. ఒక తెలుగు వ్యక్తి, ఒక హిందీ వ్యక్తి కలిసి చేసిన చిత్రం. నేను, షానియల్ అమెరికాలో పెరిగాం. మన సంస్కృతిని తను, తన సంస్కృతిని నేను అర్థం చేసుకుని ఒక హైబ్రిడ్ సినిమా చేశాం. ఈ సినిమా ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌లో వచ్చిందంటే కారణం సుప్రియగారే. అంతర్జాతీయ స్థాయిలో తీసిన 'డెకాయిట్'ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు'' అని అడివి శేష్ తెలిపారు. ఆయన హీరోగా, మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా 2026 మార్చి 19న విడుదల కానుంది. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో అనురాగ్ కశ్యప్ మాట్లాడుతూ– ''డెకాయిట్'లో నటించడం నాకు చాలా ఫన్ ఎక్స్‌పీరియన్స్'' అని పేర్కొన్నారు. మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ– ''సీతారామం' సినిమాకి స్వప్నగారితో, ఇప్పుడు 'డెకాయిట్' కోసం సుప్రియగారితో పని చేయడం సంతోషాన్నిచ్చింది'' అని తెలిపారు. ''14 ఏళ్ల క్రితం కాలిఫోర్నియాలో అడివి శేష్, నేను కలిసి ఒక కథ గురించి మాట్లాడుకున్నాం. ఆయన గైడెన్స్ నాకెంతో ఉపయోగపడింది. సుప్రియగారు చాలా ఫ్రీడమ్ ఇచ్చారు'' అని షానియల్ డియో చెప్పారు. ఎడిటర్ పవన్ కల్యాణ్ మాట్లాడారు.

వింత అనుభవాలు ఎదురయ్యాయి

● చిన్మయ్ రామ్

అమ్రిత్ రావ్, పర్వేజ్ సింబా, ప్రకాశ్ తమినాద్, రవి భట్, సంగీత ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'జిన్'. చిన్మయ్ రామ్ దర్శకత్వంలో నిఖిల్ ఎం. గౌడ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిన్మయ్ రామ్ మాట్లాడుతూ–''కన్నడలో రెండు చిత్రాలు తీశాను. తెలుగులో 'జిన్' నా తొలి సినిమా. పర్వేజ్ తనకు కలలో వచ్చిన ఈ 'జిన్' కథ గురించి చెప్పాడు. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో మాకు వింత అనుభవాలు ఎదురయ్యాయి. కెమెరా లైట్స్ వాటంతట అవే ఆఫ్ అయ్యేవి. కెమెరాలు సరిగ్గా పని చేసేవి కావు. ఓసారి హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తుంటే కారు యాక్సిడెంట్ జరిగింది. ఆ ప్రమాదం నుంచి మేం బతకడమే అదృష్టంలా అనిపిస్తోంది. కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న 'జిన్'ని ప్రేక్షకులు ఆదరిస్తే, 'జిన్ 2' తీస్తాం. స్క్రిప్ట్ రెడీగా ఉంది'' అని చెప్పారు.

కథలు రాస్తున్నాను

– ఫరియా అబ్దుల్లా

నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. మురళీ మనోహర్ దర్శకత్వంలో డా. సంధ్య గోలీ సమర్పణలో వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ–''ఈ సినిమాలో నేను సౌధామిని అనే నర్సు పాత్ర చేశాను. డాక్టర్ కావాలనుకుంటున్న సౌదామిని జీవితంలోకి గుర్రం పాపిరెడ్డి (నరేశ్ అగస్త్య రోల్) వచ్చి, ఆమె జీవితాన్నే మార్చేస్తాడు. దీంతో 'గుర్రం పాపిరెడ్డి' గ్యాంగ్‌తో కలిసి సౌదామిని ఓ దొంగతనంలో పాల్గొనాల్సి వస్తుంది. ఆ తర్వాత ఏం జరుగుతుందనేది? సినిమాలో చూడాలి. ఈ చిత్రంలో నేను డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తాను. ఈ చిత్రం కోసం ఓ ప్రమోషనల్ సాంగ్ చేశాను. ఈ పాటకు నేనే కొరియోగ్రఫీ చేశాను. యాక్షన్ సైకో కిల్లర్, సీరియల్ కిల్లర్ తరహా రోల్స్ చేయాలని ఉంది. 'భగవంతుడు' సినిమాలో విలేజ్ గాళ్‌గా చేస్తున్నాను. 'మత్తు వదలరా 3' ఉంది. సందీప్ కిషన్ మూవీలో ఓ రోల్ చేస్తున్నాను. 'గాయపడ్డ సింహం' చిత్రంలో కీ రోల్ చేస్తున్నాను. నాకు దర్శకత్వం వహించాలని ఉంది. కొన్ని కథలు రాస్తున్నాను'' అన్నారు.

ఈ సినిమా ఓ కాలేజీ

– సంగీత దర్శకుడు తమన్.ఎస్

హీరో బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన తాజా సినిమా 'అఖండ 2: తాండవం'. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలైంది. ఈ చిత్ర సంగీతదర్శకుడు తమన్ మాట్లాడుతూ– ''అఖండ 2: తాండవం' కథ విన్నప్పుడే కథలో హై మూమెంట్స్ ఉన్నాయనుకున్నాం. కమర్షియల్ పంథాలో సనాతన ధర్మాన్ని కరెక్ట్‌గా ఆడియన్స్‌కు చూపించడం, అదీ బాలకృష్ణగారిలాంటి స్టార్‌తో చేయడం చిన్న విషయం కాదు. ఈ సినిమాకి మ్యూజిక్ ఇవ్వడం సవాలుగా అనిపించింది. ఆడియన్స్‌ను ఎలా 'అఖండ 2' ట్రాన్స్‌లోకి తీసుకువెళ్లాలని ఆలోచించి, చాలా హార్డ్‌వర్క్ చేసి ఈ సినిమాకు మ్యూజిక్ కంపోజ్ చేశాం. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చేయడానికి 73 రోజులు పట్టింది. శివుని, హనుమంతుని మంత్రాలను ఎలా చేయాలని ఆలోచిస్తూ, 20 రోజులు కసరత్తు చేశాం. కల్యాణ్ చక్రవర్తి, కాసర్ల శ్యామ్, శర్మగార్లు... ఇలా లిరిక్ రైటర్లు కూడా సంస్కృతంలో చాలా ఉన్నతమైన లిరిక్స్ రాశారు. 'అఖండ' సినిమాకు సంగీతం ఇవ్వడం స్కూల్‌కి వెళ్లినట్లు ఉంటే, 'అఖండ 2: తాండవం' చిత్రానికి కాలేజీకి వెళ్లడం అనే ఫీలింగ్ కలిగింది. 'గేమ్ చేంజర్, డాకు మహారాజ్, అఖండ, ఓజీ'... ఇలా ఈ ఏడాది గ్రాండ్‌గా ముగిస్తున్నాను. వచ్చే ఏడాది ప్రారంభంలోనే 'ది రాజాసాబ్' ఉంది. ఇక బాలకృష్ణగారి 111వ సినిమాకూ నేనే మ్యూజిక్ అందిస్తున్నాను'' అని పేర్కొన్నారు.

పాత బస్తీలో థ్రిల్

● సూర్య శ్రీనివాస్, సంజీవ్ కుమార్

సూర్య శ్రీనివాస్, సంజీవ్ కుమార్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'జమానా'. భాస్కర్ జక్కులని దర్శకుడిగా పరిచయం చేస్తూ తేజస్వి అడప, బొద్దుల లక్ష్మణ్, శివకాంత్, శశికాంత్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో భాస్కర్ జక్కుల మాట్లాడుతూ– ''మంచి థ్రిల్లర్ సబ్జెక్ట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నాం. ఊహించని మలుపులతో ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు. శివకాంత్ మాట్లాడుతూ– ''హైదరాబాద్ పాతబస్తీ నేపథ్యంలో క్రైమ్, థ్రిల్లర్‌గా గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో దర్శకుడు ఈ సినిమాని అద్భుతంగా రూపొందిస్తున్నారు. జనవరి 30న సినిమాని విడుదల చేయనున్నాం'' అన్నారు.

మగధీరలా చాంపియన్ పెద్ద హిట్ కావాలి

– రామ్‌చరణ్

● నాగ్ అశ్విన్, ప్రదీప్ అద్వైతం, స్వప్న దత్, అనస్వర, రామ్ చరణ్, రోషన్, అశ్వినీదత్, ప్రియాంకా దత్, శ్రీకాంత్

''చాంపియన్' సినిమా కోసం మూడున్నరేళ్లు పట్టిందని రోషన్ చెప్పాడు. మేము కూడా కొన్ని సినిమాలకు మూడు, నాలుగైదేళ్లు ఉన్నాం. అయితే ఎన్ని రోజులు తీశాం అన్నది కాదు. 'చాంపియన్' ట్రైలర్ చూస్తుంటే సినిమా అద్భుతంగా వచ్చిందని తెలుస్తోంది. నా సెకండ్ ఫిల్మ్ 'మగధీర' ఎంత పెద్ద హిట్ అయిందో... రోషన్‌కి 'చాంపియన్' అంత పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా'' అని హీరో రామ్‌చరణ్ చెప్పారు. రోషన్, అనస్వరా రాజన్ జోడీగా నటించిన చిత్రం 'చాంపియన్'. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించారు. సి. అశ్వినీదత్, జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ బ్యానర్స్‌పై ప్రియాంక దత్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. గురువారం జరిగిన 'చాంపియన్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామ్‌చరణ్ మాట్లాడుతూ– ''ఎన్టీఆర్‌కి మొదటి సినిమా 'స్టూడెంట్ నెంబర్ 1', అల్లు అర్జున్‌కి తొలి చిత్రం 'గంగోత్రి', మహేశ్‌బాబుకి 'రాజకుమారుడు', నాకు 'చిరుత'... ఇలా మాకు ముఖ్యమైన వ్యక్తి అశ్వినీదత్‌గారు. మేం కెరీర్ మొదలు పెట్టినప్పుడు అందరి నిర్మాతలకంటే ముందు ధైర్యంగా వచ్చి... అఫ్‌కోర్స్... మా వెనక ఫ్యామిలీ ఉండొచ్చు కానీ, మేం ఎలా యాక్ట్ చేస్తామో తెలీదు, మమ్మల్ని ఎలా యాక్సెప్ట్ చేస్తారో తెలియని టైమ్‌లో వచ్చి, నటుడిగా పరిచయం చేసి మరచిపోలేని జర్నీ ఇచ్చిన దత్ గారికి, ఆయన ఫ్యామిలీకి థ్యాంక్స్. ఇప్పుడు రోషన్ కూడా 'చాంపియన్'తో వస్తున్నాడు. తను హాలీవుడ్ హీరోలా, యూరోపియన్ యాక్షన్ హీరోలా ఉన్నాడు... అందంగా ఉన్నాడు. 'చాంపియన్' చిత్ర నిర్మాతలు స్వప్న, ప్రియాంక ఇంత ప్యాషనేట్‌గా, హార్డ్ వర్క్‌తో పని చేస్తుండటం ఆశ్చర్యంగా లేదు. ఎందుకంటే దత్‌గారి ఫ్యామిలీ నుంచి వచ్చారు కాబట్టి. నాగ్ అశ్విన్‌గారితో ఇండియాస్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ ('కల్కి 2898 ఏడీ') మూవీ ఇచ్చారు. అవకాశం ఉంటే స్వప్న సినిమాస్‌లో ఓ సినిమా చేద్దామనుకుంటున్నాను. ఇంత ప్యాషనేట్ పీపుల్స్‌తో పని చేస్తే సరదాగా షూటింగ్‌కి వెళ్లి వచ్చేయొచ్చు. ఇక 'చాంపియన్'కి ప్రదీప్ అద్వైతంగారి కష్టం కనిపిస్తోంది. రోషన్ పరిణతి ఉన్న నటుడిలా నటించాడంటే తనని పాత్ర కోసం చాలా బాగా తీర్చిదిద్దారు. అనస్వర మలయాళీ అయినా తెలుగు నేర్చుకుని, డబ్బింగ్ చెప్పడం చూసి ఇంప్రెస్ అయ్యాను. అన్ని విభాగాల వాళ్లు ఎంతో కష్టపడి పని చేశారు. ఈ సినిమాని ఈ నెల 25న చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అని తెలిపారు.

ఈ సినిమా తప్పక చూడండి

– బుచ్చిబాబు

● ఫణి ప్రదీప్, బుచ్చిబాబు

అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, మొయిన్, రోహన్ సూర్య ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్ లైన్. ఫణి ప్రదీప్ ధూళిపూడి (మున్నా) దర్శకత్వంలో శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మించిన ఈ నెల 25న విడుదల కానుంది. ఈ మూవీ టీజర్‌ని దర్శకుడు బుచ్చిబాబు సానా విడుదల చేసి, మాట్లాడుతూ– ''సుకుమార్‌గారి దగ్గర నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేస్తున్నప్పుడు మున్నా కూడా సుకుమార్ గారి దగ్గరకు వచ్చేవాడు. తను డైరెక్టర్ అయిపోతున్నాడని, నేను కూడా అవ్వాలి అనుకునేవాడిని. మున్నా తెరకెక్కించిన 'బ్యాడ్ గాళ్స్'ని తప్పక చూడండి'' అని కోరారు.

కాపీ కొట్టను

– శ్రీ చరణ్ పాకాల

''శంబాల'లో చాలా థీమ్స్ ఉంటాయి. డైరెక్టర్ యుగంధర్‌కి సౌండింగ్ మీద మంచి పరిజ్ఞానం ఉంది. నేను ఎన్నో థ్రిల్లర్ సినిమాలకు పని చేశాను. కానీ 'శంబాల' లాంటి సైంటిఫిక్, మైథలాజికల్ థ్రిల్లర్‌కు పని చేయడం కొత్తగా ఉంది'' అని సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల చెప్పారు. ఆది సాయికుమార్, అర్చనా అయ్యర్ జోడీగా నటించిన చిత్రం 'శంబాల'. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సినిమాకి సంగీతం అందించిన శ్రీ చరణ్ పాకాల మాట్లాడుతూ– ''నేను చిన్నప్పటి నుంచి మన మైథలాజికల్ స్టోరీస్ వింటూ పెరిగాను. ఆ జానర్‌లో రూపొందిన 'శంబాల'కి మ్యూజిక్ ఇవ్వడం ఆనందంగా ఉంది. ఈ కథలో భాగంగా వచ్చే నాలుగు పాటలు అద్భుతంగా ఉంటాయి. నేను ప్రతీ సినిమాకు ఒకేలా కష్టపడతాను. ఎంత టైమ్ అయినా తీసుకుంటాను కానీ, కాపీ మాత్రం కొట్టను. ఒకవేళ స్ఫూర్తిగా తీసుకున్నా అందులో నా శైలి ఉండేలా చూసుకుంటాను'' అని చెప్పారు.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
78	3
84,482	25,816

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,057	▲	364
డోజోన్స్	48,122	▲	236
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,841	▲	67
డాక్స్	24,276	▲	315
షాంఘై	3,876	▲	6
నికాయ్	49,002	▽	511

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	88.73	91.16
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	118.43	122.21
€	యూరో	థామస్‌కుక్	103.97	107.34
¥	జపాన్ యెన్ (100)	థామస్‌కుక్	47.00	59.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	57.61	61.74
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.87	71.02
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.21	24.70
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.72	24.92
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.14	13.58

స్లో అయినా తగ్గని ఫ్లో

టెక్ స్టార్టప్‌లకు పెట్టుబడుల జోష్

- 2025లో 10.5 బిలియన్ డాలర్లు
- ప్రపంచవ్యాప్తంగా టాప్–3లో భారత్

దేశీయంగా వెల్లువెత్తుతున్న స్టార్టప్‌లు ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించడంలోనూ ముందున్నాయి! ఈ బాటలో మహిళలు తెరతీస్తున్న స్టార్టప్‌లు సైతం గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలను ఆకర్షిస్తున్నాయి. వివరాలు చూద్దాం..

న్యూఢిల్లీ: దేశీయంగా టెక్ స్టార్టప్‌లకు ప్రస్తుత కేలండర్ ఏడాది(2025) 10.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు లభించాయి. గతేడాది(2024) అందుకున్న 12.7 బిలియన్ డాలర్లతో పోలిస్తే 17 శాతం తగ్గాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా చూస్తే యూఎస్, యూకే తదుపరి భారత్ మూడో ర్యాంకులో నిలవడం గమనార్హం! ఈ బాటలో చైనా, జర్మనీ కంటే ముందు నిలవడం విశేషం! మార్కెట్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ట్రాక్షన్ నివేదిక వివరాలివి. వీటి ప్రకారం స్టార్టప్‌ల ఫండింగ్‌లో దేశీయంగా బెంగళూరు, ముంబై టాప్ ర్యాంకును కొల్లగొట్టాయి. కాగా.. దేశీ టెక్ స్టార్టప్‌లు 2023లో 11 బిలియన్ డాలర్లు సమీకరించాయి. వీటితో పోలిస్తే తాజాగా నిధుల సమీకరణ 4 శాతం క్షీణించింది.

దశలవారీగా విభిన్నం

టెక్ స్టార్టప్‌లలో పెట్టుబడులు వివిధ దశలలో విభిన్నంగా నమోదయ్యాయి. ఈ ఏడాది సీడ్ దశలో 1.1 బిలియన్ డాలర్లు లభించగా.. 2024తో పోలిస్తే 30 శాతం నీరసించాయి. 2023తో చూసినా ఇది 25 శాతం క్షీణత. ఇక తొలి దశ ఫండింగ్ 7 శాతం పుంజుకుని 3.9 బిలియన్ డాలర్లను తాకింది. 2024లో ఇది 3.7 బిలియన్ డాలర్లుకాగా.. 2023లో సాధించిన 3.5 బిలియన్ డాలర్లతో పోలిస్తే 11 శాతం అధికం. వృద్ధికి సిద్ధంగా ఉన్న, బలపడే వీలున్న టెక్ స్టార్టప్‌ల పట్ల గ్లోబల్ ఇన్వెస్టర్లలోగల విశ్వాసాన్ని తాజా ట్రెండ్ ప్రతిబింబిస్తోంది. అయితే చివరిదశ స్టార్టప్‌లు పెట్టుబడులను ఆకట్టుకోవడంలో వెనకడుగు వేశాయి. 2024లో 7.5 బిలియన్ డాలర్లు సమకూర్చుకోగా.. ప్రస్తుత ఏడాది 26 శాతం తక్కువగా 5.5 బిలియన్ డాలర్లు మాత్రమే లభించాయి.

క్రమశిక్షణాయుతంగా

దేశీ టెక్ స్టార్టప్‌లలో క్రమశిక్షణాయుత పెట్టుబడులు నమోదవుతున్నట్లు ట్రాక్షన్ సహవ్యవస్థాపకుడు నేహా సింగ్ పేర్కొన్నారు. తొలి దశ ఫండింగ్‌లో పెట్టుబడులు కొనసాగుతుండటం, ఐపీవో యాక్టివిటీ పుంజుకోవడం, యూనికార్న్‌ల ఆవిర్భావంలో నిలకడ వంటి అంశాలు బలపడిన ఎకోసిస్టమ్‌ను ప్రతిబింబిస్తున్నట్లు తెలియజేశారు. దీంతో వృద్ధికి వీలున్న, అత్యంత నాణ్యమైన బిజినెస్‌లకు ప్రాధాన్యత పెరుగుతున్నట్లు తెలియజేశారు. వెరసి ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్, రిటైల్, ఫిన్‌టెక్ సంస్థల పట్ల ఆసక్తి కనిపిస్తున్నట్లు వివరించారు.

2025లో స్టార్టప్‌ల ఫండింగ్ తీరు

ప్రధాన రంగం	పెట్టుబడులు(డాలర్లలో)
ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్	260 కోట్లు
రిటైల్	240 కోట్లు
ఫిన్‌టెక్	220 కోట్లు

భారీ డీల్స్..

ఈ ఏడాది దేశీయంగా 10 కోట్ల డాలర్లకుపైబడిన 14 పెట్టుబడి రౌండ్లు నమోదయ్యాయి. 2024లో ఇవి 19కాగా.. 2023లో ఈ తరహా 16 డీల్స్ నమోదయ్యాయి. ప్రధానంగా ట్రాన్స్‌పోర్టేషన్, లాజిస్టిక్స్ టెక్, ఎన్విరాన్‌మెంట్ టెక్, ఆటో టెక్ రంగాలలో భారీ డీల్స్ నమోదవుతున్నాయి. వీటిలో బిలియన్ డాలర్ల ఎరిషా ఈ మొబిలిటీ డీ రౌండ్, 30 కోట్ల డాలర్ల జెప్టో సిరీస్ హెచ్ రౌండ్, 27.5 కోట్ల డాలర్ల గ్రీన్‌లైన్ సిరీస్ ఏ ఫండింగ్‌ను చెప్పుకోదగ్గ డీల్స్‌గా నివేదిక ప్రస్తావించింది. ఆయా సంస్థల మెచ్యూరిటీ, విలువ, భిన్న లక్ష్యాల ఆధారంగా స్టార్టప్‌ల ఫండింగ్‌లో ఏ, డీ, హెచ్ తదితర రౌండ్ల(సిరీస్‌లు)కు తెరతీసే సంగతి తెలిసిందే.

మహిళా సంస్థలు

దేశీయంగా మహిళలు సహ వ్యవస్థాపకులుగా ఆవిర్భవించిన టెక్ స్టార్టప్‌లు ఈ ఏడాది బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకట్టుకున్నాయి. వీటిలో 6.2 కోట్ల డాలర్ల జివా సిరీస్ సి, 5.2 కోట్ల డాలర్ల ఆమ్నెక్స్ సిరీస్ ఏలను నివేదిక పేర్కొంది. రిటైల్, ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్ అత్యధికంగా నిధులు అందుకున్న రంగాలుకాగా.. ఇందుకు బ్రాండ్ ఆధారిత ఎగ్జిక్యూషన్, పటిష్ట కన్జూమర్ డిమాండ్, ఎంటర్‌ప్రైజ్ నిర్వహణ ప్రభావం చూపాయి. మహిళలు తెరతీసిన స్టార్టప్‌లలో బెంగళూరు, ముంబై, ఢిల్లీ ముందున్నాయి.

నిస్సాన్ గ్రావైట్ వచ్చేస్తోంది...

న్యూఢిల్లీ: జపాన్ ఆటోమొబైల్ దిగ్గజం నిస్సాన్ తమ సరికొత్త మల్టీపర్పస్ వాహనం (ఎంపీవీ) గ్రావైట్‌ని ఆవిష్కరించింది. దీన్ని వచ్చే ఏడాది తొలి నాళ్లలో ప్రవేశపెట్టనున్నట్లు సంస్థ తెలిపింది. వచ్చే 14–16 నెలల్లో మొత్తం మీద మూడు కొత్త మోడల్స్‌ను అందుబాటులోకి తేనున్నట్లు నిస్సాన్ ఎమియో (ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్, ఇండియా, యూరప్, ఓషియానియా) చైర్‌పర్సన్ మాసిమిలియానో మెసినా తెలిపారు. 2026 మధ్య నాటికి మధ్య స్థాయి ఎస్‌యూవీ టెక్టాన్‌ను, 2027 తొలి నాళ్లలో సెవెన్ సీటర్ ఎస్‌యూవీని ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. 2027 ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి సేల్స్ నెట్‌వర్క్‌ను 250 ఔట్‌లెట్స్‌కి పెంచుకోనున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం వీటి సంఖ్య 155గా ఉంది. తమ వ్యాపార వ్యూహాల్లో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని మెసినా చెప్పారు. దేశీయంగా కస్టమర్ల వైవిధ్యమైన అవసరాలకు అనుగుణంగా ఉండేలా గ్రావైట్‌ని తీర్చిదిద్దినట్లు నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరభ్ వత్స చెప్పారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

భారత్‌లో చాట్‌జీపీటీ, పర్‌ప్లెక్సిటీ జోరు	వెండి మరో కొత్త రికార్డు

ఆర్‌బీఐ జోక్యంతో కోలుకున్న రూపాయి!

- డాలర్‌తో 12 పైసలు పటిష్టం
- 90.26 స్థాయికి రికవరీ

న్యూఢిల్లీ: డాలర్‌తో రూపాయి కాస్త బలపడింది. ఫారెక్స్ మార్కెట్లో గురువారం డాలర్‌తో 12 పైసలు పుంజుకుని 90.26కు కోలుకుంది. ఆర్‌బీఐ జోక్యంతో కుదుటపడింది. బ్రెంట్ క్రూడాయిల్ ధర దిగిరావడమూ కలిసొచ్చింది. ఫారెక్స్ మార్కెట్లో 90.35 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 34 పైసలు పుంజుకుని 90.04 వరకు కోలుకుంది. చివరికి 12 పైసల లాభానికి పరిమితమైంది.

రూపాయిపై ఆందోళన లేదు

రూపాయి గురించి తనకు ఎలాంటి ఆందోళన లేదని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ తెలిపారు. చైనా, జపాన్ సైతం అధిక వృద్ధి దశలో కరెన్సీ బలహీనతను ఎదుర్కొన్నట్టు చెప్పారు. రూపాయి బలహీనతను, ఆర్థిక ఆందోళనతో ముడిపెట్టరాదన్నారు. 1990ల నుంచీ రూపాయి తన వాస్తవ విలువకు అనుగుణంగా చలించేందుకే అనుమతించినట్టు.. అధిక ఆటుపోట్లను తగ్గించే క్రమంలోనే ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటుందని చెప్పారు.

కైనెటిక్ టెక్నాలజీస్‌లో సైయెంట్ సెమీకండక్టర్స్‌కి మెజారిటీ వాటాలు

రూ. 840 కోట్ల డీల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పవర్ మేనేజ్‌మెంట్ సంస్థ కైనెటిక్ టెక్నాలజీస్‌లో మెజారిటీ వాటాలు కొనుగోలు చేయనున్నట్లు సైయెంట్ సెమీకండక్టర్స్ వెల్లడించింది. ఇందుకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఈ డీల్ విలువ 93 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 840 కోట్లు). 40 బిలియన్ డాలర్ల పైగా విలువ చేసే పవర్ సెమీకండక్టర్ల మార్కెట్లో స్థానం పటిష్టం చేసుకునేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని సీఈవో సుమన్ నారాయణ్ తెలిపారు. అలాగే డేటా సెంటర్లు, ఎలక్ట్రిఫికేషన్, ఆటోమోటివ్, నెట్‌వర్కింగ్ తదితర విభాగాల్లో విస్తరించేందుకు తోడ్పడనుందన్నారు.

నాలుగోరోజూ నష్టాల్లోనే

సెన్సెక్స్ 78; నిఫ్టీ 3 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ నాలుగో రోజూ నష్టపోయింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాలు, అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న సందిగ్ధతలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 78 పాయింట్లు నష్టపోయి 84,482 వద్ద స్థిరపడింది. నిఫ్టీ మూడు పాయింట్లు కోల్పోయి 25,816 వద్ద సెన్సెక్స్ 542 పాయింట్ల పరిధిలో 84,238 వద్ద కనిష్టాన్ని, 84,780 గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 25,726 – 25,902 శ్రేణిలో ట్రేడైంది. ఇంధన, ఆటో, ఫార్మా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఐటీ, ఫైనాన్సియల్స్, మెటల్ షేర్లు రాణించాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను నిర్ణయించే అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాల వెల్లడికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

ఐడీఆర్‌బీటీలో ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా గురువారం ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ (ఐడీఆర్‌బీటీ)ని సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంక్‌డాట్‌ఇన్ డొమైన్‌కి బ్యాంకుల మైగ్రేషన్, బ్యాంకింగ్‌కి పొంచి ఉన్న రిస్కులను గుర్తించేందుకు ఉద్దేశించిన సచేత్ ప్లాట్‌ఫాంలో ఏఐ వినియోగం తదితర అంశాల గురించి ఐడీఆర్‌బీటీ అధికారులు ఆయనకు వివరించారు. బ్యాంకింగ్ రంగం కోసం ఐటీ మౌలిక సదుపాయాలను రూపొందించడంలో సంస్థ కీలక పాత్ర పోషిస్తుండటాన్ని మల్హోత్రా ప్రశంసించారు. టెక్నాలజీ, బ్యాంకింగ్‌కి అనుగుణంగా పరిశ్రమ అవసరాలకు తగ్గ సొల్యూషన్స్‌ని రూపొందించడంపై దృష్టి పెట్టాలన్నారు. డిజిటల్ బ్యాంకింగ్‌పై ప్రజల్లో నమ్మకం కలిగించేలా వ్యూహాన్ని తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.

సాక్షి స్పోర్ట్స్

సాత్విక్–చిరాగ్ జోడీకి రెండో విజయం

హాంగ్జౌ: వరల్డ్ టూర్ ఫైనల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ వరుసగా రెండో విజయం నమోదు చేసింది. గురువారం జరిగిన గ్రూప్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–11, 16–21, 21–11తో ఫజర్ అల్ఫియాన్–షొహిబుల్ ఫిక్రి (ఇండోనేసియా) జంటను ఓడించింది. గంటపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌ను అలవోకగా నెగ్గిన భారత జోడీ రెండో గేమ్‌లో తడబడింది. నిర్ణాయక మూడో గేమ్‌లో మళ్లీ లయలోకి వచ్చి విజయాన్ని ఖాయం చేసుకుంది. మరో మ్యాచ్‌లో లియాంగ్ వె కెంగ్–వాంగ్ చాంగ్ (చైనా) జంట 21–14, 21–18తో ఆరోన్ చియా–సో వుయ్ యిక్ (మలేసియా) జోడీపై గెలిచింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో ఆరోన్ చియా–సో వుయ్ యిక్‌లతో సాత్విక్–చిరాగ్; లియాంగ్–వాంగ్ చాంగ్ (చైనా)లతో అల్ఫియాన్–ఫిక్రి తలపడతారు.

పురుషుల రికర్వ్ టీమ్ విజేతలతో జయేశ్ రంజన్ తదితరులు

ధీరజ్‌కు రెండు పతకాలు

రికర్వ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణం, టీమ్ విభాగంలో రజతం గెలిచిన ఆంధ్రప్రదేశ్ ఆర్చర్

సాక్షి, హైదరాబాద్: ఎన్‌టీపీసీ జాతీయ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్ఎస్‌సీబీ)కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ రెండు పతకాలతో మెరిశాడు. రికర్వ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం సాధించిన ధీరజ్... టీమ్ విభాగంలో రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం ముగిసిన ఈ పోటీల్లో పురుషుల రికర్వ్ వ్యక్తిగత ఫైనల్లో ధీరజ్ 6–0తో పార్థ్ సుశాంత్ సాలుంకే (మహారాష్ట్ర)పై గెలిచి జాతీయ చాంపియన్‌గా అవతరించాడు. టీమ్ విభాగంలో ధీరజ్, రాహుల్, సుఖ్‌చెయిన్ సింగ్‌లతో కూడిన సర్వీసెస్ జట్టు ఫైనల్లో అభ్యుదయ్, పార్థ్ సాలుంకే, సాహిల్‌లతో కూడిన మహారాష్ట్ర జట్టు చేతిలో ఓడిపోయింది. గౌరవ్, యశ్‌దీప్, పవన్‌లతో కూడిన రైల్వేస్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఆర్ఎస్‌పీబీ) జట్టుకు కాంస్య పతకం దక్కింది. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ) అధ్యక్షుడు అర్జున్ ముండా ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ నిర్వహణ కోసం భారత్ బిడ్ దాఖలు చేస్తుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ మాట్లాడుతూ తెలంగాణలో జాతీయ, అంతర్జాతీయ టోర్నీలు నిర్వహించేందుకు ముందుకొచ్చే క్రీడా సంఘాలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్చరీ సంఘం అధ్యక్షుడు టి.రాజు, జనరల్ సెక్రటరీ అరవింద్, ఆర్చరీ డెవలప్‌మెంట్ సభ్యుడు పుట్టా శంకరయ్య, హైదరాబాద్ ఆర్చరీ సంఘానికి చెందిన అశ్విన్ రావు, బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ గుస్తీ నోరియా, కమిటీ సభ్యుడు మర్రి ఆదిత్య రెడ్డి పాల్గొన్నారు.

షూటింగ్ లీగ్‌లో మరో ఫ్రాంచైజీ

వచ్చే ఫిబ్రవరిలో తొలి సీజన్

న్యూఢిల్లీ: విశ్వవ్యాప్త ఆదరణ చూరగొన్న ఐపీఎల్‌ను చూసి ఎన్నో లీగ్‌లు పుట్టుకొస్తున్నాయి. కొన్నేమో కొనసాగుతున్నాయి. మరెన్నో లీగ్‌లు మూతబడుతున్నాయి. ఇలాంటి విషయాలతో ప్రమేయం లేకుండా వచ్చే ఏడాది కొత్తగా షూటింగ్ లీగ్ మొదలవుతోంది. షూటింగ్ లీగ్ ఆఫ్ ఇండియా (ఎస్ఎల్ఐ) పేరుతో ఫిబ్రవరి 16 నుంచి 26 వరకు తొలి సీజన్ పోటీలు నిర్వహించేందుకు భారత జాతీయ షూటింగ్ సంఘం (ఎన్ఆర్ఏఐ) ఏర్పాట్లు చేస్తోంది. అయితే తాజాగా మూడో ఫ్రాంచైజీ యూపీ ప్రామెథియన్స్ బరిలోకి దిగనున్నట్లు ఎన్ఆర్ఏఐ అధ్యక్షుడు కాళికేశ్ సింగ్ దేవ్ తెలిపారు. ఇప్పటికే ఢిల్లీ నైట్ వారియర్స్, ముంబై ఎక్స్ క్యాలిబర్స్‌లు ఉన్నాయి. ఈ మూడు జట్ల తరపున భారత స్టార్ షూటర్లతో పాటు అంతర్జాతీయ మేటి షూటర్లు ఇందులో పాల్గొంటారని ఆయన చెప్పారు. పిస్టల్, రైఫిల్, షాట్‌గన్ కేటగిరీల్లో టీమ్ ఈవెంట్లుగా పోటీలను నిర్వహిస్తారు. మొదట లీగ్ దశ, తర్వాత నాకౌట్ దశ పోటీలు జరుగుతాయి. ఆటగాళ్లను నాలుగు కేటగిరీలుగా విభజించారు. ఎలైట్ చాంపియన్స్, వరల్డ్ ఎలైట్, జాతీయ చాంపియన్స్, జూనియర్–యూత్ విభాగాల్లో షూటర్లు ఆయా ఫ్రాంచైజీల తరపున బరిలోకి దిగుతారు.

సమమా... సొంతమా!

నేడు భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఆఖరి టి20 మ్యాచ్

- టీమిండియా గెలిస్తే సిరీస్ హస్తగతం
- సఫారీ జట్టు నెగ్గితే సిరీస్ సమం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



అహ్మదాబాద్: సిరీస్ సాధించడమే లక్ష్యంగా భారత జట్టు శుక్రవారం దక్షిణాఫ్రికాతో చివరి టి20 మ్యాచ్ బరిలోకి దిగనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా టీమిండియా రెండు విజయాలు సాధించగా... దక్షిణాఫ్రికా ఒక మ్యాచ్ నెగ్గింది. మరో మ్యాచ్ పొగమంచు కారణంగా రద్దు అయింది. దీంతో ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత్ 2–1తో ముందంజలో ఉంది. చివరి మ్యాచ్‌లో నెగ్గి సిరీస్ సొంతం చేసుకోవాలని టీమిండియా భావిస్తుండగా... సుదీర్ఘ పర్యటనను విజయంతో ముగించి సిరీస్‌ను సమం చేయాలని సఫారీలు చూస్తున్నారు. ఈ టూర్‌లో భాగంగా దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్ నెగ్గగా... టీమిండియా వన్డే సిరీస్ సొంతం చేసుకుంది. ఇప్పుడిక టి20 విజేతను తేల్చే మ్యాచ్‌కు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం సిద్ధమైంది. గాయం కారణంగా గత మ్యాచ్‌కు దూరమైన భారత వైస్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్... జట్టుతో పాటు అహ్మదాబాద్ చేరుకున్నాడు. దీంతో తుది జట్టులో సామ్సన్‌కు చోటు దక్కుతుందా లేక గిల్‌ను కొనసాగిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు సఫారీ జట్టు సిరీస్ సమం చేసి సగర్వంగా స్వదేశానికి తిరిగి వెళ్లాలని చూస్తోంది. అహ్మదాబాద్ పిచ్ అటు బ్యాటింగ్‌కు, ఇటు బౌలింగ్‌కు సమానంగా సహకరించనున్న నేపథ్యంలో హోరాహోరీ పోరు ఖాయమే!

సూర్యకుమార్ సత్తా చాటేనా!

స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోతున్న భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై ఒత్తిడి అధికంగా ఉంది. ఈ ఏడాది ఆడిన 18 ఇన్నింగ్స్‌ల్లో సూర్యకుమార్ 14.20 సగటుతో 213 పరుగులు మాత్రమే చేశాడు. అతడు తనకు అలవాటైన మూడో స్థానంలో బరిలోకి దిగి భారీ ఇన్నింగ్స్‌తో అనుమానాలను పటాపంచలు చేయాలని అభిమానులు ఆశిస్తున్నారు. వచ్చే ఏడాది ఆరంభంలో జరగనున్న టి20 వరల్డ్‌కప్‌నకు ముందు టీమిండియా మరో ఆరు మ్యాచ్‌లు మాత్రమే ఆడనున్న నేపథ్యంలో... అటు ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు ఇటు సిరీస్ చేజిక్కించుకోవాలని టీమ్ మేనేజ్‌మెంట్ వ్యూహాలు రచిస్తోంది. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ మంచి ఆరంభాలను భారీ ఇన్నింగ్స్‌లుగా మలచడంలో విఫలమవుతున్నాడు. అతడు కాసేపు క్రీజులో నిలిస్తే చాలు ప్రత్యర్థి బౌలర్ల గణాంకాలు తారుమారు కావడం ఖాయమే. ఇక మరో ఓపెనర్‌గా గిల్, సామ్సన్‌లో ఎవరికి అవకాశం దక్కుతుందో చూడాలి. హైదరాబాద్ ప్లేయర్ ఠాకూర్ తిలక్ వర్మ నిలకడ కొనసాగిస్తున్నా... బ్యాటింగ్‌లో మరింత వేగం పెంచాల్సిన అవసరముంది. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేశ్ శర్మ, హర్షిత్ రాణా భారీ షాట్లు ఆడగల సమర్థులే. అయితే వీరంతా కలిసి కట్టుగా రాణించాల్సిన అవసరముంది. బుమ్రా రాకతో బౌలింగ్ విభాగం పటిష్టమవగా... మరోసారి వరుణ్ చక్రవర్తి కీలకం కానున్నాడు.

మార్క్‌రమ్‌పై ఆశలు

టెస్టు సిరీస్ విజయంతో ఈ పర్యటనను ప్రారంభించిన దక్షిణాఫ్రికా జట్టు టి20 సిరీస్‌ను సమం చేయడంతో... ముగించాలని చూస్తోంది. బ్యాటింగ్‌లో నైపుణ్యానికి కొదవ లేకపోయినా... వారంతా సమష్టిగా రాణించలేకపోవడమే సఫారీ జట్టును ఇబ్బంది పెడుతోంది. ఓపెనర్ రీజా హెండ్రిక్స్ లయ దొరకబుచ్చుకోలేక ఇబ్బంది పడుతుంటే... మరో ఓపెనర్ డికాక్ నిలకడలేమితో సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలో డికాక్‌తో కలిసి మార్క్‌రమ్ ఇన్నింగ్స్‌ను ఆరంభించవచ్చు. భారత పిచ్‌లపై మంచి అవగాహన ఉన్న డికాక్, మార్క్‌రమ్ రాణిస్తే సఫారీ జట్టుకు తిరుగుండదు. బ్రెవిస్, మిల్లర్, ఫెరీరా, యాన్సెన్, కార్బిన్ బాష్ రూపంలో మిడిలార్డర్ పటిష్టంగా ఉంది. బౌలింగ్‌లో యాన్సెన్, ఎన్‌గిడి, బాష్, బార్ట్‌మన్ కీలకం కానున్నారు.

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, గిల్/సామ్సన్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, హర్షిత్ రాణా/వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి.

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), డికాక్, హెండ్రిక్స్, బ్రెవిస్, మిల్లర్, ఫెరీరా, యాన్సెన్, బాష్, లిండే/కేశవ్, ఎన్‌గిడి, బార్ట్‌మన్.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

జయహో జార్ఖండ్

- తొలిసారి ముస్తాక్ అలీ ట్రోఫీ కైవసం
- ఫైనల్లో హరియాణాపై ఘనవిజయం
- కెప్టెన్ ఇషాన్ కిషన్ సూపర్ సెంచరీ
- 49 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్స్‌లతో 101

పుణే: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన జార్ఖండ్ జట్టు... దేశవాళీ టి20 టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని తొలిసారి చేజిక్కించుకుంది. గురువారం జరిగిన ఫైనల్లో జార్ఖండ్ 69 పరుగుల తేడాతో హరియాణాను ఓడించింది. తద్వారా ముస్తాక్ అలీ టోర్నీ టైటిల్ గెలిచిన 12వ జట్టుగా జార్ఖండ్ నిలిచింది. మొదట జార్ఖండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 262 పరుగులు చేసింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (49 బంతుల్లో 101; 6 ఫోర్లు, 10 సిక్స్‌లు) ధనాధన్ సెంచరీతో చెలరేగగా... కుమార్ కుషాగ్ర (38 బంతుల్లో 81; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) దంచికొట్టాడు. ఆఖర్లో అనుకూల్ రాయ్ (20 బంతుల్లో 40 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాబిన్ మిన్జ్ (14 బంతుల్లో 31 నాటౌట్; 3 సిక్స్‌లు) విరుచుకుపడటంతో జార్ఖండ్ భారీ స్కోరు చేసింది. ఈ టోర్నీలో ఇషాన్ నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. 10 ఇన్నింగ్స్‌ల్లో కలిపి 197.32 స్ట్రయిక్‌రేట్‌తో 517 పరుగులు చేసి అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అందులో రెండు సెంచరీలు ఉన్నాయి. అనంతరం భారీ లక్ష్యఛేదనలో హరియాణా 18.3 ఓవర్లలో 193 పరుగులకే ఆలౌటైంది. యశ్‌వర్ధన్ దలాల్ (22 బంతుల్లో 53; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. వికాస్ సింగ్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు కోల్పోయిన హరియాణా ఆ తర్వాత కోలుకోలేకపోయింది. జార్ఖండ్ బౌలర్లలో సుశాంత్ మిశ్రా, బాలకృష్ణ చెరో 3 వికెట్లు పడగొట్టారు. ఇషాన్ కిషన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', అనుకూల్ రాయ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

ఏపీఎంఎస్ఐడీసీలో 'సైకో' ట్యాక్స్

- కీలక ప్రజాప్రతినిధికి కలెక్షన్ ఏజెన్సీగా మారిన ఏపీఎంఎస్ఐడీసీ
- ఆయన్ని ప్రసన్నం చేసుకుని వస్తేనే ఆర్డర్లు ఇస్తామంటున్న అధికారులు
- ప్రజాప్రతినిధి, అధికారుల ధనదాహంతో హడలెత్తిపోతున్న కాంట్రాక్టర్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రులకు నాణ్యమైన మందులు, సర్జికల్స్, వైద్య పరికరాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు సమకూర్చాల్సిన ఏపీ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ)ని ప్రభుత్వ పెద్దలు కలెక్షన్ ఏజెన్సీగా మార్చేశారు. వైద్యశాఖలో రూ.వేలకోట్ల విలువైన 108, 104 కాంట్రాక్ట్‌ను టైలర్ మేడ్ నిబంధనలతో అస్మదీయ సంస్థకు అడ్డదారుల్లో కట్టబెట్టేశారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్లు.. ఒక కీలక ప్రజాప్రతినిధి ఎంఎస్ఐడీసీపై వలవేశారు. టెండర్లలో పాల్గొనే సంస్థలు, వివిధ సరఫరాలు చేసే సంస్థలకు సైకో ట్యాక్స్ వేస్తున్నారు.

5-10 శాతం ఇవ్వాల్సిందే!

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాల శాఖలో పనిచేసిన ఓ అధికారి డిప్యుటేషన్‌పై ఎంఎస్ఐడీసీకి చేరుకున్నారు. ఆయన కీలక ప్రజాప్రతినిధికి ఏజెంట్‌గా పనిచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సాధారణంగా ఆస్పత్రులకు సరఫరా చేయాల్సిన మందులు, సర్జికల్స్, పరికరాల రేట్ కాంట్రాక్టులు ఉంటాయి. వైద్యశాఖలోని వివిధ విభాగాల నుంచి ఎంఎస్ఐడీసీకి ఇండెంట్ వస్తే కాంట్రాక్టు సంస్థలకు పర్చేజింగ్ ఆర్డర్ (పీవో) ఇస్తే సరఫరా చేసేస్తాయి. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ. ఇప్పుడు రేట్ కాంట్రాక్ట్‌లో ఉన్న పరికరాలకు పీవో ఇవ్వడానికి ముందు కాంట్రాక్టర్లు వెళ్లి సైకో ట్యాక్స్ కట్టేలా డీల్ చేసుకోవాలని సదరు అధికారి నిర్దేశిస్తున్నట్లు సమాచారం. లేదంటే ఇబ్బంది పడతారని హెచ్చరిస్తుండటంతో చేసేదేమీ లేక కాంట్రాక్టర్లు ప్రజాప్రతినిధికి సంబంధించిన ప్రైవేట్ వ్యక్తులను కలుస్తున్నారు. వారు ఏకంగా 5 నుంచి 10 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నారని తెలిసింది. నెల రోజుల కిందట సెకండరీ హెల్త్ పరిధిలోని ఆస్పత్రుల్లో గైనిక్, పీడియాట్రిక్స్, ఆప్తమాలజీ, మరికొన్ని విభాగాల్లో పలు పరికరాల సరఫరాకు ఎంఎస్ఐడీసీకి ఇండెంట్ వచ్చింది. ఈ వస్తువులన్నీ రేట్ కాంట్రాక్టులో ఉన్నాయి. వీటికి రూ.40 కోట్ల వరకు అవుతుందని ఎంఎస్ఐడీసీ ఎక్విప్‌మెంట్ విభాగం లెక్కించింది. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే పీవోలు ఇవ్వడానికి ముందే సైకో ట్యాక్స్ సంగతి తేల్చాలని కమీషన్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న అధికారి కాంట్రాక్టర్లకు చెప్పినట్టు తెలిసింది. దీంతో పలువురు కాంట్రాక్టర్లు ప్రజాప్రతినిధికి సంబంధించిన ప్రైవేట్ వ్యక్తులను కలిసి మూడు నుంచి ఐదుశాతం కమీషన్ ఇచ్చేలా డీల్ కుదుర్చుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీనికి అదనంగా మరికొంత కమీషన్ ఇవ్వాల్సిందేనన్న ఎంఎస్ఐడీసీ అధికారుల డిమాండ్‌కు కూడా కాంట్రాక్టర్లు అంగీకరించినట్టు తెలిసింది. అధికారులు, కీలక ప్రజాప్రతినిధి దోపిడీకి రంగం సిద్ధం చేసుకున్నాక, అనూహ్యంగా ఆర్థికశాఖ రూ.ఏడుకోట్లకు మాత్రమే బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్వో) ఇచ్చింది. దీంతో ప్రస్తుతానికి సరఫరా తాత్కాలికంగా వాయిదా వేసినట్టు వెల్లడైంది. ఆర్థిక శాఖ బీఆర్వో ఇస్తే.. పరికరాలు సరఫరా చేసి కమీషన్లు కీలక నేతకు చేరనున్నాయి. కొద్దినెలల కిందట నిర్వహించిన సెక్యూరిటీ, శానిటేషన్ కాంట్రాక్టుల్లోనూ ఆ కీలక ప్రజాప్రతినిధి ప్రైవేట్ సైన్యం అక్రమాలకు పాల్పడింది. వీరి డైరెక్షన్‌లోనే పక్క రాష్ట్రంలో టెర్మినేట్ అయిన సంస్థలకు ఎంఎస్ఐడీసీ అధికారులు శానిటేషన్ కాంట్రాక్టును కట్టబెట్టేశారు.

నన్ను పట్టించుకోండి..

ఒక నామినేటెడ్ పోస్ట్‌లో కొనసాగుతున్న రాజకీయ నాయకుడు కార్పొరేషన్‌లో అందినకాడికి దండుకోవాలని ప్రయత్నిస్తున్నారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని వారిద్వారా కాంట్రాక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులపై డబ్బు కోసం ఒత్తిడి తెస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. గతంలో నామినేటెడ్ పదవిలో కొనసాగిన వారెవరూ కార్పొరేషన్ సాధారణ కార్యకలాపాల్లో జోక్యం చేసుకునేవారు కాదు. ఇప్పుడు ఈయన మాత్రం ప్రతిదీ తనకు తెలిసే జరగాలని అధికారులు, సిబ్బందికి అల్టిమేటం ఇచ్చారు. ఇలా ఓ వైపు కీలక ప్రజాప్రతినిధి, మరోవైపు నామినేటెడ్ నేత, ఇంకోవైపు అధికారుల కమీషన్ల దాహానికి కాంట్రాక్టర్లు హడలెత్తిపోతున్నారు. అడిగినంత కమీషన్ ఇవ్వడానికి అంగీకరించని పలు మల్టీనేషనల్ కంపెనీలను సైతం అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నెలల తరబడి కార్పొరేషన్ చుట్టూ తిరుగుతున్నా బిల్లులు, పీవోలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.

క్లుప్తంగా...

పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల (ఎస్ఎస్‌సీ–2026) ఫీజు చెల్లింపు గడువును పొడిగించారు. రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన రూ.500 ఆలస్య రుసుంతో ఈనెల 19, 20 తేదీల్లో (నేడు, రేపు) విద్యార్థులు ఫీజును చెల్లించేందుకు అవకాశం కల్పించారు. వాస్తవానికి ఆలస్య రుసుంతో గడువు ఈనెల 15తోనే ముగిసింది. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు మరో రెండు రోజులు అవకాశం ఇచ్చినట్టు పరీక్షల డైరెక్టర్ కేవీ శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు. విద్యార్థుల ఫీజును https://bse.ap.gov. in వెబ్‌సైట్‌లో స్కూల్ లాగిన్ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు.

'సచివాలయ' ఉద్యోగుల బదిలీ గడువు పొడిగింపు

సాక్షి,అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల జీవిత భాగస్వామి ప్రాతిపదికన అంతర్ జిల్లాల బదిలీలను ఈ నెల 22 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులిచ్చింది. బదిలీల గడువు పొడిగించాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ కోరిన మేరకు ఈ గడువును పొడిగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

సాంకేతిక సమస్యతో నిలిచిన విమానం

- విమానంలో రాజకీయ ప్రముఖులు
- సర్వీసు రద్దుతో వెనుదిరిగిన ప్రయాణికులు

విమానాశ్రయం (గన్నవరం): విశాఖపట్నం వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం సాంకేతిక సమస్యతో గురువారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లో నిలిచిపోయింది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన బోయింగ్ 737 విమానం 175 మంది ప్రయాణికులతో గురువారం రాత్రి ఎనిమిది గంటలకు విశాఖపట్నం వెళ్లేందుకు సిద్ధమైంది. రన్ వేపై టేకాఫ్ అయ్యే సమయంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఒక్కసారిగా విమానం నిలిచిపోవడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. అనంతరం విమానాన్ని పైలెట్లు అప్రాన్‌లోకి వెనక్కి తీసుకొచ్చి ప్రయాణికులను టెర్మినల్‌లోకి తరలించారు. ఈ విమానంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు. అరగంట తర్వాత ఈ విమాన సర్వీసును రద్దు చేయడంతో ప్రయాణికులందరు వెనుదిరిగారు.

బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: 2025 – 26 విద్యా సంవత్సరానికి నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ కోర్సుల్లో రెండో విడత యాజమాన్య కోటా సీట్లను గురువారం ఆరోగ్య విశ్వవిద్యాలయం కేటాయించింది. విద్యార్థులు శనివారం మధ్యాహ్నం మూడు గంటల్లోపు కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

ఆన్‌లైన్‌లో టెట్ ప్రాథమిక కీ

సాక్షి, అమరావతి: ఏపీ టెట్ – 2025 (డిసెంబర్)లో భాగంగా ముగిసిన పరీక్షల ప్రాథమిక కీని విడుదల చేసినట్టు టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10, 11న పూర్తయిన పేపర్ – 2ఏ లాంగ్వేజెస్ పరీక్షలకు సంబంధించిన కీని https://tet2dsc.apcfss.in వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. అభ్యర్థులు తమ లాగిన్‌తో ప్రాథమిక కీపై అభ్యంతరాలను ఈ నెల 24 వరకు తెలియజేయవచ్చన్నారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే అభ్యంతరాలు స్వీకరించేది లేదన్నారు. టెట్ పరీక్షలు ఈ నెల 10న ప్రారంభం కాగా, 21తో పూర్తి కానున్నాయి.

అల్లుడితో కలిసి భర్తను చంపిన భార్య

కూతురు భర్తతో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని దారుణం

గుర్రప్ప మృతదేహం

నంద్యాల (అర్బన్): అల్లుడుతోనే వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ అల్లుడితోనే కలిసి తన భర్తను హత్య చేసింది. ఈ ఘటన గురువారం నంద్యాలలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన సుభద్ర, గుర్రప్ప(40) దంపతులు ఐదేళ్లుగా నంద్యాల శివారులోని నందమూరినగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు తువ్వపల్లె గ్రామానికి చెందిన లింగమయ్యతో మూడేళ్ల క్రితం వివాహం చేశారు. ఈ క్రమంలో సుభద్రకు అల్లుడైన లింగమయ్యతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలిసి భర్త గుర్రప్ప పలుమార్లు సుభద్రను హెచ్చరించాడు. అయినా ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదు. రోజూ ఇంట్లో గొడవ జరుగుతుండటంతో గుర్రప్పను హతమార్చాలని సుభద్ర కుట్ర పన్నింది. గురువారం ఇంట్లో పడుకుని ఉన్న గుర్రప్ప మెడకు సుభద్ర, లింగమయ్య తాడు బిగించి ఊపిరి ఆడకుండా చేసి చంపారు. గుర్రప్ప తల్లి సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు భార్య సుభద్రను అరెస్ట్ చేయగా, లింగమయ్య పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

పసి పిల్లలను విక్రయిస్తున్న ముఠా ఆటకట్టు

- 10 మంది అరెస్టు
- ఐదుగురు పిల్లలు, రూ.3.30 లక్షల నగదు స్వాధీనం
- ఢిల్లీ, ముంబైల నుంచి తరలించి పిల్లలు లేని వారికి ఇక్కడ విక్రయం

వివరాలు వెల్లడిస్తున్న సీపీ రాజశేఖరబాబు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఢిల్లీ, ముంబైల నుంచి పసి పిల్లలను తీసుకొచ్చి, పిల్లలులేని దంపతులకు విక్రయిస్తున్న ముఠాను విజయవాడ పోలీసులు అరెస్టుచేశారు. ఏకకాలంలో దాడులు నిర్వహించి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై నగరంలోని కొత్తపేట, భవానీపురం, నున్న పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదుచేశారు. నిందితుల నుంచి ఐదుగురు పసిపిల్లలతోపాటు, రూ.3.30 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు గురువారం మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. విజయవాడ సితార సెంటర్‌కు చెందిన బలగం సరోజిని సులభంగా డబ్బులు సంపాదించేందుకు పిల్లల్లేని వారికి అక్రమంగా పిల్లలను విక్రయించడాన్ని ఎంచుకుంది. ఈ క్రమంలో ఢిల్లీకి చెందిన కిరణ్‌శర్మ, ముంబైకి చెందిన కవిత, నూరి, సతీష్ ఆమెకు పరిచయమయ్యారు. వారు అక్కడి నుంచి పసిపిల్లలను తీసుకొచ్చి సరోజినికి ఇచ్చేవారు. ప్రతిఫలంగా వారికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు వరకూ సరోజిని ఇచ్చేది. ఇలా తీసుకొచ్చిన చిన్నారులను తిరిగి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు విక్రయించేది. వీరికి విజయవాడలో మరికొందరు కూడా జతకలిశారు. వీరంతా గతంలో అరెస్టయి జైలుకు వెళ్లొచ్చారు.

అమ్మకానికి సిద్ధంగా ఉండగా..

ఇక ఢిల్లీకి చెందిన కిరణ్‌శర్మ, భారతిల నుంచి ఇద్దరు పిల్లలను.. ముంబైకి చెందిన కవిత, నూరి, సతీష్‌ల నుంచి మరో ముగ్గురు పిల్లలను సరోజిని తీసుకొచ్చి అమ్మకానికి సిద్ధంగా ఉంచింది. అయితే, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబుకు ఈ విషయం తెలిసింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ కె. లతా కుమారి, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్‌ల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, భవానీపురం, నున్న ఇన్‌స్పెక్టర్లు ఏకకాలంలో దాడులు నిర్వహించి కుమ్మరిపాలెం సెంటర్ సమీపంలో ఐదుగురిని, నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉడా కాలనీలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నలుగురు పిల్లలను, రూ.3.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి విజయవాడలో వివిధ ప్రాంతాలకు చెందిన బలగం సరోజిని (31), గరికముక్కు విజయలక్ష్మి (41), వాడపల్లి బ్లెస్సీ, ఆముదాల మణి, షేక్ ఫరీనా, వంశీకిరణ్‌కుమార్, శంక యోహాన్, పతి శ్రీనివాసరావు, సత్తెనపల్లికి చెందిన షేక్ బాబావలి, తెలంగాణలోని ఘట్‌కేసర్‌కు చెందిన ముక్తిపేట నందిని.. మొత్తం పదిమందిని అరెస్టుచేసినట్లు సీపీ తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు కృష్ణకాంత్ పటేల్, కేజీవీ సరిత, ఏడీసీపీలు జి. రామకృష్ణ, ఏసీపీ కె. లతాకుమారి, ఎన్వీ దుర్గారావు, స్రవంతి రాయ్, పలువురు సీఐలు పాల్గొన్నారు.

నెల్లూరులో విద్యార్థిని ఆత్మహత్య

స్కూల్ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

లావణ్య (ఫైల్)

పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, దళిత నేతలు

నెల్లూరు (క్రైమ్): స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యమో.. సహచర విద్యార్థి వేధింపులో.. మరే ఇతర కారణమో తెలియదు గానీ పదో తరగతి చదువుతున్న ఓ బాలిక నెల్లూరు నగరంలోని ఫతేఖాన్‌పేటలో గురువారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, బాధితుల సమాచారం మేరకు... ఫతేఖాన్‌పేటలో నివసిస్తున్న తిరుపాల్, స్వాతి దంపతులకు నాగచైతన్య, లావణ్య (15) పిల్లలు. తండ్రి ఓ ఎలక్ట్రానిక్ షాప్‌లో సూపర్‌వైజర్‌గా, తల్లి ఓ షోరూంలో పనిచేస్తున్నారు. లావణ్య తన ఇంటి సమీపంలోని ప్రియాంక ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. మూడున్నర నెలల క్రితం అదే పాఠశాలలో చదువుతున్న సహచర విద్యార్థి ఇన్‌స్ట్రాగామ్‌లో ఓ మెసేజ్ చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్కూల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. అయినా వారు పట్టించుకోలేదు. ఈ క్రమంలో 15 రోజుల ముందు స్కూల్‌లో లావణ్య బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. ఘటనపై యాజమాన్యాన్ని కుటుంబ సభ్యులు ప్రశ్నించగా, దురుసుగా ప్రవర్తించడంతోపాటు సదరు బాలుడికి మద్దతుగా మాట్లాడారు. ఈ నేపథ్యంలో గురువారం పాఠశాలలో పరీక్ష రాసిన అనంతరం ఇంటికెళ్లిన బాలిక చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కళాశాల నుంచి ఇంటికొచ్చి గమనించిన సోదరుడు నాగచైతన్య విషయాన్ని తల్లిదండ్రులకు, బంధువులకు తెలియజేశాడు. చిన్నబజార్ పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. యాజమాన్యం నిర్లక్ష్యంపై బాలిక తల్లిదండ్రులు, దళిత సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. స్కూల్ ఎదుట ఆందోళనకు దిగారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. స్కూల్ కరస్పాండెంట్‌ను విచారిస్తున్నారు.

బ్యాంక్ దోపిడీకి స్కెచ్

- తుపాకులతో హల్‌చల్
- అనకాపల్లి రింగ్ రోడ్డులోని కెనరా బ్యాంక్‌లో ఘటన
- అప్రమత్తమైన సిబ్బంది
- సైరన్ మోగించడంతో పరారైన దుండగులు

కెనరా బ్యాంక్‌లో గన్ చూపించి భయపెడుతున్న ఆగంతకులు

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి రింగ్ రోడ్డులోని కెనరా బ్యాంక్‌లో దోపిడీకి ఏడుగురు ఆగంతకులు స్కెచ్ వేశారు. బ్యాంక్‌ను దోచుకోవడానికి పట్టపగలు తుపాకులతో చొరబడ్డారు. బ్యాంక్ సిబ్బంది అప్రమత్తమై అలారం ఆన్ చేయడంతో భయపడి దుండగులు పరారయ్యారు. వివరాలు.. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అనకాపల్లి రింగ్ రోడ్డులోని కెనరా బ్యాంక్‌కు ఏడుగురు వచ్చారు. అప్పటికే కొంత మంది ఖాతాదారులు బ్యాంకులో ఉన్నారు. వచ్చిన ఏడుగురిలో ఇద్దరు గేటు వద్ద వేచి ఉండగా.. ఐదుగురు లోపలకు ప్రవేశించారు. కొంత సేపు వారు లోపల అన్ని విభాగాలను పరిశీలించారు. వీరిలో ఒకరు బ్యాంక్ మేనేజర్ దగ్గరకు, మరో వ్యక్తి క్యాష్ కౌంటర్ వద్దకు వెళ్లి తుపాకులు తీసి బెదిరించారు. ఈ పరిణామంతో బ్యాంకులోని ఖాతాదారులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. సిబ్బంది తేరుకుని సైరన్ మోగించారు. దీంతో దొంగలు వెంట తీసుకొచ్చిన ద్విచక్ర వాహనాలపై రైల్వే స్టేషన్ మీదుగా పారిపోయారు. బ్యాంక్ అధికారులు అనకాపల్లి పోలీస్‌లకు సమాచారం అందించారు. పోలీసులు బ్యాంకుకు చేరుకుని సీసీ పుటేజీలను పరిశీలించారు. దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

24న ఎల్‌వీఎం3-ఎం6 ప్రయోగం

అమెరికాకు చెందిన బ్లూబర్డ్-6 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని పంపేందుకు ఏర్పాట్లు

షార్ కేంద్రంలో ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్‌ను ప్రయోగవేదిక మీదకు తరలిస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగవేదిక నుంచి ఈనెల 24న ఉదయం 8.54 గంటలకు ఎల్‌వీఎం 3–ఎం6 రాకెట్ ప్రయోగాన్ని జరిపేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఏటీఎస్ సంస్థ శాస్త్రవేత్తలు రూపొందించిన 6,500 కిలోల బ్లూబర్డ్–6 అనే కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నారు. రెండో అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్ అనుసంధానం పనులను పూర్తి చేసి ప్రయోగ వేదిక మీదకు తరలించారు. ముందుగా ఈ నెల 15న, ఆ తరువాత 21న ప్రయోగం జరపాలని భావించగా సాంకేతిక కారణాలతో వాయిదా పడింది. ఎట్టకేలకు ఈ నెల 24న ముహూర్తం కుదరడంతో శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రయోగాన్ని వీక్షించాలనుకునే వారు గురువారం నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఇస్రో ఓ ప్రకటన విడుదల చేసింది. షార్ కేంద్రం నుంచి ఇది 104వ ప్రయోగం కాగా ఉపగ్రహ ప్రయోగాల్లో వందవది కావడం గమనార్హం.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పని నడవదు.. పూట గడవదు

నెల్లూరు మాగుంట లేఔట్ ప్రాంతంలోని ప్రైవేట్ స్థలంలో నిర్మాణ పనులు లేక పక్కన పెట్టిన కాంక్రీట్ మిక్సర్ మిషన్లు..

నెల్లూరు కొండయ్యపాలెం గేటు వద్ద ఉదయం 10 గంటల సమయంలో పనుల కోసం రోడ్డుపైన వేచి చూస్తున్న భవన నిర్మాణ కార్మికులు

చంద్రబాబు సర్కారు పుణ్యమా అని కూలీల కడుపుపై దెబ్బపడింది. ప్రకృతి వనరులను చెరపట్టడంతోపాటు, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల కారణంగా నిర్మాణరంగం కుదేలయ్యింది. కూలీనాలీ చేసుకుని కలోగంజో తాగుదామనుకుంటే గంటల తరబడి అడ్డాలో నిల్చున్నా పనిదొరకడంలేదని నిర్మాణరంగ కూలీలు ఉసూరుమంటున్నారు. దాదాపు 30 రకాల పనులు చేసుకునేవారికి రోజువారీ జీవనం కష్టంగా మారింది. నెల్లూరు నగరంలో ఒకవైపు పనిలేక కాంక్రీట్ మిక్సర్ యంత్రాలు ఇలా బారులు తీరగా మరోవైపు నిర్మాణరంగ కూలీలు ఉదయం 10 గంటల వరకు పనికోసం రోడ్డుపైన నిలబడి ఉసూరుమంటూ ఇళ్లకు వెనుదిరిగిపోతున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, నెల్లూరు

తెలివితో.. సులువుగా

వ్యవసాయం జూదంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో సాగు వ్యయం ఒక్క రూపాయి తగ్గినా ఎంతో కొంత మేలు జరిగినట్లే అనుకుంటున్నారు రైతులు. మిర్చి పంటలో కలుపు తీతకు భారీగా ఖర్చవుతోందని భావించిన ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాల రైతులు వినూత్నంగా ఆలోచించారు. పాత సైకిల్‌ను వెల్డింగ్ షాపులకు తీసుకెళ్లి ముందు చక్రాన్ని తొలగించి ఇనుప బ్లేడ్‌లు అమర్చుతున్నారు. రూ. 500 ఖర్చు చేసి సైకిల్ వీడర్ అనే పరికరాన్ని తయారు చేసుకుని కలుపుతీతలో కూలీల ఖర్చు తగ్గించుకుంటున్నారు. గతంలో కలుపుతీతకు కూలీలకు ఎకరానికి రూ. 10 వేల వరకు ఖర్చయ్యేదని, ఈ పరికరం ద్వారా ఆ ఖర్చు ఆదాఅవుతోందని చెబుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఒంగోలు

వైఎస్ జగన్‌ను కలిసిన ఎంపీ రఘునాథరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల ఉద్యమంలో రాజ్యసభ ఎంపీ మేడా రఘునాథరెడ్డి పాల్గొన్నారు. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం రఘునాథరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిపిన ఉద్యమాలను పార్లమెంట్‌లో లేవనెత్తిన నిరసన, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ఫిర్యాదు చేసిన విషయాలను వైఎస్ జగన్‌కు వివరించారు. అనంతరం జగన్‌తో కలిసి గవర్నర్ భేటీలో పాల్గొన్నారు.

'కార్పొరేట్' భూ కేటాయింపులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కార్పొరేట్ సంస్థలకు చేసిన భూ కేటాయింపులు, నిధుల మంజూరుపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. విలువైన భూములను బడా సంస్థలకు కేవలం రూ.99 పైసలకే కట్టబెట్టడం దుర్మార్గమని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో భూములను వందల కోట్లకు కొనుగోలు చేసిన కంపెనీలకు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అప్పనంగా కట్టబెట్టడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. రహేజా వంటి రియల్ ఎస్టేట్ సంస్థలకు భూములతో పాటు ప్రోత్సాహకాల పేరుతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఆర్‌ఎస్‌యూ ధర్నా

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల విద్యను దిగజారుస్తోందని రివల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్(ఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, ప్రశాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా శుక్రవారం విజయవాడలో భారీ ధర్నా చేపడుతున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు గురువారం ధర్నా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. రూ.7,800 కోట్ల ఫీజులు నిలిపివేయడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నార న్నారని మండిపడ్డారు.

'ఉపాధి' పేరు మార్పుపై 22న వామపక్షాల నిరసన

సాక్షి, అమరావతి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సవరణలకు వ్యతిరేకంగా ఈ నెల 22న రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. చట్టబద్ధ హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందంటూ దుయ్యబట్టాయి. యూపీఏ ప్రభుత్వంపై ఆనాడు వామపక్షాలు తీసుకువచ్చిన ఒత్తిడి ఫలితంగా రూపుదిద్దుకున్న ఉపాధిహామీ చట్టం మౌలిక స్వభావాన్ని కేంద్రం మార్చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్(వీబీ జీ రాం జీ) పేరుతో ఉపాధిహామీ పథకానికి కేంద్రం 'రాంరాం' పలకనుందని, ఈ పథకం పేరును మార్చడం మహాత్మా గాంధీని అవమానించడమేనని ఆందోళన వ్యక్తం చేశాయి. టీడీపీ, జనసేన కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేటట్లు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐ ఎంఎల్, ఎంసీపీఐయూ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ఎస్‌యూసీఐసీ, ఫార్వర్డ్‌బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీలు గురువారం ప్రకటన విడుదల చేశాయి.

దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత నైపుణ్య శిక్షణ

మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాల బాటలు వేస్తామని దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. 21 సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సహకారంతో దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ఆన్‌లైన్ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి గురువారం ప్రారంభించారు. వెలగపూడి సచివాలయం నుంచి జూమ్ ద్వారా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు తమ నైపుణ్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఈశాఖ కార్యదర్శి ఎ. సూర్యకుమారి, డైరెక్టర్ రవిప్రకాశ్‌రెడ్డి, 21 సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ డైరెక్టర్ కె. ధరణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

22న జనసేన విస్తృత స్థాయి సమావేశం

సాక్షి, అమరావతి: ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు పొందిన జనసేన నాయకులతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ నెల 22న విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నారని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. మంగళగిరిలో నిర్వహించే విస్తృత స్థాయి సమావేశంలో మంత్రులు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొంది.

మూడేళ్లలో విద్యుత్ కొనుగోలు ఖర్చు తగ్గుతుంది

కలెక్టర్ల సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

సాక్షి, అమరావతి: వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ కొనుగోళ్ల ఖర్చు తగ్గుతుందని సీఎస్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. కలెక్టర్ల సమావేశంలో కాస్ట్ ఆప్టిమైజేషన్ ఫ్యూయల్, ఎనర్జీకి సంబంధించి విజయానంద్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం యూనిట్ విద్యుత్ ధర రూ.4.80గా ఉందని, 2029 నాటికి అది రూ.3.99కి తగ్గుతుందన్నారు. రాష్ట్రంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులు పూర్తి చేస్తే వినియోగదారులకు సరసమైన ధరలకే వివిధ రకాల ఇంధనాలు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుంటుందన్నారు. పీఎం కుసుమ్ పథకం ద్వారా 2,93,587 పంపు సెట్లకు 1,162.80 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ సరఫరా చేయనున్నామని తెలిపారు. అదేవిధంగా 20.5 లక్షల ఎస్సీ, ఎస్టీలకు ఒక్కొక్కరికి సుమారు 2 కిలోవాట్ల సామర్థ్యంతో 1,198.21 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే 27.59 లక్షల మంది బీసీ వినియోగదారులకు సుమారు 2 కిలోవాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ప్రభుత్వ స్కూళ్లు, కళాశాలలు, ఆస్పత్రులు, కార్యాలయాలపై రూఫ్‌టాప్ పెట్టడం ద్వారా సుమారు 150 మెగావాట్ల విద్యుత్‌ను సేకరిస్తామన్నారు. తద్వారా వచ్చే మూడేళ్లలో విద్యుత్ కొనుగోలు ఖర్చులో సుమారు రూ.957 కోట్ల నుంచి రూ.2,368 కోట్లు పొదుపు అవుతుందని సీఎస్ వివరించారు.

ఎరువుల నిర్వహణ, రవాణా ప్రైవేటు పరం

సాధ్యాసాధ్యాలపై అధ్యయనం కోసం కమిటీ ఏర్పాటు

సాక్షి.అమరావతి: మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువుల పంపిణీకి మంగళం పాడే లక్ష్యంతో ఎరువుల నిర్వహణ, సరఫరా కార్యకలాపాలను ప్రైవేటుపరం చేసేందుకు అధ్యయన కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్న ఈ కమిటీలో రాష్ట్ర, కేంద్ర గిడ్డంగుల సంస్థ, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, పౌరసరఫరాల సంస్థ, ఆర్ అండ్ బీ శాఖల నుంచి ఒక్కొక్కరు చొప్పున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎరువుల నిల్వ, రవాణా, టెండరింగ్ ప్రక్రియలను నిర్వహించే విధానాలపై సూచనలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం తరపున ఎరువుల నిర్వహణ, సరఫరా కార్యకలాపాలను ప్రైవేటు పరం చేసేందుకు సాధ్యాసాధ్యాలను ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. ప్రైవేట్ రంగ సంస్థలు (కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వంటి సంస్థలు) అనుసరిస్తున్న స్టాక్ లాజిస్టిక్స్ మోడళ్లను పరిశీలించాలని ఆదేశించింది. ఇప్పటి వరకు ఈ కార్యకలాపాలన్నీ ప్రభుత్వ రంగ సంస్థ అయిన మార్క్ ఫెడ్ నిర్వహిస్తోంది. వేర్వేరు సంస్థలకు ఈ కార్యకలాపాలను అప్పగించడం వలన ఎరువుల సరఫరాలో తీవ్రజాప్యం చోటు చేసుకోవడమే కాదు..ప్రైవేటు కాంట్రాక్టర్ల ఆధిపత్యం పెరుగుతుంది. ప్రభుత్వ గోదాముల స్థానంలో ప్రైవేట్ గోదాములు పెరిగితే నిర్వహణ చార్జీల పేరిట రైతులపై భారం పడే అవకాశాలుంటాయని చెబుతున్నారు.రవాణా, హ్యాండ్లింగ్ ఖర్చులు పెరిగితే అది డీలర్ మార్జిన్ లేదా అనధికార వసూళ్ల రూపంలో రైతుపై పడే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యువత కలలకు మార్గదర్శకత్వం అవసరం

కేఎల్‌యూలో యువజనోత్సవాలు ప్రారంభం

సాక్షి, అమరావతి /తాడేపల్లి రూరల్ : యువత కలలకు మార్గదర్శకత్వం అవసరమని యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ ఎస్.భరణి అన్నారు. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ వర్సిటీలో యువ – 2025 పేరుతో రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భరణి మాట్లాడుతూ యువత భవిష్యత్ నిర్మాణానికి, నైపుణ్యాల ప్రదర్శనకు, ప్రతిభను ప్రోత్సహించేందుకు వేదికలు అందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రతిభావంతులను రాష్ట్ర యువతతో అనుసంధానం చేయడానికి 'గ్లోబల్ డయాస్పోరా కనెక్ట్' రూపొందించామని చెప్పారు. యువత అధికారిక వ్యవస్థలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా సివిల్ సర్వీసెస్ కెరీర్ ఓరియంటేషన్‌ను ప్రారంభించామన్నారు. రష్యన్ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ కల్చర్ ప్రతినిధి అంటాస్య ఇలుషినా మాట్లాడుతూ భారత్‌కు యువతే బలమని, వీరి నుంచి రష్యన్ యువత చాలా నేర్చుకుంటారని చెప్పారు. ఈ యువజనోత్సవాల్లో ప్రతిభ చాటిన వారిని జాతీయ పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, స్టూడెంట్ యాక్టివిటీస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సాయి విజయ్, యువజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ప్రసాద్ పాల్గొన్నారు.

ఈ ఉద్యమం చరిత్రాత్మకం

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ పోరు గ్రాండ్ సక్సెస్
- చంద్రబాబు ప్రభుత్వ దుర్మార్గం ప్రజల్లో బట్టబయలు
- విద్య, వైద్య రంగాలు కుదేలయ్యాయని ఆగ్రహం
- సర్కారు నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకు పోరాటం : వైఎస్సార్‌సీపీ నేతల స్పష్టీకరణ

సాక్షి, అమరావతి : గత ప్రభుత్వ హయాంలో తల పెట్టిన కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగించాలన్న చంద్రబాబు ప్రభుత్వ కుట్రలు, కుతంత్రాలపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల పోరాటం గ్రాండ్ సక్సెస్ అయ్యిందని ఆ పార్టీ నేతలు అన్నారు. ఈ ప్రజా ఉద్యమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, ఇది చరిత్రాత్మకమని చెప్పారు. కోటి సంతకాల కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సంతకాలు చేశారన్నారు. తద్వారా చంద్రబాబు ప్రభుత్వ దుర్మార్గంతో పాటు, కమీషన్ల వ్యవహారం జనంలోకి వెళ్లిందని స్పష్టం చేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్దకు కోటి సంతకాల ప్రతులతో జిల్లాల నుంచి తాడేపల్లి చేరుకున్న వాహనాలను గురువారం వైఎస్ జగన్ జెండా ఊపి లోక్ భవన్‌కు పంపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే దాసరి సుధ, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, సిపాయి సుబ్రమణ్యం తదితరులు మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే పేదలకు ఉచిత వైద్యం కలేననీ చెప్పారు. అదే జరిగితే 95 శాతం మంది ప్రజలు ఇబ్బందులు పడతారని, 5 శాతం డబ్బున్న ప్రజలకు మాత్రమే ఇబ్బంది ఉండదన్నారు. మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ అంశంలో సీఎం చంద్రబాబుపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వచ్చిందని, అందుకే వైఎస్సార్‌సీపీ ఉద్యమం గ్రాండ్ సక్సెస్ అయిందని చెప్పారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వ్యవస్థలన్నీ కుప్పకూలాయని, ప్రధానంగా విద్య, వైద్య రంగాలు కుదేలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థుల చదువులు ఆగిపోతున్నాయన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. ఈ ఉద్యమం చరిత్రాత్మకమని చెప్పారు. బాబు సర్కారు దుర్మార్గ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజా కోర్టులో సీఎం చంద్రబాబు దోషిగా నిలబడాల్సిందేనని, వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా తగిన మూల్యం చెల్లిస్తారన్నారు.

22న చంద్రబాబు కేసుల మూసివేత కాపీల పిటిషన్‌పై వాదనలు

విజయవాడలీగల్: ముఖ్యమంత్రి చంద్రబాబుపై 2019–2024 మధ్య నమోదైన అవినీతి కేసులను ఉపసంహరిస్తూ ప్రభుత్వం తీసుకున్న రిపోర్టు కాపీలను కోరుతూ దాఖలైన పిటిషన్‌పై వాదనలను ఏసీబీ కోర్టు న్యాయమూర్తి పి.భాస్కరరావు ఈ నెల 22వ తేదీకి వాయిదా వేశారు. మాజీ రైల్వే ఉద్యోగి వేము కొండలరావు తరపున సీనియర్ న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు.

అనిల్ చోక్రాకు సదుపాయాలపై రేపు తీర్పు

మద్యం అక్రమ కేసులో విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఎ49 అనిల్ చోక్రా ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా జైలులో పరుపు, దిండుతోపాటు రగ్గు వంటి సదుపాయాల కల్పనకు అనుమతించాలని దాఖలైన పిటిషన్‌పై తీర్పును వాదనల అనంతరం ఈనెల 20వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. అలాగే ఆయన బెయిల్ పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. ఇదే కేసులో ఎ51గా గుంటూరు జైలులో రిమాండ్‌లో వున్న రోణక్‌కుమార్ బెయిల్ పిటిషన్ కౌంటర్‌కుగాను ఈనెల 23కి వాయిదా పడింది.

జోగి రమేష్, రాముల జైలు మార్పు

నకిలీ మద్యం కేసులో నెల్లూరు సెంట్రల్ జైలులో వున్న జోగి రమేష్, జోగి రాము అనారోగ్యంతో బాధపడుతున్నందున.. వారు కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉండేలా విజయవాడ జిల్లా జైలుకు మార్చుతూ జడ్జి లెనిన్‌బాబు ఆదేశాలు ఇచ్చారు.

కోర్టుకు హాజరైన గోరంట్ల మాధవ్

అత్యాచార బాధితురాలి వివరాలను బహిర్గతం చేశారనే ఆరోపణలపై మాజీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఫిర్యాదుపై నమోదైన కేసులో.. గోరంట్ల మాధవ్ గురువారం విజయవాడ పోక్సో కోర్టులో హాజరయ్యారు. తదుపరి విచారణ జనవరి 26కు వాయిదా పడింది.

మహోద్యమంలో మేము సైతం..

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై బిగిసిన పిడికిళ్లు

సాక్షి, నెట్‌వర్క్ : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటం ఉధృతమవుతోంది. మహోద్యమంలో మేము సైతం అంటూ ప్రజలు స్వచ్ఛందంగా పిడికిళ్లు బిగించి కదంతొక్కుతున్నారు. ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, సీపీఐ చేయిచేయి కలిపి ఉద్యమంలో భాగస్తులవుతున్నాయి. ఫలితంగా గురువారం కలెక్టరేట్లు, మెడికల్ కాలేజీల ప్రాంగణాలు ధర్నాలతో హోరెత్తాయి. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల పేదలకు వైద్య విద్య, మెరుగైన వైద్యం దూరమవుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. సర్కారు తక్షణం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకుంటే పతనం తప్పదని హెచ్చరించారు. మార్కాపురం మెడికల్ కళాశాల వద్ద, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్, తిరుపతి, గుంటూరు జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద, ఏలూరు డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలోని ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కామేపల్లిలో నిలిచిపోయిన మెడికల్ కాలేజీని ఏఐఎస్ఎఫ్, సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు సందర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం డౌన్..డౌన్.. పీపీపీ విధానం మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. తొలుత ర్యాలీగా మెడికల్ కాలేజీ వద్దకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న నాయకులు, విద్యార్థులను అద్దంకి నార్కెట్‌పల్లి హైవే వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఎట్టకేలకు పోలీసులు అనుమతించడంతో నాయకులు, విద్యార్థులు మెడకల్ కాలేజీకి చేరుకుని ధర్నా నిర్వహించారు.



విజయవాడలో జరిగిన ధర్నాలో ప్రసంగిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రైవేటు చేతుల్లోకి రాష్ట్రం : సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలతో పాటు కీలక ప్రభుత్వ రంగ సంస్థలనూ ప్రైవేటీకరించే ప్రమాదకర విధానాలను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తోందని, దీనివల్ల రాష్ట్రం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు.

వైఏటీ-సీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా పద్మావతి

సాక్షి, అమరావతి: యువజన సర్వీసులు పర్యాటక, సాంస్కృతిక శాఖ(వైఏటీ–సీ) చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా డిప్యూటీ సెక్రటరీ వి.పద్మావతి నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వర్తిస్తున్న జాయింట్ డైరెక్టర్ బి.విజయలక్ష్మి జీఏడీకి బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పోలవరం జిల్లాలో పోలవరం లేకపోవడం విడ్డూరం

- సీఎం చంద్రబాబుకు సీపీఎం లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో ఏర్పాటు చేసిన పోలవరం జిల్లా ఏజెన్సీ ప్రజలను నిరాశపర్చిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు., జిల్లాలో పోలవరం నియోజకవర్గం లేకపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొంటూ సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను ఆయన గురువారం మీడియాకు విడుదల చేశారు. పోలవరం నిర్వాసిత ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటిస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన హామీని గుర్తు చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు పూర్తికావాలంటే నిర్వాసితులకు పునరావాసం పూర్తిస్థాయిలో కల్పించాలని, అందుకు నిర్వాసిత ప్రాంతం, పునరావాసం కల్పించే ప్రాంతం ఒకే కార్యానిర్వహక ప్రాంతంగా ఉంటే సమన్వయానికి, కార్యాచరణ అమలుకు పూర్తిస్థాయిలో వీలుంటుందన్నారు.

వైఎస్సార్‌టీఏ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

సాక్షి, అమరావతి: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ జంషీద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా మట్టిగుంట మహేశ్వరరావు (ప్రకాశం), గుజ్జెల్లి కొండబాబు (అల్లూరి), రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.రెడ్డిశేఖర్ రెడ్డి (చిత్తూరు), రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కె.శ్యామ్ సుందర్ క్రిస్టసన్ (పశ్చిమ గోదావరి), ఎన్.మహేశ్వర్ రెడ్డి (నంద్యాల), పూడి జనార్దన్ రావు (శ్రీకాకుళం), కరక ప్రసాద్ (విజయనగరం), సి.గంగాధర్ రెడ్డి (అనంతపురం) వై.థామస్ రెడ్డి (గుంటూరు), సహాయ కార్యదర్శులుగా ఎస్.నారాయణరెడ్డి (నంద్యాల), నక్కా గోవర్నాయుడు (శ్రీకాకుళం), బి.మహమ్మద్ అలీ (సత్యసాయి), ఎం.జయశ్రీ (ఎన్టీఆర్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

16 మంది సభ్యులతో స్టీరింగ్ కమిటీ

సాక్షి, అమరావతి: అదానీ, గూగుల్ కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న రైడెన్ డేటా సెంటర్‌కు అనుమతులు వేగంగా మంజూరు చేయడం, నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి 16 మంది సభ్యులతో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీ శాఖ కార్యదర్శి చైర్మన్‌గా ఉండే ఈ స్టీరింగ్ కమిటీలో పలు విభాగాలకు చెందిన అధికారులు సభ్యులుగా ఉంటారని ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ జారీచేసిన ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీ 2026 డిసెంబర్ 31వ తేదీ వరకు అమల్లో ఉంటుందని తెలిపారు. అలాగే అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటమ్ వ్యాలీలో క్యూపీఐఏఐ ఇండియా, నోస్ట్రడామస్ టెక్నాలజీస్, 42 టెక్నాలజీ, క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్, సైబ్రానెక్స్ టెక్నాలజీస్, సెంటిల్లా సైంటిఫిక్ క్యూసీలైరోవియన్స్ పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

రాష్ట్రంలో 81 లక్షల మంది నిరక్షరాస్యులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2029 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. గురువారం కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం రాష్ట్రంలో 72.6 శాతం అక్షరాస్యత ఉందని, 81 లక్షల మంది నిరక్షరాస్యులు ఉన్నారని చెప్పారు. జిల్లాలో కలెక్టర్లు అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, స్వయం సహాయక సంఘాల్లో చదువుకున్నవాళ్లను గుర్తించి వారిని అక్షరాస్యత కార్యక్రమం వలంటీర్లుగా వినియోగించుకోవాలని సూచించారు. మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామని కోన శశిధర్ వివరించారు.

మండల స్థాయిలోనే స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించాలి

సాక్షి, అమరావతి: ప్రైమరీ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు మండల స్థాయిలోనే స్కూల కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని ఏపీ పీఎస్ హెచ్‌ఎం ఫోరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీ ప్రసాద్, వెంకటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈనెల 20న జరిగే కాంప్లెక్స్ సమావేశాల్లో దీనిని అమలు చేయాలన్నారు. పరిపాలనాపరమైన అంశాలు చర్చించేందుకు వీలు కల్పించాలని, తద్వారా లోటుపాట్లు సరిచేసుకునేందుకు ఆస్కారం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

గన్నవరం విమానాశ్రయ భూములపై తుది నిర్ణయం తీసుకోలేదు

హైకోర్టుకు నివేదించిన సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

సాక్షి, అమరావతి: గన్నవరం విమానాశ్రయ విస్తరణ కోసం అదనపు భూమి అవసరమా? లేక ఇప్పటికే జారీ చేసిన భూ సమీకరణ నోటిఫికేషన్‌ను ఉపసంహరించాలా? అన్నది సీఆర్‌డీఏ తదుపరి సమీక్ష సమావేశంలో నిర్ణయిస్తామని సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు హైకోర్టుకు నివేదించారు. గన్నవరం విమానాశ్రయం కోసం కృష్ణాజిల్లా అజ్జంపూడి గ్రామంలో తీసుకున్న భూములను ఇంకా స్వాధీనం చేసుకోలేదని ఆయన వివరించారు. అదనపు భూమిని భూ సేకరణ కింద తీసుకునేందుకు ప్రభుత్వం తుది అప్రూవల్ ఇవ్వలేదని ఆయన హైకోర్టుకు తెలిపారు. భూ సమీకరణ నిబంధనల కింద చట్టపరమైన ప్రక్రియ ఇంకా తుది దశకు కూడా చేరుకోలేదన్నారు. సమగ్ర వివరాలతో సమగ్ర కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రాథమిక కౌంటర్ దాఖలు చేశారు. ఈ కౌంటర్‌ను పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఈ వ్యవహారంపై తుది విచారణ జరుపుతానని స్పష్టం చేశారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 3కి వాయిదా వేశారు.

సోషల్ మీడియా యాక్టివిస్ట్ తారక్‌కు బెయిల్

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : సోషల్ మీడియా యాక్టివిస్ట్ వజ్రాల తారక్ ప్రతాపరెడ్డి గురువారం రాత్రి గుంటూరు నగరంలోని జిల్లా జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ ఏడాది సెప్టెంబర్ 24న తారక్‌ను సీఐడీ అరెస్ట్ చేయగా, 25న గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. బెయిల్ లభించడంతో జైలు వద్దకు తారక్ తండ్రి చంద్రమౌళిరెడ్డి, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు షేక్.నూరిఫాతిమా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్.గులాం రసూల్ వచ్చారు.

నిఘా నీడలో నిజాల వేట

కల్లోలిత ప్రాంతంగా మారిన దండకారణ్యం

అక్కడికి వెళ్లి వచ్చేవారిపై నిరంతర నిఘా ● ప్రతీ కదలికను గమనిస్తున్న ఇరుపక్షాలు

దండకారణ్యంలో పహారా కాస్తున్న పారా మిలిటరీ బలగాలు

దండకారణ్యం నుంచి సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కల్లోలిత ప్రాంతమైన దండకారణ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులను బయటి ప్రపంచానికి చెప్పేందుకు జర్నలిస్టులు ఒంటరిగా వెళ్లే పరిస్థితులు లేవు. ముఖ్యంగా తెలుగు మీడియా జర్నలిస్టులైతే జట్టుగా వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. హిడ్మా మరణం తర్వాత సర్వత్రా ఆసక్తి నెలకొన్నందున.. అక్కడి అంశాలను బయటి ప్రపంచానికి తెలియజేసేందుకు తెలుగు జర్నలిస్టుల బృందం ఇటీవల వెళ్లింది. తెలంగాణ సరిహద్దు నుంచి పువ్వర్తికి వెళ్లాలంటే కనీసం 11 సీఆర్‌పీఎఫ్ క్యాంపులను దాటాల్సిందే. ఈక్రమాన మీడియా బృందం ఓ క్యాంపు దాటుతుండగా సాయుధ జవాన్లు ఆపేశారు. పేరు, సంస్థ, ఫోన్ నంబర్, ఇన్‌టైం వివరాలతో పాటు ఫొటోలు తీసుకుని పంపించారు. మీడియా బృందం పువ్వర్తికి చేరుకునేసరికి తెలుగు మాట్లాడే ఓ సీఆర్‌పీఎఫ్ జవాన్ అక్కడికి వచ్చాడు. 'ఇది మావోయిస్టు ప్రభావిత ప్రాంతం. ఇక్కడ పరిస్థితులు బాగాలేవు. మీకేమైనా ఇబ్బందులు వస్తాయి. అందుకే మీ బాగోగులు చూడటానికి వచ్చాను' అంటూ తనను పరిచయం చేసుకున్నాడు. అక్కడ మీడియా బాధ్యులు ఎవరెవరిని కలుస్తున్నారు, ఎలాంటి ఇంటర్వ్యూలు చేస్తున్నారనే విషయాలను సదరు జవాన్ ఎప్పటికప్పుడు తన ఫోన్‌లో బంధించాడు.

అన్నల అడవిలో..

హిడ్మా తల్లి పువ్వర్తి నుంచి ఐదు కిలోమీటర్ల దూరాన ఓయ్‌పారా అనే గ్రామంలో ఉందని తెలియడంతో.. మీడియా బృందం అక్కడికి పయనమైంది. గ్రామం నుంచి కొద్ది దూరం వెళ్లాక వాగు ఎదురైంది.. అక్కడితో ఇటీవల సర్కార్ వేసిన రోడ్డు ముగిసింది. జర్నలిస్టులు వాగు దాటుకుని ముందుకు వెళ్తుంటే, జవాన్ అక్కడే ఆగిపోయాడు. 'ఇక్కడి నుంచి నేను ముందుకు రాలేను. మీరు వెళ్లి ఇంటర్వ్యూ తీసుకుని త్వరగా వచ్చేయండి' అని చెప్పాడు. జర్నలిస్టుల బృందం ఓయ్‌పారాకు చేరేసరికి సీఆర్‌పీఎఫ్ జవాన్ నుంచి మిస్డ్ కాల్స్ ఉన్నాయి. తిరిగి ఫోన్ చేస్తే 'మిమ్మల్ని ఫాలో అవుతూ అడవిలోకి వచ్చాను, కానీ ఇక్కడ కాలి బాటలు పాయలుగా విడిపోయి ఉన్నాయి, ఏ దారిలో ముందుకు రావాలి' అని అడిగాడు.

ముప్పిరిగొన్న సందేహాలు

జర్నలిస్టుల బాగోగులు కోసమని వచ్చిన జవాన్.. అన్నల అడవిలో' తప్పిపోతే పరిస్థితి ఏంటనే సందేహాలు రావడంతో అందరూ వెనక్కి వెళ్లారు. ఏడు నిమిషాల ప్రయాణం తర్వాత ఆయన కనిపించగా అప్పటికే మరో ఆరు మిస్డ్ కాల్స్ ఉన్నాయి. అతడిని ఓయ్‌పారాకు తీసుకొచ్చేసరికి హిడ్మా తల్లి పొలం పనుల కోసం వెళ్లినట్టు తెలిసింది. హిడ్మా తల్లి ఉంటున్న ఇంటి ఫొటోలను ఆ జవాన్ తీసుకున్నాడు. 'ఆలస్యం అయ్యేలా ఉంది. నేను ఇక్కడ ఎక్కువ సేపు ఉండడం అంత మంచిది కాదు. త్వరగా వచ్చేయండి' అంటూ వెళ్లిపోయాడు. ఆయన క్షేమంగా వెళ్లాడా, లేదా అని ఫోన్ చేయాలని భావించినా.. ఆయన కదలికలను బయటపెట్టినట్లవుతుందనే భావనతో జర్నలిస్టులంతా వెనక్కి తగ్గారు.

డ్రోన్ నిఘా..

హిడ్మా తల్లి కోసం నిరీక్షిస్తుండగా జుమ్... అంటూ శబ్దం వినిపించింది. జర్నలిస్టుల బృందం ఉన్న పాకపై డ్రోన్ ఎగురుతోందని అర్థమైంది. కొద్ది సేపటి తర్వాత శబ్దం ఆగిపోయింది. అంతకు ముందు మాట్లాడిన జవాన్ మాటల ఆధారంగా.. 'ఆ రోజు లంచ్ కోసం జర్నలిస్టులు ఏ గ్రామంలో వాకబు చేశారు, ఎలాంటి వార్తలు, ఏ తరహాలో అందిస్తున్నారు' అనే విషయాలపై వారికి పక్కా సమాచారం ఉందనేది అర్థమైంది. అంతేకాదు దండకారణ్యంలోకి వచ్చి వెళ్లే తెలుగు వాళ్ల వివరాలు తెలుసుకునేందుకు ప్రతీ సీఆర్‌పీఎఫ్ క్యాంపులో ప్రత్యేకంగా తెలుగు మాట్లాడే జవాన్లు ఉంటారని తెలిసొచ్చింది. ఓ వైపు ప్రభుత్వ పారా మిలిటరీ నిఘా ఇలా ఉంటే.. మరోవైపు అసలు ఆనవాళ్లే గుర్తించలేనంతగా మావో మద్దతుదారులు జర్నలిస్టు బృందంపై కన్నేసి ఉంచారు. ఆ నిఘా నీడలో సంచరిస్తూ హిడ్మా తల్లిని కలిసిన బృందం ఆమె బాగోగులు తెలుసుకుంది.

'నెత్రా' బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలి

రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: 'గతంలో నల్లగొండలో యురేనియం తవ్వకాలకు ప్రయత్నిస్తే మేం అడ్డుకున్నాం. ఇప్పుడు మళ్లీ గిరిజన ప్రాంతాల్లో అణు ముప్పు తెస్తారా?'అని బీఆర్‌ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. దేశంలో అణు విద్యుత్ రంగాన్ని విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా బిల్లు (నెత్రా) - 2025 బిల్లుపై గురువారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. పర్యావరణానికి, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున ఈ బిల్లును తక్షణం సెలెక్ట్ కమిటీకి పంపాలని ఆయన డిమాండ్ చేశారు. అభివృద్ధి అవసరమేనని, కానీ అది ప్రజల ప్రాణాల మీదకి రాకూడదని హితవు పలికారు. ఈ బిల్లులో అత్యంత ప్రమాదకరమైన విషయం పర్యావరణ బాధ్యతని పూర్తిగా విస్మరించడమేనని ఆయన మండిపడ్డారు. అణు ఖనిజాల తవ్వకాలు ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లోనే జరుగుతున్నాయని గుర్తుచేశారు. బిల్లులో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు సెలెక్ట్ కమిటీకి పంపాలని, ఒకవేళ అది కుదరకపోతే.. పార్లమెంటరీ పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ స్థాయీ సంఘం ఈ ప్రాజెక్టుల అమలును నిరంతరం పర్యవేక్షించాలని సురేశ్ రెడ్డి కోరారు.

50 శాతం ఏసీబీ కేసుల్లోనే శిక్షలు

ఎఫ్‌జీజీ ఆర్టీఐ దరఖాస్తునకు జవాబిచ్చిన ఏసీబీ

సాక్షి, హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖ నమోదు చేస్తున్న కేసుల్లో 50 శాతం మాత్రమే శిక్షలు ఖరారవుతున్నాయని ఏసీబీ అధికారులు వెల్లడించినట్టు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) తెలిపింది. ఏసీబీ కేసుల దర్యాప్తు వివరాలపై ఆర్టీఐ కింద ఇచ్చిన దరఖాస్తుకు ఏసీబీ సమాధానమిచ్చినట్టు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం పద్మనాభరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీబీ సమాచారం ప్రకారం.. 2023–2024లో మొత్తం 19 కేసుల్లో తీర్పు వెలవడగా ఇందులో 9 కేసులలో శిక్ష ఖరారు కాగా.. 10 కేసులలో నిర్దోషులుగా విడుదల చేసినట్టు తెలిపారు. 2024–2025లో మొత్తం 22 కేసులలో తీర్పు వెలువడగా.. ఇందులో 12 కేసుల్లో శిక్షలు ఖరారు కాగా, మరో 10 కేసులలో నిర్దోషులుగా విడుదల చేసినట్టు తెలిపారు. గత ఐదేళ్లలో ఏసీబీ 621 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

అవినీతి అధికారుల్లో భయం లేకుండా పోయింది

సగటున ఏడాదికి 120 కేసులు నమోదవుతున్నా..ఏసీబీ విచారణ పూర్తయిన తర్వాత సదరు అధికారిని కోర్టులో ప్రాసిక్యూట్ చేయడానికి ఏసీబీ ప్రభుత్వ అనుమతి కోసం పంపుతోందని, అయితే వాటిలో సచివాలయంలో రకరకాల పైరవీలతో కేవలం 25 శాతం కేసుల్లో మాత్రమే ప్రాసిక్యూషన్‌కు అనుమతి వస్తోందని పద్మనాభరెడ్డి ఆరోపించారు. మిగిలిన కేసులు శాఖాపరమైన విచారణ లేదా ట్రిబ్యునల్ ఫర్ డిసిప్లినరీ ప్రొసీడింగ్స్‌కు పంపుతున్నారని చెప్పారు. ఇలా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండి చివరకు ఎలాంటి చర్యలు లేకుండా ముగుస్తుండడంతో అవినీతి అధికారుల్లో భయం లేకుండా పోతోందన్నారు.

మహాత్ముని పేరు మార్చొద్దు

బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

సాక్షి, న్యూఢిల్లీ: ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం, నిధుల కేటాయింపులో రాష్ట్రాలపై భారం మోపడం సరికాదని బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. గురువారం రాజ్యసభలో 'వికసిత్ భారత్ గ్రామీణ మౌలిక సదుపాయాల హామీ బిల్లు'పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాముడంటే దేశంలో అందరికీ ఇష్టమేనన్నారు. కానీ మహాత్ముడి పేరు మార్చడం ప్రజలను బాధపెడుతుందన్నారు. కేంద్రం, రాష్ట్రాల నిధుల వాటాను గతంలో ఉన్న 90:10 నిష్పత్తి నుంచి 60:40కి మార్చడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల రాష్ట్రాలు తమ వాటా చెల్లించలేక పథకాన్ని పక్కనబెట్టే ప్రమాదం ఉందని, పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానించాలని, సిరిసిల్ల, పోచంపల్లి వంటి ప్రాంతాల్లోని చేనేత కార్మికులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. కీలకమైన మార్పులు చేసేముందు ముఖ్యమంత్రులతో చర్చించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు.

నితిన్ నబిన్‌కు శుభాకాంక్షలు



సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబిన్‌కు.. తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహనరావు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన గురువారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో నబిన్‌ను కలిశారు. ఈ సందర్భంగా తాను రచించిన 'సామాజిక న్యాయం–ఆర్థిక సమానత్వం–అభివృద్ధి దిశగా జీఎస్టీ సంస్కరణలు'అనే పుస్తకాన్ని నితిన్ నబిన్‌కు అందజేశారు. ఈ గ్రంథాన్ని ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆవిష్కరించడం తెలిసిందే. పుస్తక రచనకు దోహదపడిన పరిశోధనా నేపథ్యం, సామాజిక న్యాయం –ఆర్థిక సమానత్వం మధ్య ఉన్న అనుబంధం, ప్రజా విధానాల రూపకల్పనలో జీఎస్టీ పాత్రపై నితిన్ నబిన్‌కు వివరించారు.

ప్రమాదంలో దేశ దీర్ఘకాలిక ఇంధన భద్రత

- వేగంగా నిండుకుంటున్న బారైట్ నిల్వలు
- నియంత్రణ లేని ఎగుమతులతో పదేళ్లలోపే ఖాళీ
- అమెరికాకు బారైట్ ఎగుమతుల్లో 40 శాతం భారత్ నుంచే
- ముడిచమురు అన్వేషణలో బారైట్ అత్యంత కీలకం
- సెంటర్ ఫర్ డొమెస్టిక్ ఎకానమీ పాలసీ నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: భారతదేశంలో బారైట్ నిల్వలు వేగంగా ఖాళీ అవుతుండటంతో దేశ దీర్ఘకాలిక ఇంధన భద్రత ప్రమాదంలో పడుతోందని 'సెంటర్ ఫర్ డొమెస్టిక్ ఎకానమీ పాలసీ రీసెర్చ్' (సి–డెప్.ఇన్) హెచ్చరించింది. దేశీయంగా బారైట్ తవ్వకాలు భారీగా కొనసాగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచంలోని పది అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలున్న దేశాల్లో భారత్‌లోనే ప్రస్తుతం అతి తక్కువగా బారైట్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని నివేదిక పేర్కొంది. 'చమురు, గ్యాస్ డ్రిల్లింగ్ సమయంలో చమురు బావుల్లో అధిక పీడనాన్ని నిరోధించేందుకు బారైట్‌కు మించిన ప్రత్యామ్నాయం లేదు. ఈ నేపథ్యంలో అండమాన్, కృష్ణా గోదావరి బేసిన్లలో జరిగే చమురు, గ్యాస్ ఎక్స్‌ప్లొరేషన్‌పై బారైట్ కొరత భారీ ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి' అని నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది.

మంగంపేటలో భారీగా బారైట్

భారతదేశ బారైట్ సంపదలో 95 శాతం ఆంధ్రప్రదేశ్‌లోని మంగంపేట గనిలో కేంద్రీకృతమై ఉంది. అక్కడ నిరూపిత నిల్వలు 2015లో 49 మిలియన్ టన్నుల నుంచి 2024లో 23 మిలియన్ టన్నుల కంటే దిగువకు పడిపోయాయి. దశాబ్ద కాలంలోనే బారైట్ నిల్వలు 53 శాతం తగ్గిపోయాయి. భారతదేశ దీర్ఘకాలిక ఇంధన, దేశీయ అవసరాలకు వ్యూహాత్మక నిల్వలపై వ్యూహం లేకపోవడం వల్లే ఇలా జరుగుతోంది. 2016లో చైనా తన ఎగుమతులను నియంత్రించిన తర్వాత ప్రపంచానికి భారతదేశమే అతిపెద్ద బారైట్ ఎగుమతిదారుగా మారింది. అమెరికా తన బారైట్ దిగుమతుల్లో సుమారు 44 శాతం భారత్ నుంచే పొందుతోంది. ఎక్కువగా బారైట్ ఉత్పత్తి చేస్తున్న అమెరికా, ఇరాన్, కజకిస్తాన్, టర్కీ కంటే భారత్‌లోనే తక్కువ నిల్వలు ఉన్నాయి. రష్యా, ఇరాన్, అమెరికా వంటి చమురు ఉత్పత్తి చేసే దేశాలు తమ బారైట్ ఎగుమతులను నియంత్రిస్తున్నాయి. మరోవైపు దశాబ్దాల పాటు నిల్వలుండేలా బారైట్ ఉత్పత్తిని క్రమబద్ధీకరిస్తున్నాయి.

ఎగుమతులపై నియంత్రణ తప్పనిసరి

అండమాన్, కృష్ణ, గోదావరి, మహానది బేసిన్‌లలో సుమారు 22 బిలియన్ బారెల్స్ చమురు నిల్వల అన్వేషణ సాగాల్సి ఉందని సీ డెప్ అంచనా వేస్తోంది. దీనికోసం సుమారు 600 మిలియన్ టన్నులకు పైగా బారైట్ అవసరమని అంచనా. మంగంపేటలో ప్రస్తుతం మిగిలి ఉన్న బారైట్ నిల్వలు దేశ అవసరాలకు అనుగుణంగా లేవు. ఈ నేపథ్యంలో బారైట్ ఎగుమతులపై క్రమబద్ధమైన నియంత్రణలు, ఎగుమతి కేటాయింపు విధానాల సవరణ, బారైట్‌ను జాతీయ కీలక ఖనిజాల మిషన్ (ఏసీఎంఎం)లో చేర్చడాన్ని సీ డెప్ సిఫారసు చేస్తుంది. తమ అధ్యయనం ఖనిజ భద్రత, వ్యూహాత్మక నిల్వలు, భవిష్యత్ చమురు, గ్యాస్ ఎక్స్‌ప్లొరేషన్‌కు దేశీయ సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి దోహదం చేస్తుందని సీడెప్ చెబుతోంది.

దీర్ఘకాలిక విధానాలు అవసరం

'బారైట్ నిల్వల దీర్ఘకాలిక క్షీణతపై ప్రభావం విశ్లేషణ' అనే అంశంపై ఐఐటీ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ నివేదికను ఎంపీఎండీసీ మాజీ ఎండీ ప్రవీణ్ ప్రకాశ్ విడుదల చేశారు. 'బారైట్ నిల్వల క్షీణత కేవలం ఖనిజ సమస్య మాత్రమే కాదు, ఇది జాతీయ ఇంధన భద్రత సమస్య. భారతదేశం తన ముడి చమురు డిమాండ్‌లో 90 శాతం దిగుమతుల ద్వారా తీర్చుకుంటోంది. దేశీయ చమురు, గ్యాస్ నిల్వలను ఎక్స్‌ప్లోర్ చేసి తవ్వే సామర్థ్యం అవసరం. భవిష్యత్తులో సురక్షితంగా, సమర్థవంతంగా డ్రిల్ చేయడాన్ని బారైట్ నిర్ణయిస్తుంది. ఈ వనరును సంరక్షించేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. ఎంపీఎండీసీ ఉత్పత్తి, ఎగుమతుల్లో ప్రస్తుతం బారైట్ కీలకంగా ఉంది. బారైట్ ఆదాయంతో ఏపీఎండీసీ రూ.10 వేల కోట్ల బాండ్లను సేకరించింది. దీంతో బారైట్ సంరక్షణ పక్కన పెట్టి నిరంతరం ఆర్థిక అవసరాల కోసం తవ్వాల్సిన పరిస్థితిని సృష్టిస్తోంది'.. అని ఆయన పేర్కొన్నారు. బారైట్ నిల్వల పరిరక్షణకు దీర్ఘకాలిక విధానం అవసరమని సీ డెప్ అధ్యక్షుడు డాక్టర్ జైజిత్ భట్టాచార్య పేర్కొన్నారు.

63 మెడికల్ షాపుల్లో అవకతవకలు

హ్యాబిట్ ఫార్మింగ్ మందులపై డ్రగ్స్ కంట్రోల్ అధికారుల భారీ దాడులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ (వ్యసనంగా మారే మందులు) తోపాటు ఇతర ప్రిస్క్రిప్షన్ మందుల అక్రమ విక్రయాలను అరికట్టేందుకు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారుల బృందాలు గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలు జిల్లాల రిటైల్ మెడికల్ షాపులపై ఆకస్మిక దాడులు చేసి నిబంధనలకు విరుద్ధంగా మందుల విక్రయం జరుగుతున్న తీరును తెలుసుకొని, అక్రమాలకు పాల్పడుతున్న మందుల దుకాణాలపై చర్యలకు సిఫారసు చేశారు. తనిఖీలలో మొత్తం 63 మెడికల్ షాపుల్లో తీవ్రమైన లోపాలు, నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినట్టు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. ఈ దాడుల్లో వ్యసనంగా వినియోగించే హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ అయిన కోడీన్ ఉన్న దగ్గు టానిక్స్, నైట్రావెట్ (నైట్రాజెపామ్) గోలీలు, అల్ప్రాజోలం, ట్రామడాల్, జోల్పిడెమ్, టైడాల్ (టాపెంటడాల్) వంటి మాత్రల విక్రయంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. దుర్వినియోగం జరుగుతున్నట్టు సమాచారం వచ్చిన మెఫ్టర్మైన్ ఇంజెక్షన్లు, అట్రాక్యూరియం బెసిలేట్ ఇంజెక్షన్ల విక్రయాలపై కూడా ప్రత్యేక తనిఖీలు జరిపారు. ఈ తనిఖీలలో పలు దుకాణాలు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే హ్యాబిట్ ఫార్మింగ్ మందులు విక్రయించినట్టు తేలింది. మందుల అక్రమ విక్రయం, నిషేధిత డ్రగ్స్ తయారీ లేదా నిల్వపై ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా ప్రజలు వెంటనే టోల్ ఫ్రీ నంబరు 1800–599–6969 కు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేసే దినాల్లో ఫోన్ చేయవచ్చని స్పష్టం చేసింది.

గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సినీ నిర్మాత దిల్‌రాజు

గాంధీ పేరు తొలగింపు అన్యాయం: పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ భారతానికి వెన్నెముకగా ఉన్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో.. గాంధీజీ పేరును తొలగించడం అన్యాయమని గృహనిర్మాణ, రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, పేదల కడుపు కొడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పథకంలో గాంధీ పేరు తీసేస్తే చరిత్ర మారుతుందా? అని ప్రశ్నించారు. పేదల పొట్టగొట్టేందుకు, రాష్ట్రాలపై 40 శాతం భారం వేసేందుకు పేరును తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బిల్లుతో అభివృద్ధి తిరోగమనమేనని, రాష్ట్రాలకు మోయలేని భారమని 'పొంగులేటి'తెలిపారు.

స్పీకర్ రాజీనామా చేయాలి: కేఏ పాల్ డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ తీసుకున్న నిర్ణయం సరైంది కాదని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ విమర్శించారు. ఆ పది మంది ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో గెలిచి కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న విషయం మర్చిపోయారా? అంటూ నిలదీశారు. వారి విషయంలో స్పీకర్ వెల్లడించిన తీర్పును ఆయన తప్పుబట్టారు. పాల్ గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎంపీగా పోటీ చేయలేదా? ఈ విషయాన్ని మీరు చూడలేదా? వినలేదా? అంటూ ప్రశ్నలు సంధించారు. అప్పట్లో రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ ఓటు కొనేందుకు లంచం ఇస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడటాన్ని గుర్తు చేస్తూ.. ఆయన ఇప్పుడు రాష్ట్రానికి సీఎం అయ్యారని విమర్శించారు. పది మంది ఎమ్మెల్యేలపై వేటు వేయకపోతే న్యాయపోరాటం చేస్తానని హెచ్చరించారు.

పార్లమెంట్‌లో తెలంగాణ

సాక్షి, న్యూఢిల్లీ:

తెలంగాణలో 'జల్ జీవన్'నిధులపై కేంద్రం క్లారిటీ

తెలంగాణ ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు రికార్డుల్లో ఉందని కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ నిధుల విడుదల, తాగునీటి కనెక్షన్ల పరిస్థితిపై ఎంపీ కుందూరు రఘువీర్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి వి.సోమన్న సమాధానమిచ్చారు. జల్ జీవన్ మిషన్ కింద కేటాయించిన కేంద్ర వాటా నిధులు పూర్తిగా వినియోగమయ్యాయని.. నీటి సరఫరా రాష్ట్ర పరిధిలోని అంశమని, ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని కేంద్రం స్పష్టం చేసింది.

జల సంరక్షణలో తెలంగాణ జిల్లాలకు జాతీయ అవార్డులు

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో దేశంలోనే 2వ ర్యాంకు సాధించిందని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి తెలిపారు. జాతీయ నీటి అవార్డులు, 'జల సంచయ్ జన్ భాగస్వామ్య'అవార్డులను నవంబర్ 18, 2025న ప్రదానం చేశామని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 'జల సంచయ్'విభాగంలో తెలంగాణలోని ఆదిలాబాద్, నల్లగొండ, మంచిర్యాల, వరంగల్, నిర్మల్, జనగామ, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ జిల్లాలు వివిధ కేటగిరీల్లో టాప్ ర్యాంకులు సాధించి సత్తా చాటాయన్నారు.

తెలంగాణలో 116 కోల్డ్ స్టోరేజీలు

తెలంగాణలో ఇప్పటివరకు 116 కోల్డ్ స్టోరేజీలు (6.17 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం) అందుబాటులో ఉన్నాయని ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పీవీ మిథున్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ బదులిచ్చారు. దేశంలో రైతుల ఆదాయం పెంచేందుకు పీఎం కిసాన్ సంపద యోజన కింద సాయం అందిస్తున్నామని చెప్పారు. కోల్డ్ చైన్ పథకం కింద రూ. 10 కోట్ల వరకు గ్రాంట్ ఇస్తున్నట్లు మంత్రి వివరించారు.

తెలంగాణలో ఫుడ్ ప్రాసెసింగ్ జోరు..

పీఎం కిసాన్ సంపద యోజన కింద తెలంగాణలో ఇప్పటివరకు రూ. 236.21 కోట్లు మంజూరు చేయగా, అందులో రూ. 159.40 కోట్లు విడుదల చేశామని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ బదులిచ్చారు. నిజామాబాద్‌లోని స్మార్ట్ ఆగ్రో ఫుడ్ పార్క్, ఖమ్మంలోని టీఎస్ఐఐసీ పార్కులకు నిధులు మంజూరయ్యాయని, నిజామాబాద్ ప్రాజెక్ట్ ఆపరేషన్‌లో ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క ఎఫ్‌పీవో ప్రాజెక్టు కూడా మంజూరు కాలేదని తెలిపారు.

పెద్దపల్లికి ఏకలవ్య పాఠశాల లేనట్టే!

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల, భూపాలపల్లి జిల్లాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల మంజూరుపై ఎంపీ వంశీకృష్ణ గడ్డం ప్రశ్నించారు. దీనికి కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే నిరాశాజనకమైన సమాధానం ఇచ్చారు. ఈ జిల్లాల్లోని ఏ బ్లాక్‌లోనూ 50 శాతం కంటే ఎక్కువ గిరిజన జనాభా లేకపోవడం, లేదా కనీసం 20 వేల మంది గిరిజనులు ఉండాలన్న నిబంధన నెరవేరకపోవడంతో.. అక్కడ కొత్తగా ఏకలవ్య పాఠశాలలేవీ మంజూరు కాలేదని మంత్రి స్పష్టం చేశారు.

వరంగల్ స్మార్ట్ సిటీ పనులు 87 శాతం పూర్తి

ఈ ఏడాది డిసెంబర్ 1 నాటికి గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీ పరిధిలో రూ. 1,800 కోట్ల విలువైన 119 ప్రాజెక్టులకు గాను.. రూ. 1,498 కోట్ల విలువైన 103 ప్రాజెక్టులు (87%) పూర్తయ్యాయని కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి తోఖన్ సాహు సమాధానమిచ్చారు. మిగిలిన 16 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తిగా రాష్ట్ర పరిధిలోని అంశమని మంత్రి స్పష్టం చేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి 21 రోజులే గడువు!

ఆగస్టు 2024లో జారీ చేసిన కొత్త మార్గదర్శకాల ప్రకారం.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార గడువును 30 రోజుల నుంచి 21 రోజులకు తగ్గించినట్లు కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదుల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ బదులిచ్చారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పనితీరుపై రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానమిస్తూ 2024లో రికార్డు స్థాయిలో 26.15 లక్షల ఫిర్యాదులు అందగా, అందులో 26.45 లక్షల ఫిర్యాదులను పరిష్కరించామని (పాత బకాయిలతో కలిపి) గణాంకాలను వివరించారు. ప్రస్తుతం కార్మిక శాఖలో అత్యధికంగా 11 వేలకు పైగా ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

పీఎఫ్‌సీలో అక్రమాల్లేవ్.. అంతా పారదర్శకమే

విద్యుత్ రంగంలోని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్సీ)లో పదోన్నతుల విధానం, బాస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ నియామకంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్ స్పష్టత ఇచ్చారు. ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ మల్లు రవి లోక్‌సభలో ప్రశ్నించగా కేంద్రమంత్రి స్పందిస్తూ బిజినెస్ స్ట్రాటజీ అధ్యయనం కోసమే బీసీజీని నియమించామని, అది కూడా 'జీఈఎం'పోర్టల్ ద్వారా కాంపిటీటివ్ బిడ్డింగ్ ప్రక్రియలోనే జరిగిందని స్పష్టం చేశారు. బోర్డు డైరెక్టర్ల ఆమోదం మేరకే పదోన్నతుల విధానాన్ని సవరించినట్లు మంత్రి వెల్లడించారు.

అమృత్ నిధులు... విడుదల కాలేదు

అమృత్ 2.0 కింద తెలంగాణకు రూ. 2,789 కోట్ల కేంద్ర సాయం కేటాయించినప్పటికీ.. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో (2022–25) ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు గణాంకాలతో సహా తెలిపారు. పాత అమృత్ పథకం కింద తెలంగాణలో 27 మంచినీటి ప్రాజెక్టులు (రూ.1,424 కోట్లు) పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు.

విమానయానంలో కర్బన ఉద్గారాల తగ్గింపుపై చర్యలు

విమానాశ్రయాలు, విమానాల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలను తగ్గిస్తూ 2070 నాటికి 'నెట్ జీరో'లక్ష్యాన్ని చేరుకుంటామని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహల్ తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ బలరాం నాయక్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, బెంగళూరు విమానాశ్రయాలు ఇప్పటికే 'కార్బన్ న్యూట్రల్'(లెవల్ 5) స్థాయిని సాధించాయని వెల్లడించారు. 2027 నుంచి అంతర్జాతీయ విమానాలకు సీఓఆర్‌ఎస్ఐఏ నిబంధనలు తప్పనిసరి అవుతాయని తెలిపారు.

సాగుబడి

మూల కార్తె: 29 వరకు

- ★ బయోచార్ (కట్టె బొగ్గు).. ఎరువు కాదు.. ఎరువులను సమర్థవంతంగా వాడుకోవడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి తోడ్పడుతుంది
- ★ ఒక్కసారి తగినంత వేస్తే వందల ఏళ్లు నేలలో ఉండి మేలు చేస్తుంది.. సీజనల్ పంటలకైనా, పండ్ల తోటలకైనా బయోచార్ నిజంగా బంగారమే
- ★ పంట వ్యర్థాలతో రైతులే స్వయంగా కట్టె బొగ్గును తయారు చేసుకోవచ్చు
- ★ వట్టి కట్టె బొగ్గును పంటలకు వేయకూడదు.. ఏదైనా సేంద్రియ ఘన/ద్రవ ఎరువులు లేదా రసాయనిక ఎరువులతోనైనా సరే కలిపి 'బయోచార్ కంపోస్టు' తయారు చేసుకొని పొలాల్లో వెయ్యాలి
- ★ బయోచార్ ఫేమ్, ప్రముఖ స్వతంత్ర శాస్త్రవేత్త డా. నక్కా సాయిభాస్కర్ రెడ్డితో 'సాక్షి సాగుబడి' ముఖాముఖి

బయోచార్.. ఈ పేరు చెప్పగానే హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ నక్కా సాయిభాస్కర్ రెడ్డి (55) పేరు చప్పున గుర్తొస్తుంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు అంతర్జాతీయంగా కూడా ఆయన కృషి అపారం. 20 ఏళ్ల క్రితం నుంచి 'బయోచార్' అనే పేరును ఖరారు చేసి.. వ్యవసాయకంగా, పర్యావరణపరంగా దీని ప్రయోజనాల గురించి దేశ విదేశాల్లో విస్తృతంగా పరిశోధనలు, క్షేత్ర ప్రయోగాలు చేస్తూ ఇప్పటికి 5 పుస్తకాలను వెలువరించారు. వెబ్‌సైట్ ద్వారా ఈ ఓపెన్ సోర్స్ పుస్తకాలను అందుబాటులో ఉంచారు. యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రసంగాలను అందరికీ అందుబాటులోకి తెస్తున్నారు. గ్రీన్ రెవెల్యూషన్ తెచ్చిపెట్టిన జటిల సమస్యలకు ఈ నల్ల బంగారం తెచ్చే 'బ్లాక్ రెవెల్యూషన్' పర్యావరణహితమైన పరిష్కారాలు చూపుతుందంటున్నారు డా. సాయిభాస్కర్‌రెడ్డి. బయోచార్‌తో కూడిన కార్బన్ క్రెడిట్స్ అంతర్జాతీయంగా చర్చకొస్తున్న నేపథ్యంలో పారిశ్రామిక వర్గాల్లోనూ బయోచార్‌పై ఆసక్తి పెరిగింది. ఆయనతో 'సాక్షి సాగుబడి' ప్రత్యేక ఇంటర్వ్యూ...

బయోచార్ కంపోస్టు బ్రహ్మాండం

బయోచార్ తయారీ విధానం చూపుతున్న డా. సాయిభాస్కర్‌రెడ్డి

ప్రశ్న: భూసార పరిరక్షణ కృషిలో భాగంగా ఇటీవల బాగా ప్రాచుర్యంలోకి వస్తున్న 'బయోచార్' గురించి మీరు సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. అసలు బయోచార్ అంటే ఏమిటి..?

వ్యవసాయ వర్గాల్లో ఈ మధ్య తరచూ వినవస్తున్న మాట బయోచార్. బయో అంటే జీవం.. చార్ (చార్‌కోల్) అంటే బొగ్గు. బయోచార్ అంటే 'జీవం ఉన్న బొగ్గు' అని చెప్పొచ్చు. భూసారం గురించి మాట్లాడుకునేటప్పుడు సేంద్రియ కర్బనం అనే మాట వినిపిస్తుంది. ఇది ఎంత ఎక్కువ ఉంటే ఆ భూమి అంత సారవంతమైనదని భావిస్తారు. ఏభయ్యేళ్ల క్రితం మన భూముల్లో సేంద్రియ కర్బనం 1% ఉండేదని, ఇప్పుడు రసాయనిక సేద్యం వల్ల 0.3%కి తగ్గిందని మనకు తెలిసిందే. సేంద్రియ కర్బనం మట్టిలో స్థిరంగా ఉండదు. అంటే ఇది అస్థిర కర్బనం (ఒలేటైల్ కార్బన్). దీన్ని మట్టిలో పెంపొందించుకోవటానికి స్థిర కర్బనం (ఫిక్స్‌డ్ కార్బన్) దోహదం చేస్తుంది. అదే బయోచార్.

డా. సాయిభాస్కర్‌రెడ్డి

ప్రశ్న: బయోచార్ కంపోస్టు పంటలకు, నేలకు మంచిదని మీరు అనేక ఏళ్లుగా చెబుతున్నారు. ఇప్పుడిప్పుడే చాలా మంది రైతులు ఆకర్షితులవుతున్నారు. అయితే, బయోచార్ ఉత్పత్తి వల్ల అడవులకు, పర్యావరణానికి ముప్పు లేదా?

బొగ్గు నల్ల బంగారంతో సమానం. బంగారం అని ఎందుకు అన్నానంటే.. ప్రపంచంలో తయారు చేయలేనిది, డబ్బుతో కొనలేనిది మట్టి ఒక్కటే. హరిత విప్లవం పేరుతో మట్టిని మనం నాశనం/ విషతుల్యం/ నిర్జీవం చేసుకున్నాం. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం బయోచార్. అడవులను నరికి బయోచార్ తయారు చేయమని మనం చెప్పటం లేదు. పత్తి కట్టె, కంది కట్టె, వరి పొట్టు వంటి పంట వ్యర్థాలను వట్టిగానే తగులబెట్టే బదులు వాటితో బయోచార్ తయారు చేసుకోవచ్చు. వూరికే పెరిగే సర్కారు తుమ్మ వంటి కంప చెట్ల కలపతో లేదా జీడి గింజల పైపెంకులతో కూడా బయోచార్ తయారు చేసుకోవచ్చు. వరి పొట్టును బాయిలర్లలో, హోటళ్ల పొయ్యిల్లో కాల్చిన తర్వాత మిగిలే వ్యర్థాలను కూడా బయోచార్‌గా వాడుకోవచ్చు.

పరిమితంగా గాలి సోకేలా లేదా పూర్తిగా గాలి సోకకుండా ప్రత్యేక పద్ధతిలో, పెద్దగా పొగ రాకుండా, 450 నుంచి 750 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతతో కాల్చితే (ఈ ప్రక్రియనే 'పైరోలిసిస్' అంటారు) తయారయ్యే నల్లని కట్టె బొగ్గే బయోచార్. ఆరుబయట కట్టెను తగుటబెడితే బూడిద మిగులుతుంది. ఈ పద్ధతిలో అయితే బూడిద తక్కువగా బయోచార్ ఎక్కువగా వస్తుంది. రైతు స్థాయిలో ఇనుప డ్రమ్ములో లేదా కందకం తవ్వి కూడా దీన్ని తయారు చేసుకోవచ్చు. ఇంకా అనేక పారిశ్రామిక పద్ధతులు కూడా ఉన్నాయి. బయోచార్ వందల ఏళ్ల పాటు మట్టిలో ఉండి మేలుచేసే సూక్ష్మజీవరాశికి, పోషకాలకు, మొత్తంగా పర్యావరణానికి ఎంతగానో తోడ్పడుతుంది. సాగు నీటిలో విషాలను పరిహరిస్తుంది. దీనితో వ్యవసాయంలో కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలతో పోల్చితే.. దీన్ని తయారు చేసేటప్పుడు వెలువడే కొద్దిపాటి పొగ వల్ల కలిగే నష్టం చాలా తక్కువ.

ప్రశ్న: 'బయోచార్'కు 'బయోచార్ కంపోస్టు'కు మధ్య తేడా ఏమిటి?

పంట వ్యర్థాలతో తయారు చేసుకున్న బయోచార్‌ను అంటే.. బొగ్గులను లేదా బొగ్గు పొడిని నేరుగా పొలాల్లో పంటలకు, తోటలకు వేయకూడదు. బయోచార్‌ను దేనితో కలపాలి అంటే.. బయోగ్యాస్ స్లర్రీ లేదా మాగిన పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్టు లేదా దిబ్బ ఎరువు లేదా జీవామృతం లేదా పంచగవ్య వంటి ఏదైనా సేంద్రియ ఘన/ ద్రవరూప ఎరువునైనా సమపాళ్లలో కలిపి 15 రోజుల్లో బయోచార్ కంపోస్టును తయారు చేసుకోవచ్చు. బెల్లం నీటిని చిలకరిస్తూ రోజూ కలియ తిప్పుతూ ఉండాలి. 15 రోజుల తర్వాత దీన్ని పొలాల్లో వేసుకుంటే సత్ఫలితాలు వస్తాయి.

చిటికెడు బొగ్గులో లెక్కలేనన్ని సూక్ష్మరంధ్రాలు ఉంటాయి. నేరుగా వేస్తే మట్టిలోని పోషకాలను బొగ్గు పెద్దమొత్తంలో పీల్చుకుంటుంది. అందువల్ల వట్టి బయోచార్‌ను మాత్రమే వేస్తే పంటకు పోషకాలు పూర్తిగా అందవు. అందుకనే. వట్టి బయోచార్‌ను కాకుండా బయోచార్ కంపోస్టును తయారు చేసుకొని వేస్తే ఈ సమస్య ఉండదు.

మట్టిని సారవంతం చేసే సూక్ష్మజీవరాశికి మట్టిలోనే శాశ్వత ఆవాసం కల్పించటం, మట్టి స్వరూప స్వభావాలను సానుకూలంగా మార్చి, మట్టిలోని రసాయనిక పురుగుమందులు, రసాయనిక ఎరువుల అవశేషాలను, కలుషితాలను నిర్మూలించే గొప్ప ఆయుధంగా బయోచార్ కంపోస్టు ఉపయోగపడుతుంది.

బయోచార్ ఒకటి రెండు సీజన్లలో ఖర్చయిపోయే ఎరువు వంటిది కాదని రైతులు గుర్తుంచుకోవాలి. ఒకసారి వేస్తే వంద నుంచి వెయ్యేళ్ల వరకు నేలలో స్థిరంగా ఉండి మేలు చేస్తుంది. పంటలకు, సూక్ష్మజీవులకు, శిలీంధ్రాలకే కాకుండా మొత్తంగా పర్యావరణానికే బయోచార్ సుదీర్ఘ కాలం మేలు చేస్తుంది. 'బయోచార్ కంపోస్టు'తో మట్టిలో సేంద్రియ కర్బనం పెరుగుతుంది. పంట దిగుబడులు పెరుగుతాయి. చీడపీడలు తగ్గుతాయి. రైతు నికరాదాయం పెరుగుతుంది. నా ప్రయోగాల్లో ఇది నిజమైంది. అవగాహనతో చేస్తే మీకూ ఫలితాలు వస్తాయి.

ప్రశ్న: అటు రసాయనిక వ్యవసాయంలో ఇటు సేంద్రియ/ ప్రకృతి వ్యవసాయంలోనూ 'బయోచార్ కంపోస్టు' ఉపయోగపడుతుందా? రసాయనిక ఎరువులు వాడే రైతులకు ఎలా ఉపయోగపడుతుంది?

బయోచార్‌తో సేంద్రియ ఎరువు కలిపి వేసుకుంటే మంచిది. రసాయనిక ఎరువులు వాడే రైతులు కూడా బొగ్గుతో యూరియా, ఫాస్ఫేటు వంటి వాటిని కలిపి వేసుకోవచ్చు. వట్టిగా యూరియా వేస్తే 20–30 శాతం కన్నా పంటకు ఉపయోగపడదు. అదేగనక బయోచార్‌తో యూరియా కలిపి వేస్తే మరింత ఎక్కువగా పంటకు ఉపయోగపడుతుంది. బొగ్గులోని ఖాళీ గదులు ఉంటాయి కాబట్టి యూరియాను కూడా పట్టి ఉంచి, ఎక్కువ రోజుల పాటు పంట మొక్కల వేర్లకు బయోచార్ నెమ్మదిగా అందిస్తుంది.

ప్రశ్న: నీటిని నిల్వగట్టే పద్ధతిలో వరి సాగులో బయోచార్ కంపోస్టు ఎలా ఉపయోగపడుతుంది?

వరి పొలాల్లో నీటిని నిల్వగట్టే పద్ధతి వల్ల మిథేన్ వంటి హరిత గృహ వాయువులు గాలిలో కలుస్తూ వాతావరణాన్ని అమితంగా వేడెక్కిస్తున్నాయి. రసాయనిక ఎరువులు వాడే పొలాల వాయుకాలుష్యం మరింత ఎక్కువ. ఈ పొలాల్లో బయోచార్ వేస్తే.. నీటి అడుగున మట్టిలో ఆక్సిజన్‌ను లభ్యత పెరుగుతుంది. మిథేన్ తదితర హరిత గృహ వాయువులను బొగ్గు పీల్చుకుంటుంది. కాబట్టి, వాతావరణానికి జరిగే హాని తగ్గుతుంది. అందుకనే బయోచార్ వాడితే కార్బన్ క్రెడిట్స్ పేరిట డబ్బు ఇచ్చే పద్ధతులు అమల్లోకి వస్తున్నాయి. పెద్ద మొత్తంలో బయోచార్ తయారు చేసి రైతులకు సరఫరా చేసే కంపెనీలు కూడా వస్తున్నాయి. ఈ కంపెనీలకు కార్బన్ క్రెడిట్ సొమ్ము వస్తుంది. కాబట్టి, తాము తయారు చేసిన బయోచార్‌ను రైతులకు తక్కువ ధరకు ఇచ్చే కంపెనీలు భవిష్యత్తులో మన దేశంలోనూ అందుబాటులోకి వచ్చే అవకాశం వుంది.

ప్రశ్న: బయోచార్ కంపోస్టును మాగాణుల్లో, పండ్ల తోటలకు ఎంతెంత మోతాదుల్లో వేసుకోవాలి?

ఇంత సింపుల్‌గా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పటం సాధ్యం కాదు. ఎందుకంటే.. ప్రతి రైతు భూమీ ప్రత్యేకమైనదే. ఏ నేలకు ఎంత అవసరమో రైతే కొంత శ్రమకోర్చి తెలుసుకోవాలి. ఎవరికి వారే తమ పొలంలో తొలుత కొద్ది విస్తీర్ణంలో వేసుకొని పరీక్షించి చూసి, నిర్ణయించుకోవాలి.

దమ్ము చేసి వరి నాట్లు వేసుకునే రైతులు బొగ్గును పొడిచేసి కంపోస్టుతో కలిపి దుక్కిలో వెద చల్లుకోవాలి. నాట్లు వేసిన తర్వాత వేస్తే బొగ్గు నీటిలో తేలుతూ అంతగా ఉపయోగపడక పోవచ్చు. శ్రీవరి, ఆరుతడి పద్ధతిలో వరిసాగుకు కూడా బయోచార్ కంపోస్టు బాగా ఉపయోగపడుతుంది.

ఇక పండ్ల చెట్లు, కూరగాయల మొక్కలకు చిన్న చిన్న బొగ్గు ముక్కలతో (పొడి చేయనక్కర లేదు) సేంద్రియ ఎరువు కలిపి కంపోస్టు తయారు చేసుకొని మొక్కల దగ్గర్లో పీచు వేర్లు ఉండే దగ్గర వేసుకోవాలి. ఏ పంటైనా, ఏ నేలైనా.. రైతులు ఎవరికి వాళ్లు ఎంత మోతాదు తమ నేలలో పనిచేస్తోందో తక్కువ స్థలంలో 3 నెలలు టెస్ట్ చేసి, ఆ తర్వాతే మిగతా పొలంలో వేసుకోవాలి. ఇది చాలా ముఖ్యం. ఎందుకంటే.. తక్కువ వేస్తే దిగుబడి అంతగా పెరగదు. ఎక్కువ వేస్తే కూడా దిగుబడి తగ్గుతుంది. మీ నేలకు సరిపడా సమతూకంగా వేసుకోవటం ముఖ్యం. ఇతర రైతులను చూసి వేసుకోవటం తగదు. బయోచార్ కంపోస్టు ప్రతి ఏటా వేయనక్కర లేదు. వరుసగా 5–6 ఏళ్లు వేసుకుంటే చాలు. ఆ తర్వాత అవసరం ఉండదు. అందుకని, బయోచార్ కంపోస్టు గురించి శ్రద్ధగా లోతైన అవగాహన కలిగించుకొన్న తర్వాతే రైతులు వాడుకోవాలి. ఆ ఓపిక లేకపోతే దీని జోలికి వెళ్లొద్దు.

ప్రశ్న: ఎంత వెయ్యాలో టెస్ట్ చేసుకోవటం ఎలా?

మీ పొలంలో ఎత్తయిన ప్రదేశంలో 5 చిన్న మడులు చేసుకొని, వాటిల్లో బయోచార్ కంపోస్టును వేర్వేరు మోతాదుల్లో వేసి.. ఆ 5 మడుల్లోనూ ఒకే రకం పంటను సాగు చేయండి. 3 నెలల్లో మీకు ఫలితం తెలిసిపోతుంది.

1 చదరపు మీటరు విస్తీర్ణం (ఈ విస్తీర్ణాన్ని మీరే నిర్ణయించుకోండి)లో పక్క పక్కనే 5 మడులు తయారు చేసుకోండి. అంటే.. మొత్తం 5 చ.మీ. స్థలం కేటాయించండి. ఒక్కో దాని మధ్య గట్టు మాత్రం ఎత్తుగా, బలంగా వేసుకోండి.

1వ మడిలో బయోచార్ కంపోస్టు అసలు వెయ్యొద్దు. 2వ మడిలో బయోచార్ కంపోస్టు 0.5 కిలో, 3వ మడిలో 1 కిలో, 4వ మడిలో 2 కిలోలు, 5వ మడిలో 4 కిలోలు వెయ్యండి. ఈ 5 మడుల్లో 3 నెలల్లో చేతికొచ్చే ఒకే రకం పంట విత్తుకోండి లేదా కూరగాయ మొక్కలు నాటుకోండి. బయోచార్ కంపోస్టు విషయంలో వత్యాసాలు పాటించి చూడటం కోసమే ఈ ప్రయోగాత్మక సాగు. ఇక మిగతా పనులన్నీ ఈ మడుల్లో ఒకేలా చేయండి. అంటే నీరు పెట్టటం, కలుపు తీయటం, పురుగుమందులు లేదా కషాయాలు పిచికారీ చేయటం అన్నీ ఒకేలా చెయ్యండి. ఆ పంటల్లో పెరిగే దశలో వచ్చే మార్పులన్నిటినీ గమనించి, రాసుకోండి. ప్రతి వారానికోసారి ఫొటోలు/వీడియో తీసి పెట్టుకోండి. కాండం ఎత్తు, లావు, పిలకలు/కొమ్మల సంఖ్య, పూత, దిగుబడి, గింజ/కాయల సైజు, ఆ మొక్కల వేర్ల పొడవు వంటి అన్ని విషయాలను నమోదు చేయండి. 3 నెలల తర్వాత ఆ పంట పూర్తయ్యే నాటికి.. బయోచార్ కంపోస్టు అసలు వేయని మడితో పోల్చితే.. వేర్వేరు మోతాదుల్లో వేసిన మడుల్లో వచ్చిన దిగుబడులు పోల్చి చూడండి.. మీకే అర్థం అవుతుంది. ఏమీ వేయని మడిలో కన్నా బయోచార్ కంపోస్టు వేసిన మడిలో ఒక్క పంట కాలంలోనే ఖచ్చితంగా పెరుగుతుంది. ఈ టెస్ట్ ద్వారా మీ పొలంలో ఖచ్చితంగా ఎంత మొత్తంలో బయోచార్ కంపోస్టు వేస్తే సరిపోయేదీ మీకే స్పష్టంగా తెలుస్తుంది. ఆ విషయం ఎవరినో అడిగితే తెలియదు. ఈ విధంగా 'నల్ల బంగారం' తగినంత వేస్తే తరతరాల పాటు మీ భూమికి మేలు చేస్తూనే ఉంటుంది.

ప్రశ్న: లోతైన అవగాహన పొందాలనుకునే వారికి మీ సలహా?

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు రైతులకు శిక్షణ ఇప్పించాలి. నా వెబ్‌సైట్‌లో పుస్తకాలు ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొని సమాచారం చదువుకోవచ్చు. యూట్యూబ్ వీడియోలు చూస్తూ ఉచితంగా అవగాహన పెంచుకోవచ్చు.

https://biochared.com
https://www.youtube.com/@biocharchannel

– నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్

సంప్రదాయ పశు వైద్యంతోనే యాంటీబయాటిక్స్‌కు చెక్

యాంటీబయాటిక్స్ అవశేషాల్లేని పాల ఉత్పత్తికి బాటలు వేస్తున్న ఎన్.డి.డి.బి, యూనివర్సిటీ ఆఫ్ ట్రాన్స్–డిసిప్లినరీ (టీడీయూ)

మనుషులకు, జంతువులకు యాంటీబయాటిక్ ఔషధాలను నిర్దేశిత మోతాదుల కన్నా అధికంగా, విచక్షణా రహితంగా వినియోగిస్తున్నందు వల్ల కొన్ని సూక్ష్మక్రిములు ఈ మందులకు అలవాటు పడిపోయి ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. మొండికేసిన క్రిములు (సూపర్ బగ్స్) తయారవుతున్నాయి. ఇవి ఇప్పుడున్న శక్తివంతమైన యాంటీబయాటిక్స్‌కూ లొంగటం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 7 లక్షల మంది ప్రాణాలను బలిగొంటున్న ఈ సమస్యను యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎ.ఎం.ఆర్.)గా వ్యవహరిస్తున్నాం. చాపకింద నీరులా విస్తరిస్తున్న ఈ మహమ్మారిని అరికట్టడానికి తక్షణం స్పందించకపోతే 2050 నాటికి ఏటా కోటి మంది (ఇందులో 20 లక్షల మంది భారతీయులే) ఎ.ఎం.ఆర్. సమస్యతో చనిపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికి ఉన్న మందులు అసమర్థంగా మారడంతో శరీరం నుంచి ఇన్ఫెక్షన్లను తొలగించడం ఎ.ఎం.ఆర్. కష్టతరం చేస్తుంది.

ఉపయోగించిన యాంటీబయాటిక్స్ పరిమాణంలో 90% విసర్జితాల ద్వారా పర్యావరణంలోకి చేరి నీరు, నేల కలుషితమవుతుంది.

ఎ.ఎం.ఆర్. సమస్యను పరిష్కరించాలంటే.. మనుషులతో పాటు పాలు, గుడ్లు, మాంసం కోసం పెంచే పశుపక్ష్యాదుల కోసం యాంటీబయాటిక్స్ వినియోగాన్ని తగ్గించుకోవాలి.

పాడి పశువులకు వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించడం, జబ్బులు వచ్చినప్పుడు యాంటీబయాటిక్స్‌కు బదులు సంప్రదాయ మూలికలతో కూడిన పశు ఆయుర్వేద పద్ధతులు అనుసరించడం.. తద్వారా ఎ.ఎం.ఆర్. సమస్య నుంచి సమర్థవంతంగా బయటపడవచ్చని శాస్త్రీయంగా రుజువు కావటం సంతోషదాయకం. బెంగళూరులోని యూనివర్సిటీ ఆఫ్ ట్రాన్స్–డిసిప్లినరీ (యు.టి.డి.) హెల్త్ అండ్ టెక్నాలజీ, తమిళనాడు వెటర్నరీ యూనివర్సిటీ నిపుణులు గత పదేళ్లుగా ఈ దిశగా చేస్తున్న విశేష కృషి సత్ఫలితాలనిచ్చింది. 10 రాష్ట్రాల్లో సంప్రదాయ పశువైద్య పద్ధతులను అధ్యయనం చేసి 441 మూలికా వైద్య మిశ్రమాలను గుర్తించారు. వీటిని పరీక్షించి 353 మందులు సురక్షితమైనవని, ప్రభావవంతమైనవని నిర్ధారించారు.

జాతీయ పాడి అభివృద్ధి బోర్డు (ఎన్.డి.డి.బి.) ఈ పశు ఆయుర్వేద పద్ధతులను ఐదేళ్లుగా సహకార సంఘాల ద్వారా పాడి రైతులకు పరిచయం చేసి అద్భుత ఫలితాలను రాబడుతున్నది. 24 రకాల పశు వ్యాధులను నివారించడంలో, నిరోధించడంలోనూ సంప్రదాయ మూలికా మిశ్రమాలు అత్యంత సమర్థవంతంగా పని చేస్తున్నాయని ఎన్.డి.డి.బి. నిర్ధారణకు వచ్చింది. ఈ పద్ధతులను పాడి సంఘాల ద్వారా దేశవ్యాప్తంగా రైతులకు పరిచయం చేస్తోంది. ఏటా యాంటీబయాటిక్ మందుల కొనుగోలుకు రూ. 1.86 కోట్లు ఖర్చు పెట్టే ఎన్.డి.డి.బి. ఈ ఖర్చును సంప్రదాయ మూలికా వైద్యం అనుసరించడం ద్వారా రూ. 50 లక్షలకు తగ్గించుకోగలిగింది. 9 రాష్ట్రాల్లో 1500 గ్రామాల్లో పాడి రైతులకు ఈ మూలికా చికిత్సను ఇప్పటికే నేర్పించింది. తమ పరిసరాల్లోని ఔషధ మొక్కలు, దినుసులతోనే పశు వ్యాధుల నివారణకు, చికిత్సకు ఉపయోగించుకుంటూ శాస్త్రీయంగా యాంటీబయోటిక్ మందుల వాడకాన్ని 80% తగ్గించామని ఎన్.డి.డి.బి. చైర్మన్ మీనేష్ షా ప్రకటించారు. పొదుగు వాపు వ్యాధి, గాలికుంటు వ్యాధులను రసాయనిక యాంటిబయాటిక్స్ వాడకుండా నూటికి నూరు శాతం పూర్తిగా తగ్గించగలిగామని ఆయన తెలిపారు.



పొదుగువాపు వ్యాధికి గురైన పాడి ఆవుకు సంప్రదాయ వైద్యంలో భాగంగా కలబంద, పసుపు, ఉప్పు తదితరాలతో తయారు చేసిన మందును పూస్తున్న దృశ్యం

పాలలో యాంటీబయాటిక్స్‌ను 88% తగ్గించగలిగాం: ప్రొ. నాయర్



యూనివర్సిటీ ఆఫ్ ట్రాన్స్–డిసిప్లినరీ (యు.టి.డి.)లోని మూలికా పశువైద్య పరిశోధనా విభాగం అధిపతి ప్రొ. ఎం.ఎన్. బాలకృష్ణన్ నాయర్, ఆయన సహచరులు డా. ఎన్. పుణ్యమూర్తి, ఎస్.కె. కుమార్‌తో కలిసి పశు ఆయుర్వేద పద్ధతులపై పరిశోధనలు చేస్తున్నారు. కేరళ, తమిళనాడు, కర్ణాటకల్లో 140 మంది పాడి రైతులతో కలసి మూడేళ్ల ప్రయోగాత్మకంగా మూలికా వైద్యంపై అధ్యయనం చేశారు. పాలలో యాంటీబయాటిక్స్ అవశేషాలను 88% తగ్గించగలిగామని ప్రొ. నాయర్ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

ఎన్.డి.డి.బి.తో కలసి ఏపీ, తెలంగాణ సహా 14 రాష్ట్రాల్లోని 30 పాల సంఘాలలో 1750 మంది పశువైద్యులకు, 30 వేల మంది పాడి రైతులకు, 560 మంది గ్రామ రిసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. తమ యూనివర్సిటీలో రైతుల కోసం 4 రోజుల సర్టిఫికెట్ కోర్సు, పశువైద్యుల కోసం 7 రోజుల సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశపెట్టామన్నారు. ఎమ్మెస్సీ, పిహెచ్‌డి కూడా పెట్టామన్నారు. సిక్కిం, హర్యానా, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వాలతో ప్రత్యేక ఒప్పందాలు చేసుకొని రసాయనిక యాంటీబయాటిక్స్ అవసరంలేని పశుపోషణపై శిక్షణ ఇస్తున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాలు ముందుకొస్తే స్వల్ప ఫీజుతోనే ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల పెంపకందారులకు పశు ఆయుర్వేద పద్ధతులపై శిక్షణ ఇస్తామన్నారు.

బిజినెస్ రీల్

టాటా సియెరాకు 70 వేల బుకింగ్స్

ముంబై: సరికొత్తగా ప్రవేశపెడుతున్న ప్రీమియం మిడ్ ఎస్‌యూవి 'సియెరా'కి గణనీయంగా ఆదరణ లభిస్తున్నట్లు టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వివేక్ శ్రీవత్స తెలిపారు. అధికారికంగా బుకింగ్స్ ప్రారంభించిన తొలి రోజునే ఏకంగా 70,000 పైగా ఆర్డర్లు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. అదనంగా 1.35 లక్షల మంది కస్టమర్లు బుకింగ్ ప్రక్రియలో భాగంగా తమకు నచ్చిన కాన్ఫిగరేషన్ వివరాలను అందించినట్లు వివరించారు. మరింత విశాలంగా, విలాసవంతంగా, సౌకర్యవంతంగా లేటెస్ట్ సియెరాను తీర్చిదిద్దినట్లు ఆయన తెలిపారు.

గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ 'ట్విన్ 360'

అవుట్ పేషెంట్ సేవలకూ కవరేజీ

చెన్నై: గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ కొత్తగా 'గెలాక్సీ ట్విన్ 360' పేరుతో హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను ఆవిష్కరించింది. 18–45 ఏళ్ల వయసు వారిని దృష్టిలో పెట్టుకుని దీన్ని తీసుకొచ్చింది. ఇందులో కోర్, మ్యాక్స్, అల్ట్రా అని మూడు రకాలు ఉంటాయి. సమగ్రమైన ఇన్‌పేషెంట్ కవరేజీ (ఐపీడీ)తోపాటు అధిక విలువ కలిగిన అవుట్ పేషెంట్ (ఓపీడీ) ప్రయోజనాలు కలసి ఉంటాయి. ''హెల్త్ ఇన్సూరెన్స్ అన్నది కేవలం ఆస్పత్రిలో చేరిన సమయంలోనే కాకుండా రోజువారీ అవసరాలకు ఉపయోగపడాలి. కనుక ఐపీడీ, ఓపీడీ ప్రయోజనాలతో కూడిన గెలాక్సీ ట్విన్ 360 రోజువారీ బీమా అవసరాలకు ఉపయోగపడుతుంది''అని సంస్థ ఎండీ, సీఈవో జి.శ్రీనివాసన్ తెలిపారు.

సిట్రోయెన్‌తో ఇండస్‌ఇండ్ జనరల్ ఇన్సూరెన్స్ జట్టు

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ సంస్థ సిట్రోయెన్ ఇండియాతో ఇండస్‌ఇండ్ జనరల్ ఇన్సూరెన్స్ (గతంలో రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్) చేతులు కలిపింది. కస్టమర్లకు అనువైన వాహన బీమా సొల్యూషన్స్‌ను అందించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని సంస్థ తెలిపింది. విస్తృత స్థాయి రిస్కులకు కవరేజీ, దేశవ్యాప్తంగా పటిష్టమైన నెట్‌వర్క్, అతి తక్కువ పేపర్‌వర్క్‌తో నగదురహిత క్లెయిమ్ సెటిల్‌మెంట్స్ మొదలైన ప్రయోజనాలను వాహనదారులు పొందవచ్చని ఇండస్‌ఇండ్ జనరల్ ఇన్సూరెన్స్ సీఈవో రాకేశ్ జైన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-12-2025

విశాఖ	675–00
చిత్తూరు	688–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	675–00
విజయవాడ	700–00
రిటైల్ ధర (డజను)	96.00
హైదరాబాద్	650–00
వరంగల్	652–00
రిటైల్ ధర	7.10

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDIGO	5,125.00	2.9
TCS	3,281.20	1.97
MAXHEALTH	1,048.00	1.64
TECHM	1,605.00	1.62
INFY	1,627.10	1.57

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SUNPHARMA	1,746.00	-2.62
TATASTEEL	167.95	-1.4
POWERGRID	257.9	-1.23
ASIANPAINT	2,758.40	-0.98
TATACONSUM	1,169.00	-0.92

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,248
ఎన్ఎస్ఈ	1,53,035
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,75,660
ఎఫ్ఐఐ	+ 1,357
డీఐఐ	- 588

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	56.25 (రాత్రి 11.30కు)	$ 65.24 (క్రితం ముగింపు)
బ్రెంట్	60.06 (రాత్రి 11.30కు)	$ 66.69 (క్రితం ముగింపు)

భారత్‌లో చాట్‌జీపీటీ, పర్‌ప్లెక్సిటీ జోరు

- అతి పెద్ద ఎల్ఎల్ఎం మార్కెట్‌గా ఇండియా
- ప్రయోగాత్మక పరీక్షలకు టెస్ట్‌బెడ్
- బీవోఎఫ్ఏ నివేదిక



ముంబై: చాట్‌జీపీటీ, జెమినీ, పర్‌ప్లెక్సిటీలాంటి ప్లాట్‌ఫాంల వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచంలోనే అతి పెద్ద ఎల్ఎల్ఎం (లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్) మార్కెట్‌గా భారత్ ఎదిగిందని బ్రోకరేజీ సంస్థ బీవోఎఫ్ఏ సెక్యూరిటీస్ ఒక నివేదికలో తెలిపింది. దీనితో స్వతంత్రంగా పనులను చక్కబెట్టగల ఏజెంటిక్ ఏఐ యాప్‌లను ప్రయోగాత్మకంగా పరీక్షించేందుకు భారత్ టెస్ట్ బెడ్‌గా ఉపయోగపడగలదని పేర్కొంది. అయితే, దీనివల్ల దేశీయంగా స్టార్టప్ వ్యవస్థపై కొంత ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని బీవోఎఫ్ఏ సెక్యూరిటీస్ వివరించింది. టెలికం సంస్థలు కాంప్లిమెంటరీగా సబ్‌స్క్రిప్షన్లను ఆఫర్ చేస్తుండటమనేది ఎల్ఎల్ఎం ఆధారిత యాప్‌ల వినియోగం పెరగడానికి ఒకానొక కారణంగా ఉంటోంది. అలాగే, నెలకు 2 డాలర్ల కన్నా తక్కువ ఖర్చుతో 20 జీబీ డేటా ప్లాన్లు చౌకగా లభిస్తుండటం సైతం ఇందుకు దోహదపడుతోంది. నివేదిక ప్రకారం..

- 14.5 కోట్ల మంది నెలవారీ యాక్టివ్ యూజర్లతో భారత్‌లో చాట్‌జీపీటీ అగ్రగామి ఎల్ఎల్ఎంగా నిలుస్తోంది. 10.5 కోట్ల మంది యూజర్లతో జెమినీ రెండో స్థానంలో ఉంది. రోజువారీగా చూస్తే సగటున 6.5 కోట్ల మంది భారతీయులు చాట్‌జీపీటీని ఉపయోగిస్తుండగా, 1.5 కోట్ల మంది యూజర్లతో జెమినీ రెండో ప్లేస్‌లో ఉంటోంది.
- చాట్‌జీపీటీ యూజర్లలో 16 శాతం మంది భారతీయులు ఉన్నారు. తద్వారా సదరు ప్లాట్‌ఫాంనకు అతి పెద్ద మార్కెట్లలో ఒకటిగా భారత్ నిలుస్తోంది. దాని పోటీ సంస్థలకు కూడా భారత్ అతి పెద్ద మార్కెట్లలో ఒకటిగా ఉండటం గమనార్హం. సగటున నెలవారీ గూగుల్ జెమినీ యూజర్లలో 30 శాతం మంది, పర్‌ప్లెక్సిటీ యూజర్లలో 38 శాతం మంది భారత్ నుంచే ఉంటున్నారు.
- జూలైలో చాట్‌జీపీటీ డౌన్‌లోడ్స్ 2.4 కోట్ల గరిష్ట స్థాయికి చేరాయి. ఎయిర్‌టెల్ బండిల్డ్ ప్యాకేజ్ దన్నుతో అక్టోబర్‌లో పర్‌ప్లెక్సిటీ డౌన్‌లోడ్స్ 2 కోట్ల గరిష్ట స్థాయిని తాకాయి.
- ఎల్ఎల్ఎం యాప్‌ల వినియోగం అందరికీ ప్రయోజనకరంగా ఉంటోంది. ప్రాంతీయ భాషల్లోనూ ఇవి అందుబాటులో ఉండటంతో వినియోగదారులు తమ ఉత్పాదకతను పెంచుకునేందుకు, భాషపరమైన పరిమితులను అధిగమించి కొత్త విషయాలను నేర్చుకునేందుకు ఉపయోగకరంగా ఉంటోంది. అటు తమ మోడల్స్‌ను మరింత మెరుగుపర్చుకునేందుకు కావల్సిన డేటా ఎల్ఎల్ఎంలకు లభిస్తోంది. ఇక టెల్కోల విషయం తీసుకుంటే తీవ్రమైన పోటీ ఉండే రంగంలో.. వీటిని ఆఫర్ చేయడం ద్వారా యూజర్లపై వచ్చే సగటు ఆదాయాన్ని పెంచుకునేందుకు వీలవుతోంది.
- స్థానిక ఎల్ఎల్ఎంలు భారీ స్థాయికి ఎదిగేంత వరకు దేశీ స్టార్టప్‌లపై గ్లోబల్ ఎల్ఎల్ఎంల ప్రభావం కొనసాగుతుంది. ఫేస్‌బుక్, యూట్యూబ్‌లాంటి ఉత్పత్తుల ద్వారా మెటా, గూగుల్‌లాంటి దిగ్గజాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించవచ్చు.

అందరికీ అనుకూలంగా ఫండ్స్ కొత్త నిబంధనలు

- సమతుల్యంగా ఉన్నాయ్
- యాంఫి చైర్మన్ సందీప్ సిక్కా



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమకు సంబంధించి సెబీ సవరించిన నిబంధనలు సమతుల్యంగా ఉన్నాయని, ఇన్వెస్టర్లతోపాటు, మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకున్నట్టు అయిందని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా (యాంఫి) చైర్మన్ సందీప్‌సిక్కా తెలిపారు. కొత్త నిబంధనలతో ఫండ్స్ పరిశ్రమకు సైతం స్పష్టత ఏర్పడినట్టు చెప్పారు. మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో పెట్టుబడులకు సంబంధించి ఇన్వెస్టర్లు చెల్లిస్తున్న ఫీజుల్లో మార్పులు ప్రతిపాదిస్తూ కొత్త కార్యాచరణను సెబీ బుధవారం ప్రకటించడం తెలిసిందే. ఏడేళ్ల నుంచి ఫండ్స్ సంస్థలు పెట్టుబడిదారుల నుంచి 0.05 శాతం అదనంగా వసూలు చేస్తున్న ఎగ్జిట్ లోడ్ నిబంధనకు ముగింపు పలకడం గమనార్హం. ఫండ్స్ సంస్థల నుంచి ఈక్విటీ పెట్టుబడులపై బ్రోకరేజీ సంస్థలు వసూలు చేస్తున్న చార్జీల గరిష్ట పరిమితిని 0.12 శాతం నుంచి 0.06 శాతానికి, డెరివేటివ్స్ చార్జీని 0.05 శాతం నుంచి 0.01 శాతానికి తగ్గించింది. ఈ ఏడాది ఆరంభంలో ఫండ్స్‌కు సంబంధించి సెబీ ముసాయిదా నిబంధనలను ప్రకటించింది. అయితే, భాగస్వాముల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, తుది నిబంధనలను ఖరారు చేసినట్టు సెబీ చైర్మన్ తుహిన్‌కాంత పాండే చెప్పారు. దీంతో ఆరంభంలో అంత కఠినంగా తుది నిబంధనల్లేవన్నారు. సెబీ కొత్త నిబంధనలతో స్పష్టత ఏర్పడి, దేశంలో మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ మరింత విస్తరించేందుకు అనుకూలిస్తుందని సిక్కా అభిప్రాయపడ్డారు. సెబీ నిర్ణయాల నేపథ్యంలో గురువారం అస్సెట్ మేనేజ్‌మెంట్ (ఏఎంసీ) కంపెనీల షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో ర్యాలీ చేశాయి.

రూపాయి నిదానంగా కోలుకుంటుంది

- అమెరికాతో ఒప్పందం కుదిరితే సానుకూలం
- జీడీపీ వృద్ధి 7.5 శాతం
- కేర్ ఎడ్జ్ రేటింగ్స్ అంచనా

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26) జీడీపీ 7.5 శాతం వృద్ధిని నమోదు చేయొచ్చని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ అంచనా వేసింది. ''బలమైన స్థూల, ఆర్థిక పరిస్థితులతో భారత్ ఆర్థిక వ్యవస్థ 2026–27లోకి అడుగుపెడుతోంది. వెలుపలి అనిశ్చితులు నెలకొన్నప్పటికీ 2026–27లోనూ రికార్డు స్థాయిలో 7 శాతం వృద్ధిని సాధించొచ్చు''అని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ ముఖ్య ఆర్థికవేత్త రజనీ సిన్హా పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయిలో ఉండడం, వడ్డీ రేట్లు దిగిరావడం, పన్నుల భారం తగ్గడం వృద్ధికి మద్దతునిస్తాయన్నారు. యూఎస్–భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరితే వృద్ధికి అది మరింత ప్రేరణనిస్తుందన్నారు. డాలర్‌తో రూపాయి విలువ 91 స్థాయికి పడిపోగా.. 2026–27 నాటికి 89–90 స్థాయికి పుంజుకుంటుందని కేర్ ఎడ్జ్ అంచనా వేసింది. మూలధన నిధుల వ్యయ చక్రం కోలుకుంటుందన్న దానికి ఆరంభ సంకేతాలు కనిపిస్తున్నాయంటూ.. క్యాపిటల్ గూడ్స్ కంపెనీల బలమైన ఆర్డర్లను నిదర్శనాలుగా పేర్కొంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) బలంగా ఉండడాన్ని ప్రస్తావించింది. కొత్త కార్మిక చట్టం దేశ, విదేశీ ఇన్వెస్టర్లకు మరింత నమ్మకాన్నిస్తుందని అభిప్రాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో వృద్ధి రేటు బలంగా నమోదైనప్పటికీ, ద్వితీయ ఆరు నెలల్లో 7 శాతానికి పరిమితం కావొచ్చని.. పూర్తి ఆర్థిక సంవత్సరానికి 7.5 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. అమెరికా టారిఫ్‌లు భారత రత్నాభరణాలు, టెక్స్‌టైల్స్ ఎగుమతులపై ప్రభావం చూపించాయని.. అదే సమయంలో హాంగ్‌కాంగ్, యూఏఈకి వీటి ఎగుమతులు పెరిగినట్టు తెలిపింది. ఎగుమతుల్లో మారిన ఈ వైవిధ్యాన్ని ఇక ముందు ఎలా ఉంటుందో పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది. కరెంట్ ఖాతా లోటు జీడీపీలో ఒక శాతానికి పరిమితం అవుతుందని, ద్రవ్యలోటును 2026–27లో 4.4 శాతానికి, తదుపరి ఆర్థిక సంవత్సరంలో మరో 0.2% తక్కువకు ప్రభుత్వం కట్టడి చేస్తుందని అంచనా వేసింది.

భారత్ వృద్ధి 7 శాతం: గీతా గోపీనాథ్

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని ఐఎంఎఫ్ మాజీ ముఖ్య ఆర్థికవేత్త గీతా గోపీనాథ్ అభిప్రాయపడ్డారు. ఐఎంఎఫ్ అంచనా 6.6 శాతం అన్నది భారత జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్‌వో) వివరాలు వెల్లడికి ముందు వేసిన అంచనాగా పేర్కొన్నారు. భారత్ వచ్చే 20 ఏళ్ల పాటు 8 శాతం వృద్ధిని కొనసాగిస్తే, వికసిత్ భారత్ లక్ష్యాన్ని 2047 కంటే ముందే సాధించొచ్చన్నారు. ఇందుకు వీలుగా సంస్కరణలను నిలకడగా చేపట్టాల్సి ఉంటుందన్నారు. అమెరికా–భారత్ వాణిజ్య సంక్షోభానికి ముందు అంచనా వేసిన దానికంటే మెరుగ్గానే భారత్ పనితీరు చూపిస్తున్నట్టు పేర్కొన్నారు.

వెండి మరో కొత్త రికార్డు

కిలో ధర రూ. 2.07 లక్షలకు

న్యూఢిల్లీ: వెండి రికార్డుల పరుగు కొనసాగుతోంది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం గురువారం ఢిల్లీ బులియన్ మార్కెట్లో కిలోకి మరో రూ. 1,800 పెరిగి సరికొత్త జీవిత కాల గరిష్ట స్థాయి రూ. 2,07,600కి చేరింది. బుధవారం ఒక్క రోజే ఏకంగా రూ. 7,300 పెరిగి రూ. 2 లక్షల మార్కును అధిగమించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత పెరుగుదలతో ఈ ఏడాది వెండి రేటు రూ. 1,17,100 మేర (129.4 శాతం) ఎగిసినట్లయింది. 2025 జనవరి 1న వెండి రేటు కిలోకి రూ. 90,500గా నమోదైంది. రిటైల్‌తో పాటు సోలార్, ఎలక్ట్రిక్ వాహనాలు, డేటా సెంటర్లు మొదలైన పరిశ్రమల నుంచి డిమాండ్ నెలకొనడం, సరఫరా నెమ్మదించడంలాంటి అంశాలు వెండి ర్యాలీకి కారణమని రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ జిగర్ త్రివేది తెలిపారు. వరుసగా అయిదో ఏడాది కూడా వెండి కొరత కనిపిస్తోందని, 2026లో కూడా ధరల పెరుగుదల కొనసాగవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఇక పసిడి రేటు చూస్తే ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం 10 గ్రాముల రేటు పెద్దగా మార్పు లేకుండా రూ. 1,36,500 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో పుత్తడి రేటు ఔన్సుకి (31.1 గ్రాములు) 13.16 డాలర్లు క్షీణించి 4,325.02 డాలర్లుగా నమోదైంది.

నిధుల నిర్వహణలో పారదర్శకత పాటించాలి

రుణభారాన్ని తగ్గించుకోవాలి: ఆర్థిక మంత్రి సీతారామన్ సూచన

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ద్రవ్య నిర్వహణలో పారదర్శకతకు సంబంధించి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, అమలు చేస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దీనితో రుణభారం గణనీయంగా తగ్గిందని ఆమె తెలిపారు. రాష్ట్రాలు కూడా రుణ భారాన్ని తగ్గించుకునేందుకు ఇదే తరహా విధానాన్ని పాటించాలని సూచించారు. తద్వారా 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న లక్ష్య సాకారంలో తమ వంతు పాత్ర పోషించాలని ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. 'ద్రవ్య నిర్వహణ తీరుతెన్నులు అందరికీ ప్రస్ఫుటంగా తెలిసేలా, అత్యుత్తమ జవాబుదారీతనపు ప్రమాణాలను పాటించేలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ తయారీలో పారదర్శకతకు సంబంధించి స్పష్టమైన లక్ష్యాలను విధించుకుంది. ఫలితంగా కోవిడ్ అనంతరం 60 శాతానికి పైగా ఎగిసిన రుణ, జీడీపీ నిష్పత్తిని తగ్గించగలిగింది. ఇప్పుడిది మరింతగా తగ్గుతోంది' అని ఆమె తెలిపారు. కోవిడ్ అనంతరం రుణ,జీడీపీ నిష్పత్తి 61.4 శాతానికి ఎగిసింది. అయితే, ప్రభుత్వ విధానాలతో 2023–24 నాటికి 57.1 శాతానికి దిగి వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది 56.1 శాతానికి తగ్గొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తరహాలోనే రుణభారాన్ని తగ్గించుకునే దిశగా ద్రవ్య నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్రాలకు మంత్రి సూచించారు.

చమురు రంగంలో పెట్టుబడులకు బూస్ట్

- వివిధ కార్యకలాపాలకు ఒకే లైసెన్సు
- కొత్త నిబంధనలను నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: చమురు, పెట్రోలియం రంగంలో వ్యాపార నిర్వహణను సులభతరం చేయడంతో పాటు మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే దిశగా కేంద్రం కొత్త నిబంధనలను నోటిఫై చేసింది. దీనితో షేల్ గ్యాస్ సహా వివిధ రకాల హైడ్రోకార్బన్స్ అన్వేషణ, అభివృద్ధి, ఉత్పత్తికి బహుళ లైసెన్సుల స్థానంలో ఒకే పెట్రోలియం లీజు విధానం అమల్లోకి వస్తుంది. లీజు వ్యవధి 30 ఏళ్ల పాటు ఉంటుంది. క్షేత్ర స్థితిని బట్టి దీన్ని పొడిగించవచ్చు. ఇక నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి క్రిమినల్ పెనాల్టీలను తొలగించి భారీగా రూ. 25 లక్షల స్థాయిలో ఆర్థిక జరిమానాలు అమల్లోకి వస్తాయి. ఒకవేళ ఉల్లంఘనలు కొనసాగితే రోజుకు రూ. 10 లక్షల చొప్పున జరిమానా ఉంటుంది. పెట్రోలియం లీజు దరఖాస్తులపై 180 రోజుల వ్యవధిలో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆఫ్‌షోర్ కార్యకలాపాల భద్రత, ఆడిట్, ప్రమాణాల విషయంలో ఆయిల్ ఇండస్ట్రీ సేఫ్టీ డైరెక్టరేట్ నిర్ణయాధికారాలు గల సంస్థగా వ్యవహరిస్తుంది. ఇదొక కీలక మైలురాయని చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. వ్యాపారాలు, కార్యకలాపాల నిర్వహణను సులభతరం చేసేలా పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ నిబంధనలు 2025ని సవరించినట్లు చెప్పారు.

చిన్న సంస్థలకు ఏఐ దన్ను

- 500 బిలియన్ డాలర్ల ప్రయోజనాలు పొందవచ్చు
- బీసీజీఎక్స్, ఫిక్కీ నివేదిక



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంతో సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి సంస్థలు (ఎంఎస్ఎంఈ) గణనీయంగా ప్రయోజనం పొందేందుకు ఆస్కారం ఉంది. దీనితో వాటికి 500 బిలియన్ డాలర్లకు పైగా లబ్ధి చేకూరే అవకాశం ఉంది. అయితే, ఇందుకోసం వాటి మైండ్‌సెట్ 'ముందుగా వినియోగించుకోవడం' అనే ధోరణి నుంచి 'ముందుగా ఆవిష్కరించడం' అనే ఆలోచన వైపు మళ్లాల్సి ఉంటుంది. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీఎక్స్), భారతీయ పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ సంయుక్తంగా రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. భారత్‌లో 6.4 కోట్ల ఎంఎస్ఎంఈల ముంగిట అపార అవకాశాలు ఉన్నాయని నివేదిక తెలిపింది.

నివేదికలో మరిన్ని అంశాలు..

- కృత్రిమ మేధ వినియోగానికి సంబంధించి టాప్ దేశాల జాబితాలో భారత్ కూడా ఉంటున్నప్పటికీ, గ్లోబల్ ఏఐ పేటెంట్లలో వాటా మాత్రం 1 శాతం కన్నా తక్కువే ఉంటోంది. ఈ నేపథ్యంలో చిన్న సవాళ్ల పరిష్కారం కోసం ఏఐ ఆధారిత వ్యాపారాలను సృష్టించడంపై దృష్టి పెట్టాలి.
- ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, ప్రాంతీయ వ్యవస్థలవ్యాప్తంగా ఏఐ వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా భారత్ ఉత్పాదకతపరమైన ప్రయోజనాలు పొందడం, నాణ్యమైన ఉద్యోగాలు కల్పించడంతో పాటు దీర్ఘకాలికంగా సామాజిక–ఆర్థిక పటిష్టతను సాధించవచ్చు.
- ఏఐపై ఆసక్తి, పెట్టుబడులకు మధ్య భారీ వ్యత్యాసం ఉంటోంది. దాదాపు 44 శాతం ఎగ్జిక్యూటివ్‌లు ఇప్పటికీ తమ టెక్నాలజీ బడ్జెట్‌లో ఏఐకి కేటాయిస్తున్నది 10% లోపే ఉంటోంది.
- ప్రధానంగా ఏఐ ఆధారిత వ్యాపారాలను నిర్మించడం, మరిన్ని ఆవిష్కరణలు చేయడం, వాటిని అందరికీ అందుబాటులోకి తేవడంలాంటి చర్యలతో కృత్రిమ మేధ పూర్తి సామర్థ్యాలను వినియోగించుకోవచ్చు.
- 2026లో నిర్వహణ విధానాల్లో గణనీయంగా మార్పులు చోటు చేసుకోనున్నాయి. నిర్దిష్ట విధుల నిర్వహణకు, ముందుగా ఏఐని వినియోగించుకోవడం పెరుగుతుంది.

200కు పైగా దేశాలకు భారత ఔషధాలు

- నాణ్యతతో చౌక ధరలకే సరఫరా
- వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్

న్యూఢిల్లీ: భారత్ అంతర్జాతీయంగా నాణ్యమైన ఔషధాలను చౌక ధరలకే అందిస్తున్న విశ్వసనీయ భాగస్వామి అని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఫార్మాస్యూటికల్ ఎగుమతులు 10 శాతం వృద్ధితో 30.47 బిలియన్ డాలర్లకు చేరినట్టు చెప్పారు. చండీగఢ్‌లో ఫార్మా ఎగుమతులపై జరిగిన చర్చా కార్యక్రమాన్ని ఉద్దేశించి వర్చువల్‌గా మాట్లాడారు. ఔషధాల ఉత్పత్తిలో (పరిమాణం పరంగా) భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద దేశంగా ఉందని, విలువపరంగా 14వ స్థానంలో ఉందన్నారు. భారత ఔషధాలు 200కు పైగా దేశాలకు వెళుతున్నట్టు తెలిపారు. ఇందులో అమెరికాకు 34 శాతం, యూరప్‌కు 19 శాతం ఎగుమతి అవుతున్నట్టు చెప్పారు. 3,000కు పైగా కంపెనీలు, 10,500కు పైగా తయారీ యూనిట్లతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. సుంకాలేతర అవరోధాల పరిష్కారం, నియంత్రణపరమైన సహకారాన్ని బలోపేతం చేసుకోవడం, పటిష్టమైన లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల ఎకోసిస్టమ్ ఏర్పాటుపై దృష్టి సారించినట్టు చెప్పారు. దేశీ ఫార్మా మార్కెట్ పరిమాణం 60 బిలియన్ డాలర్లుగా ఉంటుందని, 2030 నాటికి రెట్టింపై 130 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు.

జీఆర్‌టీ జ్యువెలర్స్‌కు టైమ్స్ బిజినెస్ అవార్డు

హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ అరుదైన ఘనత సాధించింది. టైమ్స్ బిజినెస్ అవార్డ్స్ 2025లో ప్రతిష్టాత్మకమైన ''మోస్ట్ ట్రస్టెడ్ లెజెండరీ ఇన్ జ్యువెల్లరీ'' అవార్డు దక్కించుకుంది. తద్వారా దక్షిణ భారత్‌లో అత్యంత గౌరవనీయ ఆభరణాల సంస్థల్లో జీఆర్‌టీ జ్యువెలరీ తన స్థానాన్ని సుస్థిరపరుచుకుంది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ మాట్లాడుతూ... 'మోస్ట్ ట్రస్టెడ్ లెజెండరీ బ్రాండ్'గా గుర్తింపు పొందడం గౌరవంగా ఉందన్నారు. కస్టమర్ల విశ్వాసం, జీఆర్‌టీ కుటుంబ అంకితభావం, ఉన్నత విలువలకు ఈ అవార్డు నిదర్శనమన్నారు. సంప్రదాయ హస్తకళను ఆధునిక ఆవిష్కరణలతో సమన్వయం చేస్తూ.., శాశ్వత సౌందర్యాన్ని ప్రతిఫలించే ఆభరణాలను సృష్టించడం జీఆర్‌టీ లక్ష్యమన్నారు.

ఇండస్‌ఇండ్‌లో వాటా పెంపు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు ఆర్‌బీఐ అనుమతి

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ.. మరో ప్రయివేట్ రంగ సంస్థ ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో వాటా పెంచుకునేందుకు తాజాగా వీలు చిక్కింది. ఇందుకు ఆర్‌బీఐ అనుమతించింది. దీంతో ఇండస్‌ఇండ్‌లో వాటాను 9.5 శాతంవరకూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పెంచుకోనుంది. వాటా పెంపునకు వీలుగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పెట్టుకున్న దరఖాస్తును ఆర్‌బీఐ తాజాగా ఆమోదించినట్లు ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఒక ప్రకటనలో పేర్కొంది. దీంతో బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీ 9.5 శాతంవరకూ వాటా కొనుగోలు చేసేందుకు వీలుంటుందని తెలియజేసింది. వెరసి ఇండస్‌ఇండ్‌లో మొత్తం 9.5 శాతానికి మించకుండా చెల్లించిన మూలధనంలో వాటా లేదా వోటింగ్ హక్కులను హెచ్‌డీఎఫ్‌సీ సొంతం చేసుకోవచ్చునని పేర్కొంది. కాగా.. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం అనుమతి లభించిన ఏడాదిలోగా వాటాను కొనుగోలు చేయవలసి ఉంటుందని, లేకుంటే అనుమతులు రద్దవుతాయని వివరించింది. తాజా అనుమతికి ముందు 5 శాతంకంటే తక్కువ వాటా కలిగి ఉంటే.. మరో 5 శాతం(9.5 శాతంవరకూ) వాటాను సొంతం చేసుకోవలసి ఉంటుంది. అయితే ఇండస్‌ఇండ్ బ్యాంక్ బోర్డులో దరఖాస్తుదారు(హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్) రిప్రజెంటేషన్‌కు అనుమతించరు.

ఈ ఏటి మేటి షోలో సామ్రాట్ 'స్వర్ణ' గురి

ఐఎస్ఎస్ఎఫ్ 'టాప్-5'లో భారత షూటర్ ఘనత

న్యూఢిల్లీ: భారత షూటర్ సామ్రాట్ రాణా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కనబరిచిన స్వర్ణ పతక ప్రదర్శనకు అరుదైన గుర్తింపు దక్కింది. అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) విడుదల చేసిన ఈ ఏడాది మేటి ఐదు ప్రదర్శనల్లో మన షూటర్ ఘనత కూడా నిలిచింది. హరియాణాకు చెందిన 20 ఏళ్ల యువ షూటర్ సామ్రాట్ గత నెల కై రోలో జరిగిన ఈవెంట్‌లో బంగారు పతకం సాధించాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో అసాధారణ గురితో 'స్వర్ణ'ధరికి చేరాడు. తన తండ్రి ఇచ్చిన ప్రోత్సాహం, సొంత వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన చిన్నపాటి షూటింగ్ కేంద్రమే సామ్రాట్‌ను ప్రపంచ చాంపియన్‌గా మలిచింది. ఈ సందర్భంగా ఐఎస్ఎస్ఎఫ్ సామ్రాట్ పసిడి పతక ప్రదర్శనను ఆకాశానికెత్తింది. అద్భుతమని కితాబిచ్చింది.

అక్కడ అతనేం చేశాడంటే...

పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్స్‌కు సామ్రాట్ అర్హత సాధించాడు. కానీ అక్కడ ప్రపంచ నంబర్‌వన్ హు కై (చైనా) ఉన్నాడు. పైగా ఈ ఏడాది అతను ఎవరి చేతిలోనూ ఓడలేదు. అలాంటి అజేయ షూటర్ స్వర్ణం లక్ష్యంగా బుల్లెట్‌లను ఫైర్ చేశాడు. ఇంకో నాలుగైదు షాట్లే మిగిలున్నాయి. చైనా షూటర్ స్పష్టమైన అధిక్యంలో ఉన్నాడు. ఇలాంటి దశలో ఒత్తిడి లేకుండా సామ్రాట్ తన కంటికి లక్ష్యబిందువు తప్ప ఇంకేది కనపడనీయలేదు. ట్రిగ్గర్ నొక్కి కచ్చితత్వంతో కూడిన రెండు వరుస షాట్లు (10.2 పాయింట్లు, 10.6 పాయింట్లు) హరియాణా షూటర్‌కు అసాధారణ విజయాన్ని కట్టబెట్టాయి.

'శత'క్కొట్టిన లాథమ్, కాన్వే

డెవాన్ కాన్వే

తొలి వికెట్‌కు రికార్డు భాగస్వామ్యం ● న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 334/1 ● వెస్టిండీస్‌తో మూడో టెస్టు

మౌంట్ మాంగనీ (న్యూజిలాండ్): సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరుగుతున్న ఆఖరి టెస్టులో న్యూజిలాండ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలో ఉన్న ఆతిథ్య న్యూజిలాండ్ జట్టుకు చివరి పోరులో అదరిపోయే ఆరంభం లభించింది. బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌పై టాస్ గెలిచి సాహసోపేతంగా తొలుత బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్న న్యూజిలాండ్ జట్టు... గురువారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 334 పరుగులు చేసింది. ఓపెనర్లు డెవాన్ కాన్వే (279 బంతుల్లో 178 బ్యాటింగ్; 25 ఫోర్లు), టామ్ లాథమ్ (246 బంతుల్లో 137; 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో కదం తొక్కారు. ఈ జోడీ తొలి వికెట్‌కు రికార్డు స్థాయిలో 323 పరుగులు జోడించింది. న్యూజిలాండ్ గడ్డపై ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం. మరో మూడు ఓవర్లలో తొలి రోజు ఆట ముగుస్తుందనగా... కెప్టెన్ లాథమ్ అవుటయ్యాడు. విండీస్ బౌలర్లలో రోచ్ ఒక వికెట్ పడగొట్టాడు. కాన్వేతో పాటు నైట్ వాచ్‌మన్ జాకబ్ డఫీ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

ఆడుతూ పాడుతూ...

విండీస్ బౌలర్లు పెద్దగా ప్రభావం చూపకపోవడంతో... న్యూజిలాండ్ ఓపెనర్లు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. ఆరంభంలో కొన్ని కఠిన క్షణాలు ఎదుర్కొన్న కాన్వే... క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత చక్కటి షాట్‌లతో ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలో కాన్వే 89 బంతుల్లో, లాథమ్ 102 బంతుల్లో హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత కూడా ఏమాత్రం తొందరపాటుకు పోకుండా ఒక్కో పరుగు జోడిస్తూ ముందుకు సాగారు. పిచ్‌పై పచ్చిక ఊరిస్తున్నా విండీస్ బౌలర్లు దాన్ని వినియోగించుకోలేకపోయారు. కరీబియన్ బౌలర్ల అసహాయతను వాడుకున్న ఈ జంట చూస్తుండగానే సెంచరీల వైపు అడుగులు వేసింది. అర్ధశతకం తర్వాత వేగం పెంచిన కాన్వే 147 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకోగా... లాథమ్ 183 బంతుల్లో ఈ మార్క్ అందుకున్నాడు. 'తొలి రోజు ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నా. ఈ పిచ్‌పై నాలుగో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడం కష్టం. అందుకే వికెట్‌పై పచ్చిక ఉన్నప్పటికీ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాం. సాధారణం కంటే ఎక్కువసేపు క్రీజులో నిలవాలని ముందుగానే అనుకున్నాం' అని న్యూజిలాండ్ సారథి లాథమ్ అన్నాడు. 2011 తర్వాత న్యూజిలాండ్ జట్టు సొంతగడ్డపై టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకోలేదు. చివరిసారిగా పాకిస్తాన్‌పై వెటోరీ ఈ నిర్ణయం తీసుకోగా... ఇప్పుడు లాథమ్ ఆ సాహసం చేశాడు. ఈ రెండు మ్యాచ్‌ల్లో కెప్టెన్‌లు సెంచరీలు చేయడం విశేషం.



లాథమ్

323 ఈ మ్యాచ్‌లో ఓపెనర్లు లాథమ్, కాన్వే తొలి వికెట్‌కు జోడించిన పరుగులు. టెస్టు క్రికెట్‌లో న్యూజిలాండ్ తరఫున ఇది రెండో అత్యధికం. గ్లెన్ టర్నర్, టెర్రీ జార్విస్ 1972లో వెస్టిండీస్‌పై 387 పరుగులు జోడించి అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. సొంతగడ్డపై న్యూజిలాండ్ జట్టుకు ఇదే అత్యధిక తొలి వికెట్ భాగస్వామ్యం. గతంలో 1930, 1999లో రెండుసార్లు ఓపెనింగ్ వికెట్‌కు 276 పరుగుల భాగస్వామ్యాలు నమోదయ్యాయి.

178 తొలి రోజు ఆట ముగిసే సమయానికి కాన్వే స్కోరు. న్యూజిలాండ్ తరఫున టెస్టు మ్యాచ్‌లో ఒకే రోజు అత్యధిక పరుగులు చేసిన మూడో బ్యాటర్‌గా కాన్వే నిలిచాడు. మెకల్లమ్ 195 పరుగులు (2014లో శ్రీలంకపై), టామ్ లాథమ్ 186 పరుగులు (2022లో బంగ్లాదేశ్‌పై) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

6 సుదీర్ఘ టెస్టు చరిత్రలో న్యూజిలాండ్ ఓపెనర్లిద్దరూ ఒకే ఇన్నింగ్స్‌లో సెంచరీలు చేయడం ఇది ఆరోసారి. 2019లో చివరిసారిగా లాథమ్, జీత్ రావల్ 'శత'క్కొట్టగా... ఆరేళ్ల తర్వాత కాన్వే, లాథమ్ ఈ ఫీట్ నమోదు చేశారు.

విజేతకు రూ. 450 కోట్లు

- వచ్చే ఏడాది ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీ ప్రైజ్‌మనీ వివరాలు ప్రకటించిన 'ఫిఫా'
- 2022 ప్రపంచకప్‌తో పోలిస్తే 48.9 శాతం పెరిగిన మొత్తం ప్రైజ్‌మనీ
- అర్హత పొందిన 48 జట్లకూ లభించనున్న ప్రైజ్‌మనీ

దోహా: మరో ఏడు నెలల్లో జరగనున్న ప్రపంచకప్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు సంబంధించి ప్రైజ్‌మనీ వివరాలను అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య (ఫిఫా) గురువారం వెల్లడించింది. ఈసారి విజేత జట్టుకు 5 కోట్ల డాలర్లు (రూ. 450 కోట్లు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి. రన్నరప్ జట్టు ఖాతాలో 3 కోట్ల 30 లక్షల డాలర్లు (రూ. 297 కోట్లు) చేరుతాయి. 2026 ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఓవరాల్ ప్రైజ్‌మనీ 65 కోట్ల 50 లక్షల డాలర్లు (రూ. 5,905 కోట్లు) కావడం విశేషం. 2022లో ఖతర్‌లో జరిగిన ప్రపంచకప్‌తో పోలిస్తే ఈసారి మొత్తం ప్రైజ్‌మనీలో 48.9 శాతం పెరుగుదల ఉంది. 2022 ప్రపంచకప్ మొత్తం ప్రైజ్‌మనీ 44 కోట్లు కావడం గమనార్హం. 2022 ప్రపంచకప్‌లో టైటిల్ నెగ్గిన అర్జెంటీనా జట్టుకు 4 కోట్ల 20 లక్షల డాలర్లు... రన్నరప్ ఫ్రాన్స్ జట్టుకు 3 కోట్ల 80 లక్షల డాలర్లు లభించాయి. 2026 ప్రపంచకప్ జూన్ 11 నుంచి జూలై 19 వరకు అమెరికా, మెక్సికో, కెనడాలలో నిర్వహిస్తారు. తొలిసారి 48 జట్లతో ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు. దోహాలో జరిగిన 'ఫిఫా' కౌన్సిల్ సమావేశంలో ప్రైజ్‌మనీ వివరాలకు ఆమోదం లభించింది. ఎప్పటిలాగే టోర్నీకి అర్హత సాధించిన అన్ని జట్లకు 'ఫిఫా' నుంచి భారీ మొత్తం అందనుంది. మెగా ఈవెంట్‌కు అర్హత పొందినందుకు 48 జట్లకు 90 లక్షల డాలర్ల (రూ. 8 కోట్ల 11 లక్షలు) చొప్పున పార్టిసిపేషన్ ఫీజు... ప్రపంచకప్ సన్నాహాల ఖర్చుల కింద 15 లక్షల డాలర్ల (రూ. 1 కోటీ 35 లక్షలు) చొప్పున 'ఫిఫా' చెల్లిస్తుంది. 'ఫిఫా' చెల్లించే మొత్తం ఆయా దేశాల ఫుట్‌బాల్ సమాఖ్యలకు వెళుతుంది. తమ క్రీడాకారులకు ఎంత మొత్తం చెల్లించాలో ఆయా దేశాల సమాఖ్యలే నిర్ణయం తీసుకుంటాయని 'ఫిఫా' వివరించింది.

ఎవరికెంత ప్రైజ్‌మనీ అంటే...

విజేత:	5 కోట్ల డాలర్లు (రూ. 450 కోట్లు)
రన్నరప్:	3 కోట్ల 30 లక్షల డాలర్లు (రూ. 297 కోట్లు)
మూడో స్థానం:	2 కోట్ల 90 లక్షల డాలర్లు (రూ. 261 కోట్లు)
నాలుగో స్థానం:	2 కోట్ల 70 లక్షల డాలర్లు (రూ. 243 కోట్లు)
5 నుంచి 8 స్థానాల్లో నిలిచిన జట్లకు	1 కోటీ 90 లక్షల డాలర్ల చొప్పున (రూ. 171 కోట్లు చొప్పున)
9 నుంచి 16 స్థానాల్లో నిలిచిన జట్లకు	1 కోటీ 50 లక్షల డాలర్ల చొప్పున (రూ. 135 కోట్లు చొప్పున)
17 నుంచి 32 స్థానాల్లో నిలిచిన జట్లకు	1 కోటీ 10 లక్షల డాలర్ల చొప్పున (రూ. 99 కోట్లు చొప్పున)
33 నుంచి 48 స్థానాల్లో నిలిచిన జట్లకు	90 లక్షల డాలర్ల చొప్పున (రూ. 81 కోట్లు చొప్పున)

ఇంగ్లండ్ ఎదురీత

- తొలి ఇన్నింగ్స్‌లో 213/8
- మరో 158 పరుగులు వెనుకంజ
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 371 ఆలౌట్
- స్టార్క్ అర్ధసెంచరీ
- ఆర్చర్‌కు ఐదు వికెట్లు
- 'యాషెస్' మూడో టెస్టు

స్టోక్స్, ఆర్చర్

అడిలైడ్: ప్రతిష్టాత్మక 'యాషెస్' సిరీస్‌లో ఇంగ్లండ్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇప్పటికే తొలి రెండు టెస్టుల్లో ఓడిన బెన్ స్టోక్స్ సారథ్యంలోని ఇంగ్లండ్ జట్టు... మూడో టెస్టులోనూ పెద్దగా మెరుగైనట్లు కనిపించడం లేదు. గురువారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 68 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. టాపార్డర్ వైఫల్యం ఇంగ్లండ్‌ను దెబ్బ కొట్టింది. కెప్టెన్ బెన్ స్టోక్స్ (151 బంతుల్లో 45 బ్యాటింగ్; 3 ఫోర్లు), హ్యారీ బ్రూక్ (63 బంతుల్లో 45; 2 ఫోర్లు, 1 సిక్స్), జోఫ్రా ఆర్చర్ (48 బంతుల్లో 30 బ్యాటింగ్; 4 ఫోర్లు) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశారు. జాక్ క్రాలీ (9), ఒలీ పోప్ (3), డకెట్ (29), జో రూట్ (19) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్ల ధాటికి ఇంగ్లండ్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోగా... బెన్ స్టోక్స్ మొండిగా పోరాడాడు. 'బాజ్‌బాల్' ఆటతీరును పక్కన పెట్టిన ఇంగ్లండ్ సారథి... సంప్రదాయ టెస్టు క్రికెట్ ఫార్మాట్‌లో ఓవర్లకు ఓవర్లు క్రీజులో పాతుకుపోయి బ్యాటింగ్ చేశాడు. ఈ క్రమంలో బ్రూక్‌తో ఐదో వికెట్‌కు 56 పరుగులు జోడించిన స్టోక్స్... అబేధ్యమైన తొమ్మిదో వికెట్‌కు ఆర్చర్‌తో 45 పరుగులు జోడించాడు. కంగారూ పేసర్లు పరీక్షిస్తున్న స్టోక్స్, ఆర్చర్ జంట చక్కటి పోరాటం కనబర్చడంతో ఇంగ్లండ్ జట్టు ఆ మాత్రం స్కోరైనా చేసింది. చేతిలో రెండు వికెట్లు ఉన్న ఇంగ్లండ్... ఆసీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 158 పరుగులు వెనుకబడి ఉంది. గత రెండు మ్యాచ్‌ల్లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు దక్కించుకున్న మిచెల్ స్టార్క్ ఈసారి కాస్త శాంతించగా... ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ 3 వికెట్లతో సత్తా చాటాడు. స్కాట్ బోలాండ్, నాథన్ లయన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఈ క్రమంలో టెస్టుల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన రెండో ఆస్ట్రేలియా బౌలర్‌గా లయన్ నిలిచాడు. పేస్ దిగ్గజం మెక్‌గ్రాత్‌ను అతడు అధిగమించాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 326/8తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా... చివరకు 91.2 ఓవర్లలో 371 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ స్టార్క్ (75 బంతుల్లో 54; 9 ఫోర్లు) హాఫ్‌సెంచరీతో రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 5 వికెట్లు పడగొట్టగా... కార్స్, జాక్స్ చెరో రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు.

లయన్

2 టెస్టుల్లో ఆస్ట్రేలియా తరఫున అత్యధిక వికెట్లు పడగొట్టిన జాబితాలో లయన్ (564) రెండో స్థానానికి చేరాడు. లయన్ ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు తీయడం ద్వారా... పేస్ దిగ్గజం గ్లెన్ మెక్‌గ్రాత్ (563)ను అధిగమించాడు. 708 వికెట్లతో షేన్ వార్న్ అగ్రస్థానంలో ఉన్నాడు.

మన ఫుట్‌బాల్ సంగతేంటి?

- లక్షన్నర జనాభా గల కురసావ్ దేశం ప్రపంచకప్‌కు అర్హత సాధించగా...
- 143 కోట్ల జనాభా ఉన్న భారత్ పరిస్థితి ఏంటి!
- రాజ్యసభలో ఆసక్తికర చర్చ

న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టుపై గురువారం రాజ్యసభలో ఆసక్తికరచర్చ జరిగింది. 1 లక్షా 58 వేల జనాభా మాత్రమే ఉన్న కురసావ్ దేశం జట్టు వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత సాధించింది. అయితే 143 కోట్ల జనాభా ఉన్న భారత్ సంగతేంటని కేరళకు చెందిన కాంగ్రెస్ సభ్యులు జోస్ కె. మణి రాజ్యసభలో ప్రశ్నించారు. మన ఫుట్‌బాల్ జట్టు ప్రగతిపై దీర్ఘకాలిక ప్రణాళికలేవైనా ఉన్నాయా అని కూడా అడిగారు. దీనిపై కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ స్పందిస్తూ కురసావ్ దేశం పేరెత్తకుండా బదులిచ్చారు. 'ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు అర్హత సాధించడం అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య (ఫిఫా) నిర్దేశించిన ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది' అని అన్నారు. ఏదైనా ప్రపంచకప్ లేదంటే ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో



పాల్గొనడానికి, అర్హత సంపాదించడానికి సంబంధిత జాతీయ క్రీడా సమాఖ్య చూసుకోవాల్సిన అంశమని, ఆయా క్రీడల నిర్దిష్ట అభివృద్ధికి సంబంధిత సమాఖ్యలదే బాధ్యతని ఆయన సభకు వివరించారు. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) దేశంలో క్రీడాభివృద్ధికి, ఆదరణ పెంచేందుకు, ప్రతిభగల ఫుట్‌బాలర్లను మరింత సానబెట్టేందుకు, పురుషులు, మహిళల జట్టు 'ఫిఫా' మెగా ఈవెంట్‌కు అర్హత సాధించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్తాయని మంత్రి మాండవీయ వివరించారు. తమ ప్రభుత్వ పరంగా 'ఖేలో ఇండియా' పేరుతో చేపట్టిన బృహత్తర కార్యక్రమం ద్వారా ప్రతిభావంతులైన అథ్లెట్లు ఎందరో వెలుగులోకి వచ్చారని, 20 వేల పైచిలుకు క్రీడాకారులు ఈ ఖేలో ఇండియాతో ప్రయోజనం పొందారని చర్చ సందర్భంగా జవాబిచ్చారు. దేశంలో ఉన్న 991 ఖేలో ఇండియా కేంద్రాల్లో 28,214 మంది క్రీడాకారులు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారని చెప్పారు.

సుదీక్ష శివాని

శివానికి రజతం... సుదీక్షకు కాంస్యం

సాక్షి, హైదరాబాద్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్లు కర్రా శివాని, సుదీక్ష కృష్ణ పతకాలతో మెరిశారు. న్యూఢిల్లీలోని శ్యామాప్రసాద్ ముఖర్జీ స్విమ్మింగ్‌పూల్‌లో ఈ పోటీలు జరిగాయి. అండర్–14 బాలికల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో శివాని రజత పతకం సొంతం చేసుకుంది. 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ దూరాన్ని 1 నిమిషం 09.97 సెకన్లలో పూర్తి చేసిన శివాని రెండో స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో శివానికిది మూడో పతకం కావడం విశేషం. సోమవారం శివాని 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రజతం, 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో స్వర్ణం సాధించింది. మరోవైపు అండర్–19 బాలికల 50 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో సుదీక్ష కృష్ణ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. సుదీక్ష 28.24 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచింది.

తైవాన్‌కు రూ.లక్ష కోట్ల ఆయుధాలు

విక్రయించేందుకు అమెరికా అంగీకారం

- తమ భద్రతకు ముప్పంటూ చైనా అభ్యంతరం
- ఏక చైనా విధానాన్ని తుంగలో తొక్కిందని ఆగ్రహం

వాషింగ్టన్/బీజింగ్: చైనాతో టారిఫ్‌ల యుద్ధం ఓ వైపు కొనసాగిస్తూనే, మరో వైపు తైవాన్‌కు భారీగా అత్యాధునిక ఆయుధాలను విక్రయించేందుకు అగ్రరాజ్యం అమెరికా సిద్ధమైంది. ఏకంగా రూ.1 లక్షా 188 కోట్లు(11.1 బిలియన్ డాలర్లు) విలువైన క్షిపణులు, హోవిట్జర్లు, డ్రోన్లు తదితర అత్యాధునిక ఆయుధాలను విక్రయించనున్నట్లు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించిన అధ్యక్షుడు ట్రంప్..విదేశాంగ విధానానికి సంబంధించిన అంశాలను గానీ, చైనా, తైవాన్‌ల గురించి గానీ ప్రస్తావించలేదు. ట్రంప్ ప్రతిపాదనకు కాంగ్రెస్ ఆమోదం తెలిపిన పక్షంలో.. తైవాన్‌కు అమెరికా అందించే అతిపెద్ద ఆయుధ ప్యాకేజీగా నిలవనుంది. తైవాన్ రక్షణ శాఖతో కుదిరిన 8 ఒప్పందాల్లో 82 హై మొబిలిటీ ఆర్టిలరీ రాకెట్ వ్యవస్థలు(హైమార్స్), 420 ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్స్(అట్‌కామ్స్), 60 సెల్ఫ్ ప్రొపెల్డ్ హోవిట్జర్ వ్యవస్థలు, డ్రోన్లు, మిస్సైళ్లు ఉన్నాయి. ఎప్పటికైనా తైవాన్ తమ దేశంలో కలిసిపోవాల్సిందేనంటున్న చైనా.. ఇటీవల ఆ దిశగా దూకుడుగా వ్యవహరిస్తోంది. అంతేకాదు, అమెరికా–చైనాల మధ్య సంబంధాలు ఇప్పటికే ఉప్పూనిప్పుగా సంబంధాలు కొనసాగుతున్న వేళ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై డ్రాగన్ దేశం తీవ్రంగా స్పందించింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఒకే చైనా విధానానికి అమెరికా తూట్లు పొడిచిందని, తమ ప్రాదేశిక సమగ్రతకు భంగం కలిగించేలా వ్యవహరిస్తోందని మండిపడింది.

గురువారం బోస్నియా రాజధాని సరయేవోను దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో, ఆకాశహర్మ్యాలు కనిపించీ కనిపించకుండా కనిపించాయిలా!

అతడిని ఇలాగే ఉంచడం సరికాదు

- 12 ఏళ్లుగా కోమాలోనే ఉన్న యువకుడి కేసులో సుప్రీం వ్యాఖ్య
- త్వరలో అతడి తల్లిదండ్రులను కలవనున్న ధర్మాసనం
- కారుణ్య మరణానికి అనుమతినిచ్చే అవకాశం

న్యూఢిల్లీ: 12 ఏళ్లుగా కోమాలోనే ఉన్న ఓ యువకుడి తల్లిదండ్రులను కలుసుకునేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది. అతడికి కల్పించిన కృత్రిమ శ్వాస, కృత్రిమ ఆహారాన్ని నిలిపివేయడం ద్వారా కారుణ్య మరణాని(యుథనేసియా)కి అనుమతివ్వాలని తల్లిదండ్రులు పెట్టుకున్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా గురువారం ఈ మేరకు పేర్కొంది. పంజాబ్ వర్సిటీ విద్యార్థి అయిన హరీశ్ రాణా 2013లో తనుండే హాస్టల్ నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి పోయాడు. తలకు తీవ్ర గాయాలైన రాణా అప్పటి నుంచి కోమాలోనే ఉన్నాడు. అతడికి వైద్యులు కృత్రిమ శ్వాసం, ద్రవాహారాన్ని పైపు ద్వారా లోపలికి పంపించే ఏర్పాటు చేశారు. దాదాపు 12 ఏళ్లుగా అతడు స్పృహలోకి రాలేదు. అతడి తల్లిదండ్రులు నిరుపేదలు. కుమారుడిని బతికించుకునేందుకు తాము ఉండే ఇంటిని సైతం అమ్ముకున్నారు. హరీశ్(31) ఏళ్లుగా మంచానికే పరిమితమైపోవడంతో వీపంతా పుండుగా మారిపోయింది. కుమారుడి అవస్థలను చూడలేక తల్లిదండ్రులు అతడికి చనిపోయే అవకాశమివ్వాలని కోర్టును ఆశ్రయించారు. అతడికి యుథనేసియా సరైందేనని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. ఇందుకోసం ప్రత్యేక వైద్య బృందం ఏర్పాటు అవసరం లేదని పేర్కొంది. దీంతో, తల్లిదండ్రులు సుప్రీంను ఆశ్రయించారు. సుప్రీం ఆదేశాల మేరకు నోయిడాలోని జిల్లా కోర్టు ప్రాథమిక నివేదిక కోసం నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. వారు హరీశ్ పరిస్థితిని స్వయంగా పరిశీలించి, నివేదిక అందజేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం..'చాలా విచారం కలిగించే నివేదిక ఇది. అతడిని ఇదే పరిస్థితిలో కొనసాగనివ్వడం సరికాదు'అని పేర్కొంది. వచ్చే జనవరి 13వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ఆస్పత్రిలో ఉన్న హరీశ్ రాణాను తాము స్వయంగా చూస్తామని తెలిపింది. అదే సమయంలో, నిబంధనల ప్రకారం వచ్చే బుధవారం కల్లా ఎయిమ్స్ నిపుణుల నుంచి రెండో నివేదిక తెప్పించాల్సిందిగా అధికారులను ఆదేశించింది. కారుణ్య మరణానికి సుప్రీంకోర్టు అనుమతించిన పక్షంలో అతడిని సజీవంగా ఉంచుతున్న కృత్రిమ శ్వాస, ఆహారం సరఫరాను నిలిపివేయడం లేదా చికిత్సను నిలిపివేయడం ద్వారా చనిపోయేలా చేస్తారు.

ఊరు మూరెడు.. పురుళ్లు బారెడు

అది ఒక చిన్న గ్రామం..

జనాభా కేవలం 1500. కానీ, మూడు నెలలుగా అక్కడ పుట్టిన పిల్లల సంఖ్య ఎంతో తెలుసా? అక్షరాలా 27,397..! వినడానికి విడ్డూరంగా ఉన్నా, ఇది మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లాలో వెలుగుచూసిన ఒక భారీ కుంభకోణం. ఈ లెక్కలు చూసి సాక్షాత్తూ అధికారులే కంగుతిన్నారు. ఈ 'జనన ధ్రువపత్రాల' మాయాజాలం వెనుక ఉన్న అసలు కథేంటి?

1,500 మంది జనాభా.. 27 వేల జనన ధ్రువపత్రాలు ● మహారాష్ట్రలో భారీ కుంభకోణం

సర్వేలో సైబర్ నేరం బట్టబయలు

యావత్మాల్ జిల్లా ఆర్నీ తహసీల్‌లోని షెందురుసాని గ్రామ పంచాయతీలో.. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి నవంబర్ నెలల మధ్య జనన, మరణ ధ్రువపత్రాల తనిఖీ కోసం అధికారులు ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అప్పుడే అసలు బండారం బయటపడింది. జనాభా 1500 దాటని గ్రామంలో, వేల సంఖ్యలో పుట్టినట్లు నమోదైన గణాంకాలను చూసి ఉన్నతాధికారులకు దిమ్మ తిరిగింది. ఇది కేవలం పొరపాటు కాదు.. ఒక వ్యవస్థీకృత సైబర్ నేరమని అర్థమైంది.

ముంబై నుంచి నియంత్రణ

ప్రాథమిక దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. గ్రామ పంచాయతీకి చెందిన సీఆర్ఎస్ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్) లాగిన్ ఐడీని సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. ఈ ఐడీని ముంబై నుంచి నియంత్రిస్తున్నట్లు గుర్తించారు. గ్రామానికి సంబంధం లేని వ్యక్తుల పేర్లతో ఈ ధ్రువపత్రాలను సృష్టించారు.

కుంభకోణంలోని ప్రధానాంశాలు

అన్నీ బయటి పేర్లే: ఈ 27,397 మందిలో 99 శాతం పేర్లు పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవని బీజేపీ నేత కిరిత్ సోమయ్య వెల్లడించారు.

ఐడీ దుర్వినియోగం: గ్రామం పరిధితో ఏమాత్రం సంబంధం లేని వ్యక్తుల పేర్లతో జనన ధ్రువపత్రాలు జారీ అయ్యాయి.

భారీ నెట్‌వర్క్: ప్రభుత్వ పథకాల లబ్ధి కోసమో లేదా నకిలీ గుర్తింపు కార్డుల సృష్టి కోసమో ఈ భారీ స్కామ్ జరిగి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

రంగంలోకి ఉన్నతాధికారులు

ఈ ఘటనపై జిల్లా పరిషత్ సీఈవో మందార్ పట్కీ ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా ఆరోగ్య అధికారి ఫిర్యాదుతో యావత్మాల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో మాట్లాడినట్లు, ఈ నకిలీ రిజిస్ట్రేషన్లన్నింటినీ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసినట్లు బీజేపీ నేత కిరిత్ సోమయ్య తెలిపారు.

దర్యాప్తు ముమ్మరం

ప్రస్తుతం భారతీయ న్యాయ సంహిత, ఐటీ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. ఒక చిన్న గ్రామం కేంద్రంగా జరిగిన ఈ భారీ సైబర్ నేరం వెనుక ఎవరున్నారు? దీని వెనుక ఉన్న అంతర్జాతీయ కుట్ర కోణం ఏంటి? అనే దిశగా దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. సాంకేతిక పరిజ్ఞానం ఎంత వేగంగా పెరుగుతుందో, దాన్ని అడ్డు పెట్టుకుని జరిగే మోసాలు కూడా అంతే విస్మయం కలిగిస్తున్నాయి. షెందురుసాని గ్రామంలో వెలుగు చూసిన ఈ 'జననాల పెంపు' కుంభకోణం ఇప్పుడు మహారాష్ట్రలో సంచలనం సృష్టించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

సీపీఎన్-యూఎంఎల్ ఛైర్మన్‌గా ఓలి

ఖాట్మండూ: నేపాల్ మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలి కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్–యూనిఫైడ్ మార్క్సిస్ట్, లెనినిస్ట్(సీపీఎన్–యూఎంఎల్) ఛైర్మన్‌గా మూడోసారి ఎన్నికయ్యారు. దేశంలో సెప్టెంబర్‌లో జెన్–జీ ఆందోళనలతో రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఈ ఉద్యమంలో 77 మంది మరణించారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల నష్టం జరిగింది. దీంతో ప్రధాని కేపీ ఓలీ సహా పలువురు మంత్రులు రాజీనామా చేయడం తెలిసిందే. మూడు నెలల తరువాత ఇటీవల జరిగిన పార్టీ 11వ జనరల్ కన్వెన్షన్‌లో ఓలి.. తన ప్రత్యర్థి ఈశ్వర్ పోఖారెల్‌పై విజయం సాధించారు. ఖాట్మండూలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఓటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్, ఆఫీస్ బేరర్లు, కేంద్ర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. 2,263 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 1663 ఓట్లతో ఓలి విజయం సాధించారు. పోఖారెల్‌కు 583 ఓట్లు వచ్చాయి. తొమ్మిదవ, పదో సమావేశాల్లోనూ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఓలి.. దశాబ్దానికి పైగా పార్టీ అత్యున్నత పదవిలో ఉన్నారు.

ఢిల్లీలో రెండు నెలల్లో 1.56 లక్షలకు పైగా పీయూసీ చలాన్లు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో వాహన కాలుష్యాన్ని అరికట్టడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. పొల్యూషన్ అండర్ కంట్రోల్(పీయూసీ) సర్టిఫికెట్ లేకుండా నడుస్తున్న వాహనాలపై చలాన్లను ముమ్మరం చేసింది. గత రెండు నెలల్లో 1.56 లక్షలకు పైగా చలాన్లు జారీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2023లో 2.32 లక్షలున్న చలాన్ల సంఖ్య 2024లో 5.98 లక్షలకు చేరింది. ఇక 2025లో డిసెంబర్ నాటికే 8.22 లక్షలకు పెరిగింది. ఇందులో ఈ ఏడాది అక్టోబర్ 14 నుంచి డిసెంబర్ 15 మధ్య ఒక్కొక్క వాహనానికి రూ.10వేల చొప్పున 1,56,993 చలాన్లు జారీ చేసింది. ఏడాది కాలంలో వేసిన చలాన్ల కంటే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈ రెండు నెలల కాలంలో వేసిన చలాన్లే అధికంగా ఉన్నాయి. వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి నగర సరిహద్దులు, ప్రధాన రహదారులు, కాలుష్య హాట్‌స్పాట్‌ల వద్ద పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. గురువారం నుంచి రాజధానిలో 'నో పీయూసీ, నో ఫ్యూయల్'నిబంధన కూడా అమల్లోకి వచ్చింది. ఈ నిబంధన ప్రకారం, పీయూసీ సర్టిఫికెట్ లేని వాహనాలకు ఇంధనం అమ్మొద్దని ఇంధన కేంద్రాలకు ఆదేశాలు జారీ చేశారు.

ఢాకాలో 'వీసా' కేంద్రాన్ని తిరిగి ప్రారంభించిన భారత్

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని భారతీయ వీసా దరఖాస్తుల కేంద్రం (ఐవీఏసీ)తన కార్యకాలాపాలను తిరిగి ప్రారంభించింది. భద్రతా కారణాలతో బుధవారం కేంద్రాన్ని మూసేసిన సంగతి తెలిసిందే. ఒకరోజు తరువాత గురువారం తన కార్యకలాపాలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఢాకాలోని జమునా ఫ్యూచర్ పార్క్ దగ్గర ఉన్న ఏవీఏసీ అనిన భారతీయ వీసా కేంద్రాలకు ప్రధాన కేంద్రంగా పనిచేస్తుంది. అయితే భారత వ్యతిరేక నిరసన ల కారణంగా బంగ్లాదేశ్‌లోని ఖుల్నా, రాజ్‌షాహిలోని వీసా కేంద్రాలను మూసేసినట్లు భారత హైకమిషన్ అధికారులు తెలిపారు. భద్రతా కారణాల రీత్యా పలుమార్లు మూసేయాల్సి వస్తోందన్నారు. 2024 జూలై విద్యార్థుల తిరుగుబాటు అణచివేతకు కారణమైన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న విషయం తెలిసిందే. ఆమెను తిరిగి రప్పించాలని డిమాండ్ చేస్తూ బంగ్లాదేశ్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి.

ఎర్రకోట పేలుడు కేసులో మరో నిందితుడి అరెస్టు

న్యూఢిల్లీ: దేశరాజధానిలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు కేసులో మరో నిందితుడిని ఎన్ఐఏ అరెస్టు చేసింది. శ్రీనగర్‌లోని షోపియాన్‌కు చెందిన యాసిర్ అహ్మద్ దార్‌ను ఢిల్లీలో ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు. నవంబర్ 10న దేశ రాజధానిని కుదిపేసిన కారు బాంబు పేలుడు వెనుక కుట్రలో యాసిర్‌కు కీలక పాత్ర పోషించినట్లు ఎన్ఐఏ తెలిపింది. ఈ కేసులోని ఇతర నిందితులతో యాసిర్‌కు సన్నిహిత సంబంధాలున్నాయని, పేలుడులో మరణించిన బాంబర్ ఉమర్ ఉన్ నబీకి సన్నిహితుడని పేర్కొంది. యాసిర్ అరెస్టుతో ఈ కేసులో అరెస్టుల సంఖ్య తొమ్మిదికి చేరింది. నవంబర్ 10న జరిగిన పేలుడులో 15 మంది మరణించగా, పలువురు గాయపడ్డారు.

27న సీడబ్ల్యూసీ సమావేశం

ఉపాధి హామీ పేరు మార్పుపై చర్చించే అవకాశం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఈ నెల 27వ తేదీన సమావేశం కానుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(ఎంజీఎన్ఆర్ఈజీఏ) పేరును మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు, ఇతర కీలక రాజకీయ పరిణామాలను ఈ భేటీలో చర్చించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. జీ రామ్ జీ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనకు శ్రీకారం చుడతామని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఇప్పటికే ప్రకటించడం తెల్సిందే. అదేవిధంగా, బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత జరుగుతున్న మొదటి సీడబ్ల్యూసీ సమావేశమిది. 2026 మొదటి అర్ధభాగంలో అసోం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగే ఎన్నికలపైనా ఈ సమావేశంలో పార్టీ వ్యూహంపై చర్చించే అవకాశముంది.

ఏకసభ్య ధర్మాసనం, డివిజన్ బెంచీల్లో హైకోర్టు మాజీ జడ్జీలకు అవకాశం

2021నాటి ఉత్తర్వులను సవరించిన సుప్రీం

న్యూఢిల్లీ: తాత్కాలిక ప్రాతిపదికన నియమితులయ్యే హైకోర్టు రిటైర్డు జడ్జీలకు అప్పగించే బాధ్యతల విషయంలో సుప్రీంకోర్టు 2021నాటి తీర్పును సవరించింది. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను పరిష్కరించే లక్ష్యంతో తిరిగి విధుల్లోకి తీసుకునే వీరికి ఏకసభ్య ధర్మాసనం లేదా డివిజన్‌లో బెంచ్‌లలో బాధ్యతలను అప్పగించాలని తెలిపింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తులను తాత్కాలిక ప్రాతిపదికన తిరిగి నియమించుకునే విషయంలో ఈ మేరకు విధానాల్లో మార్పులు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రెగ్యులర్ జడ్జి కూర్చునే చోటే వీరు కూర్చుని, పెండింగ్ కేసులను చూసుకుంటారని తెలిపింది. అదేవిధంగా, డివిజన్ బెంచ్‌లో ఉన్నప్పుడు జూనియర్ జడ్జీలతోపాటు వీరిని భాగస్వాములుగా చేయరాదని తెలిపింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి తమ వద్ద పరిస్థితి, అవసరాలకు అనుగుణంగా రెగ్యులర్, తాత్కాలిక జడ్జీలతో లేదా ఇద్దరు తాత్కాలిక జడ్జీలతో డివిజన్ బెంచ్‌ను ఏర్పాటు చేయవచ్చని కూడా పేర్కొంది. రిటైరయ్యాక కూడా పనిచేయాలని ఉన్నా జూనియర్ జడ్జీలతో కలిపి డివిజన్ బెంచీల్లో బాధ్యతలు నిర్వహించడం అసౌకర్యంగా కొందరు భావిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని గురువారం సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పచోలీల తెలిపింది. అందుకే ఈ మేరకు గత ఉత్తర్వుల్లో కొద్ది సవరణలను తీసుకువస్తున్నట్లు వివరించింది. 62 ఏళ్ల వయస్సులో రిటైరవుతున్నందున పెండింగ్ సమస్య పరిష్కారానికి వీరి అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే, ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా ఆదేశాలను జారీ చేయాల్సిన అవసరం లేదని, అంతర్గతంగా సర్దుబాటు చేసుకోవచ్చని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ధర్మాసనానికి తెలిపారు. కోర్టులపై పెండింగ్ క్రిమినల్ కేసుల భారం తగ్గించే లక్ష్యంతో సుప్రీంకోర్టు 2021లో హైకోర్టు రిటైర్డు జడ్జీలను తాత్కాలికంగా రెండు లేదా మూడేళ్ల పాటు తిరిగి విధుల్లోకి తీసుకునే ఒరవడికి తెరతీసింది.

చివరి ఓవర్లలో కొట్టే సిక్స్‌ల మాదిరిగానే.. రిటైరయ్యే జడ్జీల తీర్పుల జాతర

సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: క్రికెట్ మ్యాచ్ చివరి ఓవర్‌లో సిక్స్‌లు కొట్టినట్టుగానే.. పదవీ విరమణ గడువు దగ్గరపడే వేళ న్యాయమూర్తులు ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో తీర్పులు వెలువరించే ఒరవడి పెరిగిపోతుండటంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. అనుమానాస్పదంగా తీర్పులు వెలువరించారనే కారణంగా పదవీ విరమణకు కేవలం 10 రోజుల ముందుగా మధ్యప్రదేశ్ హైకోర్టు తనను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ ప్రిన్సిపాల్ అండ్ డిస్ట్రిక్ట్ జడ్జి వేసిన పిటిషన్‌పై బుధవారం ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సారథ్యంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం..'రిటైరయ్యే సమయం దగ్గరపడుతున్న వేళ పిటిషనర్ సిక్సులు బాదటం మొదలుపెట్టారు. ఇది దురదృష్టకరమైన ట్రెండ్ అని చెప్పకతప్పదు. ఇది రోజురోజుకూ పెరుగుతోంది. దీనిపై మరింత వివరంగా చెప్పదల్చుకోలేదు'అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీ ఉన్నారు. పిటిషనర్ అయిన న్యాయాధికారి నవంబర్ 30వ తేదీన రిటైర్ కావాల్సి ఉండగా, నవంబర్ 19న సస్పెండయ్యారు. ఆయనిచ్చిన రెండు తీర్పులు అనుమానాస్పదంగా ఉండటమే ఇందుకు కారణమని హైకోర్టు పేర్కొంది. అయితే, సీనియర్ న్యాయాధికారి అయి ఉండీ హైకోర్టుకు వెళ్లడానికి బదులుగా, తన సస్పెన్షన్ ఉత్తర్వుల్లోని వివరాలు తెల్సుకునేందుకు పిటిషనర్ సహ చట్టాన్ని ఆశ్రయించారని ధర్మాసనం పేర్కొంది. ఈ పిటిషన్‌పై విచారణ జరపలేమని పేర్కొన్న ధర్మాసనం.. తిరిగి మధ్యప్రదేశ్ హైకోర్టుకే వెళ్లాలని కోరింది. సస్పెన్షన్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలంటూ వాదనలు అక్కడ వినిపించాలని సూచించింది. అదే సమయంలో, ఈ అంశంపై విచారణ చేపట్టి, నాలుగు వారాల్లో తేల్చాలని హైకోర్టును ఆదేశించింది.

ఆ వీడియో చూసి.. మానవత్వం అంటే ఏమిటో చెప్పండి..!

వీధి కుక్కల బెడద కేసులో పిటిషనర్‌తో సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) వీధి కుక్కలపట్ల అమానవీయంగా వ్యవహరిస్తోందంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. 'తదుపరి విచారణ సమయంలో ఒక వీడియో చూపిస్తాము, అమానవీయం ఏమిటో అప్పుడే మీరు చెబుదురుగాని అంటూ వ్యాఖ్యానించింది. దేశ రాజధాని ఢిల్లీలో కుక్క కాట్లతో చిన్నారులు రేబిస్ బారినపడుతున్నారంటూ వచ్చిన కథనంపై సుమోటోగా విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం..నవంబర్ 7వ తేదీన విద్యా సంస్థలు, ఆస్పత్రులు, రైల్వే స్టేషన్లలో వీధికుక్కలు, ఇతర జంతువులు కనిపించరాదని, వీధికుక్కలను పట్టుకుని స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ చేయించాలని దేశవ్యాప్త ఆదేశాలివ్వడం తెల్సిందే. అయితే, ఢిల్లీలోని అధికారులు అదనంగా మరికొన్ని నిబంధనలను చేర్చి, వీధి కుక్కలపై దయాదాక్షిణ్యం లేకుండా ప్రవర్తిస్తున్నారంటూ సీనియర్ లాయర్ కపిల్ సిబాల్ గురువారం వాదించారు. అయితే, దీనిపై ఇప్పుడేమీ తాము విచారణ చేపట్టబోమని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం స్పష్టం చేసింది. జనవరి 7వ తేదీన జరిగే విచారణ సందర్భంగా తామొక వీడియో చూపిస్తామని, దాన్ని చూశాక మానవత్వం గురించి మాట్లాడుతామంటూ వ్యాఖ్యానించింది. కుక్కల పట్ల అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న వైఖరిపై తామూ ఒక వీడియో చూపుతామని కపిల్ సిబాల్ తెలిపారు.

ఐక్యతా ప్రతిమ రూపశిల్పి రామ్ సుతార్ కన్నుమూత

తుదిశ్వాస వరకు విశ్రాంతి నెరుగని కళాకారుడు

- సంతాపం ప్రకటించిన రాష్ట్రపతి, ప్రధాని

న్యూఢిల్లీ/ముంబై: ప్రపంచ ప్రఖ్యాత శిల్పకారుడు, గుజరాత్‌లో ఏర్పాటైన ప్రపంచంలో అత్యంత ఎత్తయిన సర్దార్ పటేల్ ఐక్యతా శిల్పం రూపకర్త అయిన రామ్ సుతార్ కన్నుమూశారు. ఢిల్లీ సమీపంలోని నోయిడాలో ఉన్న తన నివాసంలో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారని ఆయన కుమారుడు తెలిపారు. వందేళ్ల వయస్సున్న రామ్ సుతార్ గత కొంత కాలంగా వయో సంబంధ రుగ్మతలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. 'మా తండ్రి శ్రీ రామ్ వంజీ సుతార్ డిసెంబర్ 17వ తేదీ రాత్రి మా నివాసంలో తుదిశ్వాస విడిచారని తెలుపుటకు విచారిస్తున్నాం'అని ఆయన కుమారుడు అనిల్ సుతార్ గురువారం ఒక ప్రకటన చేశారు. తండ్రితోపాటు ముఖ్యమైన ప్రాజెక్టుల్లో అనిల్ కూడా పాలుపంచుకున్నారు. మహారాష్ట్రలోని ధులె జిల్లా గొండూర్ గ్రామంలో 1925 ఫిబ్రవరి 19వ తేదీన రామ్ సుతార్ జన్మించారు. చిన్ననాటి నుంచే శిల్పకళపై ఆయన ఆసక్తి కనబరిచారు. ముంబైలోని జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్ కాలేజీ విద్యార్థిగా చూపిన ప్రతిభకు బంగారు పతకం సాధించారు. పార్లమెంట్ ఆవరణలో ప్రతిష్ఠించిన ధ్యానముద్రలో ఉన్న మహాత్ముడు, మహారాష్ట్రలోని సింధుదుర్గ్‌లో అశ్వంపై ఛత్రపతి శివాజీ విగ్రహాలు ఆయన రూపొందించిన అత్యుత్తమ కళాఖండాల్లో కొన్ని. గుజరాత్‌లో నర్మదా తీరంలో కేవడియా వద్ద దేశ ప్రప్రథమ ఉపప్రధాని, హోం మంత్రి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విగ్రహం కూడా రామ్ సుతార్ ఘనతే. 182 మీటర్ల ఎత్తయిన ఐక్యతా శిల్పం రూపకర్తగా ఈయన పేరు ప్రపంచదేశాల్లో మారుమోగిపోయింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఈ విగ్రహంతో భారీ స్థాయి స్మారక విగ్రహాల రూపకల్పనలో ఆయన ప్రతిష్టను, పేరును సుస్థిరం చేసింది.

తాను రూపొందించిన గాంధీజీ, నెహ్రూ, పటేల్ విగ్రహాలతో ఏర్పాటైన ఎగ్జిబిషన్‌లో రామ్ సుతార్(ఫైల్)

రామ్ సుతార్ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో ముంబైలోని ఇందుమిల్‌లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ మెమోరియల్ ఒకటి. మరికొద్ది రోజుల్లో ఆవిష్కరించనున్న అసోంలోని గౌహటిలో గోపీనాథ్ బొర్దొలోయ్ విగ్రహం కూడా ఈయన చేతుల్లో జీవం పోసుకున్నదే కావడం విశేషం. ఇప్పటికే అసోంలోని జోర్హాత్‌లో ఉన్న లచిత్ బర్ఫుకాన్ భారీ విగ్రహం సైతం సుతార్ రూపొందించిందే కావడం గమనార్హం. తుదిశ్వాస వరకు దాదాపు ఏడు దశాబ్దాల పాటు రాతి, కాంస్య శిల్పాలకు ప్రాణం పోసే పనిలోనే నిమగ్నమై ఉన్న రామ్ సుతార్‌కు స్టాచ్యూ మ్యాన్ అనే పేరు స్థిరపడిపోయింది. కేంద్ర ప్రభుత్వం 1999లో పద్మశ్రీతో, 2016లో పద్మ భూషణ్ పురస్కారాలతో ఆయన్ను గౌరవించింది. ఇటీవల మహారాష్ట్ర అత్యున్నత పురస్కారం మహారాష్ట్ర భూషణ్ పురస్కార్ కూడా రామ్ సుతార్ అందుకున్నారు. రామ్ సుతార్ మృతిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇదో లగ్జరీ లిటిగేషన్..!

ప్యాకేజ్డ్ వాటర్‌కు ప్రమాణాలు నిర్ణయించాలన్న పిల్‌పై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌కు అంతర్జాతీయ ప్రమాణాలుండేలా ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిల్‌ను 'లగ్జరీ లిటిగేషన్'అంటూ సుప్రీంకోర్టు కొట్టివేసింది. దేశంలో ఇప్పటికీ చాలా మంది ప్రజలకు కనీసం మంచినీరు కూడా దొరకని పరిస్థితులున్నాయని పేర్కొంది. 'ఈ దేశంలో తాగు నీరు ఎక్కడుంది, మేడమ్? ప్రజలకు తాగు నీరే అందుబాటులో లేదు. నీటి నాణ్యత విషయం తర్వాత మాట్లాడుకుందాం'అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొనగా, ఇవన్నీ ఖరీదైన పిటిషన్లంటూ ధర్మాసనంలో ఉన్న జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి వ్యాఖ్యానించారు. మన దేశంలో విక్రయించే ప్యాకేజ్డ్ తాగు నీటికి ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) వంటి సంస్థలు నిర్ణయించిన అంతర్జాతీయ ప్రమాణాలుండేలా ఆదేశాలు జారీ చేయాలంటూ సారంగ్ వామన్ యద్వాద్కర్ వేసిన పిటిషన్‌పై సీనియర్ లాయర్ అనితా షెనాయ్‌తో ధర్మాసనం పైవ్యాఖ్యలు చేసింది. అసలు, మీ ఇంట్లో మంచినీరు ఉందా అని ప్రశ్నించింది. దేశంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను తాము మరువలేమని తెలిపింది. పట్టణ ప్రాంత పరిస్థితులను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నట్లు కనిపిస్తోందని పేర్కొన్న ధర్మాసనం..గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు బావుల్లో నీటిపైనే ఆధారపడుతున్నారని, వారెలాంటి అనారోగ్యాలకు గురికావడం లేదని తెలిపింది. అమెరికా, జపాన్, ఈయూ తరహా మార్గదర్శకాలను మనం అమలు చేయగలమని భావిస్తున్నారా అంటూ నిలదీసింది. పేదల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇలాంటివన్నీ కేవలం పట్టణవాసులు, ధనికుల భయాందోళనల నుంచి వస్తున్న పిటిషన్లు మాత్రమేనని పేర్కొంది.

రెండో పరిపాలనా సంస్కరణల సంఘం అధ్యక్షుడు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

సర్కారియా కమిషన్ సిఫారసులు

అత్యవసర పరిస్థితి (అధికరణం 356)

అత్యవసర అధికారాలు దేశ సమగ్రత, ఐక్యతను కాపాడటానికేగానీ కేంద్రానికి మితిమీరిన అధికారాలు కావని సర్కారియా కమిషన్ పేర్కొంది. కాబట్టి అధికరణం 356ను ఆచితూచి ఉపయోగించాలని, చిట్టచివరి అవకాశంగా మాత్రమే ప్రయోగించాలని సూచించింది. అలాంటి కొన్ని సందర్భాలు..

- రాజకీయ అనిశ్చిత పరిస్థితి
- అంతర్గత విచ్ఛిన్నకర పరిణామాలు
- రాజ్యాంగ నిర్దేశాల అమల్లో నిర్లక్ష్యం
- పరిపాలనా యంత్రాంగం వైఫల్యం

రాష్ట్రపతి పాలన ప్రకటనను పార్లమెంటు ఆమోదించాక రాష్ట్ర విధాన సభను రద్దు చేయొద్దు. అప్పుడే పార్లమెంటుకు రాష్ట్రపతి పాలనకు సంబంధించిన విషయాల మీద తగిన నియంత్రణ అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా ఏ పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధించాల్సి వచ్చిందో ప్రకటనలో పేర్కొనాలి. అప్పుడే న్యాయ సమీక్ష జరిపే వీలుంటుంది. రాజస్థాన్ రాష్ట్రం- భారత ప్రభుత్వాల వివాదం, మినర్వా మిల్లుల వివాదం సందర్భంగా సుప్రీంకోర్టు ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చింది.

రాష్ట్రాలకు ఆదేశాల విషయంలో..

సర్కారియా కమిషన్ 256, 257 అధికరణల ప్రకారం కార్యనిర్వాహక విషయాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న ఆధిపత్యంలో ఎలాంటి మార్పులు చేయనవసరం లేదని భావించింది. అయితే 258 అధికరణను ఉదారంగా అన్వయించి వికేంద్రీకరణను ప్రోత్సహించాలని సూచించింది.

కేంద్ర సాయుధ దళాల మొహరింపు

సాయుధ దళాల మొహరింపు నిర్ణయాధికారం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదే. కానీ ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్నీ సంప్రదించాలి. ఇలాంటి చర్య కొన్నిసార్లు చట్టబద్ధంగా సహేతుకమైనప్పటికీ, రాజకీయంగా సరైన నిర్ణయం కాకపోవచ్చని కమిషన్ అభిప్రాయం.

అఖిల భారత సర్వీసులు

అఖిల భారత సర్వీసులను కొనసాగించాలని వాటిని శక్తివంతం చేయాలని సర్కారియా కమిషన్ భావించింది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకోవాలి. దీని కోసం క్యాబినెట్ సెక్రెటరీ ఆధ్వర్యంలో ఒక సలహా సంఘాన్ని నియమించాలి. మరిన్ని అఖిల భారత సర్వీసుల ఏర్పాటుకు రాష్ట్రాలు సిద్ధం కావాలి.

అంతర్రాష్ట్ర మండలి (అధికరణం-236)

శాశ్వత అంతర్రాష్ట్ర మండలిని అంతర్ ప్రభుత్వ మండలి పేరుతో అధికరణం-263 కింద ఏర్పరచి సామాజిక, ఆర్థిక, ప్రణాళికేతర విషయాల మీద శ్రద్ధ తీసుకోవాలి. జాతీయ అభివృద్ధి మండలి అలాగే కొనసాగాలి. కానీ జాతీయ అభివృద్ధి మండలి స్థాయిని లాంఛనప్రాయం చేసి అధికరణం-263 కింద పునర్నిర్మించి జాతీయ ఆర్థిక అభివృద్ధి మండలి అనే కొత్త పేరు ఇవ్వాలని కమిషన్ అభిప్రాయపడింది.

అధికార భాష

భాషను రాజకీయం చేయడం దేశ ఐక్యత, సమగ్రతకు మంచిదికాదు. అధికార భాషా విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవడానికి సర్కారియా కమిషన్ కొన్ని సిఫారులు చేసింది. త్రి భాషా సూత్రాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలి.

ప్రసార సాధనాలు (మీడియా)

ప్రసార సాధనాలను ఉమ్మడి జాబితా లేదా రాష్ట్ర జాబితాకు బదిలీ చేయడానికి కమిషన్ సుముఖత చూపలేదు. కానీ ఆకాశవాణి, దూరదర్శన్‌ల విషయంలో సహేతుకమైన అధికార వికేంద్రీకరణ చేపట్టాలని సూచించింది. జాతీయ ప్రయోజనాలకు,రాష్ట్రాల అవసరాలకు మధ్య సమతుల్య పూర్వక సయోధ్య ఉండాలని కమిషన్ సూచించింది.

విచారణ చట్టం

విచారణ చట్టాన్ని సవరించాలని, కేంద్ర రాష్ట్ర మంత్రులపై విచారణ సంఘాన్ని వీలైనంత వరకూ నియమించొద్దని కమిషన్ అభిప్రాయపడింది. విచారణ సంఘాన్ని నియమించే ముందు పార్లమెంటు ఉభయ సభలు మెజారిటీ ఓటు ద్వారా తీర్మానం ఆమోదించాలని కమిషన్ సూచించింది. విచారణ సంఘం నియామకానికి ముందు ఈ విషయాన్ని అంతర్ ప్రభుత్వ మండలిలో ఉంచాలని కమిషన్ అభిప్రాయం.

అంతర్రాష్ట్ర వివాదాలు

అంతర్రాష్ట్ర నదీ జలాల ట్రిబ్యునల్‌కు సంబంధించిన చట్టాన్ని సవరించాలని, అయిదేళ్లలోపు నిర్ణయాలు అమలు జరగాలని సూచించింది.

హైకోర్టు జడ్జిల నియామకం

రాజ్యాంగాన్ని సవరించి నిర్ణీత కాలంలో కేంద్ర రాష్ట్రాలు పరస్పరం సంప్రదించుకొని హైకోర్టు జడ్జిలను నియమించేలా చట్టాన్ని రూపొందించాలని సర్కారియా కమిషన్ సూచించింది.

డి.ఆర్. గాడ్గిల్ ఫార్ములా

దేశం అనుసరిస్తున్న సమాఖ్య తరహా వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సరైన రీతిలో ఆర్థిక వనరుల పంపిణీ కోసం మార్గదర్శక సూత్రాలు, సహేతుకమైన సూచనలు చేయాల్సిందిగా మాజీ ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్ డి.ఆర్. గాడ్గిల్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ కమిటీ కేంద్ర ప్రభుత్వం అందించే ప్రణాళిక సహాయాన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేయడానికి ఒక ఫార్ములా (సూత్రాన్ని)రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి 1971లో అందించింది. డి.ఆర్.గాడ్గిల్ నివేదికపై 1981లో ఒకసారి, 1992లో మరోసారి సమీక్ష నిర్వహించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ గాడ్గిల్ ఫార్ములాను అనుసరించి జనాభా ఆధారంగా 60 శాతం నిధులు, తలసరి ఆదాయం ఆధారంగా 25 శాతం నిధులు రెవెన్యూ వ్యయాలను సరిచూసుకొని ఫిస్కల్ డెఫిసిట్‌ను తగ్గించినందుకు 7.5 శాతం, ఎడారి, కొండ ప్రాంతాలు, శిశుమరణాలు, ఆరోగ్యం తదితర సమస్యల ఆధారంగా 7.5 శాతం నిధులను కేటాయించాలని స్పష్టంగా విశదీకరించింది.

నోట్: కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు సహాయాన్ని అందిస్తుంది. కానీ వెనుకబడిన, పేద రాష్ట్రాలకు ఈ ఫార్ములా ప్రకారం నిధుల పంపిణీ అంత ఉపయోగకరంగా లేదు.

విత్త రంగంలో చూపిన క్రమశిక్షణను గాడ్గిల్ ఫార్ములా ప్రోత్సహించేలా లేదని కొందరు నిపుణుల అభిప్రాయం.

జస్టిస్ మదన్‌మోహన్ పూంఛీ కమిషన్

కేంద్ర, రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేసి సూచనలు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మదన్‌మోహన్ పూంఛీ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం 2007 ఏప్రిల్ 28న ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

కమిషన్ సభ్యులు

1. ధీరేంద్రసింగ్ (హోంశాఖ మాజీ కార్యదర్శి)
2. అమరేశ్ బాంగ్చీ (మాజీ డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ)
3. వినోద్ కుమార్ దుగ్గల్ (హోంశాఖ మాజీ కార్యదర్శి)
4. డాక్టర్ ఎన్ఆర్ మాధవ మీనన్ (మాజీ డైరెక్టర్, జాతీయ న్యాయ అకాడమీ, భోపాల్)

పూంఛీ కమిషన్ తన నివేదికను 7 అధ్యాయాలుగా రూపొందించి 2010 ఏప్రిల్ 20న కేంద్ర ప్రభుత్వానికి అందించింది.

నివేదికలోని ముఖ్య అధ్యాయాలు

1. కేంద్ర, రాష్ట్ర సంబంధాల పరిణామ క్రమాన్ని మొదటి అధ్యాయంలో వివరించింది.
2. పౌరహక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛను తెలిపే 19వ అధికరణం,అత్యవసర పరిస్థితిని వివరించే 353 అధికరణం, రాష్ట్రాల సంక్షేమం, సంరక్షణను కేంద్ర ప్రభుత్వ బాధ్యతగా తెలిపే 355అధికరణం, రాష్ట్రపతి పాలనను తెలిపే 356 అధికరణం, అంతర్రాష్ట్ర మండలిని తెలిపే 263 అధికరణం గురించి అధ్యయనం చేసి సమగ్ర వివరాలను 2వ అధ్యాయంలో కమిషన్ వివరించింది.
3. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలు, విత్త సంబంధాలు, ప్రాంతీయ అసమానతలను 3వ అధ్యాయంలో పొందుపరిచింది.
4. 73,74 రాజ్యాంగ సవరణలు, 6వ షెడ్యూల్‌కు సంబంధించిన సూచనలను 4వ అధ్యాయంలో పొందుపరిచింది. తీవ్రవాదం, తిరుగుబాట్లు, నక్సలిజం, హింస, మత కల్లోలాలు, జాతీయ అంతరంగిక భద్రతను 5వ అధ్యాయంలో పొందుపరిచింది. పర్యావరణ సమస్యలు, వనరుల విభజనకు సంబంధించి 6వ అధ్యాయంలో పేర్కొంది. సామాజికాభివృద్ధి, సుపరిపాలన, ఎలక్ట్రానిక్ సేవలను 7వ అధ్యాయంలో పొందుపరిచింది. ఇలా 7 అధ్యాయాలుగా కమిషన్ నివేదికను తయారుచేసింది.

సిఫారసులు

- తీవ్రవాద సమస్యకు గురైన ప్రాంతాలను పరిమిత కాలం పాటు కేంద్ర ప్రభుత్వం పాలనలోకి తెచ్చేందుకు 355, 356వ అధికరణలను సవరించాలి.
- 355, 356 అధికరణల కింద అత్యవసర నిబంధనలను స్థానికీకరణం చేయాలంటే రాష్ట్రం మొత్తం రాష్ట్రపతి పాలన విధించకుండా సమస్యాత్మక,యంత్రాంగం వైఫల్యం చెందిన ప్రాంతాల్లో మాత్రమే రాష్ట్రపతి పాలన విధించాలి. రాష్ట్రపతి పాలనను 3 నెలలకు మించకుండా చూడాలని కమిషన్ సిఫారసు చేసింది.
- రాష్ట్రాల్లో మత కల్లోలాలు, హింస, అంతరంగిక ప్రాంతీయ వైషమ్యాలు సంభవించినప్పుడు కేంద్ర బలగాలు నేరుగా మొహరించాలి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అనుమతి లేకుండా కేంద్ర బలగాలను పంపాలి. ఇలాంటి ప్రత్యేక పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు వారం పాటు నిరంతర పర్యవేక్షణ, కేంద్ర బలగాలను, కేంద్ర హోంశాఖ సమీక్షించాలి.
- రాష్ట్రాల మంత్రి మండలి సలహాకు వ్యతిరేకంగా ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతించే హక్కు గవర్నర్లకు ఉండాలి. విశ్వవిద్యాలయాలకు చైర్మన్లుగా గవర్నర్లను నియమించొద్దని కమిషన్ అభిప్రాయపడింది.
- సరైన కారణాలు తెలపకుండా గవర్నర్ల తొలగింపు సరికాదని పేర్కొంది. గవర్నర్ పదవీ కాలాన్ని ఐదేళ్లుగా నిర్ణయించాలని తెలిపింది. రాష్ట్రపతి మహాభియోగతీర్మానం ద్వారానే గవర్నర్లను తొలగించాలని అభిప్రాయపడింది.
- అధికరణం 163(2) ద్వారా గవర్నర్లకు సంక్రమించిన విచక్షణాధికారాల పరిధిని రాజ్యాంగ సవరణ చేసి తగ్గించాలి. బిల్లులను తన వద్ద అట్టిపెట్టుకొనే అధికారాన్ని తగ్గించి 4 నెలల్లోగా కచ్చితంగా బిల్లుపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలని సూచించింది.
- జాతీయ సమగ్రతా మండలి ఏడాదికోసారి సమావేశం కావాలని చెప్పింది. జాతీయ పరిశోధనా ఏజెన్సీ వంటి కొత్త సంస్థలను అధ్యయనం చేసి నివేదించింది.

వీరప్ప మొయిలీ అధ్యక్షతన రెండో పరిపాలనా సంస్కరణల సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం 2005 ఆగస్టు 31న నియమించింది. దీనిలో సభ్యులు.

1. వి. రామచంద్రన్ 2. డాక్టర్ ఏ.పి.ముఖర్జీ
3. డాక్టర్ ఎ.హెచ్. ఖత్రో
4. డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ (రాజీనామా చేశారు)
5. శ్రీమతి వినితా రాయ్ (కార్యదర్శి)

వీరప్పమొయిలీ అధ్యక్షతన నియమించిన రెండో పరిపాలనా సంస్కరణ సంఘం ప్రభుత్వం, పాలనా వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి బాధ్యతాయుత, జవాబుదారీతనం, సమర్థ పాలనకు సంబంధించి మొత్తం 15 అధ్యయన నివేదికలను కేంద్రప్రభుత్వానికి సమర్పించింది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కింది వాటిలో కేంద్ర, రాష్ట్ర సంబంధాలతో సంబంధం లేనిది?
   ఎ) ఇంద్రజిత్ గుప్తా కమిటీ
   బి) పశ్చిమబెంగాల్ ప్రభుత్వ మెమొరాండం
   సి) రాజమన్నార్ కమిటీ
   డి) సర్కారియా కమిషన్
2. రెండో పరిపాలనా సంస్కరణల సంఘం అధ్యక్షుడు ఎవరు?
   ఎ) సి. రంగరాజన్
   బి) వినోద్ రాయ్
   సి) వీరప్పమొయిలీ
   డి) వినితారాయ్
3. ఎన్నికల అజమాయిషీ, సూచనలు, నియంత్రణ ఎన్నికల సంఘం చేతుల్లో ఉండాలని ఏ రాజ్యాంగ అధికరణ తెలుపుతుంది?
   ఎ) 324 బి) 323
   సి) 325 డి) 326
4. కింది వాటిలో ఏ కేసు విషయంలో సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర, రాష్ట్ర సంబంధాలను పునర్ నిర్వచించింది?
   ఎ) ఇంద్ర సహానీ కేసు
   బి) రాయనరావు కేసు
   సి) ఎస్.ఆర్. బొమ్మయ్ కేసు
   డి) ఐ.ఆర్. కొయల్‌హో కేసు
5. కేంద్ర,రాష్ట్ర సంబంధాలకు సంబంధించి డి.ఆర్. గాడ్గిల్ సూత్రాన్ని ఎందుకు ఉపయోగిస్తారు?
   ఎ) పన్నుల రాబడుల విభజన
   బి) రాష్ట్ర రుణాల మాఫీ
   సి) రాష్ట్రాలు కొత్త అప్పులు చేయకుండా ఉండటానికి
   డి) రాష్ట్రాలకు కేంద్ర సహాయాన్ని సమకూర్చడానికి
6. సర్కారియా కమిషన్ అధ్యయన నివేదికను ఎప్పుడు సమర్పించింది?
   ఎ) 1988 బి) 1989
   సి) 1987 డి) 1986
7. అఖిల భారత సర్వీసులను ముఖ్యంగా ఐఏఎస్, ఐపీఎస్‌లను రద్దు చేయాలని సిఫారసు చేసిన కమిటీ ఏది?
   ఎ) సర్కారియా కమిషన్
   బి) రాజమన్నార్ కమిషన్
   సి) ఖేర్ కమిషన్ డి) కాకా కలేల్కర్ కమిషన్

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) ఎ; 4) సి; 5) డి; 6) సి; 7) బి.

మానవ మెదడు సగటు బరువు?

శరీరంలో జరిగే అన్ని జీవక్రియలు నాడీ వ్యవస్థ ఆధీనంలో ఉంటాయి. మానవ నాడీ వ్యవస్థలో మూడు భాగాలు ఉంటాయి. అవి.. కేంద్ర నాడీవ్యవస్థ, పరధీయ నాడీవ్యవస్థ, స్వయం చోదిత నాడీవ్యవస్థ. కేంద్ర నాడీ వ్యవస్థలో మెదడు, వెన్నుపాము ఉంటాయి. వీటిని ఆవరించి ఉండే మూడు పొరలను మెనింజస్ అంటారు. మెదడు.. తలలోని దృఢమైన ఎముకల పెట్టె(కపాలం)లో, నీటి అలల మధ్య తేలుతూ పటిష్ట భద్రత మధ్య ఉంటుంది. మెదడును వివిధ పరికరాలతో స్కానింగ్ చేసి దానిలోని మార్పులను గుర్తించి వ్యాధులను నిర్ధారించడాన్ని బ్రెయిన్ మ్యాపింగ్ అంటారు.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

మానవ నాడీ వ్యవస్థ

మానవుడిలో మెదడు.. తలలోని దృఢమైన ఎముకల పెట్టె (కపాలం)లో, నీటి అలల మధ్య తేలుతూ పటిష్ట భద్రత మధ్య ఉంటుంది. కపాలం అధ్యయనాన్ని క్రేనియాలజీ అంటారు. శరీరంలో జరిగే అన్ని జీవక్రియలు నాడీ వ్యవస్థ ఆధీనంలో ఉంటాయి. ఈ వ్యవస్థ శరీరానికి వెలుపల, లోపల జరిగే మార్పులకు ప్రతిచర్యలను కలిగిస్తుంది. నాడీ వ్యవస్థ అధ్యయనాన్ని న్యూరాలజీ అంటారు. మానవ నాడీవ్యవస్థలో మూడు భాగాలు ఉంటాయి. అవి.. కేంద్ర నాడీవ్యవస్థ, పరధీయ నాడీవ్యవస్థ, స్వయం చోదిత నాడీవ్యవస్థ.

కేంద్ర నాడీ వ్యవస్థ

ఇందులో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి.. మెదడు. రెండు.. వెన్నుపాము. వీటిని ఆవరించి ఉండే మూడు పొరలను మెనింజస్ అంటారు. ఆ పొరలు (వెలుపలి నుంచి లోపలి వైపునకు వరుసగా).. వరాశిక, లౌతుకళ, మృద్వి. ఈ పొరలకు బ్యాక్టీరియా (నిస్సేరా మెనింజైటిస్) సంక్రమిస్తే మెనింజైటిస్ వ్యాధి వస్తుంది. ఈ పొరల మధ్య ఉండే ద్రవ పదార్థాన్ని మస్తిష్క మేరుద్రవం(సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్) అంటారు. ఈ ద్రవం మెదడుకు, వెన్నుపాముకు రక్షణ కల్పి స్తుంది. మెదడులోని నాడీకణాలకు ఆహారాన్ని, ఆక్సీజన్‌ను సరఫరా చేస్తుంది.

మెదడు

మెదడు అధ్యయనాన్ని 'ప్రినాలజీ' అంటారు. అప్పుడే పుట్టిన శిశువు మెదడు 300–400 గ్రాముల బరువు ఉంటుంది. వయోజనుల మెదడు 1350–1400 గ్రాములు, పురుషుల్లో 1375 గ్రాములు, స్త్రీల్లో 1275 గ్రాముల బరు వు ఉంటుంది. మెదడులో 75 శాతానికి పైగా నీరు ఉంటుంది.

జంతువుల్లో అత్యంత బరువైన మెదడు (8 కిలోలు)తిమింగలంలో ఉంటుంది. ఏనుగు మెదడు 5 కిలోలు ఉంటుంది. నాడీ కణాల సంఖ్య మాత్రం మానవుల మెదడులోనే ఎక్కు వ. ఏనుగు మెదడులో 2,300 కోట్ల నాడీ కణా లు, చింపాంజీలో 700 కోట్లు, మానవుడిలో 8,600 కోట్లు ఉంటాయి.

నాడీ వ్యవస్థ నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం నాడీకణం (న్యూరాన్). మెదడు పనితీరుకు మూలం న్యూరాన్. మెదడు కణాల్లో న్యూరాన్లు పది శాతం ఉంటాయి. మిగతా 90 శాతం గ్లియల్ కణాలు ఉంటాయి. ఈ కణాలు పోషక పదార్థాలను అందించడంతోపాటు మెద డును శుభ్రం చేస్తాయి. మెదడు బరువు ఎక్కువ ఉన్నవారు ఎక్కువ తెలివితేటలు కలిగి ఉంటారని ఫ్రెడరిక్ టిడ్‌మాన్ పేర్కొన్నాడు.

- మానవుడి దేహం బరువులో మెదడు బరు వు రెండు శాతం మాత్రమే. కానీ శరీరం లోని మొత్తం శక్తిలో దాదాపు 20 శాతం, ఆక్సీజన్‌లో 20 శాతం, గ్లూకోజ్‌లో 25 శాతాన్ని వినియోగించుకుంటుంది.
- చుంచెలుక శరీరం మొత్తం బరువులో మెదడు బరువు 10 శాతం ఉంటుంది. మెదడుకు 5 నుంచి 7 సెకన్ల పాటు ఆక్సీజన్ అందకుంటే బ్రెయిన్ డెడ్ అవుతుంది.
- శరీరం లాగే మెదడుకూ విశ్రాంతి (నిద్ర) అవసరం.
- పెద్దవారు రోజుకు ఆరు గంటలు నిద్రపోవాలి
- క్రీడాకారులు 9 గంటలు, 18 ఏళ్ల లోపు వారు 8 గంటలు, నవజాత శిశువులు 18 గంటలు విశ్రాంతి తీసుకోవాలి.

బ్రెయిన్ మ్యాపింగ్

అత్యాధునిక స్కానింగ్, మ్యాపింగ్ పరిశోధనల వల్ల మెదడు పనితీరుపై అవగాహన ఏర్పడింది. మెదడును వివిధ పరికరాలతో స్కానింగ్ చేసి దానిలోని మార్పులను గుర్తించి వ్యాధులను నిర్ధారించడాన్ని బ్రెయిన్ మ్యాపింగ్ అంటారు. మెదడు వ్యాధుల గుర్తింపు పరీక్షలు..

1. ఎలక్ట్రో ఎన్‌సెఫలో గ్రామ్ (ఈఈజీ)
2. మ్యాగ్నెటిక్ ఎన్‌సెఫలో గ్రామ్ (ఎంఈజీ)
3. మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ)
4. కంప్యూటెడ్ టోమోగ్రఫీ (సీటీ స్కాన్)
5. ఫంక్షనల్ మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్ (ఎఫ్ఎంఆర్ఐ)

- స్కానింగ్‌లో రేడియోధార్మిక కిరణాలను ఉపయోగిస్తారు.
- కండరాల నొప్పులు, పక్షవాతం చికిత్సలో పరారుణ కిరణాలను వాడతారు.

నార్కో అనాలసిస్

- మెదడులోని సమాచారాన్ని యథావిధిగా బయటకు చెప్పించే ప్రక్రియ నార్కో అనాలసిస్ టెస్ట్.
- ఈ పరీక్షను అంతర్జాతీయ ఉగ్రవాదులు, ఆర్థిక నేరస్తులు, కుంభకోణాలకు పాల్పడిన వ్యక్తుల నుంచి నిజాలను రాబట్టడానికి ఉపయోగిస్తారు.
- ఈ పరీక్షలో వాడే రసాయనాలు.. సోడియం అమైటాల్, సోడియం పెంటాథాల్.

నోట్: ఈ పరీక్ష రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తి స్వేచ్ఛకు, జీవించే హక్కుకు వ్యతిరేకం. కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో కోర్టు అనుమతితో దీన్ని నిర్వహించాలి.

మెదడు - నిర్మాణం

మెదడులో మూడు భాగాలు ఉంటాయి. అవి.. ముందు మెదడు, మధ్య మెదడు, వెనక మెదడు.

ముందు మెదడు

ముందు మెదడునే సెరిబ్రమ్/మస్తిష్కం/పెద్ద మెదడు అని అంటారు. సెరిబ్రమ్ 995 గ్రాముల బరువు ఉంటుంది. దీనిలోని ఎత్తైన ప్రదేశాలను(గట్లను) గైరై అని, లోతైన ప్రదేశాలను సల్సై అని అంటారు. మస్తిష్కం 2 మస్తిష్కార్ధగోళాలు గా విభజితమవుతుంది. కుడి మస్తిష్కార్ధ గోళం ఎడమ కాళ్లు, చేతులను; ఎడమ మస్తిష్కార్ధగోళం కుడి కాళ్లు, చేతులను నియంత్రిస్తాయి.

- కుడి మస్తిష్కార్ధ గోళానికి గాయమైతే దేహంలోని ఎడమ వైపు భాగాలకు, ఎడ మ గోళానికి దెబ్బ తగిలితే కుడి వైపు భాగాలకు పక్షవాతం వస్తుంది. ఈ మస్తిష్కార్ధ గోళాలను నాడీదండం కలుపుతుం ది. మస్తిష్కానికి, మధ్య మెదడుకు మధ్యద్వారగోర్ధం ఉంటుంది. ఇది రాంబాయిడ ల్ ఆకారంలో కనిపిస్తుంది. థలామస్,హైపోథలామస్‌గా విభజితమవుతుంది.

హైపోథలామస్ విధులు

1) భావోద్వేగాల నియంత్రణ
2) ఆకలి, దప్పిక
3) నిద్ర, మెలకువ
4) నీటి సమతుల్యత, రక్తపీడనం, శరీర ఉష్ణోగ్రత క్రమత
5) లైంగిక వాంఛ

- హైపోథలామస్..పీయూష గ్రంథిని నియంత్రిస్తుంది.మానవుడిలో ఈ గ్రంథి ప్రధానమైంది.
- దృశ్య, శ్రవణ, స్పర్శ, వాసన, రుచిని తెలుసుకోవడానికి మస్తిష్కంలో ఐదు జ్ఞాన కేంద్రాలు ఉంటాయి.
- మస్తిష్కాన్ని ఉదర తలం నుంచి చూస్తే అందులో గదాకృతి నిర్మాణాలు కనిపిస్తా యి. వాటిని ఘ్రాణ లబింకలు అంటారు.

మస్తిష్కం విధులు

1) జ్ఞాపక శక్తి 2) తెలివితేటలు
3) ఆలోచన 4) ఊహా శక్తి
5) వివేచన 6) సమస్యల పరిష్కారం
7) అభ్యాసం 8) మాట్లాడటం

మధ్య మెదడు

- ఇది మందంగా, దృఢంగా ఉన్న చిన్న కాడ వంటి భాగం.
- ఇది హైపోథలామస్‌కు, పాన్స్‌వెరోలికి మధ్య ఉంటుంది. మధ్య మెదడు పృష్ఠ భాగంలో నాలుగు లంబికలతో 'కార్పొరా క్వాడ్రిజమైనా' అనే నిర్మాణం ఉంటుంది. ఇది దృశ్య, శ్రవణ జ్ఞానాలను కలిగిస్తుంది.

వెనక మెదడు

ఇది మెదడు చివరి భాగం. దీనిలో మూడు భాగాలు ఉంటాయి. అవి..
1) అనుమస్తిష్కం
2) పాన్స్ వెరోలి
3) మజ్జాముఖం.

అనుమస్తిష్కం (సెరిబెల్లమ్)

- దీన్ని లిటిల్ బ్రెయిన్ (చిన్న మెదడు) అని కూడా అంటారు.
- ఇది తల వెనక భాగంలో (మస్తిష్కానికి దిగువన, మజ్జాముఖానికి పైన) ఉంటుంది.

విధులు

1) శరీర సమతాస్థితిని కాపాడటం
2) నియంత్రిత కండరాల చలనాలను క్రమబద్ధీకరించడం

నోట్: మత్తుమందు ఇచ్చినప్పుడు, మద్యా న్ని అధికంగా సేవించినప్పుడు ఈ భాగం సక్రమంగా పనిచేయక మనిషి అదుపు తప్పుతాడు.

పాన్స్ వెరోలి

- ఇది మజ్జాముఖానికి వెనక, మధ్య మెదడుకు కింద ఉంటుంది. శ్వాస కండరాల కదలికలను నియంత్రించి, ఉచ్ఛ్వా సలో పీల్చే వాయువుల ఘనపరిమాణాన్ని క్రమపరుస్తుంది.

మజ్జాముఖం

ఇది మెదడు చివరి భాగం. మెదడును, వెన్నుపామును కలిపే సంధానకర్త/వారధి. ఇది అనియంత్రిత కండరాలకు సమాచారాన్ని అందిస్తుంది.

విధులు

1) శ్వాసక్రియ, నాడీ స్పందన, రక్తపీడనం, హృదయ స్పందన, పేగులు, జీర్ణాశయం, ఆహార వాహిక, మూత్రాశయం చలనాలను నియంత్రిస్తుంది.
2) వాసోమోటర్‌గా పనిచేస్తుంది(రక్తనాళా ల్లో జరిగే చర్యల వల్ల వాటి వ్యాసం మారుతుంది)
3) మింగడం, దగ్గడం, తుమ్మడం, వాంతులు, వెక్కిళ్లను నియంత్రిస్తుంది.

- మానవ మెదడులో మజ్జాముఖం అతి ముఖ్య భాగం. దీనికి తీవ్ర గాయమైతే (శ్వాసక్రియకు అంతరాయం కలిగి) వ్యక్తి మరణిస్తాడు.

వెన్నుపాము

మజ్జాముఖం.. వెనక వైపునకు విస్తరించి వెన్నుపాముగా మారి మొండెం చివరి వరకు ప్రయాణిస్తుంది. ఇది 42 నుంచి 45 సెం.మీ. పొడవు ఉంటుంది. వెన్నుపాము దాని అడ్డుకోతలో హెచ్ లేదా సీతాకోకచిలుక ఆకారంలో కనిపిస్తుంది. వెన్నుపాము లోపలి వైపు బూడిద రంగు పదార్థం, వెలుపలి వైపు తెలుపు పదార్థం ఉంటాయి. వెన్నుపాము మెదడుకు, శరీర భాగాలకు మధ్యవర్తిగా, సంధానకర్తగా పనిచేస్తుంది. అందువల్ల వెన్నుపామును టెలిఫోన్ ఎక్స్ఛేంజ్/రిలే సెంటర్ అని పేర్కొంటారు.

విధులు

అసంకల్పిత ప్రతీకార చర్యలను చూపడం. అంటే అనుకోకుండా వేగంగా, వెంటనే, అప్రయత్నంగా జరిగే చర్యలు. ఈ చర్యలు వెన్నుపాము ఆధీనంలో మాత్రమే ఉంటాయి. వీటికి మెదడుతో సంబంధం లేదు.

ఉదాహరణలు:

- వేడి వస్తువులను తాకగానే చేతిని వెనక్కి లాగడం.
- కీటకం అకస్మాత్తుగా కంటి వద్దకు రాగానే కనురెప్పలు మూయడం.
- చీకట్లో ఒక్కసారిగా కాంతి పడగానే కళ్లు మూసుకోవడం.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. శరీరంలో ఉష్ణ నియంత్రణ కేంద్రం?
   1) కశేరు నాడీదండం
   2) హైపోథలామస్
   3) అనుమస్తిష్కం
   4) వెన్నుపాము
2. తుమ్మడం, మింగడం, వాంతులు, వెక్కిళ్లు దేని నియంత్రణలో ఉంటాయి? (గ్రూప్–1, 1990)
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) మజ్జాముఖం 4) వెన్నుపాము
3. ఆల్కహాల్, అనస్థీషియా.. మెదడులోని ఏ భాగంపై ప్రభావం చూపుతాయి?
   1) సెరిబ్రమ్ 2) సెరిబెల్లమ్
   3) మెడుల్లా అబ్లాంగేట 4) వెన్నుపాము
4. మెదడును ఆవరించి ఉన్న పొరలేవి (వెలుపలి నుంచి లోపలి వైపునకు వరుసగా)?
   1) మృద్వి 2) వరాశిక
   3) లౌతుకళ 4) ప్లూరా
   1) 1, 2, 3, 4 2) 2, 3, 4, 1
   3) 2, 3, 1 4) 3, 2, 1
5. అనుమస్తిష్కం (సెరిబెల్లమ్) దేనికి సంబంధించింది? (ఏపీ టౌన్ ప్లానింగ్, 2010)
   1) కండర కదలికల సమన్వయం
   2) గ్రాహకాంగం 3) జ్ఞాపకశక్తి
   4) దృష్టి
6. మెదడులోని ఏ భాగం జ్ఞాపకశక్తికి మూలం? (జేఎల్, 2004)
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) దవ్వ 4) అధో పర్యంకం
7. మానవ మెదడు సగటు బరువు?
   1) 1300 గ్రా।। 2) 1400 గ్రా।।
   3) 1500 గ్రా।। 4) 1350 గ్రా।।
8. ఆకలి, దప్పిక, లైంగిక వాంఛ, శరీర ఉష్ణోగ్రత దేని ఆధీనంలో ఉంటాయి? (గ్రూప్–1, 2000)
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) మజ్జాముఖం 4) హైపోథలామస్
9. శరీరంలో వార్తలను గ్రహించి విశ్లేషించి సమన్వయపరిచే కేంద్రం?(జేఎల్, 2003)
   1) గుండె 2) కాలేయం
   3) మూత్రపిండాలు 4) మెదడు
10. పార్కిన్‌సన్ వ్యాధి ఏ అవయవానికి వస్తుంది? (ఏఈఈ, 2006)
   1) గుండె 2) చర్మం
   3) మెదడు 4) కాలేయం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 2; 4) 3; 5) 1; 6) 1; 7) 2; 8) 4; 9) 4; 10) 3.

బ్లాస్ట్ ఫర్నేస్‌లో లభించే గుల్లబారిన ఇనుమును ఏమంటారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

లోహాల ఉనికి

భూమి వల్కలంలో అత్యంత విస్తారంగా లభించే మూలకం ఆక్సిజన్(45.5 శాతం). ఆక్సిజన్ తర్వాత విస్తృతిని సిలికాన్(27 శాతం) ఆక్రమిస్తుంది. భూపటలంలో లభించే మూలకాల్లో మూడోది, లోహాల్లో మొదటిది అల్యూమినియం(8.3 శాతం). రెండోది ఇనుము(5శాతం). మూలకాల్లో నాలుగో స్థానం, మనిషి ఉపయోగించిన మొదటి లోహం రాగి (కాపర్). అత్యధికంగా వినియోగించే లోహం ఇనుము(ఐరన్).

లోహ సంగ్రహణ

బంగారం(గోల్డ్), ప్లాటినం లాంటి కొన్ని లోహాలు మాత్రమే ప్రకృతిలో స్వాభావికంగా లభిస్తాయి. కార్బన్, సల్ఫర్ భూమి పైపొరల్లో స్వేచ్ఛాస్థితిలో ఉంటాయి. ఉత్కృష్ట వాయువులు గాలిలో స్వేచ్ఛగా ఉంటాయి. ఆక్సిజన్, నైట్రోజన్లు గాలిలో స్వేచ్ఛాస్థితిలో ఉన్నప్పటికీ ఇతర మూలకాల్లో సంయోగ పదార్థాలను ఏర్పరుస్తాయి. దాదాపు మిగిలిన మూలకాలన్నీ ఒకదానితో మరొటి కలిసి భూమి పొరల్లో సంయోగ పదార్థాలుగా ఉంటాయి. సహజంగా లభించే లోహ సంయోగ పదార్థాల నుంచి లోహాన్ని నిష్కర్షించి వేరు చేసే పద్ధతిని 'లోహ నిష్కర్షణ' అంటారు. సమ్మేళనాల నుంచి లోహాలను సంగ్రహించడం, శుద్ధి చేయడంతోపాటు వివిధ మిశ్రమ లోహాలు తయారు చేయడం లోహ సంగ్రహణశాస్త్ర పరిధి లోకి వస్తాయి.

ఖనిజాలు (మినరల్స్)

ప్రకృతిలో లభించే లోహ సమ్మేళనాలు ఇసుక, రాళ్లు, బంకమన్ను మొదలైన మలినాల తో కలిసి ఉంటాయి. ఈ విధంగా లభించే లోహాల ముడి పదార్థాలను ఖనిజాలు అంటారు. గనుల నుంచి తవ్వి ఖనిజాలను వెలికి తీస్తారు. అయితే అన్ని ఖనిజాల నుంచి లోహాన్ని వేరు చేయడం లాభదాయకం కాదు. వాణిజ్యపరంగా ఏ ఖనిజం నుంచి లాభదాయకంగా లోహాన్ని వేరు చేస్తారో దాన్ని ఆ లోహధాతువు(ఓర్) అంటారు. ఉదాహరణకు అల్యూమినియం.. బాక్సైట్ రూపంలో, కయోలినైట్ అనే బంకమన్ను.. కోరండం, డయాస్పోర్‌లుగా లభిస్తాయి. ఇవన్నీ అల్యూమినియం ఖనిజాలు. కానీ అల్యూమినియం లోహాన్ని 'బాక్సైట్' నుంచి మాత్రమే లాభసాటిగా సంగ్రహిస్తారు. అందువల్ల బాక్సైట్‌ను అల్యూమినియం ధాతువుగా పరిగణిస్తారు.

ఎక్కువ శాతం లోహాలు ఆక్సైడ్లుగా లభిస్తాయి. ఇతరత్రా కార్బొనేట్లు, సల్ఫేట్లు, సల్ఫైడ్లు, క్లోరైడ్‌ల రూపాల్లో లభిస్తాయి.

ధాతువును ఎంచుకునేటప్పుడు కేవలం ఆర్థికాంశాలే కాకుండా పర్యావరణ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు సల్ఫైడ్ ఖనిజమైన 'ఐరన్ పైరైటీస్' నుంచి ఐరన్‌ను సంగ్రహిస్తే అది వాతావరణాన్ని కలుషితం చేసి ఆమ్ల వర్షాలకు కారణమయ్యే 'సల్ఫర్ డై ఆక్సైడ్'ను విడుదల చేస్తుంది. కాబట్టి ఆక్సైడ్ ఖనిజాలైన హైమటైట్ లాంటి ఖనిజాలను ఉపయోగిస్తారు.

ఖనిజ రూపం	ఖనిజాలు
ఆక్సైడ్	బాక్సైట్, హెమటైట్, మాగ్నటైట్, మోనోజైట్, సిలికా, జింకైట్ (ఫిలాసఫర్స్ ఊల్).
కార్బొనేట్	సున్నపురాయి, మాలకైట్, కాలమైన్, డోలమైట్, సిడరైట్
సల్ఫేట్	బెరైటీస్, జిప్సం.
సల్ఫైడ్	పైరైటీస్, సిన్నబార్, గెలీనా, కాపర్ గ్లాన్స్.
క్లోరైడ్	కార్నలైట్, హార్న్ సిల్వర్, రాతి ఉప్పు(రాక్‌సాల్ట్).

సాంద్రీకరణ

ముడి ఖనిజాల్లో చాలా వరకు మాలిన్యాలు ఉంటాయి. వీటి నుంచి శుద్ధ లోహాన్ని పొందడానికి కొన్ని రసాయన ప్రక్రియల ద్వారా మలినాలను తొలగిస్తారు. ఈ పద్ధతిని 'సాంద్రీకరణ' అంటారు.

సాంద్రీకరణ పద్ధతులు

లెవిగేషన్: గురుత్వాకర్షణ సూత్రంపై ఆధారపడిన సాంద్రీకరణ పద్ధతిలో వేగంగా వచ్చే నీటి ధారతో చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని కడుగుతారు. తేలికైన మాలిన్య కణాలు నీటి ప్రవాహంతో కొట్టుకుపోగా బరువైన శుద్ధి ముడి ఖనిజ కణాలు నిలిచిపోతాయి. ఇది భౌతిక పద్ధతి.

ప్లవన క్రియ: సల్ఫైడ్ ఖనిజాల నుంచి మలినాలను తొలగించడానికి ఈ పద్ధతిలో చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని నీటిలో అవలంబనం చేస్తారు. అనంతరం నూనె సమక్షంలో గాలిని పంపిస్తూ గిలకరించడం వల్ల పైన ఏర్పడే నురుగులోకి ఖనిజ కణాలు వస్తాయి. నురుగు కోసం పైన్ ఆయిల్, కొవ్వు ఆమ్లాలు, గ్జాంథేట్‌లను కలుపుతారు. జింక్, లెడ్ లాంటి లోహాల ఖనిజాలను ఈ విధంగా సాంద్రీకరిస్తారు. ఇది కూడా భౌతిక పద్ధతి.

లీచింగ్ (నిక్షాళనం): ఇది ఒక రసాయన పద్ధతి. ఇందులో ధాతువు రసాయన స్వభావాన్ని అనుసరించి, తగిన కారకాన్ని ఉపయోగించి, ధాతువు మాత్రమే ద్రావణంలో కరిగేలా చేస్తారు. కరగకుండా మిగిలిపోయిన మలినాలను వడపోత ద్వారా వేరు చేస్తారు. ఉదాహరణకు బాక్సైట్‌ను సోడియం హైడ్రాక్సైడ్‌ను ఉపయోగించి లీచింగ్ చేస్తారు.

అయస్కాంత వేర్పాటు పద్ధతి: ముడి ఖనిజానికి కానీ, మలినానికి కానీ అయస్కాంత ధర్మం ఉంటే ఈ పద్ధతిలో సాంద్రీకరిస్తారు. చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని అయస్కాంత రోల్లర్ మీద తిరిగే కన్వేయర్ బెల్ట్ మీద పడేలా చేస్తే ఖనిజం మాలిన్యం నుంచి వేరు అవుతుంది. ఈ పద్ధతిలో ఇనుప ఖనిజాలను, టిన్ స్టోన్‌ను సాంద్రీకరిస్తారు.

ముడి లోహాన్ని సంగ్రహించడం

ధాతువు నుంచి లోహాన్ని సంగ్రహించడానికి కొన్ని రసాయన ప్రక్రియలను అవసరానికి తగినట్లు ఉపయోగిస్తారు. వాటిలో ముఖ్యమైన ప్రక్రియలు.

భస్మీకరణం(కాల్సినేషన్): ధాతువును గాలి లేకుండా బాగా వేడి చేసి బాష్పశీల (వాయురూప) మలినాలను తొలగించే పద్ధతిని భస్మీకరణం అంటారు. కార్బొనేట్, బైకార్బొనేట్ ఖనిజాలకు ఈ పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఉదాహరణకు కాల్షియం కార్బొనేట్ (సున్నపురాయి)ని భస్మీకరణం చేస్తే కాల్షియం ఆక్సైడ్ (సున్నం) ఏర్పడుతుంది. కార్బన్ డై ఆక్సైడ్ వేరు పడుతుంది.

భర్జనం(రోస్టింగ్): గాలి సరఫరా చేస్తూ లోహ ద్రవీభవన స్థానం కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద కొలిమిలో ముడి ఖనిజాన్ని వేడి చేసే ప్రక్రియ భర్జనం. ప్రధానంగా సల్ఫైడ్ ఖనిజాలను ఆక్సైడ్‌లుగా మార్చేందుకు ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. ఉదాహరణకు రివర్బరేటరీ కొలిమిలో కాపర్ సల్ఫైడ్ ఖనిజాన్ని భర్జనం చేస్తారు.

ప్రగలనం: ధాతువును ద్రవకారి(ధాతువు ద్రవీకరణ ఉష్ణోగ్రతను తగ్గించే పదార్థం) కలిపి కానీ లేకుండా కానీ వేడిచేసి లోహాన్ని ద్రవస్థితిలో పొందే ప్రక్రియను ప్రగలనం అంటారు.

క్షయకరణం: లోహ ఆక్సైడ్‌లను సాధారణంగా కోక్(కార్బన్) లేదా కార్బన్ మోనాక్సైడ్ (CO) కలిపి వేడి చేస్తారు. ఈ ప్రక్రియలో అవి ఆక్సిజన్‌ను కోల్పోయి లోహాలుగా క్షయకరణం చెందుతాయి. ఉదాహరణకు 'బ్లాస్ట్ ఫర్నేసు'లో కోక్ మండటం వల్ల ఏర్పడిన కార్బన్ మోనాక్సైడ్.. ఐరన్ ఆక్సైడ్‌ను ఐరన్‌గా క్షయకరణం చేస్తుంది.

లోహ సంగ్రహణ - ముఖ్యాంశాలు

- ధాతువులో లోహంతోపాటు ఉండే మలినాలను 'గాంగ్' అంటారు.
- ఇనుము సంగ్రహణలో 'బ్లాస్ట కొలిమి'ని ఉపయోగిస్తారు. కొలిమిలోకి ప్రవేశపెట్టే కోక్, ధాతువు, సున్నపురాయిల మిశ్రమాన్ని చార్జ్ అంటారు.
- రివర్బరేటరీ కొలిమిలో ప్రగలనం, వేడి చేయడం ద్వారా కాపర్‌ను నిష్కర్షణ చేస్తారు.
- గలన స్థితిలో ఉండే లోహాన్ని పచ్చి కర్రలతో కలియబెట్టి మాలిన్యాలను వేరు చేస్తారు. ఈ పద్ధతిని 'పోలింగ్' అంటారు.
- విద్యుద్విశ్లేషణ పద్ధతిలో లోహాన్ని శుద్ధి చేసే ప్రక్రియలో అపరిశుద్ధ లోహాన్ని ఆనోడ్‌గా, శుద్ధమైన లోహ రేకును కాథోడ్‌గా వాడతారు.
- బ్లాస్ట ఫర్నేసులో 750° సెంటీగ్రేడ్ వద్ద ఏర్పడిన ఇనుము ఘన స్థితిలో, గుల్ల బారి ఉంటుంది. దీన్ని 'స్పాంజ్ ఐరన్' అంటారు.
- స్పాంజ్ ఐరన్ కొలిమి అడుగు భాగం ద్రవరూపంలోకి మారుతుంది. ఈ స్థితిలో కార్బన్, ఫాస్ఫరస్, సిలికా చేరి దుక్క ఇనుము లేదా పోత ఇనుము(కాస్ట్ ఐరన్)గా మారుతుంది. దీనిలో కార్బన్ 3 నుంచి 4 శాతం ఉంటుంది.
- దుక్క ఇనుము సంఘటనలో మార్పుల ద్వారా చేత ఇనుము(వ్రాట్ ఐరన్), స్టీల్ తయారు చేస్తారు.
- చేత ఇనుము శుద్ధమైన ఇనుము. ఇందులో కార్బన్ 0.1 – 0.25 శాతం మాత్రమే ఉంటుంది.
- ఉక్కు(స్టీల్)లో కార్బన్ 0.1–1.5 శాతం మాత్రమే. కార్బన్ శాతం పెరుగుతున్న కొద్దీ పెలుసుదనం పెరుగుతుంది.
- ఉక్కు ప్రధానంగా ఇనుము, కార్బన్ల మిశ్రమ లోహం. కార్బన్‌తోపాటు వివిధ పరిమాణాల్లో మాంగనీస్, నికెల్, క్రోమియం, మాలిబ్డినం, వెనేడియం, టంగ్‌స్టన్ మొదలైన లోహాలను మిశ్రమం చేసి ప్రత్యేక ధర్మాలు ఉన్న ఉక్కును తయారు చేస్తారు.
- స్టెయిన్‌లెస్ స్టీల్‌లో ఇనుము, కార్బన్‌తోపాటు క్రోమియం, నికెల్ ఉంటాయి.
- దుక్క ఇనుము నుంచి స్టీల్ తయారీకి 'ఓపెన్ హార్త్ కొలిమి'ని ఉపయోగిస్తారు.

కొన్ని ముఖ్యమైన లోహాలు - వాటి ఖనిజాలు

లోహం	ముఖ్య ఖనిజాలు
అల్యూమినియం	బాక్సైట్, కోరండం, డయాస్పోర్, కయోలినైట్
బేరియం	బెరైటీస్
కాపర్	కాపర్ పైరెటీస్, చాల్కో పైరెటీస్, మాలకైట్, క్యూప్రైట్, కాపర్ గ్లాన్స్.
ఐరన్	ఐరన్ పైరెటీస్ (ఫూల్స్ గోల్డ్), హెమటైట్, మాగ్నటైట్, సిడరైట్, లియొనైట్, సిడరైట్.
కాల్షియం	సున్నపురాయి (కాల్షియం కార్బొనేట్), జిప్సం.
మెగ్నీషియం	కార్నలైట్, మాగ్నసైట్, ఎప్సం లవణం.
థోరియం	మోనోజైట్
మెర్క్యురీ	సిన్నబార్
జింక్	కాలమైన్, జింక్‌బ్లెండ్, జింకైట్.
మాంగనీస్	పైరోలుసైట్
సిల్వర్	అర్జెంటైట్, హార్న్ సిల్వర్
లెడ్ (సీసం)	గెలీనా
సోడియం	రాతి ఉప్పు (రాక్ సాల్ట్), చిలీ సాల్ట్ పీటర్.

మాదిరి ప్రశ్నలు

1. సిన్నబార్ దేని ధాతువు?
   1) బంగారం 2) యురేనియం
   3) సీసం 4) మెర్క్యురీ
2. చార్జ్ అంటే ఏమిటి?
   1) విద్యుదావేశం 2) ఖనిజ చూర్ణం
   3) కోక్, సున్నపురాయి, ధాతువుల మిశ్రమం
   4) కోక్, ధాతువుల మిశ్రమం
3. బ్లాస్ట్ ఫర్నేస్‌లో లభించే గుల్లబారిన ఇనుమును ఏమంటారు?
   1) స్టీల్ 2) బ్లిస్టర్ ఐరన్
   3) స్పాంజ్ ఐరన్ 4) చేత ఇనుము
4. చేత ఇనుములో కార్బన్ శాతం?
   1) 2 శాతం 2) 0.1 శాతం
   3) 0.8 శాతం 4) 0.2 శాతం
5. గాలి లేకుండా ధాతువును వేడి చేసి బాష్పశీల మలినాలను తొలగించే ప్రక్రియ?
   1) భస్మీకరణం 2) భర్జనం
   3) నిక్షాళనం 4) పోలింగ్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 3; 4) 4; 5) 1.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. పైరైటీస్ రూపంలో ఇండియాలో లభించే ముడి ఖనిజం?
   1) అల్యూమినియం 2) ఇనుము
   3) బంగారం 4) ప్లాటినం
2. అల్యూమినియం లోహం ధాతువు?
   1) బాక్సైట్ 2) బెరైటీస్
   3) సిన్నబార్ 4) హెమటైట్
3. భూపటలంలో పుష్కలమైన లోహం?
   1) ఇనుము 2) బంగారం
   3) అల్యూమినియం 4) లెడ్
4. ఫిలాసఫర్స్ ఊల్ అంటే ఏమిటి?
   1) జింక్ బ్రోమైడ్
   2) జింక్ నైట్రేట్
   3) జింక్ ఆక్సైడ్ 4) జింక్ క్లోరైడ్

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 3.

Banks in India can be classified under...

BANK EXAMS

BANKING AWARENESS

1. Co-operative Banks come under the control of RBI by virtue of certain provisions of:
   a) Reserve Bank of India Act 1934
   b) Banking Laws (Application to Co-operative Societies) Act 1965
   c) Banking Regulation Act 1949
   d) Negotiable Instruments act 1881
   e) All the above
2. Which among the following is part of the banking business under the provisions of section 6(1) of B R Act:
   a) Collecting and transmitting of money
   b) Negotiating loans and advance
   c) Acquiring and holding the investments d) All the above
   e) None of the above
3. Which one of the following is not Appropriate:
   a) A Commercial bank is prohibited in selling insurance products
   b) An urban co-operative bank can sell mutual fund products
   c) A Private Sector bank can issue a Credit card
   d) A Nationalized bank is permitted to accept articles under safe custody
   e) None of the above
4. Which kind of assistance is provided by EXIM Bank to Indian companies?
   a) Direct loans to exporters
   b) Technology services
   c) Consultancy services
   d) Credit for export of capital goods
   e) All the above
5. Banks in India can be classified under ______ categories:
   a) A body corporate constituted under a special statute
   b) Company registered under the companies act
   c) Foreign company
   d) a, b only e) All a, b and c
6. Central government can exempt a particular bank from the provisions of banking regulation act:
   a) On the recommendations of the RBI.
   b) If the central government is satisfied with the case
   c) If requested by the board of directors of the bank
   d) If unanimous resolution passed by shareholders of the bank
   e) All the above
7. Other than the Governor, Deputy Governors of RBI, the other directors are :
   a) Appointed b) Nominated
   c) Selected d) Elected
   e) Any of the above
8. Which of the following statements is not correct regarding nominations?
   a) Two or more persons can be nominated by a depositor or group of depositors. A Bank will have a full discharge of its liability if it makes the payment to the nominee.
   b) Bank is not obliged to receive any notice of claim from any other person other than the depositor
   c) The Bank will take due notice of any order or certificate from competent jurisdiction relating to deposits where nominee is appointed.
   d) Nominee should be individual and not an institution.
   e) Only a & b
9. Which of the following statements is correct?
   a) RBI approval is required for appointment of a chairman of a Bank.
   b) RBI is empowered to remove top managerial personnel of a Bank.
   c) RBI may appoint suitable person in place of the person so removed.
   d) Only b & c e) All the above
10. If RBI cancels the license of a bank, the bank has the remedy option of:
    a) Filling a review application before governor of RBI
    b) Filling an appeal with RBI after passing a general body resolution
    c) Appealing to central government
    d) Appeal after recommendations of general body and governor to central government
    e) Any of the above
11. Which of the following statements is correct?
    a) The RBI may decide the maximum amount of advance which a Bank may provide to one company or firm or individual.
    b) RBI may advice the Bank for which maximum amount of guarantee may be given to any one company or firm
    c) RBI is empowered to determine other terms and conditions to be followed by a Banking company while considering the loans and advances.
    d) Only b & d e) All the above
12. A bank has refused to open the account without any valid reasons. When the matter was referred to the Bank's Regional Office, no response received even after two months. Then:
    a) The person can refer the matter to Banking Ombudsman.
    b) Even though he is yet to become the customer of the bank, he can refer the matter to Banking Ombudsman.
    c) Since he is the non customer he loses the right to refer the matter to Banking Ombudsman
    d) The person can refer the matter to the Head Office/ Corporate Office of the Bank and then only can approach Banking Ombudsman
    e) None of the above
13. Most of the banks have established ______ for giving focused attention to a particular aspect of banking:
    a) Specialized branches
    b) Large branches
    c) Medium branches
    d) Overseas branches
    e) None of the above
14. If a co-operative bank fails, the depositors of such a bank is protected up to Rs.1 lakh subject to the provision that:
    a) The depositor is not having more than Rs.1 lac at the time of failure of the bank
    b) The bank has registered with the DICGC
    c) The depositor has is not having more than one deposit account
    d) The depositor has opted for insurance coverage specifically
    e) If the bank is paying Insurance Premium to LIC regularly
15. Which of the following statements not correct?
    a) The Nationalized Banks may go to public to raise capital
    b) Public Sector Banks can raise foreign equity up to 49 per cent.
    c) Private Sector Banks can raise capital from the public
    d) Regional Rural Banks cannot raise capital from the public
    e) None of the above
16. Which of the following is correct regarding Capital Adequacy ratio?
    a) The objective of Capital adequacy is to strengthen the financial stability of banks
    b) Capital is divided into two tiers, tier I and tier II
    c) Assets are assigned risk weight from 0-100 based on intensity of risk
    d) Only b is correct
    e) All the above
17. What are the implications of moral suasion?
    a) It has only psychological advantage
    b) It has no legal sanction
    c) It may or may not be an effective tool
    d) It is only a trial of RBI to exercise its function to control the economic system
    e) All the above
18. The limits for FPI investment in govt. securities (G-sec) will be raised in phases (by March 2018) to what per cent of the outstanding stock as per RBI?
    a) 2 % b) 3% c) 4%
    d) 5% e) 6%
19. Which of the following agencies maintain RIDF (Rural Infrastructure Development Fund)?
    a) Ministry of Rural Development
    b) Reserve Bank of India
    c) NABARD d) SIDBI
    e) None of the above
20. RBI announced in its fourth policy review on 29 September that India's GDP growth for 2015-16 can be estimated as:
    a) 7.6 % b) 7.4% c) 7.2%
    d) 7.1% e) 6.9%
21. Which of the following PSBs is NOT among the 8 public sector banks which received the capital infusion of Rs 13,955cr by the Central govt. recently?
    a) Andhra bank
    b) Corporation bank
    c) Dena bank d) Canara bank
    e) None of these
22. The RBI has reduced the benchmark Repo rate on 29 September 2015 and present Repo rate is:
    a) 6.50% b) 6.25%
    c) 6.75% d) 7.75%
    e) 7.25%
23. The gilt-edged security market is the market for which of the Following?
    a) Market for trading in gold
    b) Market for trading in silver
    c) Market for government securities
    d) Market for industrial securities
    e) None of the above
24. Which of the following can be called as intermediary in the financial System?
    a) Insurance companies
    b) Banking companies
    c) Mutual funds
    d) Financial institutions
    e) All of the above
25. Acceptance is required in the case of:
    a) Usance Bill b) Demand bill
    c) Cheque d) Demand Draft
    e) None of these
26. Matured, but not paid, term deposits are treated as :
    a) Demand liability
    b) Time liability
    c) No liability
    d) Contingent liability
    e) None of the above
27. Urban cooperative banks are controlled by:
    a) Registrar of societies
    b) State governments
    c) Reserve bank d) b & c
    e) None of the above
28. A Cheque drawn in favour of Raju & Co. and endorsement is duly confirmed by the collecting banker. Will the paying banker get protection?
    a) Will not get, as endorsement is irregular
    b) Will get protection as endorsement is confirmed by the collecting banker
    c) Will get only if payee has rectified the action
    d) Paying banker is not concerned with the genuineness of endorsement
    e) None of the above
29. The holder of a Negotiable instrument is Holder in due course if:
    a) He receives the instrument in good faith and without negligence
    b) He receives the instrument before its maturity
    c) He receives the instrument for lawful consideration
    d) All of the above
    e) None of the above
30. An inchoate instrument is one which does not have:
    a) The Amount b) The Date
    c) Name of the payee
    d) Signature of the drawer
    e) a, b & c

KEY

1) e;	2) d;	3) a;	4) e;
5) e;	6) a;	7) b;	8) a;
9) e;	10) c;	11) e;	12) a;
13) a;	14) b;	15) b;	16) e;
17) e;	18) d;	19) c;	20) b;
21) e;	22) c;	23) c;	24) e;
25) a;	26) a;	27) d;	28) a;
29) d;	30) e;		